KHAZANA JEWELLERY

ఈనాడు

ఖజానా జ్యూవలరీ

హైదరాబాద్ 4-10-2024 శుక్రవారం సిటీ సంపుటి 51. సంచిక 55

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 12+12+4 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



ఛాంపియన్

ఖుషీకి కాంస్యం


ఖుషి

లిమా (పెరూ): ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారిణి ఖుషి కాంస్యం సొంతం చేసుకుంది. మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్‌లో ఖుషి (447.3) మూడో స్థానంలో నిలిచింది. ఎనిమిది మంది బరిలో దిగిన ఫైనల్లో సినోవీ బర్గ్ (458.4 - నార్వే) స్వర్ణం, కరోలిన్ లుండ్ (458.3 - నార్వే) రజతం సాధించారు. అంతకుముందు అర్హత రౌండ్లో ఖుషి ఏడో స్థానంలో నిలిచింది. నలుగురు క్రీడాకారిణుల పాయింట్లు సమమవగా. . కౌంట్‌బ్యాక్‌లో ఖుషి ఏడు, అనా శివాన్ (ఇటలీ) ఎనిమిదో స్థానాలు సాధించి ఫైనల్లో అడుగు పెట్టారు.

మళ్లీ బతికినట్లు అనిపించింది


రోహిత్ శర్మ

ముంబయి: ఈ ఏడాది టీ20 ప్రపంచ కప్ గెలవడంతో తనకు మళ్లీ బతికినట్లు అనిపించిందని టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ చెప్పాడు. గత ఏడాది వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఓటమితో భారత జట్టే కాక దేశమంతా తీవ్ర వేదనకు గురైన సంగతి తెలిసిందే. ఆ ఓటమి తాలూకు బాధను ఈ ఏడాది పొట్టి కప్పు విజయం మరిపించిందని రోహిత్ అన్నాడు. ముంబయిలో తన క్రికెట్ అకాడమీని ప్రారంభించిన సందర్భంగా రోహిత్ ప్రసంగిస్తూ.. "నేను మరాఠీలో స్పష్టంగా మాట్లాడలేను. కానీ ప్రయత్నిస్తా. ఈ ఏడాది టీ20 ప్రపంచకప్ గెలవడాన్ని లక్ష్యంగా పెట్టుకుని 3-4 నెలలు కష్టపడ్డాం. అందుకు ఫలితం దక్కింది. ఆ కప్పు గెలిచాక నాకు మళ్లీ బతికినట్లు అనిపించింది. మేం మొదలు పెట్టిన అకాడమీ నుంచి యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, జస్‌ప్రీత్ బుమ్రా లాంటి క్రికెటర్లు రావాలని కోరుకుంటున్నా" అని చెప్పాడు.

అశ్విన్.. మురళీని దాటేసేవాడే!


అశ్విన్

ముంబయి: బంగ్లాదేశ్‌తో రెండు టెస్టుల సిరీస్‌లో గొప్పగా రాణించి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' గెలుచుకున్నాడు బౌలింగ్ ఆల్‌రౌండర్ రవిచంద్రన్ అశ్విన్. ఈ క్రమంలో అత్యధిక 'సిరీస్' అవార్డులు నెగ్గిన ఆటగాడిగా (11).. శ్రీలంక దిగ్గజ స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్‌ను సమం చేశాడు. నిజానికి అతడు మురళీని దాటేసి అత్యధిక 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' ట్రోఫీలు గెలుచుకున్న ఆటగాడిగా నిలిచే అవకాశం కొద్దిలో చేజారింది. గతేడాది వెస్టిండీస్ పర్యటనలో ఒక అర్ధసెంచరీ, 15 వికెట్లు పడగొట్టిన అశ్విన్‌నే ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా ప్రకటించారు. కానీ అతడికి ఆ అవార్డు చేతికి ఇవ్వలేదు. దీంతో బంగ్లా సిరీస్‌కు ముందు లెక్క సాంకేతికంగా 10 అవార్డులుగానే ఉంది. స్పాన్సర్‌గా ఉన్న భారత ఏజెన్సీ తప్పిదం వల్లే తాము సరైన సమయంలో అశ్విన్‌కు ఈ పురస్కారాన్ని అందించలేదని వెస్టిండీస్ క్రికెట్ సంఘం తెలిపింది. మ్యాచ్ ముగిశాక ఇవ్వలేకపోయినా ఆ తర్వాతైనా ఆ ఆటగాడికి ట్రోఫీ అందించాలి కానీ అలా జరగలేదు. ఆ అవార్డు అప్పుడే ఇచ్చి ఉంటే అశ్విన్ ఇప్పుడు ప్రపంచ రికార్డు సాధించేవాడే.

ఆరంభం అదిరిపోవాలి


హర్మన్‌ప్రీత్

రాత్రి 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

- భారత అమ్మాయిల తొలి పోరు నేడు
- టీ20 ప్రపంచకప్‌లో న్యూజిలాండ్‌తో ఢీ



ఈసారైనా కప్పు కలను నెరవేర్చుకోవాలని పట్టుదలతో ఉన్న భారత మహిళల క్రికెట్ జట్టు.. టీ20 ప్రపంచకప్‌లో తొలి పోరుకు సిద్ధమైంది. శుక్రవారం హర్మన్‌ప్రీత్ సేన.. గ్రూప్-ఎ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌ను ఢీకొంటోంది.

దుబాయ్

గ్రూప్‌లో ప్రతి జట్టూ బలమైందే కాబట్టి ఏ మ్యాచ్‌నూ తేలికగా తీసుకునే స్థితిలో భారత్ లేదు. టోర్నీలో శుభారంభం చేయకపోతే సెమీస్ అవకాశాలు సంక్లిష్టమవుతాయి. ఈ గ్రూప్ నుంచి ఆస్ట్రేలియాను సెమీస్ చేరకుండా ఆపడం కష్టం. రెండో బెర్తు కోసం ప్రధానంగా భారత్, న్యూజిలాండ్‌ల మధ్యే పోటీ నెలకొంది. ఈ రెండు జట్ల మధ్యే తొలి మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో ఇందులో గెలిచే జట్టుకే సెమీస్ అవకాశాలు మెరుగ్గా ఉంటాయని చెప్పొచ్చు. కాబట్టి భారత జట్టు తొలి పోరులో సత్తా చాటి శుభారంభం చేయడం కీలకం. ఇటీవల హర్మన్‌ప్రీత్ సేన ఫామ్ అయితే బాగానే ఉంది. వార్మప్ మ్యాచ్‌లు రెండింట్లోనూ భారత్ విజయం సాధించింది. కానీ బౌలర్లు రాణించినంతగా బ్యాటర్లు సత్తా చాటలేకపోయారు. టాప్-3 బ్యాటర్లు స్మృతిమంధాన, షెఫాలి వర్మ, హర్మన్‌ప్రీత్ విఫలమయ్యారు. ఈ త్రయం కివీస్‌పై రాణించాల్సిందే. జెమీమా చక్కటి ఫామ్‌లో ఉండడం సానుకూలాంశం. మిడిలార్డర్లో రిచా ఘోష్ కీలకం. ఇన్నింగ్స్‌కు మెరుపు ముగింపు ఇవ్వడంలో ఆమె పాత్ర కీలకం. దీప్తి శర్మ, పూజ వస్త్రాకర్‌ల నుంచి జట్టు ఆల్‌రౌండ్ ప్రదర్శనను ఆశిస్తోంది. వీళ్లిద్దరూ బంతితో మంచి ఫామ్‌లో ఉన్నారు. దుబాయ్ పిచ్ స్పిన్నర్లకు అనుకూలమన్న అంచనాల నేపథ్యంలో దీప్తితో పాటు ఆశ శోభన, రాధ యాదవ్ ఎలా రాణిస్తారన్నది మ్యాచ్ ఫలితాన్ని నిర్దేశించనుంది.

ఆల్‌రౌండర్ల జట్టు: న్యూజిలాండ్ భారత్‌కు దీటైన జట్టే. ఎక్కువమంది ఆల్‌రౌండర్లుండడం ఆ జట్టుకు కలిసొచ్చే అంశం. ప్రపంచ మేటి ఆల్‌రౌండర్లలో ఒకరైన అమేలియా కెర్ జట్టుకు అతి పెద్ద బలం. కెప్టెన్ సోఫీ డివైన్, లీగ్ కాస్పరెక్, బ్రూక్ హాలిడేలతో పాటు ఓపెనర్ సుజీ బేట్స్ సైతం బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ రాణించగలదు. వీరికి తోడు జెస్ కెర్, మోలీ పెన్‌ఫోల్డ్, ఫ్రాన్ జోనాస్‌లతో బౌలింగ్ విభాగమూ మెరుగ్గానే కనిపిస్తోంది. అందరిలోకి అమేలియా, సోఫీ, సుజీలను నియంత్రించడం కీలకం. న్యూజిలాండ్‌పై టీ20ల్లో గెలుపోటముల రికార్డు (4-9) పేలవంగా ఉన్నప్పటికీ.. ఇటీవల కివీస్ ప్రదర్శన బాగా లేదు. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌ల చేతుల్లో టీ20ల్లో వైట్‌వాష్‌కు గురైంది.


అమేలియా కెర్

13
న్యూజిలాండ్‌తో భారత్ ఆడిన టీ20లు. 4 మ్యాచ్‌లు నెగ్గి, 9 ఓడింది.

తుది జట్లు (అంచనా)

భారత్: స్మృతి మంధాన, షెఫాలి వర్మ, హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్, దీప్తి శర్మ, పూజ వస్త్రాకర్, ఆశ శోభన, శ్రేయాంక పాటిల్, రాధ యాదవ్, రేణుక సింగ్.

న్యూజిలాండ్: సుజీ బేట్స్, సోఫీ డివైన్, అమేలియా కెర్, బ్రూక్ హాలిడే, మ్యాడీ గ్రీన్, లీగ్ కాస్పరెక్, ఫ్రాన్ జోనాస్, జెస్ కెర్, మోలీ పెన్‌ఫోల్డ్, హన్నా రోవ్, లియా తహుహు.

మాపై గౌరవం పెరిగింది


కోహ్లి

ముంబయి: ఆస్ట్రేలియాలో ఆస్ట్రేలియాపై వరుసగా రెండు టెస్టు సిరీస్‌లు గెలవడంతో ప్రత్యర్థి జట్టుకు తమపై గౌరవం పెరిగిందని భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి అన్నాడు. "ఒకప్పుడు బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో చాలా తీవ్రత కనిపించేది. కానీ మేం వరుసగా రెండుసార్లు ఆస్ట్రేలియాలో సిరీస్ విజయం సాధించడంతో అది మా పట్ల గౌరవంగా మారింది. ఒక టెస్టు జట్టుగా మమ్మల్ని చాలా గౌరవిస్తున్నారు. మేం ఆస్ట్రేలియాతో ఆడుతున్నపుడు అది స్పష్టంగా కనిపిస్తోంది. వాళ్లను సొంత గడ్డపై వరుసగా రెండుసార్లు ఓడించడం వల్లే ఇది సాధ్యమైంది" అని కోహ్లి అన్నాడు. బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో కొత్త సిరీస్ నవంబరులో మొదలు కానున్న సంగతి తెలిసిందే.

ఈశ్వరన్ అజేయ శతకం

- రెస్ట్ దీటైన జవాబు
- ఇరానీ కప్


ఈశ్వరన్

లఖ్‌నవూ: ఫామ్‌లో ఉన్న ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్ (151 బ్యాటింగ్; 212 బంతుల్లో 12×4, 1×6) ఈ సీజన్లో వరుసగా మూడో సెంచరీ సాధించడంతో ముంబయితో ఇరానీ కప్‌లో రెస్ట్ ఆఫ్ ఇండియా దీటుగా బదులిస్తోంది. గురువారం, మూడో రోజు ఆట చివరికి రెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో 289/4తో నిలిచింది. ఈశ్వరన్‌తో పాటు ధ్రువ్ జురెల్ (30 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (9) విఫలమైనా.. సాయి సుదర్శన్ (32)తో కలిసి ఈశ్వరన్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. ఆ తర్వాత ఇషాన్ కిషన్ (38), జురెల్ తోడుగా స్కోరును 300కు చేరువగా తీసుకెళ్లాడు. రెస్ట్ ఇంకా 248 పరుగులు వెనుకబడి ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 536/9తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ముంబయి ఒక పరుగే జత చేసి 537కు ఆలౌటైంది. ఓవర్‌నైట్ డబుల్ సెంచరీ హీరో సర్ఫరాజ్ ఖాన్ (222 నాటౌట్) అజేయంగా నిలిచాడు. ముకేశ్ కుమార్ (5/110) రాణించాడు.

శార్దూల్‌కు తీవ్ర జ్వరం


శార్దూల్

బుధవారం, రెండో రోజు జ్వరంతోనే ఆడి 36 పరుగులు సాధించిన ముంబయి ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్.. మూడో రోజు దాదాపుగా బరిలో దిగలేకపోయాడు. 102 డిగ్రీల జ్వరం ఉండడంతో ఆట ముగిసిన వెంటనే అతడిని ఆసుపత్రిలో చేర్చారు. రక్త పరీక్షల్లో ప్రమాదమేమీ లేదని తేలాక గురువారం డిశ్చార్జి చేశారు. మూడో సెషన్‌లో చేతికి పట్టీతో అతడు మైదానంలో కనిపించాడు.

బంగ్లా శుభారంభం

- తొలి మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై గెలుపు
- మహిళల టీ20 ప్రపంచకప్


ఫాతిమా, రితు

షార్జా: మహిళల టీ20 ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ శుభారంభం చేసింది. సమష్టిగా ఆడిన ఆ జట్టు టోర్నీ ఆరంభ మ్యాచ్ (గ్రూప్-బి)లో గురువారం 16 పరుగుల తేడాతో స్కాట్లాండ్‌పై గెలిచింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్.. 7 వికెట్లకు 119 పరుగులే చేయగలిగింది. శోభన మోస్త్రీ (36; 38 బంతుల్లో 2×4) టాప్ స్కోరర్. షతి రాణి (29; 32 బంతుల్లో 3×4)తో రెండో వికెట్‌కు ఆమె 42 పరుగులు జోడించింది. స్కాట్లాండ్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో బంగ్లా ఇన్నింగ్స్ ఏ దశలోనూ దూకుడుగా సాగలేదు. కెప్టెన్ నిగర్ సుల్తానా 18 పరుగులు చేసింది. సస్కియా హార్లీ (3/13), ఒలీవియా బెల్ (1/23), కేథరిన్ బ్రైస్ (1/23) బంగ్లా బ్యాటర్లకు స్వేచ్ఛనివ్వలేదు. అయితే బంగ్లా తక్కువ స్కోరే చేసినా.. సూపర్ బౌలింగ్‌తో దాన్ని కాపాడుకుంది. స్వల్ప ఛేదనలో తడబడ్డ స్కాట్లాండ్.. 7 వికెట్లకు 103 పరుగులే చేయగలిగింది. మరోవైపు నుంచి వికెట్లు క్రమం తప్పకుండా పోతున్నా... వికెట్ కీపర్ సారా బ్రైస్ (49 నాటౌట్; 52 బంతుల్లో 1×4) స్కాట్లాండ్‌ను గట్టెక్కించడానికి విఫలయత్నం చేసింది. ఇతర బ్యాటర్ల నుంచి ఆమెకు ఎలాంటి సహకారం లభించలేదు. సారా బ్రైస్ తర్వాత అత్యధిక స్కోరు కేథరిన్ బ్రైస్ (11), లిస్టర్ (11)లదే. రితు మోని (2/15), మరూఫా అక్తర్ (1/17), నహీదా (1/19), రబేయా ఖాన్ (1/20), ఫాతిమా ఖాతూన్ (1/21) స్కాట్లాండ్‌ను దెబ్బతీశారు.

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: 119/7 (శోభన 36, షతి రాణి 29; సస్కియా హార్లీ 3/13)

స్కాట్లాండ్ ఇన్నింగ్స్: 103/7 (సారా బ్రైస్ 49 నాటౌట్, రితు మోని (2/15)

పాక్.. చిన్న స్కోరుతోనే

శ్రీలంకపై ఘనవిజయం

షార్జా: మహిళల టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ అదరగొట్టింది. శ్రీలంకతో తన తొలి మ్యాచ్ (గ్రూప్-ఎ)లో తక్కువ స్కోరే చేసినప్పటికీ.. 31 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. మొదట చమరి ఆటపట్టు (3/18), ఉదేశిక (3/20), సుగంధిక (3/19)ల ధాటికి పాక్ 20 ఓవర్లలో 116 పరుగులకే ఆలౌటైంది. ఫాతిమా సనా (30), నిదా దర్ (23) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. స్వల్ప లక్ష్య ఛేదనలో లంక తడబడింది. నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లకు 85 పరుగులే చేయగలిగింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', పాక్ కెప్టెన్ ఫాతిమా సనా (2/10) బంతితోనూ రాణించగా.. సాదియా ఇక్బాల్ (3/17), ఒమైమా (2/17), నష్రా (2/15) కూడా ఆకట్టుకున్నారు.

సంక్షిప్త స్కోర్లు

పాక్: 116 (ఫాతిమా 30, నిదా దర్ 23; చమరి 3/18, ఉదేశిక 3/20, సుగంధిక 3/19)

శ్రీలంక: 85/9 (విష్మి 20, నీలాక్షిక 22; ఫాతిమా 2/10, సాదియా 3/17, ఒమైమా 2/17, నష్రా 2/15)

ద్వేషం వారి దరి చేరకుండా..

షార్జా: మహిళల టీ20 ప్రపంచకప్ ఆడుతున్న క్రికెటర్లపై సామాజిక మాధ్యమాల నుంచి ఎదురయ్యే ద్వేషం, వ్యతిరేకత ప్రభావితం చూపనివ్వకుండా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రత్యేక ఏర్పాటు చేసింది. గో బబుల్ అనే సంస్థ సహకారంతో కృత్రిమ మేధస్సు ద్వారా సామాజిక మాధ్యమాల్లో ప్రతికూల కామెంట్లు ఏవీ ప్రపంచకప్ క్రికెటర్లు, సహాయ సిబ్బందికి చేరకుండా నియంత్రిస్తోంది. సామాజిక మాధ్యమాల వల్ల క్రికెటర్ల మానసిక ఆరోగ్యం దెబ్బ తినకూడదన్న ఉద్దేశంతో ఐసీసీ ఈ ఏర్పాటు చేసింది.

ఒక వంద నాది.. మరొకటి తమ్ముడిది


సర్ఫరాజ్‌ఖాన్

లఖ్‌నవూ: ఇరానీ కప్‌లో రెస్ట్ ఆఫ్ ఇండియాపై చేసిన డబుల్ సెంచరీలో ఒక వంద తనది.. మరొకటి తమ్ముడిదని ముంబయి స్టార్ బ్యాటర్ సర్ఫరాజ్‌ఖాన్ అన్నాడు. సోదరుడు, సహచర ముంబయి ఆటగాడు ముషీర్‌ఖాన్ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న నేపథ్యంలో అతడిలా వ్యాఖ్యానించాడు. "ఈ వారం ఉద్వేగంగా ఉంది. ఇరానీ ట్రోఫీలో బరిలో దిగేముందు డబుల్ సెంచరీ చేస్తానని కుటుంబ సభ్యులు, సహచరులకు మాట ఇచ్చా. ఈ ద్విశతకంలో ఒక వంద నాది. మరొకటి తమ్ముడిది. ఈ మ్యాచ్‌లో ముషీర్ కూడా ఆడి ఉంటే నాన్న ఎంతో గర్వించేవాడు. కానీ దురదృష్టవశాత్తూ అతడికి ప్రమాదం జరిగింది. అందుకే ఎలాగైనా ఈ మ్యాచ్‌లో డబుల్ సెంచరీ చేయాలని భావించి ఆ లక్ష్యాన్ని చేరుకున్నా" అని సర్ఫరాజ్ తెలిపాడు. ముషీర్‌తో కోలుకోవడానికి కనీసం రెండు, మూడు నెలల సమయం పడుతుందని సర్ఫరాజ్ చెప్పాడు.

కార్ల్‌సన్, ఆనంద్ గేమ్ డ్రా

గ్లోబల్ చెస్ లీగ్


ఆనంద్, కార్ల్‌సన్

లండన్: చాలా కాలం తర్వాత తలపడ్డ చెస్ దిగ్గజాలు విశ్వనాథన్ ఆనంద్, మాగ్నస్ కార్ల్‌సన్‌లు తమ గేమ్‌ను డ్రాగా ముగించారు. గ్లోబల్ చెస్‌లో లీగ్ (జీసీఎల్)లో వీళ్లు గురువారం పోటీపడ్డారు. అయితే ఆనంద్ ప్రాతినిధ్యం వహిస్తున్న గ్యాంజెస్ మాస్టర్స్ జట్టు 6-11తో కార్ల్‌సన్ జట్టు అల్పైన్ ఎస్‌జీ పైపర్స్ చేతిలో ఓడిపోయింది. పర్హామ్‌పై రిచర్డ్ ర్యాపోర్ట్ (అల్పైన్), వైశాలిపై యిఫాన్ (అల్పైన్) నెగ్గారు. వొలోదార్ (గ్యాంజెస్)తో గేమ్‌ను డేనియల్, అర్జున్ ఇరిగేశి (గ్యాంజెస్)తో గేమ్‌ను ప్రజ్ఞానంద డ్రా చేసుకున్నారు. మరోవైపు అమెరికన్ గ్యాంబిట్స్ శుభారంభం చేసింది. 11-6తో ముంబా మాస్టర్స్‌పై గెలిచింది. దుడా, బిబిసార, జోనాస్‌లు గ్యాంబిట్స్ విజయంలో కీలక పాత్ర పోషించారు. విదిత్‌పై దుడా, హంపిపై బిబిసార, రౌనక్‌పై జోనాస్ నెగ్గారు. పీటర్ స్విడ్లర్ (ముంబా)తో గేమ్‌ను యాంగ్యి, లాగ్రేవ్‌తో గేమ్‌ను నకమురా (గ్యాంబిట్స్) డ్రాగా ముగించారు. ఎలిసబెత్‌పై హారిక (ముంబా) విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ త్రివేణి కాంటినెంటల్ కింగ్స్ 3-15తో అలాస్కన్ నైట్స్ చేతిలో చిత్తయింది. అలాస్కన్ నైట్స్ తరఫున నోదిర్‌బెక్, షక్రియార్, నిహాల్ సరీన్ విజయాలు సాధించారు.

మెస్సి వచ్చాడు


మెస్సి

బ్యూనస్ ఎయిర్స్: అర్జెంటీనా దిగ్గజ ఆటగాడు లియోనల్ మెస్సి జాతీయ జట్టులోకి పునరాగమనం చేశాడు. వెనిజువెలా, బొలీవియాలతో ప్రపంచకప్ క్వాలిఫయర్స్ మ్యాచ్‌ల్లో తలపడే అర్జెంటీనా జట్టులో 37 ఏళ్ల మెస్సిని ఎంపిక చేశారు. చీలమండ గాయం కారణంగా కొన్నాళ్లు మైదానానికి దూరమైన అతడు పూర్తి ఫిట్‌నెస్ సాధించినట్లు కోచ్ లియోనల్ స్కలోని చెప్పాడు. కోపా అమెరికా ఫైనల్లో కొలంబియాపై అర్జెంటీనా నెగ్గిన తర్వాత మెస్సి బరిలో దిగలేదు. ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలో రెండు మ్యాచ్‌లకు గైర్హాజరయ్యాడు. అక్టోబర్ 10న వెనిజువెలాతో.. 15న బొలీవియాతో అర్జెంటీనా తలపడనుంది. ప్రస్తుతం ఫిఫా దక్షిణ అమెరికా అర్హత టోర్నీలో అర్జెంటీనా 18 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. కొలంబియా (16), ఉరుగ్వే (15) తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నాయి. ఈ టోర్నీలో టాప్-6లో నిలిచిన జట్లు 2026 ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధిస్తాయి. ఏడో స్థానం దక్కించుకున్న జట్టుకు ప్లేఆఫ్స్ ద్వారా బెర్తు చేజిక్కించుకునే అవకాశముంటుంది.

విండీస్ కాంట్రాక్టులు కొత్తగా..


అల్జారి జోసెఫ్

సెయింట్ జాన్స్ (అంటిగ్వా): క్రికెట్ వెస్టిండీస్ (సీడబ్ల్యూఐ) తన చరిత్రలోనే తొలిసారి క్రికెటర్లకు బహుళ సంవత్సరాల కాంట్రాక్టులు ఇచ్చింది. వన్డే వైస్ కెప్టెన్ అల్జారి జోసెఫ్, పేస్ సంచలనం షమార్ జోసెఫ్, మహిళల టీ20 కెప్టెన్ హేలీ మాథ్యూస్ సహా తొమ్మిది మంది విండీస్ క్రికెటర్లు వచ్చే రెండేళ్ల కాలానికి కాంట్రాక్టులు పొందారు. 15 మంది పురుష క్రికెటర్లకు కాంట్రాక్టులు ఇచ్చిన సీడబ్ల్యూఐ.. 2023-2024లో ప్రదర్శన ఆధారంగా, అందులో ఆరుగురికి రెండేళ్ల కాంట్రాక్టులు ఇచ్చింది. 15 మంది అమ్మాయిల్లో ముగ్గురికి బహుళ సంవత్సరాల కాంట్రాక్టులు లభించాయి. చాలా మంది ప్రతిభావంతులైన ఆటగాళ్లు టీ20 లీగ్‌లకే ప్రాధాన్యమిస్తుండడంతో వెస్టిండీస్ జట్టు బాగా బలహీనపడ్డాయి. ఈ నేపథ్యంలో విండీస్ బోర్డు.. క్రికెటర్లకు బహుళ సంవత్సరాల కాంట్రాక్టులు ఇచ్చింది.


సెమీస్‌లో విష్ణువర్ధన్

దిల్లీ: ఫెనెస్టా ఓపెన్ జాతీయ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ ఆటగాడు విష్ణువర్ధన్ సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో విష్ణువర్ధన్ 6-3, 6-3తో హావోబమ్ (మణిపూర్)పై గెలుపొందాడు. అతడు సెమీస్‌లో నితిన్‌ను ఢీకొంటాడు. నితిన్ (పశ్చిమ బెంగాల్) 6-3, 6-4తో రాఘవ్ జైసింఘాని (మధ్యప్రదేశ్)పై నెగ్గాడు. మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో మాయా (తమిళనాడు) 6-2, 7-6 (2)తో హుమేర బహరమస్ (తెలంగాణ)పై, రియా భాటియా (దిల్లీ) 6-3, 2-6, 7-6 (5)తో యుబ్రాని బెనర్జీ (రైల్వేస్)పై విజయం సాధించారు.

వన్షిక్‌కు రెండు స్వర్ణాలు

ముంబయి: ప్రపంచ పికిల్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారుడు వన్షిక్ సత్తా చాటాడు. బాలిలో జరిగిన ఈ పోటీల్లో అతడు రెండు స్వర్ణాలతో మెరిశాడు. 35 ప్లస్ సింగిల్స్‌లో పసిడి పతకం సాధించిన వన్షిక్.. ఇషా లఖాని జతగా మిక్స్‌డ్ డబుల్స్‌నూ స్వర్ణాన్ని సొంతం చేసుకున్నాడు. పురుషుల డబుల్స్‌లోనూ అతడు రజతం నెగ్గాడు. తుది పోరులో వన్షిక్-తేజస్ ద్వయం రెండో స్థానంలో నిలిచింది. మొత్తంగా భారత్ ఈ టోర్నీని రెండు స్వర్ణాలు.. రెండు రజతాలతో ఘనంగా ముగించింది.

సెంట్రల్ కాంట్రాక్ట్ వద్దన్న షంసి


షంసి

జొహానెస్‌బర్గ్: ఎడమచేతి వాటం స్పిన్నర్ తబ్రైజ్ షంసి.. దక్షిణాఫ్రికా సెంట్రల్ కాంట్రాక్ట్‌ను వద్దనుకున్నాడు. ప్రపంచవ్యాప్తంగా టీ20 లీగుల్లో ఆడడం కోసం అతడు ఈ నిర్ణయం తీసుకున్నాడు. అయితే పెద్ద ద్వైపాక్షిక సిరీస్, ఐసీసీ టోర్నమెంట్లలో ఆడేందుకు షంసి ఇప్పటికీ అందుబాటులో ఉంటాడు. "సెంట్రల్ కాంట్రాక్ట్ నుంచి బయటికి రావాలని నిర్ణయించుకున్నా. అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలు ఉపయోగించుకునేందుకు, కుటుంబాన్ని చూసుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నా. నా అవసరం ఉంటే దక్షిణాఫ్రికాకు ఆడడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటా" అని షంసి అన్నాడు. "దక్షిణాఫ్రికాకు ప్రపంచ కప్ అందించాలన్నది నా కల. దేశానికి ఆడడం కన్నా ఏ ఫ్రాంఛైజీ లీగ్ ముఖ్యం కాదు" అని చెప్పాడు.

దక్షిణాఫ్రికా చేతిలో ఐర్లాండ్ చిత్తు


ర్యాన్ రికెల్టన్

అబుదాబి: ర్యాన్ రికెల్టన్ (91; 102 బంతుల్లో 7×4, 3×6), ట్రిస్టియన్ స్టబ్స్ (79; 86 బంతుల్లో 2×4, 4×6) సత్తాచాటడంతో ఐర్లాండ్‌తో వన్డే సిరీస్‌లో దక్షిణాఫ్రికా శుభారంభం చేసింది. తొలి వన్డేలో దక్షిణాఫ్రికా 139 పరుగుల ఆధిక్యంతో ఐర్లాండ్‌ను చిత్తుచేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యం సంపాదించింది. తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 9 వికెట్లకు 271 పరుగులు సాధించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' రికెల్టన్, స్టబ్స్ నాలుగో వికెట్‌కు 152 పరుగులు జోడించి జట్టుకు మెరుగైన స్కోరు అందించారు. ఐర్లాండ్ బౌలర్లలో మార్క్ అడైర్ (4/50), క్రెయిగ్ యంగ్ (3/45) రాణించారు. లక్ష్యఛేదనలో ఐర్లాండ్ 31.5 ఓవర్లలో 132 పరుగులకే కుప్పకూలింది. ఆ జట్టులో జార్జ్ డాక్రెల్ (21) అత్యధిక స్కోరర్. లిజాడ్ విలియమ్స్ (4/32), ఎంగిడి (2/35), ఫోర్టుయిన్ (2/28) విజృంభించి దక్షిణాఫ్రికాకు విజయం అందించారు.

ఈనాడు

హైదరాబాద్ 4-10-2024 శుక్రవారం సిటీ సంపుటి 51. సంచిక 55

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 12+12+4 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

వసుంధర

vasundhara@eenadu.in



ఆ క్రికెటరే.. ఈ శాస్త్రవేత్త!

సూర్యకిరణాలు భూమిని చేరనంతవరకూ చుట్టూ అంధకారమే! ఆ వెలుగు ఉంటేనే మనకు ఆహారమైనా... ఆరోగ్యమైనా! అలా మన జీవితాల్లో తమ పరిశోధనలతో వెలుగులు నింపేవారే శాస్త్రవేత్తలు. నవరాత్రుల్లో రెండోరోజు అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిస్తుంది. ఈమె కూడా సూర్య సంబంధిత దేవతే! జ్ఞాన ప్రదాయిని కూడా. ఆ గాయత్రీదేవిలా ఆరోగ్యరంగంలో వెలుగులు నింపుతోన్న స్త్రీశక్తి చంద్రిమా సాహా. ఆవిడ కథేమిటంటే...

'మనసుండాలే కానీ సామాన్యంగా కనిపించే దానిలోనూ అద్భుతాన్ని చూడొచ్చు' అనేవారు నాన్న. ఆయన ఫొటోగ్రాఫర్. అమ్మేమో ఆర్టిస్ట్. పైగా స్త్రీవాది. ఊహలకు రెక్కలు తొడగమని చంద్రిమని ప్రోత్సహించేవారామె. తనలోని పరిశోధకురాలిని నిద్రలేపింది వీళ్లిద్దరే అంటారు చంద్రిమా సాహా. ఈవిడది కోల్‌కతా. నేర్చుకోవాలనే ఆసక్తి పెంచాలని అమ్మానాన్నలు ఆమెకో టెలిస్కోప్ ఇచ్చారు. అనంతవిశ్వాన్ని పరిచయం చేయాలనుకుంటే... ఆమె కన్ను మైక్రోస్కోప్‌పై పడింది. చుట్టుపక్కల చెరువులు, బావులు, కాలువల నుంచి నీరు తేవడం... వాటిని మైక్రోస్కోప్ కింద పరీక్షించడం... రోజూ ఆవిడకి ఇదే పని. అదే రానురానూ ఆవిడలో బయాలజిస్ట్ కావాలన్న కోరికను పెంచాయి.

కోల్‌కతా యూనివర్సిటీ నుంచి డిగ్రీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ బయాలజీ నుంచి పీహెచ్‌డీ పూర్తిచేశారు. అమెరికాలోని కనాసా మెడికల్ సెంటర్‌లో రెండేళ్లు పోస్ట్ డాక్టోరల్ రిసెర్చ్ చేసి, న్యూయార్క్‌లో మరో రెండేళ్లు పనిచేశారు. స్వదేశంపై ప్రేమతో తిరిగొచ్చి దిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యూనాలజీలో రిసెర్చర్‌గా చేరారు. ఒక చిన్న కణం... ప్రాణిగా రూపొందడం చంద్రిమకు ఆశ్చర్యంగా అనిపించేది. అందుకే తన దృష్టంతా సెల్‌బయాలజీపైనే పెట్టారామె. రోజూ మన శరీరంలో ఎన్నో కణాలు చనిపోతాయి. మరెన్నో పుట్టుకొస్తాయి. ఆ చనిపోయే కణాల మరణానికి దారితీసే క్రమాన్ని కనుక్కోవడంపై పరిశోధనలు చేస్తున్నారు. దీని కోసం కాలా అజార్ (బ్లాక్ ఫీవర్)కి కారణమయ్యే లీష్మేనీయా అనే పారాసైట్, క్యాన్సర్ కణాలపైనా రిసెర్చ్ చేస్తున్నారామె. కణాల చావు వెనకనున్న మెకానిజాన్ని తెలుసుకుంటే క్యాన్సర్ సహా ఎన్నో దీర్ఘకాలిక అనారోగ్యాలకు మందులు కనిపెట్టొచ్చనేది ఆమె అభిప్రాయం.

ఒత్తిడి సమయంలో కణాలు స్పందించే, వాతావరణ మార్పులకు అనుగుణంగా వాటినవి మలుచుకునే తీరుపై ఆమె చేసిన పరిశోధనలు చాలా సమస్యలకు పరిష్కార మార్గాన్ని చూపాయి. తన సేవలకు గుర్తింపుగా ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్, నేషనల్ అండ్ ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, ద వరల్డ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ వంటి జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి పురస్కారాలెన్నో అందుకున్నారు చంద్రిమ. దేశవిదేశాల్లోని ప్రతిష్ఠాత్మక సైన్స్ అకాడమీల్లో కౌన్సిల్ మెంబర్, అడ్వైజర్‌గానూ చేశారు. ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీకి ప్రెసిడెంట్ అయ్యారు. 80ఏళ్లకుపైగా చరిత్ర ఉన్న సంస్థలో ఆ హోదాకి చేరుకున్న తొలి మహిళ ఆవిడ. 'నేను చేరిన కొత్తలో శాస్త్రవేత్తలు దాదాపుగా అందరూ మగవారే. పైగా నేనే చిన్న. షేక్‌హ్యాండ్ సరి కదా... మాట కూడా కలిపేవారు కాదు. అలా లింగ వివక్ష చూపడం, మన పనిని పట్టించుకోకపోవడం... వీటితో చాలావరకూ అనాసక్తి కలుగుతుంది. కానీ నాకవి ప్రేరణను కలిగించేవి. పట్టుదలను పెంచేవి. కాబట్టే విజయవంతమైన శాస్త్రవేత్తగా అందరి ముందూ నిలిచా. జీవితం ఖాళీ కాన్వాస్ లాంటిది. దాన్ని అందంగా, మంచి జ్ఞాపకంగా తీర్చిదిద్దుకోవడం మన చేతిలోనే ఉంది. నా లక్ష్యం... లోకానికి సాయపడటం. దానిపై దృష్టిపెడితే మిగతావేవీ కనిపించేవి కాదు' అంటారు 72ఏళ్ల చంద్రిమ. యువ మహిళా శాస్త్రవేత్తలను పరిశోధనలవైపు ప్రోత్సహిస్తున్నారీమె. అన్నట్టూ ఈవిడ పశ్చిమ్ బంగ తొలి మహిళా క్రికెట్ జట్టుకి వైస్‌కెప్టెన్, ఆల్ ఇండియా రేడియోలో తొలి మహిళా క్రికెట్ వ్యాఖ్యాత కూడా. చిన్న మైక్రోస్కోప్‌తో మొదలైన ఆమె ప్రయాణం... ఎంతోమందికి మార్గదర్శకంగా నిలవడం స్త్రీశక్తికి నిదర్శనమే కదూ.

శ్రీ గాయత్రీదేవి!

శక్తిరూపం



శరన్నవరాత్రుల్లో విజయవాడ కనకదుర్గ ఆలయంలో ఆదిశక్తి ఈ రోజు శ్రీ గాయత్రీదేవిగా దర్శనమిస్తోంది. వికసించిన ఎర్రకమలంలో ఆసీనురాలైన గాయత్రీదేవి... సకల వేదస్వరూపం. ముక్త(ముత్యం), విద్రుమ(వైఢూర్యం), హేమ(బంగారం), నీల(నీలం), ధవళ(తెలుపు) వర్ణాలు కలిగిన ఐదు ముఖాలతో ఆమె దర్శనమిస్తుంది. ఐదు ముఖాల్లో ఒకటి గాయత్రీదేవినీ మరో నాలుగు చతుర్వేదాలనీ సూచిస్తాయి. ఐదు ముఖాలూ పంచభూతాలకు సంకేతమని కూడా అంటారు. దేవి ముఖంలో అగ్ని, శిరస్సులో బ్రహ్మ, శిఖలో రుద్రుడు, హృదయంలో విష్ణువు కొలువుంటారని పురాణాలు చెబుతున్నాయి. త్రిమూర్తుల ఆయుధాలు ధరించిన గాయత్రిని సరస్వతి, లక్ష్మి, పార్వతి దివ్య అంశగానూ, ఆదిశక్తి రూపంగానూ కొలుస్తారు. గా అంటే గానం, యత్రి అంటే రక్షించునది అని అర్థం.

బ్రహ్మదేవుడు నాలుగు ముఖాలతో ఆదిశక్తిని ప్రార్థించి... గాయత్రీ మంత్రాన్ని నాలుగు వేదాల రూపంలో వివరించాడట. దీనికి సంతోషించిన ఆ తల్లి గాయత్రీ అవతారమెత్తిందనీ అప్పట్నుంచీ వేదమాతగా పిలుస్తున్నారనేది ఓ పురాణ కథనం. ఆ మంత్ర రూపమే గాయత్రీదేవి అనీ అంటారు.

పూర్వం అరుణుడు అనే రాక్షసుడు యుద్ధంలోగానీ; స్త్రీ, పురుషుల నుంచిగానీ; రెండు కాళ్ల, నాలుగు కాళ్ల జీవుల వల్లగానీ మరణంలేని వరాన్ని బ్రహ్మ నుంచి పొందుతాడు. ఆ వర గర్వంతో దేవతల్ని హింసిస్తాడు. అతను గాయత్రీ ఉపాసకుడు కావడంతో ఎవరూ ఏమీ చేయలేకపోతారు. అప్పుడు నారదుడి సలహామేరకు బృహస్పతి అతని దగ్గరకెళ్లి... 'మేం జపించే గాయత్రీ మంత్రాన్నే నువ్వూ జపిస్తున్నావు కాబట్టి మనం స్నేహితులమే కదా' అంటాడు. అది విన్న అరుణుడు దురహంకారంతో 'దేవతలు చేసేదే నేను చేయడమేంటీ' అనుకుని గాయత్రీ మంత్రోపాసన ఆపేస్తాడు. దాంతో బలహీనుడవుతాడు. అప్పుడు ఇంద్రాది దేవతలు గాయత్రీ మాతను శరణు కోరగా ఆ తల్లి... కోట్లాది భ్రమరాలను పంపిస్తుంది. అవన్నీ భీకరశబ్దం చేస్తూ అతన్ని చుట్టుముట్టి ఆ అసురుణ్ణి వధిస్తాయి. 24 బీజాక్షరాలతో లిఖితమైన గాయత్రీ మంత్రం మహిమాన్వితమైనది కాబట్టే... ఈ మంత్రాన్ని పఠించడం వల్ల మంత్రసిద్ధి, బ్రహ్మజ్ఞానం కలుగుతాయనీ బుద్ధి తేజోవంతమవుతుందనీ చెబుతారు. ఈ దేవిని కొలిస్తే ఆరోగ్యం, తేజస్సు, జ్ఞానం కలుగుతాయన్నది భక్తుల విశ్వాసం. ఈ రోజున అమ్మవారు నారింజ లేదా కనకాంబర రంగు చీరలో దర్శనమిస్తారు. పులిహోర, అల్లం గారెలు నివేదన చేస్తారు. గాయత్రీదేవిని అష్టోత్తర శతనామావళితో పూజించడం వల్ల సకల శుభాలూ కలుగుతాయనీ, తామర, కలువ పూలతో పూజిస్తే విశేష ఫలితాలు సిద్ధిస్తాయనీ చెబుతారు.

తగిన కూతురిని కాదేమో!

నాకు పదహారేళ్లు. ఈమధ్య నేను అనుకున్నట్లుగా ఏం జరగకపోయినా ఏడుపొచ్చేస్తోంది. ప్రతిచిన్న దానికీ భోరున ఏడ్చేస్తున్నా. అమ్మానాన్నలకు ఒక్కతే అమ్మాయిని. నాపై ఎన్నో ఆశలు వాళ్లకి. నేనేమో ఇలా బేలగా తయారవుతున్నా. వాళ్లకి తగిన కూతురిని కాదేమోనని బాధ. నావల్ల వాళ్లకి నిరాశే ఎదురవుతుందేమోనని భయంగా కూడా ఉంది. – ఓ సోదరి

నువ్వు చెప్పినదాన్నిబట్టి చూస్తే నువ్వు చాలా సున్నిత మనస్కురాలివని అర్థమవుతోంది. జీవితంలో బోలెడు కోరుకుంటాం. అవి జరగకపోతే బాధపడతాం. కానీ అన్నీ అనుకున్నట్లే జరుగుతాయా? అలాగని ఏడుస్తూ కూర్చుంటే సాధించేస్తామా? పొరపాట్లు ఎక్కడ జరిగాయి, ప్రయత్నలోపం ఏమైనా ఉందా అని సరిచూసుకుంటేనే కదా ముందుకెళ్లేది? కాబట్టి ముందు వాటిని గమనించుకో. బిడ్డల మీద తల్లిదండ్రులకు ఎన్నో ఆశలు ఉంటాయన్నది వాస్తవమే అయినా అవన్నీ వాళ్లు తప్పకుండా నెరవేర్చాలనేమీ లేదు కదా. నీ లక్ష్యాలు, అభిరుచులు, ఆసక్తులను గుర్తించి, వాటిలో విజయం సాధించే ప్రయత్నం చెయ్యి. అప్పుడూ మీ అమ్మానాన్నలు నీ గురించి గొప్పగానే చెప్పుకొంటారు. ముందు నీ సామర్థ్యాలు, బలహీనతలను గమనించు. నీ ఆసక్తికి తగ్గట్టుగా నైపుణ్యాలను పెంచుకో. అవసరమైతే వ్యక్తిత్వ వికాస నిపుణులను కలిసి ఆత్మవిశ్వాసం పెంచుకోవడం, సానుకూల దృక్పథం అలవర్చుకోవడం, భావోద్వేగాలను అదుపు చేసుకోవడం వంటివాటిపై పట్టు తెచ్చుకో. వీటితో విశ్లేషణ శక్తి పెరిగి ప్రతి చిన్నదానికి ఏడవడం, బేలగా ఉండడం వంటివి తగ్గుతాయి. నీ మీద నీకు నమ్మకం, నీ లక్ష్యాల పట్ల నిబద్ధత పెరిగి అనుకున్నది సాధించగలుగుతావు.

డియర్... వసుంధర



డా. స్వాతి పైడిపాటి
మానసిక నిపుణురాలు

బంగారం-వెండి



3న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ.లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	7,110	7,100
వెండి (గ్రా)	101.00	101.00

	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం (24క్యా)	78,000	78,270	75,890	------	77,550	77,450	77,550	77,480	77,290	77,180
ఆర్నమెంట్	71,900	71,800	71,100	------	71,810	71,720	71,210	71,130	71,100	71,000
వెండి (కిలో)	93,829	92,790	93,700	------	91,500	91,000	93,000	93,200	92,000	92,000

ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్, టెలిగ్రాంల ద్వారా పంపవచ్చు.



ప్రతి ఇంటా ఓ దుర్గ!

దేశంలో ఆడపిల్లలపై జరుగుతోన్న అకృత్యాలు... ఆమె ఆత్మరక్షణ విద్య నేర్చుకోవలసిన అవసరాన్ని నొక్కి చెబుతున్నాయి. ఈ విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసింది. నవరాత్రులు మొదలుకుని ప్రతి ఇంట్లో ఒక దుర్గ ఉండాలంటూ 'హర్ ఘర్ దుర్గ అభియాన్' కార్యక్రమం ప్రారంభించింది. శక్తికి ప్రతీకగా, చెడుపై గెలిచిన దుర్గాదేవి విజయానికి గుర్తుగా జరుపుకొనే దసరా ఉత్సవాలతో వీటిని ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వరంగ పారిశ్రామిక సంస్థల్లో (ఐటీఐ)చదువుతోన్న విద్యార్థినులకు ఉచితంగా సెల్ఫ్ డిఫెన్స్ తరగతులు నిర్వహిస్తారు. ఏడాది పొడవునా, వారానికి రెండు రోజులు ఈ కార్యక్రమాలు సాగుతాయి. అంతేకాదు, ఇది విద్యార్థులకోసమే రూపొందించినా 'ఆత్మరక్షణ విద్య నేర్చుకోవాలనుకునే ఏ స్త్రీ అయినా నిరభ్యంతరంగా నేర్చుకోవచ్చు' అని చెబుతున్నారు ఆ రాష్ట్ర మంత్రి మంగళ్ ప్రభాత్ లోధా. ఈ స్ఫూర్తిని అందుకుని ప్రతి ఇంట్లోనూ చెడుపై పోరాడే ఓ శక్తి తయారవ్వాలని మనమూ కోరుకుందాం!

కళ తెచ్చే కనకాంబరం...!

చిన్ననాటి జ్ఞాపకాల్ని గుర్తుచేసే పూల మొక్క కనకాంబరం. వాసన లేకపోయినా కంటికింపైన రంగుల్లో ఆకట్టుకుంటాయివి. తేలిగ్గా ఉండి, మూడు నాలుగురోజుల పాటు తాజాగా కనిపిస్తాయి. బతుకమ్మ పండక్కి ఈ పూలు దండల్లే మారి... పడుచుల మనసుల్ని మురిపిస్తాయి. అయితే, సాధారణంగా కనకాంబరాలు అనగానే నారింజ, పసుపు రంగుల్లో ఉన్నవే ఎక్కువగా కనిపిస్తుంటాయి. కానీ, నేరేడు, ఎరుపు, లేత గులాబీ... వంటి మరెన్నో వర్ణాల్లోనూ ఇవి దొరుకుతాయి. దాంతో ఒక్క బతుకమ్మ వేడుకలోనే కాదు, పెళ్లి, పేరంటం....ఏదైనా సరే మూరైనా కనకాంబరాల మాల తలలో పెట్టుకోవాల్సిందే అనుకుంటారు ఒకప్పటి తరం. ఇలా వీటిని కేశాలంకరణకే కాదు, ఇతర అలంకరణలు, దేవుడి పటాలకు దండలుగానూ వాడుతుంటారు. అంతేనా, ఈ కనకాంబరం మొక్కల్లో ఔషధ గుణాలు ఎక్కువట. ఆయుర్వేద వైద్యంలో దగ్గు, అల్సర్ నివారణా మందుల్లో వాడతారట. పుణెలోని మోడరన్ కాలేజీ నిర్వహించిన బయోటెక్నాలజీ పరిశోధనల్లో కనకాంబరాలకు సెల్‌ఫోన్‌పై పేరుకునే బ్యాక్టీరియాను తొలగించే శక్తి ఉందనీ తేలింది.





కురులకీ ఎస్‌పీఎఫ్!

ఎండ నుంచి చర్మాన్ని రక్షించడానికి సన్‌స్క్రీన్ రాస్తుంటాం కదా! మరి కురుల సంగతేంటి? వాటికీ ఎస్‌పీఎఫ్ రక్షణ కావాలి. ఎండ వేడి, అతినీలలోహిత కిరణాల ప్రభావం కురులపైనా ఉంటుంది. పొడిబారడం, ఊరికే తెగిపోవడం, చిట్లడం వంటివన్నీ ఎండ చలవే! అందుకే కురులకీ సన్‌స్క్రీన్ వాడమంటున్నారు నిపుణులు. వీటిల్లోని యాంటీ ఆక్సిడెంట్లు, మాయిశ్చరైజర్, ఎస్‌పీఎఫ్ ఈ దుష్ప్రభావాల నుంచి కురులను కాపాడతాయి. మాడునీ ఆరోగ్యంగా ఉంచుతాయి. అయితే ముఖానికి రాసేదే దీనికీ వాడేరు! జుట్టు కోసం ప్రత్యేకంగా సన్‌స్క్రీన్ లోషన్లున్నాయి. నిజానికి వీటిని కురులకు వేసుకున్న రంగు పోకుండా ఉండటానికి వాడమనేవారు. కానీ పెరుగుతున్న వేడికి జుట్టు ఆరోగ్యం క్షీణించడం, ఊడిపోవడం లాంటివి పెరుగుతుండటంతో దీన్ని ప్రత్యేకంగా సూచిస్తున్నారు. తలనీ ఇంతలా పట్టించుకునే సమయం లేదు... ఓపిక లేదు అంటారా అయితే ఎండలోకి వెళుతున్నప్పుడు స్కార్ఫ్‌తో కప్పడమో, టోపీని పెట్టుకోవడమో అయినా తప్పనిసరిగా చేయండి. అప్పుడు కురులకు రక్షణ దొరకడమే కాదు... అవి ఆరోగ్యంగా మెరవడమూ గమనిస్తారు.

ఆ పొడవు ఆమెను గేమ్ చేంజర్‌ను చేసింది!





గోల్ కోసం ప్రత్యర్థులు తీవ్రంగా ప్రయత్నిస్తుంటే, విజయం ఎవరికి దక్కుతుందనే ఉత్కంఠ అందరిలో నిండిపోయింది. అంతలో పూనమ్ చతుర్వేది రావడం, ప్రత్యర్థుల దగ్గర నుంచి బంతిని చేజిక్కించుకుని సునాయసంగా నెట్‌లో వేయడం క్షణాల్లో జరిగింది. దాంతో ఆమె జట్టు విజేతగా నిలిచింది. ఎవరికీ సామాన్యంగా సాధ్యంకాని గోల్‌ను పూనమ్ తేలికగా చేయడానికి కారణం ఆమె పొడవే. ఏడు అడుగుల ఎత్తుతో దేశంలోనే అత్యంత పొడవైన బాస్కెట్‌బాల్ క్రీడాకారిణిగా గుర్తింపు ఉందీమెకు. ఇదే ఆమెను ఇండియన్ విమెన్స్ బాస్కెట్‌బాల్ జట్టులో స్థానం సంపాదించేలా చేసింది. మెదడులో కణితి బాధించినా, దాన్నుంచి కోలుకొని, ఆటలో తనను తాను నిరూపించుకుంటున్న పూనమ్ స్ఫూర్తి కథనమిది.

కాన్పూర్‌లోని మారుమూల ప్రాంతానికి చెందిన కుటుంబం పూనమ్‌ది. పుట్టుకతోనే పైపెదవి చీలినట్లు ఉండేది. చికిత్స చేయించే స్థోమత తల్లిదండ్రులకు లేదు. ఈ వైకల్యంతో ఆమె మాట స్పష్టంగా ఉండేది కాదు. దీంతో స్కూల్‌లో తోటిపిల్లలు హేళన చేసేవారు. అయినా చదువుతోపాటు క్రీడల్లోనూ ఉత్సాహంగా పాల్గొనేదీమె. స్కూల్‌లో చదువుతున్నప్పుడు 6.3 అడుగులున్న ఈమెను బంధువు ఒకాయన చూసి 'బాస్కెట్‌బాల్‌లో శిక్షణ ఇప్పిస్తే రాణిస్తుంద'ని చెప్పాడు. ఆ సలహా మేరకు ఈమెను ఛత్తీస్‌గఢ్‌లో బాస్కెట్‌బాల్ కోచ్ రాజేష్ పాటిల్ వద్ద చేర్పించారు. అతి తక్కువ కాలంలోనే ఈమె ఆటలో నైపుణ్యాలను గుర్తించిన కోచ్ స్థానిక పోటీలకు పంపడం మొదలుపెట్టారు. గోల్స్ సునాయసంగా వేసే ఈమె ఆట తీరుకు క్రమేపీ అవకాశాలు పెరుగుతున్న సమయంలో 2013లో తీవ్ర అనారోగ్యానికి గురైంది. వైద్యపరీక్షల్లో మెదడులో కణితి ఉన్నట్లు తేలింది. సర్జరీ చేయకపోతే ప్రాణానికే ముప్పు అన్నారు. రెండు శస్త్రచికిత్సలు నిర్వహించడంతో ఆటకు తాత్కాలికంగా విరామమివ్వాల్సి వచ్చింది.

ఇబ్బందులతోనే...

అయిదేళ్లపాటు ఈ వ్యాధితో పోరాడి పూనమ్ చివరకు గెలిచింది. 2019లో ఆరోగ్యవంతురాలిగా తిరిగి క్రీడామైదానంలోకి అడుగుపెట్టింది. 'పొడవు కారణంగా అందరిలా ఉండలేం. ప్రతిచోట ఏదో ఒక ఇబ్బంది ఎదురవుతుంది. కారులో కూర్చున్నప్పుడు, గదిలోకి వెళ్లేటప్పుడు, షూలు కొనేటప్పుడు ఇలా ప్రతి సందర్భంలోనూ సమస్యలొస్తాయి. వీటిని దాటి ఆటలో నైపుణ్యాలను పెంచుకోవడానికి కృషి చేశా. నా ఎత్తు ఇప్పుడు ఏడడుగులు. ఈ ఎత్తును లోపంగా చూడకుండా, దాన్ని ఆటలో ఉపయోగించడమెలాగో నేర్చుకున్నా. జీవితంలో సమతుల్యత, పనితీరు, ఫిట్‌నెస్ ప్రాముఖ్యతవంటి వాటిపై అవగాహన పెంచుకున్నాను. టీమ్ అందిస్తున్న సహకారం, ప్రోత్సాహంతో జట్టు గెలుపు కోసం పాటుపడుతున్నా. ఇండియన్ విమెన్స్ బాస్కెట్‌బాల్ జట్టులో స్థానాన్నీ సంపాదించుకున్నా. పలు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ఆడే అవకాశాన్నీ అందుకొని జట్టును గెలిపించడంలో నావంతు సహకారం అందించా. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలనే లక్ష్యంతో ఉన్నా'నని చెబుతోందీ గేమ్ చేంజర్.



ఫ్యాషన్ ఫ్యాషన్

ఆడదామా... దాండియా!

దేశవ్యాప్తంగా నవరాత్రి సందడి మొదలైంది. ఓవైపు భక్తి భావన... మరోవైపు నృత్యాలతో కోలాహలం. చిన్నాపెద్దా ఓచోట చేరి నవరాత్రులన్నీ సందడిగా గడిచిపోతాయి. నవరాత్రి అనగానే గుర్తొచ్చేది దాండియా కూడా! ఈ గుజరాతీ జానపద నృత్యం మనకీ కొత్తేమీ కాదు. ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థల పుణ్యమా అని ఎప్పుడో పరిచయమైంది కూడా. నిర్వహిస్తున్న చోటికి వెళ్లి స్నేహితులతో సరదాగా అలా ఆడిపాడడానికి ఉత్సాహం చూపేవారూ ఎందరో! అయితే దాండియా అంటే సంగీతానికి తగ్గట్టుగా పాదం కదిపేయడమే కాదు. ఆహార్యమూ నృత్యం చేస్తున్నట్లే ఉంటుంది. అలలుగా కదిలే గాగ్రా... ఆ సందడికి సవ్వడి చేసే గవ్వలూ, మువ్వలూ... వెలుగులకు తళుక్కుమనే అద్దాలూ! ఇక పెద్ద జుంకీలు, పట్టీలు, నెక్లెస్‌లు, గాజులను జతచేస్తే పెరిగే అందమే వేరు. కానీ తొలి ప్రాధాన్యం మాత్రం రంగు రంగులతో మెరిసిపోయే వస్త్రాలదే! దాండియా నృత్యంలో మనది అందె వేసిన చేయి కాకపోయినా... ఆ వస్త్రధారణలో నలుగురితో అలా అలా ఆడిపాడినా వచ్చే సంతృప్తే వేరు. మీరూ ఆ ఆనందాన్ని ఆస్వాదించాలనుకుంటే ఈ గాగ్రా లేదా చనియా చోలీలను చూసేయండి. కోట్‌తో, అటాచ్‌డ్ చున్నీతో వేగంగా సిద్ధమవడంలో సాయం చేయడమే కాదు... సౌకర్యవంతంగానూ అనిపిస్తాయి. మనమూ వీటిని ప్రయత్నించి మురిసిపోదామా? సరదాగా చేద్దామా... దాండియా?









మహిళా డాక్టర్లే మేలు!

వివిధ కారణాలతో అత్యవసర సేవల కోసం హాస్పిటల్‌లో చేరిన 7.5లక్షల మందికి సంబంధించిన డేటాను విశ్లేషించారు అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా పరిశోధకులు. ఫిజీషియన్లుగా మహిళలు ఉంటే.. పేషెంట్లు చనిపోవడం, తిరిగి హాస్పిటల్‌లో చేరడం లాంటి వాటికి ఆస్కారం తక్కువని గుర్తించారు. ఇది మహిళలూ, పురుషులూ ఇద్దరి విషయంలోనూ వాస్తవమని తేలింది. మహిళా పేషెంట్ల విషయంలో ఇంకాస్త మెరుగైన ఫలితాలున్నాయట. డాక్టర్ల జెండర్ ఎందుకు ప్రాధాన్యమనే విషయాన్ని పరిశోధకులు కచ్చితంగా చెప్పకపోయినా, మహిళా వైద్యులు మహిళా పేషెంట్లతో బాగా మాట్లాడి ఎక్కువ వివరాలు తెలుసుకుంటారనీ, తద్వారా వ్యాధి నిర్ధారణ, చికిత్స మెరుగ్గా ఉంటాయనే అంచనాకు వచ్చారు.

ఈనాడు

హైదరాబాద్ 4-10-2024 శుక్రవారం సిటీ సంపుటి 51. సంచిక 55
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 12+12+4 www.eenadu.net
Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ముసుగు రాజకీయాలొద్దు

కేటీఆర్, హరీశ్.. మూసీని అడ్డుపెట్టుకుని ఎన్నాళ్లు గడుపుతారు?

- ఫాంహౌస్‌లను కాపాడుకునేందుకే భారాస ఆందోళనలు
- ఆ పార్టీకి రూ.1500 కోట్లున్నాయి.. రూ.500 కోట్లు పేదలకు ఇవ్వొచ్చుగా..
- ఈటలా.. ప్రధాని వద్దకు వెళ్లి రూ.25 వేల కోట్లు అడుగుదాం పదండి
- 'ఫ్యామిలీ డిజిటల్ కార్డు' పైలట్ ప్రాజెక్టు ప్రారంభం సందర్భంగా సీఎం రేవంత్



ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే ఫారాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, గద్వాల విజయలక్ష్మి

ఈనాడు - హైదరాబాద్, కంటోన్మెంట్, కార్ఖానా - న్యూస్‌టుడే: 'దోమలు, అనారోగ్యం, వరదల వంటి ఇబ్బందుల మధ్య.. మూసీలో నివసిస్తున్న ప్రజలు గౌరవంగా జీవించేందుకు రెండు పడక గదుల ఇళ్లు, తొవ్వ ఖర్చులకు రూ. పాతిక వేలు ఇస్తున్నాం. దీనిపై మూసీ ముసుగు కప్పుకొని రాజకీయాలు చేయకండి. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను ఆక్రమించి నిర్మించుకున్న తమ ఫాంహౌస్‌లను కాపాడుకునేందుకే బావాబావమరుదులు హరీశ్‌రావు, కేటీఆర్‌లు కిరాయిమూకలతో ఆందోళనలు చేయిస్తున్నారు. వారికి సబితమ్మ వంత పాడుతోంది. వెనకున్న కేవీపీ కూడా ఆమెను రక్షించలేరు' అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిప్పులు చెరిగారు. సికింద్రాబాద్ హాకీ గ్రౌండ్స్‌లో గురువారం 'ఫ్యామిలీ డిజిటల్ కార్డు' పైలట్ ప్రాజెక్టు సర్వేను ప్రారంభించిన సందర్భంగా.. ఆయన విపక్షాల తీరుపై మండిపడ్డారు. ...మిగతా 2లో

> "పదేళ్ల పాటు అధికారంలో ఉన్న భారాస నాయకులు చెరువులు, నాలాలను ఆక్రమించి విధ్వంసం సృష్టించారు. హైదరాబాద్ నగర ప్రజలకు తాగునీటిని అందిస్తున్న జంటజలాశయాలను ఆక్రమించుకుని ఫాంహౌస్‌లు కట్టుకున్నారు. జన్వాడలో కేటీఆర్, అజీజ్‌నగర్‌లో హరీశ్‌రావు, జంట జలాశయాలకు సమీపంలో సబితమ్మ తన కుమారుల పేర్లతో ఫాంహౌస్‌లు నిర్మించుకున్నారు. వాటిని కూల్చేస్తే అక్రమం అవుతుందా?"
>
> – సీఎం రేవంత్‌రెడ్డి

48 గంటల్లోపే రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు

- తాలు, తరుగు, తేమంటూ మోసంచేస్తే క్రిమినల్ చర్యలు తీసుకోండి
- కలెక్టర్లతో వీసీలో సీఎం రేవంత్

2లో

ఇసుక అక్రమ రవాణా కట్టడిలో వైఫల్యం..

ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్సైలపై వేటు

ఈనాడు, హైదరాబాద్: ఇసుక అక్రమ రవాణాను నియంత్రించడంలో విఫలమైన పోలీసులపై ఆ శాఖ ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. మల్టీజోన్-2 పరిధిలోని తొమ్మిది జిల్లాల్లో ఇందుకు బాధ్యులను గుర్తించి వారిపై వేటు వేశారు. ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్సైలను వేకెన్సీ రిజర్వ్(వీఆర్)లో పెడుతూ జోన్ ఐజీపీ వి.సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ జాబితాలో సంగారెడ్డి రూరల్, తాండూరు రూరల్, తాండూరు టౌన్ ఇన్‌స్పెక్టర్లతోపాటు వీపనగండ్ల, బిజినేపల్లి, తెలకపల్లి, వంగూరు, ఉప్పునూతల, సంగారెడ్డి రూరల్, పెద్దేముల్, యాలాల్, తుంగతుర్తి, ఆత్మకూర్(ఎస్), పెన్‌పహాడ్, వాడపల్లి, హాలియా ఎస్సైలు ఉన్నారు. సమగ్ర విచారణ అనంతరం ఈ వ్యవహారంలో ప్రత్యక్ష, పరోక్ష సహకారం ఉన్న వారిని గుర్తించి శాఖాపరమైన



చర్యలు తీసుకోనున్నారు. రాష్ట్ర నిఘా వర్గాల నివేదికలు, విచారణల ఆధారంగా సీఐ, ఎస్సైలపై చర్యలు చేపట్టినట్లు ఐజీ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. వీరే కాకుండా ఇంతకుముందు కూడా ఇసుక అక్రమ రవాణా కట్టడిలో విఫలమైన ఒక సీఐతోపాటు అడవిదేవిపల్లి, వేములపల్లి, నార్కట్‌పల్లి, చండూర్, మాడుగులపల్లి, తిప్పర్తి, చింతలపాలెం, తిరుమలగిరి, నాగారం, బాజిరెడ్డిగూడెం, అచ్చంపేట, బొంరాస్‌పేట్, తాండూరు, చిన్నంబావి ఎస్సైలపై బదిలీ వేటు వేశారు. ...మిగతా 2లో

పేదల ఇళ్లు కూలిస్తే.. ప్రభుత్వమూ కూలుతుంది



- డ్రైనేజీ సమస్య పరిష్కరించకుండా మూసీ సుందరీకరణ అనాలోచితం
- కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: పేద ప్రజల ఇళ్లను కూల్చే ప్రయత్నం చేస్తే.. రాష్ట్ర ప్రభుత్వం కూలిపోక తప్పదని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి హెచ్చరించారు. మూసీ సుందరీకరణ పేరుతో పేదలపై ప్రతాపం చూపిస్తే ప్రభుత్వాన్ని స్తంభింపజేస్తామన్నారు. గురువారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా విద్య, వైద్య రంగాన్ని పట్టించుకోలేదు. బస్తీలపై కన్నేసి పేదల ఇళ్లను కూల్చే పనిని మొదలుపెట్టింది. పేదల నివాసాలు కూల్చొద్దని భాజపా ఆధ్వర్యంలో ఆందోళనలు చేశాం. సీఎంకు స్వయంగా లేఖ కూడా రాశాను. ...మిగతా 2లో

'మేడిగడ్డ'పై వేగం పెంచిన విజిలెన్స్

- 5 నుంచి 11 వరకు తొమ్మిది మంది ఇంజినీర్ల విచారణ

ఈనాడు, హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజీ విచారణలో విజిలెన్స్ వేగం పెంచింది. ఈ నెల ఐదో తేదీ నుంచి విచారణకు రావాలని పలువురు సీనియర్ ఇంజినీర్లను పిలిచింది. పూర్తి నివేదికను త్వరగా అందజేయాలని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సూచించిన నేపథ్యంలో నీటిపారుదల శాఖలో కీలకమైన రాష్ట్రస్థాయి స్టాండింగ్ కమిటీ, సెంట్రల్



డిజైన్స్ ఆర్గనైజేషన్(సీడీవో) ఇంజినీర్లను విచారించనుంది. మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాక్ కుంగడంపై విచారణ జరిపిన విజిలెన్స్ ఏడు అంశాలకు సంబంధించిన ...మిగతా 2లో

నిపుణుల కమిటీ నిర్ణయం తర్వాతే ఫలితాల విడుదల

- గ్రూప్-1పై హైకోర్టులో టీజీపీఎస్సీ వాదన

3లో

నేటి నుంచి కన్వీనర్ కోటా వైద్య సీట్లకు వెబ్‌ఆప్షన్లు

3లో

మూసీ సుందరీకరణతో పేదలెవరినీ నష్టపోనివ్వం

● స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలతో భేటీలో మంత్రి శ్రీధర్‌బాబు

ఈనాడు, హైదరాబాద్: 'మూసీ రివర్ ఫ్రంట్ సుందరీకరణ'తో పేదలెవరూ నష్టపోకుండా చూస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పునరుద్ఘాటించారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి గురువారం ఇరవైకి పైగా స్వచ్ఛంద సంస్థలు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులతో మంత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు తమ అభిప్రాయాలు, సూచనలు ఇచ్చారు. బాధితుల్లో నెలకొన్న ఆందోళనలు, వారి సమస్యలపై మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... "మూసీ సుందరీకరణ ప్రాజెక్టు విషయంలో అందరి సలహాలు, సూచనలను గౌరవిస్తాం. ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని, ఏకపక్షంగా వ్యవహరించవద్దని యంత్రాంగానికి సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఆదేశాలిచ్చారు. మూసీ నదీగర్భంలో ఇళ్లు నిర్మించుకున్న వారికి పునరావాసం కల్పిస్తాం. ఎవరినీ రోడ్లపైకి పంపించే ప్రసక్తే లేదు. తెలిసో తెలియకో కొంతకాలంగా వారంతా మురుగునీటి ప్రవాహం పక్కన నివసిస్తున్నారు. భవిష్యత్తులో మూసీకి లక్ష క్యూసెక్కులకుపైగా వరద వస్తే పరీవాహకంలో ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతుందనేదే ప్రభుత్వ ఆందోళన. బఫర్ జోన్‌లో ఆక్రమణల తొలగింపు విషయంలోనూ అందరి అభిప్రాయాలను వింటాం. మూసీ పునరుజ్జీవంతోపాటు రెండువైపులా ఉన్న పురాతన ఆలయాలు, సాంస్కృతిక చిహ్నాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. సుందరీకరణ తర్వాత మూసీ పరీవాహకమంతా పర్యాటక కేంద్రంగా మారుతుంది. వేల మంది స్థానికులకు ఉపాధి దొరుకుతుంది. ఎవరు రెచ్చగొట్టినా, ప్రలోభ పెట్టాలని చూసినా... ప్రజలు ఆవేశాలకు పోవద్దు. రాజకీయంగా వాడుకోవాలని చూసే వారితో నష్టపోవడం తప్ప... ఒరిగేదేమీ ఉండదు" అని వివరించారు. సమావేశంలో తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం, ప్రొ.హరగోపాల్, ప్రొ.శాంతాసిన్హా, సజయ, సంధ్య, బ్రదర్ వర్గీస్, మీరా సంఘమిత్ర, బిలాల్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు. చిత్రంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు

మండిపడిన చిత్రసీమ

● మంత్రి కొండా సురేఖపై వెల్లువెత్తిన నిరసనలు ● అనుచిత వ్యాఖ్యల్ని సహించబోమన్న తారాలోకం

ఈనాడు, హైదరాబాద్: సినీ ప్రముఖుల వ్యక్తిగత జీవితాల్ని ప్రస్తావిస్తూ బుధవారం మంత్రి కొండా సురేఖ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై చిత్రసీమ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. రాజకీయ లబ్ధి కోసం సినీ కుటుంబాలపై నిరాధారమైన, అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని తేల్చి చెప్పింది. పలువురు సినీ ప్రముఖులు సామాజిక మాధ్యమాల వేదికగా మంత్రి వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండించారు. బుధవారం ఆమె భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై విమర్శలు చేయడంతో పాటు సినీనటుడు అక్కినేని నాగార్జునపైన; నాగచైతన్య, సమంత విడాకులపైన చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపాయి. వాటిని నాగార్జున, సమంత, అమలతో పాటు సినీరంగానికి చెందిన పలువురు ఇప్పటికే తీవ్రంగా ఖండించారు. గురువారం ఆ వేడి ఇంకా పెరిగిన నేపథ్యంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ కొండా సురేఖతో సమావేశమై చర్చించారు. అనంతరం తన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకొంటున్నట్లు సురేఖ ప్రకటించారు. మరోవైపు అక్కినేని నాగార్జున తన పరువుకు భంగం కలిగించేలా మాట్లాడిన సురేఖపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ నాంపల్లిలోని స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టును ఆశ్రయించారు.

హద్దుల్ని గౌరవించాలి

ప్రజా ప్రతినిధులు నిరాధారమైన ఆరోపణలు చేయడం సహించలేనివి. హద్దుల్ని గౌరవించాలి. హుందాగా వ్యవహరించాలి. – ఎస్.ఎస్.రాజమౌళి

దురదృష్టకరం...

రాజకీయ లబ్ధి కోసం వ్యక్తిగత విషయాన్ని ఆయుధంగా మార్చుకోవడం దురదృష్టకరం. కళలపట్ల గౌరవం, శ్రమ, అంకితభావంతో మా సినీ పరిశ్రమ ఏర్పడింది. నాయకత్వ స్థానాల్లో ఉన్న వ్యక్తుల మాటలకు ఎంతో విలువ ఉంటుందని గుర్తు చేసుకోవాలి. రాజకీయాల్లోకి ఇతరుల వ్యక్తిగత జీవితాల్ని తీసుకురావడం వల్ల ఎవరికీ ఉపయోగం ఉండదు. ఇందులో భాగమైనవారి కుటుంబానికి బాధ మాత్రమే ఉంటుంది. – వెంకటేశ్

ఆమోదయోగ్యం కాని వ్యాఖ్యలు

మా సినీ కుటుంబానికి చెందిన ప్రముఖులపై మంత్రి సురేఖ చేసిన వ్యాఖ్యలు నాకెంతో బాధ కలిగించాయి. ఒక మహిళా మంత్రి మరో మహిళపై చేసిన ఆమోదయోగ్యం కాని వ్యాఖ్యలు, భాష తీవ్ర వేదనకు గురిచేశాయి. ఎదుటివారి మనోభావాల్ని దెబ్బతీయనంతవరకూ వాక్ స్వాతంత్ర్యాన్ని ఉపయోగించుకోవచ్చు. ఇలాంటి చౌకబారు, నిరాధారమైన ఆరోపణల్ని తీవ్రంగా ఖండిస్తున్నా. సినీ రంగాన్ని లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేయొద్దని అభ్యర్థిస్తున్నా. – మహేశ్‌బాబు

మేం చూస్తూ ఊరుకోం...

వ్యక్తిగత జీవితాల్ని రాజకీయాల్లోకి లాగడం దిగజారుడుతనం. ప్రత్యేకించి బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉన్నవాళ్లు తప్పనిసరిగా వ్యక్తుల గౌరవాన్ని, గోప్యతను గౌరవించాలి. సినిమా పరిశ్రమ గురించి నిర్లక్ష్యపూరితంగా చేస్తున్న నిరాధారమైన వ్యాఖ్యలు విని ఎంతో నిరుత్సాహానికి గురయ్యా. ఇతరులు మాపైన నిరాధార ఆరోపణలు చేస్తే మేం చూస్తూ ఊరుకోం. – ఎన్టీఆర్

సమాజం సాధారణంగా చూడకూడదు

సినీ ప్రముఖులు, సినీ కుటుంబాల్ని కించపరుస్తూ చేసిన నిరాధారమైన వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండిస్తున్నా. ఈ ప్రవర్తన తెలుగు సంస్కృతి విలువలకు విరుద్ధం, అగౌరవం. ఇలాంటి బాధ్యతారాహిత్య చర్యలను సమాజం సాధారణంగా చూడకూడదు.– అల్లు అర్జున్

రాజకీయ శత్రుత్వాల్లోకి మహిళల్ని లాగకూడదు

రాజకీయ యుద్ధం పేరుతో గౌరవప్రదమైన వారిపై ఓ మహిళా మంత్రి నీచమైన ఆరోపణలు చేయడం నన్ను భయాందోళనలకు గురిచేసింది. ఇది అవమానకరమైన చర్య. తమ రాజకీయ శత్రుత్వాల్లోకి అమాయక వ్యక్తుల్ని, ముఖ్యంగా మహిళల్ని లాగకూడదు. రాజకీయ నాయకులు అందరికీ స్ఫూర్తిగా నిలవాలి. – రవితేజ

అసహ్యం వేస్తోంది...

రాజకీయ నాయకులు ఎలాంటి అవాస్తవాలైనా మాట్లాడొచ్చు, తప్పించుకోవచ్చని అనుకోవడం చూస్తే అసహ్యం వేస్తోంది. మన సమాజాన్ని చెడుగా ప్రతిబింబించే ఇలాంటి చర్యల్ని మనందరం ఖండించాలి. – నాని

దుర్మార్గమైన ప్రచారం

నాకు ఏ రాజకీయ పార్టీతోనూ, వ్యక్తితోనూ సంబంధం లేదు. రాజకీయ మైలేజీ కోసం నా పేరును హానికరమైన రీతిలో ఉపయోగించడం మానేయాలి. తోటి మహిళపై దుర్మార్గమైన, నిరాధారమైన ప్రచారాన్ని వ్యాప్తి చేయడం, అది కూడా బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న ఓ మహిళ చేయడం బాధాకరం. మౌనంగా ఉంటుంటే అది బలహీనతగా భావిస్తున్నారు. - రకుల్‌ప్రీత్ సింగ్

ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నాం...

మహిళా మంత్రి చేసిన అవమానకర వ్యాఖ్యలు చాలా బాధించాయి. చిత్ర పరిశ్రమకు చెందిన సభ్యులపై ఇలాంటి మాటల దాడుల్ని మేమంతా ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నాం. వార్తల్లో నిలిచేందుకు ప్రముఖుల్ని, సినీ కుటుంబానికి చెందిన వ్యక్తుల్ని లక్ష్యంగా చేసుకుని మాట్లాడటం సిగ్గుచేటు. రాజకీయాలతో సంబంధం లేని వ్యక్తులు, మరీ ముఖ్యంగా మహిళలపై ఇలాంటి ఆరోపణలు చేసి దిగజారవద్దు. సమాజాభివృద్ధి కోసం నాయకుల్ని ఎన్నుకుంటాం. ఇలాంటి వ్యాఖ్యలు చేసి స్థాయిని తగ్గించుకోకూడదు. గౌరవప్రదమైన స్థానాల్లో ఉన్నవాళ్లు ఎంతోమందికి స్ఫూర్తిగా నిలవాలి. – చిరంజీవి

చర్యలు తీసుకోవడానికి వెనకాడం

చిత్ర పరిశ్రమకు చెందిన సభ్యుల వ్యక్తిగత జీవితాలకు సంబంధించి, సున్నితమైన విషయాలపై ఎవరు మాట్లాడినా చర్యలు తీసుకోవడానికి వెనకాడబోమని తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి ఓ ప్రకటనలో తెలిపింది. తెలుగు సినిమాకు సంబంధించిన వ్యక్తులపై దుర్మార్గమైన, హేయమైన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా తెలుగు పరిశ్రమ ఏకతాటిపై నిలబడుతుందని చలనచిత్ర వాణిజ్య మండలి కార్యదర్శి కె.ఎల్.దామోదర్ ప్రసాద్ పేర్కొన్నారు.

✦ సినీ నటులు రాజశేఖర్, విజయ్ దేవరకొండ, సాయి దుర్గా తేజ్, వరుణ్‌తేజ్, మంచు మనోజ్, సుధీర్‌బాబు, విష్వక్‌సేన్, సందీప్‌కిషన్, కిరణ్ అబ్బవరం, తేజ సజ్జా, సంయుక్త, లావణ్య త్రిపాఠి, ఖుష్బూ, దర్శకులు రామ్‌గోపాల్ వర్మ, హరీశ్‌శంకర్, శైలేశ్ కొలను, వేణు ఉడుగుల, కోన వెంకట్, సుమ కనకాల తదితరులు కూడా సామాజిక మాధ్యమాల వేదికగా మంత్రి వ్యాఖ్యల్ని ఖండించారు.

ఏకమై నిలబడతాం...

రాజకీయాల కోసం ప్రజల దృష్టిని ఆకర్షించడానికి మా నటులు, వారి కుటుంబాల పేర్లు వాడకండి. వృత్తి పరంగానే కాకుండా మనుషులుగా కూడా మా కుటుంబాలపై వచ్చే అబద్ధపు కథనాలవల్ల కలిగే బాధ చాలా తీవ్రమైనది. చిత్ర పరిశ్రమను బాధ పెట్టాలని చూస్తే మేం మౌనంగా ఉండం. ఇలాంటి మాటల దాడుల్ని తట్టుకోం. ఏకమై నిలబడతాం.

– మంచు విష్ణు, మా అధ్యక్షుడు

ఈ వివాదానికి ఇంతటితో ముగింపు పలకండి: మహేశ్‌కుమార్‌గౌడ్ వినతి

భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విషయంలో మాట్లాడుతూ సినీ పరిశ్రమకు సంబంధించి చేసిన వ్యాఖ్యలను సురేఖ బేషరతుగా వెనక్కి తీసుకున్నందున ఈ వివాదానికి ఇంతటితో ముగింపు పలకాలని సినీ పెద్దలకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఇరువైపులా మహిళలే ఉన్నారని గ్రహించి ఈ విషయాన్ని ఇంతటితో వదిలేయాలని కోరారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జాగ్రత్తగా మాట్లాడాలని మంత్రులకు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఆయన సూచించారు.

మీ మనోభావాలను దెబ్బతీయడం నా ఉద్దేశం కాదు

● నా వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకొంటున్నా

● సినీ నటి సమంతను ఉద్దేశించి ఎక్స్‌లో మంత్రి కొండా సురేఖ

ఈనాడు, హైదరాబాద్, వరంగల్: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను విమర్శించే క్రమంలో సినీ పరిశ్రమ గురించి చేసిన వ్యాఖ్యలపై అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ స్పందించారు. మహిళల పట్ల ఓ నాయకుడి చిన్న చూపు ధోరణిని ప్రశ్నించడమే తన వ్యాఖ్యల సారాంశం తప్ప సినీ నటి సమంత మనోభావాలను దెబ్బతీయడం కాదని అన్నారు. తన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకొంటున్నట్లు ప్రకటించారు. గురువారం హనుమకొండలోని నివాసంలో మీడియాతో మాట్లాడారు. అనంతరం ఎక్స్‌లోనూ ఈ విషయంపై వివరణ ఇస్తూ పోస్టు పెట్టారు. ''మీ(సమంత) మనోభావాలను దెబ్బతీయడం నా ఉద్దేశం కాదు. మీరంటే నాకు కేవలం అభిమానమే కాదు.. స్వయం శక్తితో మీరు ఎదిగిన తీరు ఆదర్శం కూడా. నా వ్యాఖ్యల పట్ల మీరు కానీ, మీ అభిమానులు కానీ మనస్తాపానికి గురైనట్లయితే బేషరతుగా, పూర్తిగా వాటిని ఉపసంహరించుకొంటున్నా. అన్యథా భావించవద్దు' అని పేర్కొన్నారు.

కొండా సురేఖపై క్రిమినల్ పరువునష్టం దావా

దాఖలు చేసిన సినీ నటుడు నాగార్జున

ఈనాడు, హైదరాబాద్: మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై సినీ నటుడు నాగార్జున గురువారం నాంపల్లి కోర్టులో క్రిమినల్ పరువునష్టం దావా వేశారు. ఆమె తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార వ్యాఖ్యలు చేశారని, ఆమెపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో కోరారు. తెలుగు సినీ చరిత్రలో తన తండ్రి అక్కినేని నాగేశ్వరరావు పాత్ర ఎంతో కీలకమని, ఆ వారసత్వాన్ని తాను, తన కుమారుడు కొనసాగిస్తున్నామని తెలిపారు. తాను తెలుగు, తమిళం, హిందీ సహా పలు భాషల సినిమాల్లో నటించి నంది, ఫిల్మ్‌ఫేర్, జాతీయ, ఇతర అవార్డులు పొందడం ద్వారా దేశవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు గడించినట్లు తెలిపారు. కేవలం సినీరంగానికే పరిమితం కాకుండా పలు సామాజిక కార్యక్రమాలు చేస్తున్నట్టు వెల్లడించారు. తన భార్య అమల మూగ జీవాల సంరక్షణకు బ్లూక్రాస్ ఆఫ్ హైదరాబాద్ సంస్థను నడుపుతున్నారని తెలిపారు. "2017లో నా కుమారుడు నాగచైతన్య, సమంత... వివాహ బంధం ద్వారా ఒక్కటయ్యారు. వ్యక్తిగత కారణాలతో 2021లో విడిపోయి ఇద్దరూ గౌరవప్రదంగా జీవిస్తున్నారు. దశాబ్దాలుగా పేరు ప్రఖ్యాతులను కాపాడుకుంటూ వస్తున్న మా కుటుంబంపై మంత్రి సురేఖ రాజకీయ దురుద్దేశంతో నిరాధార వ్యాఖ్యలు చేశారు. వాటివల్ల మా కుటుంబంపై ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్లాయి. నిజానిజాలు తెలుసుకోకుండా పరువుకు నష్టం కలిగించేలా వ్యాఖ్యలు చేసిన ఆమెపై చర్యలు తీసుకోవాలి'' అని కోరారు.

మహిళలను గౌరవిద్దాం: స్మితా సభర్వాల్

ఈనాడు, హైదరాబాద్: మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తనను షాక్‌కు గురిచేశాయని, ప్రతి విషయాన్ని రాజకీయాల కోసం వాడుకోవడం తగదని ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్ పేర్కొన్నారు. మంత్రి వ్యాఖ్యలపై 'ఎక్స్'లో గురువారం ఆమె స్పందించారు. ''మహిళలను దృష్టిని ఆకర్షించే కోణంలో చూడటం సమాజంలో అలవాటుగా మారింది. అధికారులను కూడా వదిలిపెట్టడం లేదు. ఇది నా వ్యక్తిగత అనుభవం నుంచి మాట్లాడుతున్నాను. ఎంత కష్టపడి పైకి ఎదగాలంటే.. అంత పెద్ద అపవాదు భరించాల్సి వస్తోంది. మహిళలను, వారి కుటుంబాలను, సామాజిక నిబంధనలను గౌరవిద్దాం. ప్రజా జీవితంలో ఆరోగ్యకరమైన వ్యాఖ్యలు చేద్దాం'' అని స్మితా సభర్వాల్ పేర్కొన్నారు.

ఈనాడు
THE LARGEST CIRCULATED TELUGU DAILY
హైదరాబాద్ 4-10-2024 శుక్రవారం సిటీ సంపుటి 51. సంచిక 55
రూ. 6-50 పేజీలు 12+12+4 www.eenadu.net
Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



శ్రీవారి ఆలయంలో ధ్వజస్తంభం చుట్టూ పుష్పాలంకరణ



ఆలయం వెలుపల స్వర్ణ కిరీటం నమూనా

వైభవోపేతంగా అంకురార్పణ

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం • తిరుమల క్షేత్రం పుష్పశోభితం

తిరుమల, న్యూస్‌టుడే: అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు తిరుమల శ్రీనివాసుని సాలకట్ల బ్రహ్మోత్సవాలకు తితిదే గురువారం శాస్త్రోక్తంగా శ్రీకారం చుట్టింది. రాత్రి 7 నుంచి 8 గంటల మధ్య అంకురార్పణతో ఉత్సవాలను ఆరంభించింది. శుక్రవారం ధ్వజారోహణతో పూర్తిస్థాయిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. శనివారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకు ఉదయం, రాత్రి వేళల్లో వాహన సేవలు జరగనున్నాయి. అంకురార్పణలో భాగంగా శ్రీవారి సేనాధిపతి విష్వక్సేనుడు ఆలయ మాడ వీధుల్లో ఊరేగింపుగా వెళ్లి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం కంకణ భట్టాచార్యులు గోవిందాచార్యులు భూమి పూజ, పుట్ట మట్టి సేకరించి అంకురార్పణ చేశారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని తిరుమల పుష్పశోభితమైంది. క్షేత్రాన్ని విద్యుద్దీపాలు, టన్నుల కొద్దీ పూలతో అలంకరించారు. కల్యాణ వేదికలో ఫలపుష్ప ప్రదర్శనలో భాగంగా అయోధ్య రామాలయం, రాముడి సైకత శిల్పం, సీతా స్వయంవరం సెట్టింగ్‌ను తీర్చిదిద్దారు. ఆలయం వెలుపల శ్రీవారి స్వర్ణ కిరీటం నమూనా సెట్టింగ్‌ను విద్యుద్దీపాలతో శోభాయమానంగా ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం 5.45 నుంచి 6.00 గంటల మధ్య ధ్వజారోహణ నిర్వహించనున్నారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామివారి సమక్షంలో అర్చక స్వాములు ధ్వజస్తంభంపై గరుడ ధ్వజాన్ని ఎగురవేసి.. సకల దేవతలను, అష్టదిక్పాలకులను ఆహ్వానిస్తారు. ఏపీ సీఎం చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించడానికి శుక్రవారం సాయంత్రం తిరుమలకు చేరుకుంటారు.

గోవాకు కొత్త రైలు

ప్రతి బుధ, శుక్రవారాల్లో సికింద్రాబాద్ నుంచి..

ఈనాడు, హైదరాబాద్: గోవాకు వెళ్లే పర్యాటకులకు కొత్త రైలు అందుబాటులోకి రానుంది. ఈ నెల 6న ప్రయోగాత్మకంగా రైలును ప్రారంభిస్తున్నారు. రెగ్యులర్ సర్వీసులు సికింద్రాబాద్ నుంచి ఈ నెల 9న, వాస్కోడగామా నుంచి 10న ప్రారంభమవుతాయి. సికింద్రాబాద్-వాస్కోడగామా (17039) రైలు ప్రతి బుధ, శుక్రవారాల్లో.. వాస్కోడగామా-సికింద్రాబాద్ (17040) రైలు ప్రతి గురు, శనివారాల్లో బయల్దేరుతాయి. ప్రస్తుతం సికింద్రాబాద్-వాస్కోడగామా మధ్య రెగ్యులర్ సర్వీసు (17603) ఉంది. అది మంగళ, బుధ, శుక్ర, ఆది వారాల్లో నడుస్తోంది. ప్రయాణికుల నుంచి తీవ్ర డిమాండ్ ఉండటంతో ఈ రైలు ఎప్పుడూ కిటకిటలాడుతుంది. హైదరాబాద్ నుంచి వాస్కోడగామాకు మరో రైలు (17021) ఉంది. కానీ వారంలో ఒక రోజు మాత్రమే నడుస్తుంది. ఇందులోనూ టికెట్లు దొరకడం చాలా కష్టం. ఈ నేపథ్యంలో ప్రారంభం కానున్న కొత్త రైలు పర్యాటకుల ప్రయాణ అవకాశాల్ని పెంచనుంది. అదనంగా సీట్లు అందుబాటులోకి రానున్నాయి.

మరో 2 ట్రిపుల్ ఐటీలు

- బాసర ఆర్జీయూకేటీకి అనుబంధంగా ప్రాంగణాల ఏర్పాటుకు సన్నాహాలు
- ఇంజినీరింగ్‌తోపాటు మల్టీ డిసిప్లినరీ కోర్సులు
- సర్కారుకు సాంకేతిక విద్యాశాఖ ప్రతిపాదన



ఈనాడు, హైదరాబాద్: బాసరలోని రాజీవ్ గాంధీ సాంకేతిక, వైజ్ఞానిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ)కి అనుబంధంగా మరో రెండు కొత్త ప్రాంగణాలను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. కొత్త ట్రిపుల్‌ఐటీలను నెలకొల్పుతామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికల్లో సైతం హామీ ఇచ్చిన నేపథ్యంలో ఇటీవల మంత్రివర్గ ఉపసంఘంలోనూ వాటి ఏర్పాటుపై చర్చ జరిగింది. వచ్చే విద్యా సంవత్సరం(2025-26) నుంచి ఒక్కటైనా అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి ఐటీ నిపుణులు తయారు కావాలన్న ఆశయంతో 2008లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రారంభించిన మూడు ట్రిపుల్ ఐటీల్లో బాసర ఆర్జీయూకేటీ ఒకటి. రాష్ట్రం విడిపోయాక తెలంగాణలో ఇదొక్కటే ట్రిపుల్ ఐటీ మిగిలింది. గ్రామీణ విద్యార్థుల నుంచి పోటీ అధికమైనందున మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో మరో ప్రాంగణాన్ని నెలకొల్పాలని విద్యావేత్త ఐఐటీ రామయ్య ఎన్నో ఏళ్లుగా కోరుతూ వచ్చినా అది నెరవేరలేదు. బాసర ఆర్జీయూకేటీలో ఏటా 1500 మంది ప్రవేశాలు పొందుతున్నారు. ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ కావడంతో ప్రాంగణం 9 వేల మందికి పైగా విద్యార్థులతో కిక్కిరిసిపోతోంది.

త్వరలోనే కొత్త ప్రాంగణాలు...!

విద్యారంగంలో సంస్కరణలపై ఇటీవల మంత్రి శ్రీధర్‌బాబు ఛైర్మన్‌గా మంత్రివర్గ ఉప సంఘం సమావేశమైన సంగతి తెలిసిందే. ఇందులో రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ నాలుగు ప్రతిపాదనలను సమర్పించింది. మరో రెండు ఆర్జీయూకేటీ ప్రాంగణాలను ప్రారంభించడం.. వాటిలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టడం అనేవి అందులో ఉన్నాయి. వాటిపై సమావేశంలో చర్చ జరిగింది. ప్రస్తుతం బాసర ఆర్జీయూకేటీలో సంప్రదాయ ఇంజినీరింగ్ కోర్సులు మాత్రమే ఉన్నాయి. వాటికి అదనంగా బీటెక్ బయో టెక్నాలజీ, బయో మెడికల్, బయో ఇన్‌ఫర్‌మేటిక్స్, ఫార్మా టెక్నాలజీ వంటి ఇంజినీరింగ్, బయో సైన్స్ సమ్మేళనంతో కూడిన మల్టీ డిసిప్లినరీ కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. పూర్తిగా గురుకుల ప్రాంగణాలు కావడంతో ఒక్కో దానికి కనీసం 100 ఎకరాల భూమి, రూ.500 కోట్లు అవసరమవుతాయని అంచనా.

దక్షిణ తెలంగాణకే ప్రాధాన్యం!

ఉత్తర తెలంగాణలో ఒక ప్రాంగణం ఉన్నందున ఎన్నికల హామీ మేరకు మరో రెండింటిని దక్షిణ తెలంగాణ జిల్లాల్లో ఏర్పాటు చేయాలన్నది సర్కారు యోచన. ఒక దాన్ని ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో ఏర్పాటుచేసే అవకాశం ఉంది. మరొకటి ఖమ్మం లేదా నల్గొండ జిల్లాలో ఏర్పాటు చేయవచ్చని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ వర్గాలు భావిస్తున్నాయి. ఒక ప్రాంగణాన్ని వచ్చే విద్యా సంవత్సరం(2025-26)లో తాత్కాలికంగా అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఇద్దరు బాలికలపై ఐదుగురు యువకుల అత్యాచారం

ఈనాడు, హైదరాబాద్; సైదాబాద్, న్యూస్‌టుడే: పునరావాస కేంద్రం నుంచి పారిపోయిన ఇద్దరు బాలికలపై ఐదుగురు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. సైదాబాద్ పోలీసులు తెలిపిన వివరాలివీ... ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలో బాలికల కోసం ఓ ప్రైవేటు సంస్థ పునరావాస కేంద్రం నిర్వహిస్తోంది. జనగామ ప్రాంతానికి చెందిన బాలిక(14) మూడు నెలల నుంచి, మల్కాజిగిరికి చెందిన బాలిక(15) సెప్టెంబరు 18 నుంచి ఆశ్రయం పొందుతున్నారు. ఇద్దరికీ తల్లిదండ్రులున్నా.. వేర్వేరు కారణాలతో వారిని అక్కడ చేర్పించారు. బాలికల మధ్య స్నేహం పెరిగి.. పారిపోవాలని పథకం వేశారు. సెప్టెంబరు 24న కిటికీ నుంచి దూకి పారిపోయారు. నిర్వాహకుల ఫిర్యాదుతో సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. బాలికలు రాత్రి 8 గంటల సమయానికి జనగామ చేరుకున్నారు. బాలికల్లో ఒకరు బస్టాండ్ సమీపాన పాన్‌షాప్ నిర్వాహకుడు సాయిదీప్ దగ్గర ఫోన్ తీసుకుని తనకు పరిచయస్థుడైన నాగరాజుకు ఫోన్ చేసింది. అతడు వచ్చి, ఆశ్రయం కల్పిస్తానంటూ తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బస్టాండు దగ్గరే మరో బాలిక ఒంటరిగా ఉండిపోవడాన్ని గమనించిన సాయిదీప్.. ఆశ్రయం కల్పిస్తానని పక్కనే ఉన్న బేకరీకి తీసుకెళ్లాడు. అక్కడ సాయిదీప్, బేకరీ నిర్వాహకుడు రాజు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. తాను తీసుకెళ్లిన బాలికను నాగరాజు 25న ఉదయం తీసుకొచ్చి బస్టాండు దగ్గర వదిలేశాడు. బాలికల విషయం తెలుసుకున్న సాయిదీప్, రాజుల స్నేహితులు అఖిల్, రోహిత్‌లు హైదరాబాద్ తీసుకెళ్తామంటూ.. కారులో వేర్వేరు ప్రాంతాల్లో తిప్పుతూ లైంగిక దాడికి పాల్పడి తిరిగి బస్టాండ్ దగ్గరే వదిలిపెట్టారు. పోలీసులకు వారు కనిపించడంతో అదే రోజు సైదాబాద్‌కు తీసుకొచ్చి పునరావాస కేంద్రంలో అప్పగించారు. నిర్వాహకులు భరోసా కేంద్రం నిపుణులను పిలిపించి కౌన్సెలింగ్ ఇప్పించగా.. బాలికలు తమపై లైంగిక దాడి జరిగిందని తెలిపారు. సైదాబాద్ పోలీసులు ఐదుగురు యువకులపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

పగబట్టిన వరద
పరిమళిస్తున్న దాతృత్వం

ఉపాధి కోసం వచ్చిన వందల కుటుంబాలు కష్టార్జితం కూడబెట్టి గూడు కట్టుకున్నాయి. చిన్నచిన్న పనులు చేసుకుంటూ బతుకు బండిని లాగుతున్నాయి. ఉన్నట్టుండి వరద ఆ జీవితాలను తలకిందులు చేసింది. ఊహించని రీతిలో అర్ధరాత్రి ఇళ్లను ముంచెత్తింది. ఒక్కరాత్రిలో నిరాశ్రయులుగా మారిన ఆ బాధితులు.. నేటికీ ఆ విషాదం నుంచి తేరుకోలేకపోతున్నారు. మళ్లీ మునుపటిలా నిలదొక్కుకునేందుకు వదాన్యుల వైపు ఆశగా చూస్తున్నారు. వారికి అండగా నిలిచేందుకు దాతృత్వపు హృదయాలెన్నో ముందుకొస్తున్నాయి.

తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితులకు అండగా నిలిచేందుకు రామోజీ గ్రూపు తరఫున రూ.5 కోట్లతో ఏర్పాటు చేసిన 'ఈనాడు సహాయనిధి'కి ఉదారంగా విరాళాలు ఇస్తున్న దాతలకు కృతజ్ఞతలు. ఈనాడు పిలుపు అందుకొని స్పందిస్తున్న సహృదయుల వివరాలు..

ఈనాడు సహాయనిధికి విరాళాలిచ్చిన దాతలు

వ్యక్తులు / సంస్థలు	సాయం (రూ.లలో)
1980 బ్యాచ్, ఆర్బీఐ, హైదరాబాద్	75,000
టి.ఎ.జనార్దన్‌రెడ్డి, శౌరిలమ్మ, హైదరాబాద్	25,000
శ్రీ విజ్ఞానసుధ హైస్కూల్, తిరుపతి	20,116
వడ్డవల్లి సరస్వతి, హైదరాబాద్	20,000
సాయి గణపతి ఇంజినీరింగ్ కాలేజీ ఈసీఈ విద్యార్థులు, సిబ్బంది, విశాఖపట్నం	13,300
ఇక్ఫాయ్ నేషనల్ కాలేజీ ఎంబీఏ 2003-2005 బ్యాచ్ పూర్వ విద్యార్థులు, కొలకలూరు, గుంటూరు జిల్లా	11,788
మాకినేని మురళీకృష్ణ, మోహిని, ఒంగోలు	11,116
గోపు స్వరాజ్యలక్ష్మి, వెంకటసుబ్బయ్య, హైదరాబాద్	11,116
సాతులూరి సూర్యప్రకాశ్, హైదరాబాద్	10,116
కపిలవాయి కృష్ణమూర్తి, ఏలూరు	10,000
కాసు జగన్మోహన్‌రెడ్డి, హనుమకొండ	10,000
ఎం.ఆర్.కె.రాజు, రాజమహేంద్రవరం	10,000
వి.స్వర్ణలత, ఆర్టీపీపీ, కడప	10,000
టి.ఎస్.ఆర్.వి.ప్రసాద్, హైదరాబాద్	10,000
ఎం.చిత్రలేఖ, హైదరాబాద్	10,000
కోడూరు వెంకట కృష్ణారావు, వేలేరు, కృష్ణా జిల్లా	9,000
కిలారు జగన్మోహనరావు, సరోజిని, చింతకాని, ఖమ్మం జిల్లా	5,555
గోగినేని వెంకట్రావు, హైదరాబాద్	5,555
కందమూరు సుబ్రహ్మణ్యం, విజయవాడ	5,116
మాదాల శ్రీనివాసరావు, హైదరాబాద్	5,116
డి.జక్షిత్, వి.కోట, చిత్తూరు జిల్లా	5,116
ఎం.వీరమల్లయ్య, ఎల్లమ్మగుట్ట, నిజామాబాద్ జిల్లా	5,100
ఎన్.ఎస్.కె.మూర్తి, మహబూబ్‌నగర్	5,022
కుందా రామరాజయ్య, సంగారెడ్డి	5,010
డా.నంబూరి ఈశ్వరప్రసాద్, హైదరాబాద్	5,000
బేటా శ్రీనివాసరావు, బెంగళూరు	5,000
తోట రాజశేఖర్, నిజామాబాద్	5,000
కె.సత్యకుమార్, విజయవాడ	5,000
కారుమూరి వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం	5,000
నాగేలు నర్సింగరావు, విజయనగరం	5,000

మనం చేసే సహాయం.. మానవతా సందేశం!

దాతలకు ముఖ్య సూచన: మీరిచ్చే విరాళాలకు రసీదులు పొందేందుకు ఈ వివరాలు పంపవలసిందిగా మనవి. 1. దాత పేరు 2. పూర్తి చిరునామా 3. పాన్‌కార్డు నంబరు.
- ఈ వివరాలను 9154990933 నంబరుకు లేదా relieffund@eenadu.in ఈ మెయిల్ ఐడీకి పంపగలరు.

విరాళాలు పంపవలసిన ఎకౌంట్ వివరాలు

ఈనాడు రిలీఫ్ ఫండ్,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,
సైఫాబాద్ బ్రాంచి,
SB A/C No: 370602010006658
IFSC: UBIN0537063

48 గంటల్లోపే రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు

- ఎంఎస్‌పీకి అదనంగా సన్నాలకు క్వింటాకు రూ.500 బోనస్
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



కలెక్టర్లతో నిర్వహించిన సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి

ఈనాడు, హైదరాబాద్: సన్నాల సాగుపై రైతులకు ఇచ్చిన మాట ప్రకారం వానాకాలం సీజన్ నుంచే ఎంఎస్‌పీకి క్వింటాకు అదనంగా రూ.500 బోనస్ చెల్లించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. ధాన్యం డబ్బుల్ని రైతుల ఖాతాల్లో 48 గంటల్లోపే జమ చేస్తామన్నారు. గురువారం మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేలా చూడాలని అధికారుల్ని ఆదేశించారు. "సన్న వడ్లకు బోనస్ ఇవ్వడం ఇదే మొదటిసారి. వాటి సేకరణకు వీలుగా వేర్వేరు కొనుగోలు కేంద్రాలను, లేదంటే వేర్వేరు కాంటాలు ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలి. సన్న రకాలను ధ్రువీకరించే యంత్రాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలి. సేకరణలో అప్రమత్తంగా లేకుంటే గోల్‌మాల్ జరిగే ప్రమాదముంది. ఎలాంటి తప్పులు, అవకతవకలు జరగకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలి. ప్రతి కేంద్రానికి ఒక ప్రత్యేక నంబరు కేటాయించాలి. అక్కడ కొనుగోలు చేసిన వడ్ల సంచులపైన ఆ నంబరును తప్పకుండా వేయాలి. అప్పుడు... ఏ తప్పు జరిగినా, ఏ దశలో గోల్‌మాల్ జరిగినా ఎక్కడ జరిగిందో సులభంగా గుర్తించవచ్చు. సరిహద్దు రాష్ట్రాల నుంచి ధాన్యం మనరాష్ట్రంలోకి రాకుండా పోలీసు అధికారులు కట్టడి చేయాలి" అని సీఎం స్పష్టం చేశారు.

రైతులు దోపిడీకి గురికావొద్దు

"రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనట్లుగా రికార్డు స్థాయిలో 140 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. విస్తీర్ణంలో 58% సన్న రకాలు సాగయ్యాయి. ధాన్యం సేకరణలో తాలు, తరుగు, తేమ పేరుతో రైతులను మోసం చేసే వారిని సహించొద్దు. అవసరమైతే క్రిమినల్ కేసులు పెట్టాలి. రైతుల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, పరిష్కరించాలి. వాతావరణ శాఖ సూచనలను ప్రతి గంటకోసారి కొనుగోలు కేంద్రాలకు చేరవేయాలి. ప్రతిరోజూ కేంద్రాలను పరిశీలించి, కొనుగోళ్ల ప్రక్రియను సమీక్షించాలి. సివిల్ సప్లయిస్ విభాగంలో 24 గంటలు పని చేసే కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలి' అన్ని జిల్లాల కలెక్టర్లకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

దొడ్డు వడ్లకు డిమాండ్ లేదు

"దొడ్డు వడ్లకు మార్కెట్లో డిమాండ్ లేదు. ఎఫ్‌సీఐ వద్ద కూడా భారీగా నిల్వలున్నాయి. అందుకే సన్న వరి సాగునే ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. భవిష్యత్తులో మొత్తం సన్నరకాలే సాగయ్యే అవకాశముంది. వచ్చే జనవరి నుంచి రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తాం. ఈసారి దిగుబడయ్యే 146 లక్షల టన్నుల ధాన్యంలో ట్రేడర్లు, మిల్లర్లు, కొనుగోలు చేసే ధాన్యం... రైతులు తమ అవసరాలకు ఉంచుకునే నిల్వలు పక్కనపెడితే.. 91 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనాల్సి ఉంటుందని అంచనా" అని వివరించారు.

బ్యాంకు గ్యారంటీ తీసుకుని ధాన్యం

"రైతుల నుంచి కొన్న ధాన్యాన్ని మిల్లర్లకు ఇచ్చే విషయంలోనూ కలెక్టర్లు నిబంధనలను పాటించాలి. వరుసగా బకాయి పడ్డ మిల్లర్లకు ధాన్యం ఇవ్వొద్దు. మిగతా వారికి కూడా బ్యాంకు గ్యారంటీ తీసుకొని ధాన్యం అప్పగించాలి' అని సీఎం సూచించారు. ఈ కాన్ఫరెన్స్‌లో... తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, సీఎస్ శాంతికుమారి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్ రావు పాల్గొన్నారు.

ముసుగు రాజకీయాలొద్దు

(మొదటి పేజీ తరువాయి)

'బావాబావమరుదులు మూసీని అడ్డుపెట్టుకుని ఎన్ని రోజులు గడుపుతారు? మీ భరతం పడతాం.. పేద ప్రజలపై అంత ప్రేమ ఉంటే.. భారాస ఖాతాలో రూ.1500 కోట్లు ఉన్నాయి.. రూ.500 కోట్లు పేదలకు ఇవ్వొచ్చు కదా. మూసీ నిర్వాసితులకు ఇంకా మేలైన పథకం ఉంటే సూచించండి. సచివాలయానికి రండి.. ఎన్ని రోజులైనా కూర్చుని చర్చిద్దాం. పేదలకు కొంత బాధ, నష్టం కలుగుతున్న మాట వాస్తవం. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకునే మూసీ ప్రక్షాళన చేపట్టాం. అడ్డుకోవద్దు' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

ఏ ఆక్రమణనూ వదిలిపెట్టం

హైదరాబాద్‌లో చెరువులు, కుంటలు, నాలాల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో ఎవరు ఇళ్లు కట్టుకున్నా కూల్చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 'చెరువులను పరిరక్షించాల్సిన భారాస నాయకులు వెంచర్లు వేశారు. మూసీ బఫర్‌జోన్‌లో, నల్లచెరువులో ప్లాట్లు వేసి అమ్మింది మీరు కాదా? మూసీలో కాలుష్యంతో నల్గొండ జిల్లాలో పంటలు, కూరగాయలు విషపూరితమయ్యాయి. ఆ జిల్లా ప్రజలు ఒకవైపు ఫ్లోరైడ్‌తో బాధపడుతున్నారు. మరోవైపు విషం మింగుతూ బతుకుతున్నారు. వారు స్వచ్ఛమైన నీరు తాగేందుకు అర్హులు కాదా? ఆక్రమణల వల్ల ఇప్పటికే హైదరాబాద్ చుట్టుపక్కల భూగర్భజలాలు అడుగంటాయి. అందుకే జంట జలాశయాలు, మూసీ ప్రక్షాళన చేపట్టాం. ఈ లోపు నగరంలోని ప్రజలందరూ ఇళ్లలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచిస్తున్నాం. అవి లేని ఇళ్లకు నీళ్ల ట్యాంకర్ రెట్టింపు ధరకు విక్రయించాలని అధికారులను ఆదేశించాం.

బుల్డోజర్లు కొనేందుకు మా వద్ద డబ్బుల్లేవ్..

మూసీ నిర్వాసితుల వద్దకు హరీశ్‌రావు, కేటీఆర్, ఈటల తదితర నాయకులు వెళ్లి కృత్రిమ ధర్నాలు చేస్తున్నారు. ముందు మాపై నుంచి బుల్డోజర్లు పంపించండంటున్నారు. అన్ని బుల్డోజర్లు కొనేందుకు మా దగ్గర డబ్బుల్లేవు. ప్రజలకు నచ్చజెప్పి.. మెరుగైన పరిహారం అందిస్తాం. రాజకీయంగా నష్టమని తెలిసినా ముందుకు వెళ్తున్నామంటే.. హైదరాబాద్ ప్రజల భవిష్యత్తు కోసం మాత్రమే. కేటీఆర్, హరీశ్‌లకు జిరాక్స్‌లా ఈటల రాజేందర్ మాట్లాడుతున్నారు. ఈటలా.. మీకు నిజంగా పేదలపై ప్రేమ ఉంటే కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లతో కలిసి రండి. మీరు ముగ్గురూ ముందుండి దిల్లీకి నడిపించండి. మేం వెనకే ఉంటాం. జవహర్‌నగర్‌లో వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. నిర్వాసితులకు 150 గజాల చొప్పున ఇద్దాం. ఇళ్లు కట్టేందుకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రూ.25 వేల కోట్లు అడుగుదాం పదండి. మోదీని అడిగేందుకు మాకు ఎలాంటి భేషజాలు లేవు.

ఫ్యామిలీ డిజిటల్ కార్డుతోనే అన్నీ..

ఒకే రాష్ట్రం, ఒకే కార్డు అన్న నినాదంతో ఫ్యామిలీ డిజిటల్ కార్డును రూపొందిస్తున్నాం. రేషన్, ఆరోగ్యశ్రీ, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, పింఛను, ఫీజు రీయింబర్స్‌మెంట్.. ఇలా అన్నిటికీ ఈ కార్డు ఉపయోగపడుతుంది. వారసత్వ హక్కులు, ఆస్తుల బదిలీలు, విరాసత్‌లు, పాస్‌పోర్టు దరఖాస్తులు ఇలా అన్నీ సులభంగా పరిష్కారమవుతాయి. రాష్ట్రంలోని 238 యూనిట్ల పరిధుల్లో ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకూ ఐదు రోజుల పాటు పైలట్ ప్రాజెక్టు సర్వే నిర్వహిస్తారు' అని సీఎం వివరించారు. రెవెన్యూ, గృహనిర్మాణశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. మూసీ నిర్వాసితులకు ప్రస్తుతం కేటాయించిన 15 వేల ఇళ్లకు అదనంగా మరో నాలుగైదు వేల ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. నిర్వాసితుల విషయంలో సోషల్‌మీడియా, యూట్యూబ్ ఛానెళ్లలో కేటీఆర్ విష ప్రచారం చేయిస్తున్నారని, దీన్ని ఇప్పటికే ప్రజలు గ్రహించారని అన్నారు. పేదలకు 1.33 లక్షల రెండు పడక గదుల ఇళ్లు ఇస్తామన్న భారాస ప్రభుత్వం.. 67 వేల ఇళ్లు మాత్రమే నిర్మించిందని, మిగిలిన ఇళ్లను పూర్తిచేసి దసరాలోపు లబ్ధిదారులకు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ మాట్లాడుతూ.. తమ నియోజకవర్గానికి ఒక డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ నియోజకవర్గంలోని వాహెబ్‌నగర్‌లో 900 కుటుంబాలు, కార్ఖానాలోని 600 కుటుంబాలను సర్వేకు అధికారులు ఎంపిక చేయగా.. వారిలో ఐదుగురిని సీఎం రేవంత్‌రెడ్డి వేదికపైకి పిలిచారు. ఎమ్మెల్యే శ్రీగణేశ్ భార్య వర్షశ్రీతో పాటు స్థానిక మహిళలు శారద, రాజేశ్వరి, సుల్తానా బేగం, బొబ్బిలి అన్నపూర్ణమ్మలకు ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఫారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, మేయర్, డిప్యూటీ మేయర్లు గద్వాల్ విజయలక్ష్మి, మోతె శ్రీలతారెడ్డి, మాజీ మంత్రి ఎస్.వేణుగోపాలాచారి, ఐఏఎస్ అధికారులు జయేశ్‌రంజన్, దాసరి హరిచందన, అనురాగ్ జయంతి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఎమ్మెల్సీలు మీర్జా రియాజ్ ఉల్ హసన్, మీర్జా రహమత్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లు కూలిస్తే.. ప్రభుత్వమూ కూలుతుంది

(మొదటి పేజీ తరువాయి)

గత భారాస ప్రభుత్వంలోనూ ఇదేవిధంగా మూసీ సుందరీకరణ పేరుతో కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఇళ్లపై మార్కింగ్ చేశారు. ప్రజల నుంచి తీవ్ర నిరసన వెలువడటంతో వెనకడుగు వేశారు. సమగ్రమైన ఆలోచన లేకుండా అక్రమ కట్టడాల పేరుతో కూల్చివేత చర్యలను వెంటనే ఉపసంహరించుకోవాలి. హైదరాబాద్‌లోని 70 శాతం మురుగునీరు మూసీలోకే చేరుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ డ్రైనేజీ సమస్యను పరిష్కరించకుండా రూ.లక్షన్నర కోట్లతో మూసీ సుందరీకరణ చేయాలనుకోవడం అనాలోచితం. అనేక చెరువుల్లో బడాబాబులు, పెద్ద రియల్ ఎస్టేట్ కంపెనీలు, వ్యాపారవేత్తలు ఫాంహౌస్‌లు, ఎస్టేట్ల పేరుతో నిర్మాణాలు చేసుకున్నారు. ముందు వాటిపై హైడ్రా ప్రతాపం చూపాలి. అక్రమంగా నిర్మించిన ఫాతిమా కాలేజీని కూల్చాలి. స్వప్రయోజనాల కోసం, ప్రత్యర్థులను విమర్శించేందుకు ఇతరుల కుటుంబాల వ్యవహారాలను, మహిళల వ్యక్తిగత విషయాలను రాజకీయాలకు ముడిపెట్టడాన్ని ఖండిస్తున్నా. ఈ సంస్కృతిని మాజీ సీఎం కేసీఆర్ మొదలుపెట్టగా.. మాజీ మంత్రి కేటీఆర్ ముందుకు తీసుకెళ్లారు. నేడు సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొనసాగిస్తున్నారు. భారాస, కాంగ్రెస్ నాయకుల వ్యక్తిగత దూషణలు, దిగజారుడు భాషను తెలంగాణ సమాజం సహించదు. గత కేసీఆర్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌తో సినీ ప్రముఖులు, వ్యాపారస్థుల వ్యక్తిగత విషయాలను తెలుసుకుని, వారిని బ్లాక్ మెయిల్ చేస్తూ రూ.కోట్లు వసూలు చేసినట్లు గతంలో పోలీసు అధికారులే చెప్పారు' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

'మేడిగడ్డ'పై వేగం పెంచిన విజిలెన్స్

(మొదటి పేజీ తరువాయి)

నివేదికను ఇప్పటికే అందజేసింది. మిగిలిన అంశాలపైనా విచారణ ముగించి, తుది నివేదికను జస్టిస్ ఘోష్ కమిషన్‌కు, ప్రభుత్వానికి అందజేయనుంది. ఇందులో భాగంగా మేడిగడ్డ బ్యారేజీ పనులకు సంబంధించిన నిర్ణయాల్లో భాగంగా స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీలో ఉన్న మాజీ ఈఎన్సీ మురళీధర్, ఓఅండ్ఎం ఈఎన్సీ నాగేంద్రరావు, గతంలో సీడీవోలో ఉండి ప్రస్తుతం ఆదిలాబాద్ ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్‌గా ఉన్న శ్రీనివాస్, వర్క్స్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్ ఫణిభూషణ్ శర్మ, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ అజ్మల్ ఖాన్‌లను ఈ నెల ఐదు, ఏడు, ఎనిమిది తేదీల్లో హాజరు కావాలని కోరింది. ఈ మేరకు గురువారం విజిలెన్స్ అదనపు ఎస్పీ నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్(పరిపాలన)కు లేఖ రాశారు. వీరితోపాటు మరో నలుగురిని ఈ నెల 9, 10, 11 తేదీలో విచారణకు పిలిచింది.

గిరిజన ప్రాంతాల్లో బైక్ అంబులెన్సులు

- మంత్రి దామోదర్ రాజనర్సింహ



ఈనాడు, హైదరాబాద్: "ఐటీడీఏల పరిధిలోని గిరిజనులు తమ నివాస ప్రాంతాల నుంచి అరగంటలోనే ఆసుపత్రికి చేరుకోవాలి. దీనికనుగుణంగా పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, సబ్ సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి. అవసరమైన చోట బైక్ అంబులెన్స్‌లను ప్రారంభించండి" అని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ పరిధిలో అందిస్తున్న వైద్య సేవల బలోపేతంపై గురువారం హైదరాబాద్‌లోని దామోదరం సంజీవయ్య భవన్‌లో మంత్రి రాజనర్సింహ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. అందులో ఎమ్మెల్యే వంశీకృష్ణ, వైద్యారోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తూ, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వి.కర్ణన్, ట్రైకార్ ఛైర్మన్ బెల్లయ్య నాయక్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ జె.అజయ్ కుమార్, ప్రజారోగ్యశాఖ సంచాలకులు రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... "రాజకీయ జోక్యానికి తావులేకుండా ప్రజల అవసరాల మేరకే ప్రతిపాదనలు ఉండాలి. ఐటీడీఏ పరిధిలో వైద్యులు, సిబ్బంది కొరత లేకుండా చూడాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆదిమ తెగ గిరిజనులు(పీటీజీ) కోసం ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలి. వాటిలో గిరిజన భాష మాట్లాడే వైద్య సిబ్బందిని నియమించాలి. అడవులు, రోడ్లు సక్రమంగా లేనిప్రాంతాల్లో నివసిస్తున్న గర్భిణుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి. ప్రసవ తేదీకంటే ముందే వారిని ఆసుపత్రులకు తరలించాలి. 108 అంబులెన్స్‌లు వెళ్లలేని గిరిజన ప్రాంతాల్లో బైక్ అంబులెన్స్‌ల సదుపాయం కల్పించడానికి జనాభా ప్రాతిపదికన ప్రతిపాదనలు అందజేయాలి. ప్రతి గిరిజన ఆవాసంలో ఆసక్తి ఉన్న కనీసం ఇద్దరిని గుర్తించి ప్రథమ చికిత్స చేయడంపై శిక్షణ ఇప్పించాలి" అని ఆదేశించారు.

నకిలీ పత్రాలతో అప్పు తీసుకున్నా.. తీర్చేస్తే క్రిమినల్ చర్యలు అవసరం లేదు: సుప్రీం

ఈనాడు, దిల్లీ: నకిలీ పత్రాలతో రుణం తీసుకున్నా.. దాన్ని తిరిగి చెల్లించేసిన వారిపై క్రిమినల్ చర్యలు అవసరం లేదని జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. తెలంగాణకు చెందిన ఇద్దరు మహిళల పిటిషన్‌పై గురువారం ఈ తీర్పు చెప్పింది. హైదరాబాద్‌కు చెందిన శిరీష్ ట్రేడర్స్ యజమాని కె.సురేష్‌కుమార్ సహా ఐదుగురు... ఆస్తులు తనఖాపెట్టి ఉస్మాన్‌గంజ్‌లోని ఇండియన్ బ్యాంకు నుంచి రుణం తీసుకున్నారు. బకాయిలు చెల్లించకపోవడంతో బ్యాంకు రుణరికవరీ ట్రైబ్యునల్‌లో కేసు దాఖలు చేసింది. కానీ రుణగ్రహీతలు ఇచ్చిన పత్రాలు నకిలీవని తేలింది. వీరిపై సీబీఐ చెన్నై బ్రాంచి 2012 సెప్టెంబరు 15న కేసు నమోదు చేసింది. విచారణ జరుగుతుండగానే.. రుణగ్రహీతలు బ్యాంకుకు రూ.3.8 కోట్లు చెల్లించేశారు. సీబీఐ కేసును రద్దు చేయాలని నిందితులు 2016 ఏప్రిల్‌లో పిటిషన్ దాఖలు చేయగా.. హైకోర్టు కొట్టేసింది. ఆ తీర్పునే నిందితులు సవాల్ చేశారు.

ముగ్గురు సీఐలు,13 మంది ఎస్సైలపై వేటు

(మొదటి పేజీ తరువాయి)

ఇసుక అక్రమ రవాణాలో వసూళ్లకు పాల్పడినట్లు తేలడంతో కొండమల్లేపల్లి హోంగార్డు, జడ్చర్ల హెడ్ కానిస్టేబుల్‌ను కూడా ఇప్పటికే డిస్ట్రిక్ట్ ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ కార్యాలయాలకు అటాచ్ చేశారు.

వికారాబాద్ టౌన్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

జోగిపేట ఎస్‌హెచ్‌వోగా పనిచేసిన సమయంలో మైనర్ బాలికపై అత్యాచారం కేసులో అలసత్వం ప్రదర్శించడంతోపాటు దర్యాప్తులో అవకతవకలకు పాల్పడినట్లు తేలడంతో వికారాబాద్ టౌన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజును సస్పెండ్ చేస్తూ ఐజీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

మరికొన్నింటిపైనా నిఘా

రేషన్ దుకాణాల ద్వారా పేదలకు పంపిణీ చేసే బియ్యం అక్రమ రవాణాతోపాటు గాంబ్లింగ్, మట్కా లాంటి అక్రమ దందాలపైనా ఉన్నతాధికారులు నిఘా పెట్టారు. వాటిపై అంతర్గత విచారణ ప్రారంభించారు. ఇప్పటికే వికారాబాద్ మర్పల్లి గెస్ట్‌హౌస్‌లో పేకాట నిర్వహించిన ప్రభాకర్, రఫీక్ అనే వ్యక్తులను ఐజీ, ఎస్పీలు పిలిచి హెచ్చరించారు. రఫీక్‌పై సస్పెక్ట్ షీట్ తెరిచారు.

బాధ్యతలు పెరిగితేనే.. అధిక రివార్డులు



రివార్డు, బాధ్యత అనేవి ఒకే నాణేనికి ఉన్న రెండు ముఖాల వంటివి. మీకు ఎక్కువ రివార్డులు కావాలంటే.. ఎక్కువ బాధ్యతలు తీసుకోండి. బాధ్యతలు పెరగకుండా రివార్డులు మాత్రమే పెరగాలని కోరుకోవడం మూర్ఖత్వమే అవుతుంది!

– నికోలస్ కోల్, రచయిత

మూసీకి రూ.1.50 లక్షల కోట్లు ఎక్కడి నుంచి తెస్తారు?

- సీఎంకి ఎంపీ ఈటల ప్రశ్న

కంటోన్మెంట్, కార్ఖానా, న్యూస్‌టుడే: 'ఆర్టీసీకి రూ.280 కోట్ల చెక్కు ఇస్తే అది చెల్లకుండా పోయిన చరిత్ర మీది. అలాంటిది మూసీ ప్రక్షాళనకు రూ.1.50 లక్షల కోట్లు ఎక్కడి నుంచి తెస్తారు' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నించారు. దేశంలో గంగానది ప్రక్షాళనకు రూ.20 వేల కోట్లు, సబర్మతి అభివృద్ధికి రూ.1,400 కోట్లను కేంద్రం కేటాయించిందన్నారు. మూసీ నది ప్రక్షాళనకు లెక్కాపత్రం లేకుండానే ఏకంగా రూ.1.50 లక్షల కోట్లను కేటాయిస్తామని సీఎం ప్రకటించడం ఆయన అవగాహనరాహిత్యానికి అద్దం పడుతోందని విమర్శించారు. కంటోన్మెంట్‌లో గురువారం విలేకరులతో ఈటల మాట్లాడారు. 'సీఎం సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారు. మల్కాజిగిరికి బతకడానికి వచ్చానని నాపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసం? దమ్ముంటే ఎలాంటి భద్రత లేకుండా సీఎం నాతో కలిసి మూసీ పరీవాహకంలో పర్యటించాలి. అక్కడ ఏ ఒక్కరైనా ఆయన చేసే పనిని సమర్థిస్తే నేను రాజకీయాల నుంచి తప్పుకొంటా' అని స్పష్టంచేశారు.

'ట్రిపుల్‌ఆర్' ఎలైన్‌మెంట్ మార్చాలి

రాంనగర్, న్యూస్‌టుడే: ట్రిపుల్‌ఆర్ నిర్మాణంతో భూములు కోల్పోతున్న తమకు న్యాయం చేయాలని కోరుతూ భూ నిర్వాసితుల ఐక్య వేదిక, భూ నిర్వాసితుల ఐక్య వేదిక (యాదాద్రి జిల్లా) సంయుక్తాధ్వర్యంలో గురువారం ఇందిరాపార్కు వద్ద రైతులు భారీ ధర్నా నిర్వహించారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, జూలకంటి రంగారెడ్డి, సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు హాజరై మద్దతు ప్రకటించారు. ఈటల మాట్లాడుతూ.. ట్రిపుల్ ఆర్‌ను ఓఆర్‌ఆర్‌కు 60 కి.మీ. దూరంలో నిర్మించాలని ప్రభుత్వానికి సూచించారు. చౌటుప్పల్, భువనగిరి ప్రాంతాల్లోని ట్రిపుల్‌ఆర్ ఎలైన్‌మెంట్‌నూ మార్చాలని డిమాండ్ చేశారు.

'విద్యారంగానికి అరకొర నిధులు'

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే విద్యారంగానికి బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయిస్తామని ప్రకటించి.. తీరా 7.3 శాతంతో సరిపుచ్చి చేతులు దులుపుకొందని తెలంగాణ విద్యా పరిరక్షణ సమితి పేర్కొంది. హైదరాబాద్ సుందరయ్య కళానిలయంలో గురువారం తెలంగాణ విద్యా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యాపరిరక్షణపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని, ఉపాధ్యాయులు లేకుంటే ప్రశ్నించేందుకు మనమే క్షేత్రస్థాయికి వెళ్లాలని సూచించారు. ఆచార్య హరగోపాల్, ఓయూ విశ్రాంత ఆచార్యుడు పీఎల్ విశ్వేశ్వర్‌రావు, విద్యాపరిరక్షణ సమితి కార్యనిర్వాహక కార్యదర్శి లక్ష్మీనారాయణ తదితరులు మాట్లాడారు.

గ్రహం అనుగ్రహం

4-10-2024 శుక్రవారం

శ్రీ క్రోధి నామ సంవత్సరం;
దక్షిణాయణం;
శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం
విదియ: రా. 2-47 తదుపరి తదియ
చిత్త: సా. 5-31 తదుపరి స్వాతి
వర్జ్యం: రా. 11-40 నుంచి 1-25 వరకు
అమృత ఘడియలు: ఉ. 10-26 నుంచి 12-12 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-16 నుంచి 9-03 వరకు
తిరిగి మ. 12-13 నుంచి 1-01 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ. 5.54; సూర్యాస్తమయం: సా.5.46
తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల ప్రారంభం

ఇదీ సంగతి!



నిపుణుల కమిటీ నిర్ణయం తర్వాతే ఫలితాల విడుదల

గ్రూప్-1పై హైకోర్టులో టీజీపీఎస్సీ వాదన

ఈనాడు, హైదరాబాద్: గ్రూప్-1 పరీక్షల కీపై అభ్యంతరాలు స్వీకరించామని, వాటిని ఆయా సబ్జెక్టుల వారీగా నిపుణుల కమిటీకి పంపి.. వారు ఆమోదించిన తర్వాతే ఫలితాలు విడుదల చేసినట్లు టీజీపీఎస్సీ హైకోర్టుకు గురువారం నివేదించింది. త్వరలో మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయని, ఈ దశలో కోర్టులు జోక్యం చేసుకోరాదని, దీనివల్ల అభ్యర్థులకు తీవ్ర నష్టం కలుగుతుందని పేర్కొంది. గ్రూప్-1 పోస్టుల భర్తీ నిమిత్తం 2022లో జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయకుండా మరో నోటిఫికేషన్ జారీ చేయడం చెల్లదని, ప్రాథమిక కీలో తప్పులున్నాయని, వాటిని సవరించాలన్న అభ్యంతరాలను పట్టించుకోకపోవడాన్ని సవాల్ చేస్తూ పలువురు అభ్యర్థులు రెండు వేర్వేరు పిటిషన్‌లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ పుల్లా కార్తీక్ గురువారం విచారణ చేపట్టారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది రాహుల్‌రెడ్డి, టీజీపీఎస్సీ తరఫున ఎం.రాంగోపాల్‌రావులు వాదనలు వినిపిస్తూ పరీక్షలు రాసిన 3 లక్షల మంది నుంచి ప్రిలిమ్స్ కీపై భౌతికంగా 721, ఆన్‌లైన్ ద్వారా 6,470 అభ్యంతరాలు వచ్చాయని తెలిపారు. వాటిని నిపుణుల కమిటీ పరిశీలించిందన్నారు. ప్రధానంగా ఉన్నవాటిని పరిగణనలోకి తీసుకుని కమిటీ సిఫారసుల మేరకు రెండు ప్రశ్నలను తొలగించి కీని విడుదల చేశామని వివరించారు. ప్రస్తుతం పిటిషన్ దాఖలు చేసిన ఐదుగురిలో ఒక్కరే కమిషన్‌కు అభ్యంతరాలు తెలియజేశారన్నారు. మిగిలినవారు ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకుండా కోర్టును ఆశ్రయించారన్నారు. రెండోసారి నోటిఫికేషన్ జారీని సవాల్ చేసిన అభ్యర్థితో పాటు కీని సవాల్ చేసిన పిటిషనర్లలో ముగ్గురు మెయిన్స్‌కు అర్హత సాధించారన్నారు. ప్రశ్నలకు విశ్లేషణాత్మకంగా ఆలోచించి సమాధానం ఇవ్వాల్సి ఉంటుందని, ఒకరిద్దరికి అర్థం కానంత మాత్రాన అవి తప్పులైనట్లు కాదన్నారు. పరీక్షలను నిష్పాక్షికంగా నిర్వహిస్తున్నామని, ఈ పిటిషన్‌లను కొట్టివేయాలని కోరారు. వాదనలు పూర్తికాకపోవడంతో తదుపరి విచారణను న్యాయమూర్తి శుక్రవారానికి వాయిదా వేశారు.

నేటి నుంచి కన్వీనర్ వైద్య సీట్లకు వెబ్‌ఆప్షన్లు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో కన్వీనర్ కోటా సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు రెండో రౌండ్‌లో వెబ్‌ఆప్షన్లకు అవకాశం కల్పిస్తూ కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రకటన జారీ చేసింది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి 6వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటలోపు వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని తెలిపింది. కాగా.. కన్వీనర్ కోటా కింద మొదటి రౌండ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంటలోపు కేటాయించిన వైద్య కళాశాలల్లో చేరాలని వర్సిటీ పేర్కొంది.

మేనేజ్‌మెంట్ కోటా ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపు

మేనేజ్‌మెంట్ కోటా కింద మొదటి దశ కౌన్సెలింగ్‌లో ఎంబీబీఎస్ సీట్లను దక్కించుకున్న విద్యార్థుల వివరాలను కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం గురువారం ప్రకటించింది. కళాశాలల వారీగా అడ్మిషన్లు పొందిన విద్యార్థుల వివరాలను వెల్లడించింది.



అదృష్టం మిమ్మల్ని వరించాలంటే..

అదృష్టం అనేది అభూతకల్పన కాదు.. వాస్తవమే. కానీ అది- కష్టమైన పనులను ఎంచుకొని పూర్తిచేసేవారిని, తమ చుట్టూ విస్తృత స్థాయి నెట్‌వర్క్‌ను ఏర్పరుచుకునేవారిని, ప్రతిరోజు తమను తాము మెరుగుపరుచుకునేవారిని మాత్రమే వరిస్తుంది. అదృష్టం వరించేలా మిమ్మల్ని మీరు మలచుకోండి.

– జస్టిన్ వెల్ష్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

ఆ కేసుల్లోని భూముల విలువ రూ.వందల కోట్లు

- భూ ఆక్రమణ నిరోధక కోర్టు వివరాలు కోరిన ప్రభుత్వం
- ఆ మేరకు సమాచారం ఇచ్చిన కోర్టు అధికారులు
- 'ఈనాడు' కథనంతో స్పందించిన ప్రభుత్వం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో రద్దయిన భూ ఆక్రమణ నిరోధక చట్టం, ప్రత్యేక కోర్టుపై ప్రభుత్వం దృష్టి సారించింది. తెలంగాణ ప్రభుత్వ ల్యాండ్ గ్రాబింగ్ (ప్రొబిషన్) చట్టం వివరాలను అందజేయాలంటూ తాజాగా స్పెషల్ కోర్టు రిజిస్ట్రార్‌ను కోరింది. 2016 జూన్ 1న జారీ చేసిన జీవో 113 కింద కోర్టు రద్దు నేపథ్యంలో వివరాలు అందజేయాలని కోరుతూ ప్రభుత్వ అదనపు కార్యదర్శి టి. శేఖర్ పలు ప్రశ్నలతో కూడిన లేఖను స్పెషల్ కోర్టు రిజిస్ట్రార్‌కు రాశారు. 'చట్టం రద్దయ్యే నాటికి ఎన్ని కేసులు ఈ చట్టం కింద పెండింగ్‌లో ఉన్నాయి? ఆ కేసుల పరిధిలో ఉన్న ప్రభుత్వ భూముల విస్తీర్ణం ఎంత? వాటి విలువ ఎంత? వివిధ రకాల కోర్టుల్లో ఉన్న కేసుల తాజా పరిస్థితి ఏంటి?' అనేవి వెంటనే తెలియజేయాలని కోరారు. ఈ నెల 1న 'ఈనాడు'లో 'కబ్జాల కట్టడికి కావాలో చట్టం' శీర్షికన ప్రచురితమైన కథనం నేపథ్యంలోనే ముఖ్యమంత్రి కార్యాలయం, రెవెన్యూశాఖ స్పందించినట్లు తెలుస్తోంది.

విచారణ దశలో 541 కేసులు

భూ ఆక్రమణ నిరోధక కోర్టు రిజిస్ట్రార్ ప్రభుత్వం కోరిన సమాచారాన్ని వెంటనే అందజేశారు. 'భూ ఆక్రమణ నిరోధక కేసులు, అప్పీళ్ల కింద ఉన్న కేసుల్లోని భూముల విలువ రూ.వందల కోట్లలో ఉంటుంది. అంతకు ముందు ప్రత్యేక కోర్టు తీర్పుల ద్వారా రక్షించిన భూముల విలువ సుమారు రూ.5 వేల కోట్ల వరకు ఉన్నట్లు అంచనాలు ఉన్నాయి. రాష్ట్రంలో భూ ఆక్రమణ నిరోధక చట్టం, ప్రత్యేక కోర్టు రద్దయ్యే నాటికి 541 కేసులు(ఏపీకి చెందినవి కాకుండా) విచారణ దశలో ఉన్నాయి. కోర్టు రద్దు అనంతరం 520 కేసులు జిల్లా కోర్టులకు, 21 అప్పీళ్లను హైకోర్టుకు బదిలీ చేశాం. కోర్టుకు 80 మంజూరీ పోస్టులు ఉండగా 60 మంది సిబ్బంది ఉండేవారు. వారిలో 19 మందిని భూ ఆక్రమణ నిరోధక కోర్టు కింద, 35 మందిని పునరావాస- పునర్నివాస అథారిటీకి, ఐదుగురిని తెలంగాణ ఫుడ్ కమిషన్‌కు, ఒకరిని సచివాలయానికి డిప్యుటేషన్‌పై పంపించాం. ఉమ్మడి రాష్ట్రంలో 3,542 కేసులకు సంబంధించిన తీర్పుల్లో రూ.5 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములకు రక్షణ లభించింది' అని తెలిపారు.



ఈ నెల 1న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనం

వైద్య, ఆరోగ్యశాఖలో నర్సింగ్ ఆఫీసర్ల (స్టాఫ్ నర్సుల) ఎంపిక పరీక్షను నవంబరు 23న నిర్వహిస్తున్నట్లు ఎంహెచ్‌ఎస్‌ఆర్‌బీ తెలిపింది.


ఈనాడు

సైబర్ నేరగాళ్ల స్వైరవిహారం

కత్తులూ తుపాకులూ చూపించి బెదిరించరు కానీ, క్షణాల్లో లక్షలు లాగేస్తారు. ఎక్కడో తాపీగా కూర్చొని రోజుకో రకంగా జనాన్ని దోచేస్తున్న సైబర్ నేరగాళ్లు- పట్టుబడతామనే భయమే లేకుండా చెలరేగిపోతున్నారు. మీ పేరిట డ్రగ్స్ వచ్చాయనో, క్రెడిట్ డెబిట్ కార్డులు స్తంభించిపోతాయనో, ఇంతకింతా లాభాలు వస్తాయనో నమ్మించి ప్రజలను వారు బురిడీ కొట్టిస్తున్నారు. వ్యాపార సంస్థలపై సైబర్ దాడులకు పాల్పడుతూ భారీగా సొమ్ములు దండుకొంటున్నారు. అధికారిక లెక్కల ప్రకారం, ఈ ఏడాది మొదటి నాలుగు నెలల్లోనే సైబర్ బందిపోట్లు దేశవ్యాప్తంగా 1,750 కోట్ల రూపాయలు దోచేశారు. అంతకు ముందు 33 నెలల్లో రూ.పదివేల కోట్లకు పైగా కొల్లగొట్టారు. ఏపీలో రోజుకు సగటున రూ.86 లక్షలు, తెలంగాణలో రూ.67 లక్షల మేర జనం సొమ్ము డిజిటల్ దొంగల పాలవుతోంది. వెలుగులోకి రాని నేరాలనూ కలిపితే నష్టం మరింత ఎక్కువగానే లెక్కతేలుతుంది. జాతీయ సైబర్‌నేరాల పోర్టల్‌లో రోజుకు ఏడువేల చొప్పున నమోదవుతున్న ఫిర్యాదులు- సమస్య తీవ్రతకు అద్దంపడుతున్నాయి. ఫిర్యాదులూ కేసుల దాఖలులో జాప్యంవల్ల చాలా సందర్భాల్లో బాధితుల డబ్బు తిరిగి రావడంలేదు!

ఝార్ఖండ్, రాజస్థాన్, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్‌లలోని పది జిల్లాల నుంచే దేశీయంగా 80శాతం సైబర్ నేరాలు జరుగుతున్నట్లు పరిశీలనలు వెల్లడిస్తున్నాయి. లావోస్, మయన్మార్, థాయ్‌లాండ్ సరిహద్దులతో కూడిన 'గోల్డెన్ ట్రయాంగిల్' గతంలో మాదకద్రవ్యాల రవాణాకు ముఖ్యకేంద్రంగా ఉండేది. కొంతకాలంగా చైనా ముఠాలు ఆ ప్రాంతాన్ని సైబర్ నేరాలకు అడ్డాగా మార్చేశాయి. ఉద్యోగాల పేరిట భారతీయ యువతను అక్కడికి రప్పించి, వారిని బలవంతంగా ఆన్‌లైన్ మోసాల రొంపిలోకి దింపుతున్నాయి. కమీషన్లకు కక్కుర్తిపడి ఇండియాలో కొందరు తమ పేరిట బ్యాంకు ఖాతాలు తెరిచి, వాటిని నేరముఠాలకు అప్పగిస్తున్నారు. ఇలాంటి 27 మంది తాజాగా రాజస్థాన్‌లో తెలంగాణ సైబర్ భద్రతా పోలీసుల చేతికి చిక్కారు. చైనీస్ చోరులకు ఫోన్ నంబర్లు, ఇతర వివరాలు అందించేందుకు పలు బృందాలు ఇండియాలో పనిచేస్తున్నాయి. ఇలా వ్యవస్థీకృత దందాగా మారిన సైబర్ నేరాలకు ఉన్నత విద్యావంతులూ బాధితులవుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో పోస్టులను విశ్లేషించి శ్రీమంతులపై గురిపెట్టి కోట్లు కొల్లగొట్టుకుపోతుండటం- ఆన్‌లైన్ మాయగాళ్ల నయా ఎత్తుగడలకు నిదర్శనం!

సైబర్ కేటుగాళ్లను కట్టడి చేయడంలో భాగంగా కేంద్రం ఇటీవల లక్షల సంఖ్యలో సిమ్ కార్డులను రద్దు చేసింది. నకిలీ ఖాతాలను పెద్దయెత్తున స్తంభింపజేసింది. మరో 2.17 కోట్ల సిమ్‌లపైనా వేటు వేయనున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. ఆన్‌లైన్ ఘాతుకాలను అడ్డుకొనేందుకు రాబోయే అయిదేళ్లలో అయిదు వేల మంది సైబర్ కమాండోలను సిద్ధం చేయనున్నట్లు కేంద్రం ప్రకటించింది. జిల్లాకు ఒక సైబర్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వం తాజాగా నిశ్చయించింది. తెలంగాణలోనూ అలాంటివి తొమ్మిది పనిచేస్తున్నాయి. అయితే, ఇతర దేశాలూ రాష్ట్రాల్లో తిష్ఠవేసి సైబర్‌సీమలో ఘరానా మోసాలకు పాల్పడుతున్నవారు అంత తేలిగ్గా చిక్కడం లేదు. ఒకవేళ అరెస్టు అయినా, బెయిల్ వచ్చిన వెంటనే మాయమవుతున్నారు. దాంతో చాలా కేసుల్లో శిక్షలు కరవవుతున్నాయి. ఈ అవ్యవస్థను సరిదిద్దాలంటే- రాష్ట్రాల నడుమ సమన్వయం కీలకం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సమష్టిగా సైబర్ నేరగాళ్ల పీచమణచాలి. ఆన్‌లైన్ నేరాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించడం అన్నింటికన్నా ప్రధానం!



ధైర్యం అంటే భయం లేకపోవడం కాదు, భయాన్ని గెలవడం. ఏ ఉద్యమం విజయం సాధించాలన్నా, సమాజంలో ఏ మార్పు తేవాలన్నా పోరాడే వారందరూ ఐక్యంగా ఉండటమే అన్నిటికన్నా పెద్ద బలం.

– శ్యామ్‌జీ కృష్ణవర్మ, ఉద్యమకారుడు, న్యాయవాది

బ్రహ్మాండనాయకుడి బ్రహ్మోత్సవం

తిరుమల శ్రీవేంకటాచలపతి ఉత్సవ ప్రియుడే కాదు, ఆబాలగోపాలాన్ని ఉద్ధరించే ఉత్సవకరుడు కూడా! శ్రీనివాసుడి నిత్యోత్సవం సకల జనులకు నేత్రోత్సవం. శ్రీవేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవం సమస్త లోకాలకు దివ్యోత్సవం. నిత్యసేవల్లో ఆ స్వామి ఆనంద నిలయాన ఆరాధనలు అందుకుంటే, బ్రహ్మోత్సవాల్లో పురవీధుల్లో పూజలందుకుంటాడు. నిత్యపూజల్ని తిలకించి తరించే భాగ్యం లేని భక్తజనుల మనోరథాన్ని, ఆ బ్రహ్మాండనాయకుడు మహారథమెక్కి బ్రహ్మోత్సవ రూపంలో తీరుస్తాడు. మానవులు చేసుకునే ఏ వేడుకలైనా ఆ మహితాత్ముడి వైభవం ముందు దిగదుడుపేనని ఆ బ్రహ్మాండనాయకుడి బ్రహ్మోత్సవాలు తేటతెల్లం చేస్తాయి. ఆ విశ్వరూపుడి విభవం ఎదుట మనమెంత స్వల్పాతిస్వల్పమో విస్పష్టం చేస్తాయి. ఆ మహోత్సవాల్లో అన్ని వాహనాలపై అంత వైభవంగా ఊరేగుతున్న మహామూర్తిని చూశాక మన అహంకారం తొలగిపోవాలి. అభిజాత్యం తరిగిపోవాలి. అదే ఆ బ్రహ్మోత్సవాల దర్శన పరమార్థం.



అంతర్యామి

శేషాద్రినిలయుడికి ఈ సంబరాల సందర్భంగా జరిగే విశిష్టపూజలు, ఉపచారాల ఫలితంగా ప్రకృతిలో, జీవుల్లో ఆధ్యాత్మిక శక్తి ప్రేరేపితమవుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అంతేకాకుండా ఈ ఉత్సవాలు మానవుల్ని లౌకికపరమైన దుఃఖం నుంచి విముక్తులను చేస్తాయని, పారమార్థిక ఉన్నతిని ప్రసాదిస్తాయని అపారమైన నమ్మకం. ఈ బ్రహ్మోత్సవాన్నే 'మహోత్సవం', 'తిరునాళ్', 'కల్యాణోత్సవం' అని పిలుచుకోవటం ఆనవాయితీ. తిరుమల కొండపై జనసంచారం లేనిరోజుల్లో బ్రహ్మోత్సవాలను పద్మావతి అమ్మవారు కొలువైన తిరుచానూరులో నిర్వహించేవారట. తిరుమలలో ధ్వజారోహణం మాత్రం జరిపి, తక్కిన వాహన సేవలన్నీ తిరుచానూరులోనే నిర్వహించేవారట.

శ్రీనివాసుడి వేడుకల ప్రస్తావన వరాహ, భవిష్యోత్తర, బ్రహ్మాండ, మార్కండేయ, వామన తదితర పురాణాల్లో కనిపిస్తుంది. ప్రస్తుతం తిరుమలలో ఏటా నిర్వహించే బ్రహ్మోత్సవాలు భవిష్యోత్తర పురాణంలో వర్ణించిన పద్ధతిలో, వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం జరుగుతున్నాయి. తొలుత సాక్షాత్తూ బ్రహ్మదేవుడే తిరుమలకు వేంచేసి, ఆ పురాణపురుషుడికి ఈ ఉత్సవాలు జరిపాడని పురాణాలు చెబుతున్నాయి. శ్రీనివాసుడి ఆజ్ఞ మేరకు చతుర్ముఖ బ్రహ్మ చతుర్వేదాలకు ప్రతీకగా ఉత్సవ శ్రీనివాసమూర్తి, ఉగ్ర శ్రీనివాసమూర్తి, సర్వాధిప శ్రీనివాసమూర్తి, లేఖక శ్రీనివాసమూర్తి అనే నాలుగు విధాలైన వేంకటేశ్వరుడి అర్చామూర్తులను ఆనంద నిలయంలో నెలకొల్పాడని చెబుతారు.

క్రీ.శ.1561 నుంచి శ్రీవారి వేడుకల్లో వాహనసేవల్ని చేర్చారని చరిత్ర కథనం. చూసేవారికి చూడముచ్చటగా, పుణ్యమూర్తులకు ధన్యభాగ్యంగా ఆ ధరణీనాయకుడు సతీసమేతంగా బ్రహ్మోత్సవాల్లో దర్శనమిస్తాడు. సంకీర్తనాచార్యుడు అన్నమయ్య స్వయంగా శ్రీనివాసుడి నిత్యోత్సవాలనే కాదు బ్రహ్మోత్సవాలను కూడా శోభాయమానంగా జరిపాడు. ఆ పద్మావతి ప్రియుడి బ్రహ్మోత్సవ ప్రాభవాన్ని 'దేవదేవుడెక్కెనదె దివ్యరథము...' వంటి పలు కీర్తనల్లో ప్రస్తుతించి పరవశించాడు.

– బి.సైదులు

ఈ-వ్యర్థాలను తొలగించలేమా?

భూమండలం వ్యర్థాల దిబ్బగా మారుతోంది. ఆధునిక ప్రపంచంలో ఎలక్ట్రానిక్ ఉపకరణాల వినియోగం అంతకంతకూ పెరుగుతోంది. ముంచెత్తుతున్న వ్యర్థాలు పూర్తిస్థాయిలో పునశ్శుద్ధికి నోచుకోవడం లేదు. వాటిలోని విలువైన లోహాలు మట్టి పాలవుతున్నాయి. భూమి, నీరు, గాలి కాలుష్యం బారిన పడుతున్నాయి.



సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్నకొద్దీ రోజుకో కొత్తరకం ఎలక్ట్రానిక్ ఉపకరణం ప్రపంచానికి పరిచయం అవుతోంది. కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, టీవీలు, ఛార్జర్లు, బ్లూటూత్‌లు, ల్యాప్‌టాప్‌లు, బ్యాటరీలు, ఫ్రిజ్‌లు తదితరాలను అధునాతన ఫీచర్ల పేరిట ఎప్పటికప్పుడు మార్చేస్తున్నారు. కొత్తరకాలను కొనేస్తున్నారు. అయితే, పాతవాటిని సరైన రీతిలో రీసైక్లింగ్ చేసి తిరిగి వినియోగించకుండా వృథాగా పారేస్తుండటంతో సమస్య ఉత్పన్నమవుతోంది. ఈ-వ్యర్థాలు భూమి పొరల్లో, జల వనరుల్లో కలిసిపోతున్నాయి. వీటి నుంచి విడుదలయ్యే కర్బన ఉద్గారాలు, భారలోహాలు, రసాయనాల వల్ల పర్యావరణానికి, మానవాళి ఆరోగ్యానికి తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

ఎన్ని పోగుపడుతున్నాయి?

యూఎన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ (యూఎన్ఐటీఏఆర్) రూపొందించిన 'గ్లోబల్ ఈ-వేస్ట్ మానిటర్ 2024' నివేదిక- 'ఎలక్ట్రానిక్ వ్యర్థాల ఉత్పత్తిని తగ్గించడమే ఈ-వేస్ట్ సమస్యలకు పరిష్కారం' అని తెలిపింది. 2022 గణాంకాల మేరకు ప్రపంచవ్యాప్తంగా ఏడాదికి 6.2 కోట్ల టన్నుల ఈ-వ్యర్థాలు పోగుపడుతున్నాయి. 2010లో 3.4 కోట్ల టన్నులు, 2019లో 5.36 కోట్ల టన్నులు, 2021లో 5.37 కోట్ల టన్నులు ఉత్పత్తి అయ్యాయి. 2022లో కేవలం 1.3కోట్ల టన్నుల వ్యర్థాలను మాత్రమే రీసైక్లింగ్ చేసినట్లు ఐరాస నివేదిక స్పష్టంచేస్తోంది.

మన దేశం పరిస్థితేంటి?

ప్రపంచంలో ఈ-వ్యర్థాల ఉత్పత్తిలో చైనా, అమెరికాల తర్వాతి స్థానం భారత్‌దేనని గతంలోనే ఐరాస నివేదిక వెల్లడించింది. 2019లో భారత్‌లో 32లక్షల టన్నుల వ్యర్థాలు ఉత్పత్తయ్యాయి. ఇందులో ప్రధాన నగరాల వాటాయే అధికం. తొలిస్థానంలో ఉన్న ముంబయిలో 96వేల టన్నుల ఈ-వ్యర్థాలు ఉత్పత్తి అయితే- దిల్లీ, చెన్నైలు ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. హైదరాబాద్‌లో 35 వేల టన్నులు పోగవుతోంది. అసోచామ్ సంస్థ 'దేశంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణ'పై చేపట్టిన అధ్యయనంలో కేవలం 10 రాష్ట్రాల్లోని 65 నగరాల నుంచే 70 శాతం వ్యర్థాల ఉత్పన్నమవుతున్నట్లు గుర్తించింది. ఈ-వ్యర్థాలు ఉత్పత్తిలో మహారాష్ట్ర తర్వాత తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు ఉన్నట్లు వెల్లడించింది.

పర్యావరణానికి ఎలా హానికరం?

ఈ-వ్యర్థాలను భూమిపైన, నీటిలో పడేస్తుండటంతో పర్యావరణానికి, మానవాళికి హాని కలుగుతోంది. వీటిని దహనం చేయడం వల్ల కర్బన ఉద్గారాలు విడుదలై ప్రకృతిపై, జనజీవనంపై దుష్ప్రభావం చూపుతున్నాయి. పాడైన టీవీలు, ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులు, మెమొరీ చిప్‌లను పారవేసినప్పుడు అందులోని భార లోహాలు వివిధ రసాయనాలను విడుదల చేస్తాయి. అవి భూగర్భ జలాలను విషపూరితం చేస్తున్నాయి. కలుషిత రసాయనాలను పీల్చేవారు, కాలుష్య జలాలను తాగినవారు క్యాన్సర్, మెదడు, నాడీ వ్యవస్థ, కాలేయం, మూత్రపిండాలు సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. మహిళల్లో గర్భస్థ సమస్యలు తలెత్తుతున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు.

పునర్వినియోగంలోకి రావట్లేదా?

ఈ-వ్యర్థాలను పునర్వినియోగం చేయలేకపోతే తగినరీతిలో తొలగించాలి. అయితే, దేశవ్యాప్తంగా ఇప్పటికీ 75 శాతం ఈ-వ్యర్థాలు సేకరణకే నోచుకోవడం లేదు. ఈ-వేస్ట్ పునర్వినియోగంపై హైదరాబాద్ ఐఐటీ, పుణెకు చెందిన సెంటర్ ఫర్ మెటీరియల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ (సీ-మెట్) సంయుక్తంగా పరిశోధనలు నిర్వహిస్తున్నాయి. పర్యావరణ మంత్రిత్వ శాఖ 2022 గణాంకాల ప్రకారం, 22 రాష్ట్రాల్లో 468 ఈ-వేస్ట్ పునర్వినియోగ కేంద్రాలు ఉన్నాయి. ఇవి ఏడాదికి 13.90 లక్షల టన్నుల వ్యర్థాలను రీసైక్లింగ్ చేస్తున్నాయి. వ్యర్థాల సేకరణ, రీసైక్లింగ్‌లో ప్రపంచంలో దక్షిణ కొరియా, నార్వే, యూకే, జపాన్, నెదర్లాండ్స్ ముందున్నాయి. ప్రపంచంలో 81 దేశాలు ఈ-వ్యర్థాల నియంత్రణపై చట్టాలు చేశాయి. 36 దేశాలు రీసైక్లింగ్ లక్ష్యాలను అమలు చేస్తున్నాయి. చాలా దేశాలు చట్టాల అమలుపై పూర్తిస్థాయిలో దృష్టి సారించకపోవడంతో ఏటా కోట్ల టన్నుల వ్యర్థాలు భూమిపై పోగవుతున్నాయి.

అవకాశం పోతోందా?

వాడిపారేసిన ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, ఫోన్లలోని సర్క్యూట్లలో విలువైన బంగారంతోపాటు అల్యూమినియం, సీసం, రాగి, ఇనుము, ప్లాస్టిక్ ఉంటుంది. వీటిని రీసైక్లింగ్ కేంద్రాల ద్వారా వేరుచేసి పునర్వినియోగించవచ్చు. 2010లో వాంకోవర్‌లో నిర్వహించిన వింటర్ ఒలింపిక్స్‌లో విజేతలకు అందించిన పతకాల్లో 1.52 శాతం బంగారం వీటి నుంచి సేకరించిందే. యాపిల్ కంపెనీ 2015లో వందల కిలోల బంగారాన్ని ఈ ప్రక్రియ ద్వారా సేకరించింది. టోక్యో ఒలింపిక్స్‌లో జపాన్ 50 వేల టన్నుల వ్యర్థాల నుంచి సేకరించిన బంగారం ద్వారా పతకాలు రూపొందించింది. ఈ-వ్యర్థాల నుంచి ఏటా ఎనిమిది వేల కోట్ల రూపాయల విలువైన బంగారాన్ని వెలికితీసే అవకాశాన్ని భారత్ కోల్పోతున్నట్లు ఫిక్కీ చెబుతోంది.

ఏం చేయాలి?

వ్యర్థాల సేకరణ, పునర్వినియోగం ద్వారా నష్టాలను నియంత్రించవచ్చు. మనుగడ అధికంగా ఉండే ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పత్తి దిశగా తయారీదారులను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి. పాడైన వస్తువులను పునర్వినియోగించే కార్యక్రమాలు రూపొందించేలా చర్యలు చేపట్టాలి. పర్యావరణానికి, మానవాళికి ఎలాంటి నష్టం కలిగించని రీతిలో వ్యర్థాల రీసైక్లింగ్ కేంద్రాల ఏర్పాటుకు సహకరించాలి. ముఖ్యంగా ఈ-వేస్ట్‌తో తలెత్తే దుష్పరిణామాలపై వినియోగదారులకు అవగాహన కల్పించాలి.

– వైశ్యరాజు ప్రవీణ్‌రాజు



ఇళ్లే... గుళ్లవుతాయి!

దసరా అనగానే గుర్తొచ్చేది వాకిట్లో బతుకమ్మ, ఇంట్లో బొమ్మల కొలువూ! అటక మీది పెట్టెల్లో మెత్తటి పొత్తి గుడ్డల్లో పడుకోబెట్టిన బొమ్మలూ దేవుళ్లూ చకచకా నట్టింట అంచెలవారీగా పేర్చిన చెక్క బెంచీల మీదకు వచ్చి కూర్చోవడంతో పండగ సందడి మొదలయ్యేది. చేతిలో తుపాకితో సిపాయి బొమ్మా పొలం దున్నే రైతూ నల్లటి కోరమీసాల భగత్ సింగూ... లేకపోతే అది బొమ్మల కొలువే కాదు. దేవుళ్లంతా ఉండాలమ్మా అంటూ బామ్మతో పేచీపడి అయినా అందరినీ కొలువులో చేర్చేది చిట్టితల్లి. రాముడూ సీతా మధ్యలో మాయజింక సరేసరి. వేలెడంత లక్ష్మణుడు విల్లంబుతో కాపలా కాస్తుంటే పక్కనే వెదురు గుంజల పర్ణశాల, ఎదురుగా ఆయన గీసిన గీత!

దశావతారాలు పై మెట్టు మీద! వారం రోజుల ముందే ఆవాలు మెంతులు మొలకలెత్తించి సృష్టించిన పార్క్, సికింద్రాబాద్ స్టేషన్‌లో ఆగుతున్న రైలు కూడా బొమ్మల కొలువులోకి వచ్చేవి. ఆ పట్టాలెంత బాగుంటాయని! ఆ పక్క కాస్త ఇసుక పేర్చితే బాసర గోదావరి తీరం రెడీ. అవీ ఇవీ అన్నీ కలిపి హాలంతా అంతస్తులవారీగా అంపకాలు పెట్టేస్తుంది బంగారు తల్లి. ఏడాదిపాటు మంచినిద్ర పోయి హుషారుగా లేచొచ్చి కూర్చుంటారు వారంతా, తమను పిలిచింది మూడేళ్ల పిల్లైనా అస్సలు ఫీలవరు. సకలదేవతలు ఆమె చెప్పినట్టు వింటారు. ఎక్కడ కూచోమంటే అక్కడ కూర్చుంటారు. ఏం ఆరగింపు చేస్తే అదే తింటారు. ఎట్లా పాడినా వింటారు. ఏ బొమ్మైనా దేవుడే. ఎంత దేవుడూ చిన్న బొమ్మే ఇప్పుడు. ఈ తొమ్మిది రోజులూ ఇళ్లే గుళ్లవుతాయి.

నీలమో పచ్చో ఇటుకరాయి రంగో... పట్టుపావడాల్లో ఎవరి పిల్లలు ఎవరో ఆనవాలే తెలియదు. అమ్మమ్మ వాళ్ల ఊరెళ్లినా, నగరం నడిబొడ్డున అపార్ట్‌మెంట్‌లో ఉన్నా... బొమ్మల కొలువు పేరంటాలకీ బతుకమ్మ ఆటలకీ ఏ లోటూ లేదు. తాహతు కొద్దీ ప్రియంగా అలంకరించుకుని అమ్మవారికి ఆటలూ పాటలూ వంటలూ నైవేద్యం చేస్తారు. అన్న సంతర్పణలు, పండగ మామూళ్లు... కలిగినది పంచడంలో సంతోషపు రుచి తెలిసొచ్చే మాసం ఇది. ఆశ్వయుజంలో ఆడపిల్లలున్న ఇంట్లో పూచే కలువ ఈ పండుగ.

పాడ్యమి నుంచి దశమి వరకూ ఇంట్లో అమ్మ కుంకుమ పూజ. పక్కిళ్ల వాళ్లకి సాయంత్రం పండూ శెనగల తాంబూలం పంచడం మా పని. ప్రతీ విజయదశమికీ పిల్లలకు అక్షరాభ్యాసాలు. మరో కొత్తవిద్యేదో గరిపేందుకు సరికొత్త నోటు పుస్తకంతో పెద్దలు తయారు. కొత్త దుస్తులు, రిబ్బన్లు, గాజులు. ఆకుపచ్చ బంగారం- జమ్మి ఆకుని స్నేహాలింగనాలతో పంచుకోవటం! ఎక్కడ చూసినా గాలిలో వాత్సల్యం! జ్ఞానంతో కూడిన చైతన్యం! పండుగ ప్రథమ లక్ష్యం అదే కదా! చిన్నప్పుడు మేమూ బతుకమ్మ ఆడేవాళ్లం, పుట్నాలూ కొబ్బరి చక్కెరా బొక్కేవాళ్లం... తియ్యగా!

– పద్మజ సూరపరాజు



దొంగ బంగారం

భారతీయులకు బంగారంపై మక్కువ ఎక్కువ. చాలామంది దాన్ని మేలైన పెట్టుబడి మార్గంగా భావిస్తారు. డిమాండ్ అధికంగా ఉండటంతో పన్నులు ఎగ్గొట్టేందుకు చాలామంది బంగారాన్ని అక్రమంగా ఇండియాకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో విమానాశ్రయాల్లో ఎందరో పట్టుబడుతున్నారు. ఆయా సంవత్సరాల్లో ఎయిర్‌పోర్టుల్లో పట్టుబడిన బంగారం విలువ.

సంవత్సరం	విలువ (కోట్ల రూపాయల్లో)
2021–22	572.22
2022–23	1381.55
2023–24	2081.39
2024 (జూన్ వరకు)	543.61

(ఆధారం: రాజ్యసభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

అశ్లీల సంస్కృతికి విరుగుడు

చిన్నారులను అశ్లీల చిత్రాల కోసం ఉపయోగించడం అయిదేళ్ల జైలు శిక్షకు, జరిమానాకూ అర్హమైన నేరమని 2012 నాటి 'పోక్సో' చట్టంలోని 14వ సెక్షన్ చెబుతోంది. మళ్లీ అదే నేరం చేస్తే ఏడేళ్ల జైలు శిక్ష పడుతుంది. 15వ సెక్షన్‌లో మూడు ఉప సెక్షన్లు ఉన్నాయి. పిల్లలపై అశ్లీల వీడియోలను దగ్గరుంచుకోవడం శిక్షార్హమని 15(1) ఉప సెక్షన్ పేర్కొంటోంది. ఇలాంటి వీడియోలను తొలగించకపోయినా, చెరిపేయకపోయినా, తన చేతికి ఇలాంటి వీడియోలు అందాయని అధికారులకు ఫిర్యాదు చేయకపోయినా రూ.5,000 వరకు జరిమానా విధించవచ్చు. మళ్లీ ఇదే నేరం చేస్తే జరిమానా రూ.10,000కు పెరుగుతుంది. చిన్నారులపై అశ్లీల వీడియోలను ఇతరులకు పంపినా, ప్రచారం చేసినా శిక్ష, జరిమానా విధించాలని 15(2) నిర్దేశిస్తోంది. కోర్టులో సాక్ష్యంగా నివేదించడానికి తప్ప, మరేవిధంగానూ ఇలాంటి వీడియోలను ప్రదర్శించకూడదని అది స్పష్టం చేస్తోంది. వ్యాపారం చేయడానికని పిల్లలపై చిత్రీకరించిన అశ్లీల వీడియోలను నిల్వ చేయడం, దగ్గరుంచుకోవడం శిక్షార్హమైన నేరాలని 15(3) ఉప సెక్షన్ చెబుతోంది. చిన్నారులతో కూడిన అశ్లీల వీడియోలను వ్యాపారం కోసం వినియోగించే, పంపిణీచేసే ఉద్దేశం నిందితుడికి ఉన్నట్లు నిర్ధారణ అయితేనే పోక్సో చట్టంలోని 15వ సెక్షన్ కింద శిక్ష విధించాలని వివిధ హైకోర్టులు తీర్మానించాయి. అందుకే ఇటువంటి వీడియోలను డౌన్‌లోడ్ చేయడం, చూడటం పోక్సో చట్టం కింద కానీ, ఐటీ చట్టం-2000 కింద కానీ నేరంకాదని మద్రాసు హైకోర్టు తీర్పు వెలువరించింది. నిందితుడిపై కేసు కొట్టేసింది. ఆ తీర్పును 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్' అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలాల ధర్మాసనం ఇటీవల హైకోర్టు తీర్పును తోసిపుచ్చింది.



చిన్నారులపై లైంగిక అకృత్యాలు, అశ్లీల చిత్రాలపై సుప్రీంకోర్టు కన్నెర్ర చేసింది. అశ్లీల వీడియోలను దగ్గర ఉంచుకున్నంత మాత్రాన 'పోక్సో' చట్టం కింద నేరంగా పరిగణించలేమన్న మద్రాసు హైకోర్టు తీర్పును సర్వోన్నత న్యాయస్థానం కొట్టేసింది. ఇటువంటి వీడియోలను దగ్గరుంచుకోవడం, చూడటం, ఇతరులతో పంచుకోవడమే కాకుండా, వాటి గురించి అధికారులకు ఫిర్యాదు చేయకపోవడమూ 'పోక్సో' చట్టం కింద నేరమేనని 'సుప్రీం' స్పష్టం చేసింది.

సామాజిక మాధ్యమాల పాత్ర...

ఐటీ చట్టంలోని సెక్షన్ '67బి' పిల్లలపై లైంగిక కృత్యాలను ఎలక్ట్రానిక్ రూపంలో ప్రచురించడం, పంపిణీ చేయడం శిక్షార్హమైన నేరాలుగా పరిగణిస్తోంది. ఇలాంటి అశ్లీల వీడియోల సృష్టి, వాటిని దగ్గర ఉంచుకోవడం, పంపిణీ చేయడం, చూడటం, వినియోగించడం కూడా శిక్షార్హమైన నేరాలంటూ '67బి' పరిధిని సుప్రీంకోర్టు విస్తరించింది. పిల్లలపై అశ్లీల వీడియోలు సామాజిక మాధ్యమాల ద్వారా పంపిణీ అవుతున్నా, వాటి నిర్వాహకులు పట్టించుకోకపోవడాన్ని సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. ఇలాంటి వీడియోల గురించి అధికారులకు ఫిర్యాదు చేయాలని ఐటీ, పోక్సో చట్టాలు నిర్దేశిస్తున్నాయని గుర్తుచేసింది. వీడియోల నిర్మాతలు, పంపిణీదారులు, వినియోగదారుల మధ్య తాము కేవలం మధ్యవర్తులమంటూ సామాజిక మాధ్యమాలు తప్పించుకోవడం కుదరదని తేల్చిచెప్పింది. పోక్సో చట్టం గురించి సుప్రీంకోర్టు మరిన్ని విలువైన భాష్యాలను వెలువరించింది. ఈ చట్టంలోని 30వ సెక్షన్ ప్రకారం నిందితులకు నేర బుద్ధి ఉందని నిరూపణ అయితేనే శిక్ష విధించాలి. అయితే, తనకు నేర చింతన లేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత నిందితుడిపైనే ఉందని సుప్రీంకోర్టు స్పష్టీకరించింది.

ఇకపై ఆ మాటలు వద్దు...


'చైల్డ్ పోర్నోగ్రఫీ' అనే పదాల మీదా సుప్రీంకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇలాంటి వీడియోలు, చిత్రాలను పరస్పర అంగీకారంతోనే తీస్తున్నారనే అభిప్రాయం ఈ పదాలవల్ల కలుగుతోందని అభిప్రాయపడింది. వాస్తవంలో పిల్లలపై దౌర్జన్యం చేసి, వారిని నిర్బంధించి, రకరకాలుగా ఒత్తిడి చేసి అశ్లీల చిత్రాలను తీస్తారు. ఇకపై చైల్డ్ పోర్నోగ్రఫీ అనే మాటను కాకుండా 'చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లాయిటేటివ్, అబ్యూజ్ మెటీరియల్' అనే పదాలను ఉపయోగించాలని సుప్రీంకోర్టు నిర్దేశించింది. చిన్నారులపై అశ్లీల చిత్రాల నైతిక, చట్టపరమైన పర్యవసానాల గురించి అవగాహన పెంచాలని సర్వోన్నత న్యాయస్థానం కేంద్ర మహిళా, శిశు సంక్షేమశాఖకు సూచించడం స్వాగతించాల్సిన విషయం. అన్నింటినీ మించి పోక్సో చట్టానికి వివిధ హైకోర్టులు చెప్పిన భాష్యాలు, తీర్పుల్లో తేడాలను సరిచేయడం మీద సుప్రీంకోర్టు దృష్టి పెట్టింది. ఈ చిత్రాలను దగ్గర ఉంచుకోవడాన్ని, పంపిణీ చేయడాన్ని వేర్వేరు నేరాలుగా కాకుండా ఒకే నేరంగా కొన్ని హైకోర్టులు పరిగణించాయి. అయితే, ఇవి వేర్వేరు శిక్షార్హమైన నేరాలని సుప్రీం స్పష్టం చేసింది. పిల్లలపై సైబర్ నేరాలు పెరుగుతున్న తరుణంలో ఇది సరైన నివారణ చర్య అవుతుంది. నేరస్థులను సత్వరం శిక్షించడం సాధ్యమవుతుంది.

– రిత్వీక శర్మ, న్యాయ నిపుణులు, విధి సెంటర్ ఫర్ లీగల్ పాలసీ

హాయ్! బుజ్జీ!!

మారిన నది!

కొండల మధ్య నుంచి వేగావతి నది ప్రవహించేది. స్వచ్ఛమైన నీరు కావడంతో ఆ చుట్టు పక్కల ప్రజలు ఆ నీటినే తాగేవాళ్లు. కాలువల ద్వారా పంట పొలాలకు వదిలేవాళ్లు రైతులు. అలా అన్ని అవసరాలకు ఆ నది నీళ్లే ఉపయోగించేవారు. దాంతో నదికి కాస్త గర్వం పెరిగింది. ఒకసారి కొండని చూసి ఎగతాళిగా నవ్వింది నది. కారణం తెలియని కొండ.. ఆశ్చర్యంగా నదిని చూడసాగింది. అప్పుడు నది.. 'నిన్ను చూస్తే జాలేస్తుంది. ఆకాశాన్ని తాకేంత ఎత్తుగా ఉన్నావన్నమాటే కానీ ఎటూ కదల్లేవు. ఉన్న దగ్గరే నీ జీవితం గడిచిపోతుంది. నన్ను



చూడు ఎప్పుడూ ముందుకు వెళ్తుంటాను. ఎందరికో ఉపయోగపడతాను. ఉన్న చోటే ఉండిపోవడంతోనే నీ బతుకు వృథా అయింది' అంది. 'నిజమే నువ్వెప్పుడూ పరిగెడుతూ ఉంటావు. అంత మాత్రాన అందరి కంటే గొప్ప అని కాదు. నిన్ను బంధించే జలాశయాలు, ఆనకట్టలు దారి పొడవునా ఉంటాయి. వేసవి వస్తే చాలు ఎండిపోతావు. కానీ నేను నీలా కాదు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఒకేలా ఉంటాను. నా మీద చాలా చెట్లు పెరుగుతాయి. ఎన్నో పక్షులు, జంతువులకు నేను ఆశ్రయమిస్తాను. నా వల్లే వానలు కురిసి నువ్వు చక్కని ప్రవాహంగా ప్రయాణిస్తున్నావు. నీ ప్రయాణం అందమైనది కావచ్చు. కానీ చివరికి నువ్వు సముద్రంలో కలసిపోయి మాయమవ్వాల్సిందే కదా!' అని బదులిచ్చింది కొండ. అది వినగానే నది గర్వం అణిగిపోయింది. 'ఎవరి ప్రత్యేకతలు, లక్షణాలను బట్టి వాళ్లు గొప్పవారు. నేను చేసిన తప్పునకు క్షమించు' అని అడిగింది నది. 'ఇప్పటికైనా అర్థం చేసుకున్నావు. ఇక క్షమాపణలు ఎందుకులే!' అని బదులిచ్చింది కొండ.

– నారంశెట్టి ఉమామహేశ్వరరావు

ఆ ఒక్కటి ఏది?

ఇక్కడ ఇచ్చిన వాటిల్లో ఒకటి మాత్రం మిగతా వాటికి భిన్నంగా ఉంది. ఆ ఒక్కటి ఏదో కనిపెట్టండి.





జవాబు:

గత ఐదేళ్లూ సనాతన ధర్మంపై దాడి

- తిరుపతి వారాహి సభలో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ఈనాడు, తిరుపతి: వైకాపా అధ్యక్షుడు జగన్ అమాయకుడు, సుద్దపూసేమీ కాదని ఆయనపై మోసం, నేరపూరిత విశ్వాస ఘాతుకం, అధికార దుర్వినియోగం వంటి ఆరోపణలపై 29 కేసులు ఉన్నాయని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విరుచుకుపడ్డారు. ఐదేళ్ల వైకాపా పాలనలో తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా ఎన్నో అరాచకాలు జరిగాయని.. ఐదేళ్లుగా సనాతన ధర్మంపై దాడి చేస్తూనే ఉన్నారని, అనేక విధ్వంసకర ఘటనలకు పాల్పడ్డారని ఆయన మండిపడ్డారు. వాటన్నింటినీ ఉన్నత న్యాయవ్యవస్థ, జాతి దృష్టికి తీసుకొస్తున్నామని చెప్పారు. తీర్పు ఇచ్చే ముందు వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలని న్యాయవ్యవస్థకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కల్తీ నెయ్యితో శ్రీవారి ప్రసాదాలు తయారుచేయడాన్ని చిన్న ఘటనలా తీసేయకూడదని, వైకాపా ప్రభుత్వం నియమించిన తితిదే పాలకమండళ్ల హయాంలో అంతకు మించిన ఘోరాలు అనేకం చోటుచేసుకున్నాయని పవన్ పేర్కొన్నారు. సనాతన ధర్మాన్ని ముట్టుకున్న ఎవరైనా మాడి మసైపోతారని హెచ్చరించారు. గురువారం తిరుపతిలో నిర్వహించిన వారాహి డిక్లరేషన్ సభలో ఆయన మాట్లాడారు. ‘శ్రీవారి లడ్డూ ప్రసాదంపై సుప్రీంకోర్టులో కొన్ని వ్యాఖ్యలు చేశారు. నేను కోర్టును, న్యాయవ్యవస్థను ఎంతో గౌరవిస్తాను. కానీ జాతి దృష్టికి కొన్ని విషయాలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. తిరుమలలో కొన్ని సరిగా జరగలేదు. వాటిని మీ దృష్టికి తెస్తున్నా. నాకు సనాతన ధర్మం, ప్రజాస్వామ్య విలువలు ముఖ్యం. గత ఐదేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌లో ఏం జరిగిందో తెలుసుకోండి. లడ్డూ ప్రసాదానికి ఉపయోగించే నెయ్యిని కల్తీ చేయడం ఒక్కటే కాదు.. తిరుమల పవిత్రతను దెబ్బతీసే అనేక చర్యలు జరిగాయి. మీరు ఏదైనా తీర్పు చెప్పాలనుకుంటే నా వాదన ఇదే’ అని ఆయన పేర్కొన్నారు. ‘సనాతన ధర్మం ఒక వైరస్ అని.. దాన్ని అంతం చేస్తామని ఇటీవల ఒక యువ నాయకుడన్నారు. జంతువుల కొవ్వు కలిపిన కల్తీ నెయ్యితో చేసిన ప్రసాదాల్ని ఏడుకొండలవాడికి నైవేద్యంగా పెట్టారు. అదే కల్తీ నెయ్యితో చేసిన లక్ష లడ్డూల్ని అయోధ్య రాముడికి పంపించారు. ఆయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవాన్ని రాహుల్‌గాంధీ ‘నాచ్ గానా’ సభగా ఎద్దేవా చేశారు. హిందువులంతా ఓట్లేసి వాళ్లను గెలిపించాలి. కానీ వాళ్లు మాత్రం రాముణ్ని గౌరవించరు’ అని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వైకాపా అధ్యక్షుడు జగన్, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌లపై పవన్ నిప్పులు చెరిగారు.



ప్రాణాలైనా అర్పిస్తా

నేను ముమ్మాటికీ సనాతన హిందువునే. నా ప్రాణాల్ని అడ్డుపెట్టయినా సనాతన ధర్మాన్ని కాపాడుకుంటాను. దాని కోసం నా రాజకీయ హోదాను, పదవిని, అధికారాల్నే కాదు... నా ప్రాణాల్ని కోల్పోవడానికీ సిద్ధం. - పవన్ కల్యాణ్

కొడంగల్ ఎత్తిపోతల బదులు వాటర్‌షెడ్

ప్రభుత్వానికి భాజపా ఎంపీ లక్ష్మణ్ సూచన

సోమాజిగూడ, న్యూస్‌టుడే: కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని భాజపా ఎంపీ కె.లక్ష్మణ్ సూచించారు. ఆ ప్రాజెక్టుకు బదులు ‘ఫోర్ వాటర్ కాన్సెప్ట్’ (నాలుగు రకాలుగా నీరింకే విధానం) కింద వాటర్‌షెడ్ అభివృద్ధి చేస్తే తక్కువ ఖర్చుతో నీరందించవచ్చన్నారు. డా.చెన్నారెడ్డి స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో గ్రీన్‌ల్యాండ్స్‌లోని సెస్ ఆడిటోరియంలో ‘హనుమంతరావు ఫోర్ వాటర్ కాన్సెప్ట్ ఫర్ అల్టిమేట్ వాటర్ సెక్యూరిటీ ఇన్ తెలంగాణ’ అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. వసుంధర రాజే రాజస్థాన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆ రాష్ట్రమంతటా ఫోర్ వాటర్ కాన్సెప్ట్‌ను అమలు చేశారని తెలిపారు. సమావేశంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కె.లక్ష్మణ్. చిత్రంలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి

కేటీఆర్, హరీశ్‌రావులపై కేసు నమోదు

ఈనాడు, హైదరాబాద్: మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులతో పాటు కొన్ని యూట్యూబ్ ఛానెళ్లపై సైబరాబాద్ సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. ఇటీవల ఓ సభలో మంత్రి కొండా సురేఖతో తాను ఉన్న ఫొటోను సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారానికి వాడుకున్నారని భాజపా ఎంపీ రఘునందన్‌రావు ఫిర్యాదు చేశారు. కొన్ని యూట్యూబ్ ఛానెళ్లు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ రవీందర్‌రెడ్డి తెలిపారు.

కేయూ సెర్చ్ కమిటీ సమావేశం వాయిదా

ఈనాడు, హైదరాబాద్: విశ్వవిద్యాలయాలకు ఉపకులపతుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న సమావేశాలు గందరగోళంగా మారుతున్నాయి. మొత్తం 10 వర్సిటీల సెర్చ్ కమిటీలు నిర్వహించాల్సి ఉండగా...గతంలోనే ఆర్కిటెక్చర్, అంబేడ్కర్ వర్సిటీ సమావేశాలు వాయిదా పడ్డాయి. సచివాలయంలో గురువారం పాలమూరు, తెలుగు, ఓయూ, అంబేడ్కర్ వర్సిటీ సమావేశాలు జరగాల్సి ఉండగా అంబేడ్కర్ సమావేశం జరగలేదు. తాజాగా శుక్రవారం జరగాల్సిన కాకతీయ వర్సిటీ సెర్చ్ కమిటీ సమావేశం సైతం వాయిదా పడింది.

డీఎంహెచ్‌వోల రాష్ట్ర అధ్యక్షుడిగా పుట్ల శ్రీనివాస్

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర డీఎంహెచ్‌వోల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆ సంఘం గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది. రాష్ట్ర అధ్యక్షుడిగా పుట్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్‌లాల్ కోశాధికారిగా అప్పయ్య, నలుగురు ఉపాధ్యక్షులు, ముగ్గురు కార్యదర్శులు ఎన్నికైనట్లు తెలిపింది.



మిమ్మల్ని చూస్తూనే పిల్లలు నేర్చుకుంటారు

మీరు ఫిట్‌గా లేకపోతే మీ పిల్లలూ ఫిట్‌నెస్‌పై దృష్టిపెట్టరు. మీరు ఫోన్‌కు బానిసలుగా మారితే వాళ్లూ మీలానే తయారవుతారు. మీ కలల సాకారానికి మీరు ప్రయత్నించకపోతే వాళ్లూ తమ కలలను పక్కన పెట్టేస్తారు. మిమ్మల్ని చూస్తూనే పిల్లలు అన్నీ నేర్చుకుంటారు. వాళ్లు గొప్పగా ఎదగాలంటే.. అందుకు ఉదాహరణలుగా మీరే నిలవండి.

– డాన్ గో, హై పర్ఫార్మెన్స్ కోచ్

వచ్చే ఒలింపిక్స్‌లో స్వర్ణాలు గెలవాలి

- స్పోర్ట్స్ వర్సిటీ, అకాడమీ ఏర్పాటు చేస్తాం
- సీఎం కప్ టార్చ్ రిలే ప్రారంభం
- భారత అండర్-17 ఫుట్‌బాల్ జట్టును దత్తత తీసుకుంటాం: సీఎం రేవంత్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: దేశంలోనే అత్యుత్తమ క్రీడా కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పేద కుటుంబాల వారైనా.. క్రీడల్లో సత్తా చాటి.. డీఎస్పీ (గ్రూప్-1) ఉద్యోగాలు పొందిన బాక్సర్ నిఖత్ జరీన్, క్రికెటర్ మహ్మద్ సిరాజ్‌లను ఆదర్శంగా తీసుకుని క్రీడాకారులు రాణించాలని సూచించారు. 2028 ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు బంగారు పతకాలు సాధించాలని, అందుకు ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ నెల 21 నుంచి డిసెంబరు 5 వరకు నిర్వహించే సీఎం కప్-2024 క్రీడా పోటీల టార్చ్ రిలేను గురువారం ఎల్బీ స్టేడియం టెన్నిస్ కాంప్లెక్సులో రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న ఈ పోటీల మస్కట్, లోగో, గోడ పత్రికను ఆవిష్కరించారు. గత ఏడాది జాతీయ క్రీడల్లో పతకాలు సాధించిన క్రీడాకారులకు రూ.1.02 కోట్లు, 2023 సీఎం కప్ విజేతలకు రూ.52 లక్షల నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి సీఎం మాట్లాడారు. ‘ఇటీవల గచ్చిబౌలి స్టేడియంలో మూడు దేశాల ఫుట్‌బాల్ టోర్నీ నిర్వహించాం. అప్పుడే అఖిలభారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) అధ్యక్షుడితో మాట్లాడా. భారత అండర్-17 ఫుట్‌బాల్ జట్టును తెలంగాణ ప్రభుత్వం దత్తత తీసుకుంటుంది. ఆ జట్టుకు స్పాన్సర్‌గా వ్యవహరిస్తూ హైదరాబాద్‌లోనే అత్యున్నతస్థాయి శిక్షణ ఇస్తాం. మొన్నటి ఒలింపిక్స్‌లో 4.5 కోట్ల జనాభా ఉన్న దక్షిణ కొరియా 32 పతకాలు సాధించింది. అక్కడ 30 ఎకరాల్లో ఉన్న స్పోర్ట్స్ యూనివర్సిటీ 16 పతకాలు గెలుచుకుంది. వాళ్లలో ఉన్నది.. మనలో లేనిది పట్టుదల, ప్రయత్న లోపమే. అందుకే రాష్ట్రంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, అకాడమీలను ఏర్పాటు చేస్తాం. దక్షిణ కొరియా కోచ్‌లను హైదరాబాద్‌కు రప్పించి అత్యుత్తమ శిక్షణ ఇప్పిస్తాం. త్వరలోనే ఎల్బీ స్టేడియాన్ని ఆధునికీకరిస్తాం’ అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే వివేక్, దిల్లీలో తెలంగాణ ప్రభుత్వ అధికార ప్రతినిధి జితేందర్‌రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి, డీజీపీ జితేందర్, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి వాణీమోహన్, మాజీ మంత్రి వేణుగోపాలాచారి తదితరులు పాల్గొన్నారు.



సీఎం కప్ జ్యోతిని వెలిగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో శివసేనారెడ్డి, వాణీమోహన్, వేణుగోపాలాచారి, జితేందర్‌రెడ్డి, మహేశ్‌కుమార్ గౌడ్, అనిల్‌కుమార్ యాదవ్

సురేఖ వ్యాఖ్యలపై రాహుల్ మౌనమేల?

కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

దిల్లీ: సమంత, నాగచైతన్య, నాగార్జునలను ఉద్దేశించి మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ గురువారం ‘ఎక్స్’ వేదికగా తప్పుబట్టారు. ఈ అంశంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ నేత ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వంలోని మంత్రి.. సినీనటులపై చేసిన వ్యాఖ్యలు దిగ్భ్రాంతికి గురిచేశాయని, కాంగ్రెస్ మహిళా వ్యతిరేక ఆలోచనను సూచిస్తున్నాయని పేర్కొన్నారు.



గాంధీభవన్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న గ్రూప్–4 అభ్యర్థులు

గ్రూప్-4 ఫలితాలు ప్రకటించాలని ఆందోళన

నాంపల్లి, న్యూస్‌టుడే: గ్రూప్-4 పరీక్ష తుది ఫలితాలను తక్షణమే ప్రకటించి, ఉద్యోగ నియామకాలు చేపట్టాలని అభ్యర్థులు గురువారం నాంపల్లిలోని టీజీపీఎస్సీ, గాంధీభవన్‌ల వద్ద ఆందోళన చేపట్టారు. గ్రూప్-4 నియామకాలిచ్చి మా జీవితాల్లో వెలుగులు నింపండి.. అంటూ వందల మంది అభ్యర్థులు టీజీపీఎస్సీ కార్యాలయం వైపునకు దూసుకొచ్చారు. పోలీసు బలగాలు అడ్డుకోవడంతో గాంధీభవన్ వైపు వెళ్లారు. పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశంలో నిరసన కార్యక్రమాన్ని కొనసాగించారు. ధ్రువపత్రాల పరిశీలన పూర్తయి రెండు నెలలైనా, ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదని వారు తెలిపారు. దసరా కానుకగా తుది ఫలితాలు ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అభ్యర్థులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో పరిస్థితి సద్దుమణిగింది.

మూసీని శుద్ధి చేసి.. మంజీరాను కలుషితం చేస్తారా?

- మాజీ మంత్రి హరీశ్‌రావు

జహీరాబాద్ అర్బన్, న్యాల్‌కల్, న్యూస్‌టుడే: సుందరీకరణ పేరుతో మూసీ నదిని శుద్ధి చేసి ఉమ్మడి మెదక్ జిల్లాతోపాటు హైదరాబాద్‌కు తాగునీరందించే మంజీరా నదిని కలుషితం చేస్తామంటే భారాస చూస్తూ ఊరుకోదని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం డప్పూర్‌లో ఫార్మా సిటీకి భూసేకరణను వ్యతిరేకిస్తూ రైతులు గురువారం చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, చింతా ప్రభాకర్‌లతో కలిసి ఆయన పాల్గొన్నారు. వడ్డి, మల్గి, డప్పూర్ గ్రామాల రైతులనుద్దేశించి మాట్లాడారు. మాజీ ప్రధాని ఇందిరమ్మ పేదలకు భూములు పంచితే.. సీఎం రేవంత్‌రెడ్డి పేదల నుంచి వాటిని లాక్కుంటున్నారని మండిపడ్డారు. ఇందిరమ్మ రాజ్యమంటే పేదల ఇళ్లు కూల్చడమేనా అని ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాల్లో రైతుల పక్షాన పోరాడతామని తెలిపారు. ఈ సందర్భంగా భూములు కోల్పోతున్న పలువురు రైతులు తమ ఆవేదన చెప్పుకొని హరీశ్ ఎదుట కంటతడి పెట్టగా ఆయన ఓదార్చారు.



హరీశ్‌రావు ఎదుట కంటతడి పెడుతున్న మహిళా రైతు



EENADU Vol: 51, Iss: 55

Printed and Published by D N Prasad on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt. Ltd. Printed at Ushodaya Publications, Eenadu Press, Plot No. A-1/1, Block No. 3, Industrial Development Area, Uppal, Hyderabad, Medchal District - 500 039, Telangana State. Published at Eenadu Corporate Office, Ramoji Film City, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy District - 501 512, Telangana State. Editor: D N Prasad. Phone: 040-22232223. RNI No. 27656/75. Regd. No. HSE/1009/2024-26, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00.

Founder Ramoji Rao



ఈనాడు



హైదరాబాద్ 4-10-2024 శుక్రవారం సిటీ సంపుటి 51. సంచిక 55

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 12+12+4 www.eenadu.net


Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru




CMR BIGGEST FESTIVE DHAMAKA
సూపర్ ఫెస్టివ్ కలెక్షన్స్‌తో
ఫ్యాషన్ ట్రెండ్ సెట్ చేయండి
CMR SHOPPING MALL
The joy of life
ప్రతి ₹500ల షాపింగ్ తో లక్కీ డ్రా కూపన్
కూపన్ ఒకటి ఛాన్సులు మూడు
డైలీ డ్రా
వీక్లీ డ్రా
దసరా బంపర్ డ్రా
దీపావళి బంపర్ డ్రా
గంట గంటకు బహుమతి గెలుచుకునే అవకాశం మీ సొంతం
*colours shown may not match the actual colours, features mentioned and accessories shown may vary by model and also may not be a part of the standard equipment.
శారీస్
1 బందరులంక శారీ ₹79*
1 పర్ఫ్యూమ్ సిల్క్ శారీ ₹149*
1 బర్బీ షిఫాన్ శారీ ₹199*
1 కోరల్ సిల్క్ శారీ ₹249*
1 డిజైనర్ శారీ ₹299*
1 ఫ్యాన్సీ బుట్ట శారీ ₹333*
1 కాక్‌టెయిల్ శారీస్ ₹349*
1 మంగళ శారీస్ ₹399*
1 సాఫ్ట్ బ్రోకేడ్ శారీ ₹444*
1 కేండీ సిల్క్ శారీ ₹449*
1 సిటీ సిల్క్ శారీ ₹499*
1 మల్ మల్ కాటన్ శారీస్ ₹499*
1 సిల్క్ బ్రోకేడ్ శారీ ₹499*
1 మౌ ఫ్యాన్సీ శారీ ₹555*
2 షిఫాన్ బ్రాసో శారీస్ ₹649*
2 సవారియ శారీస్ ₹749*
2 సనా సిల్క్ శారీస్ ₹799*
2 కంచి కాటన్ శారీస్ ₹799*
1 మలబార్ ఫ్యాన్సీ శారీస్ ₹899*
2 జారా సిల్క్ శారీస్ ₹899*
1 బనారస్ ఫ్యాన్సీ శారీస్ ₹999*
2 అరవు కొట్టై శారీ ₹1199*
1 ధర్మవరం పట్టు శారీ ₹1199*
1 మహాదేవ పట్టు శారీ ₹1499*
1 ఐశ్వర్య పట్టు శారీ ₹1799*
1 సౌభాగ్య పట్టు శారీ ₹1999*
1 మహాలక్ష్మి పట్టు శారీ ₹2199*
1 మాంగళ్య పట్టు శారీస్ ₹2399*
1 అక్షయ పట్టు శారీ ₹2999*
2 ఉప్పాడ శారీస్ ₹2999*
ఉమెన్స్ వేర్
1 లేడీస్ కుర్తా ₹99*
1 లేడీస్ టీ-షర్ట్ ₹99*
1 లేడీస్ లెగ్గింగ్స్ ₹149*
1 లేడీస్ ప్రింటెడ్ కుర్తా ₹199*
1 ఫ్యాషన్ కుర్తా ₹249*
1 లేడీస్ నైటీ ₹299*
1 లేడీస్ కుర్తా/కుర్తి ₹299*
1 కాటన్ డ్రెస్ మెటీరియల్ ₹499*
1 స్ట్రెయిట్‌కట్ చుడీదార్ ₹599*
1 కాటన్ మెటీరియల్ ₹599*
1 ఫ్యాన్సీ గాగ్రా 699*
1 రెడీమేడ్ చుడీదార్స్ ₹699*
3 డ్రెస్ మెటీరియల్ కాంబో ₹899*
2 లేడీస్ వెస్టర్న్ డ్రెస్ ₹999*
కిడ్స్ వేర్
2 గర్ల్స్ లెగ్గింగ్స్ ₹179*
2 బాయ్స్/గర్ల్స్ టీ-షర్ట్స్ ₹249*
3 గర్ల్స్ హాసరీ షార్ట్స్ ₹249*
3 బాయ్స్ షార్ట్స్ ₹299*
2 బాయ్స్ షార్ట్స్ ₹349*
3 గర్ల్స్ లోయర్స్ ₹399*
3 గర్ల్స్ కాటన్/హాసరీ ఫ్రాక్స్ ₹599*
3 బాయ్స్ క్యాజువల్ షర్ట్స్ ₹549*
3 బాయ్స్ ట్రౌజర్స్/జీన్స్ ₹999*
3 గర్ల్స్ ఫ్యాన్సీ ఫ్రాక్స్ ₹999*
మెన్స్ వేర్
1 మెన్స్ టీ-షర్ట్స్ ₹249*
1 మెన్స్ క్యాజువల్ షర్ట్స్ ₹299*
1 మెన్స్ క్యాజువల్ షర్ట్స్ ₹399*
1 మెన్స్ క్యాజువల్ షర్ట్స్ ₹499*
2 మెన్స్ ట్రౌజర్స్ ₹1099*
2 మెన్స్ జీన్స్ ₹1299*
2 మెన్స్ జీన్స్ ₹1499*
U.S. POLO ASSN. SINCE 1890
On Purchase of ₹7999* Get a Duffle Bag @ ₹499*
On Purchase of ₹10999* Get a Backpack @ ₹699*
ARROW
SHOP FOR ₹6999/- AND GET A DUFFLE BAG @ ₹299
Shop for ₹14999* AND GET A TROLLEY @ ₹499*
mufti alternative clothing
GET ₹1000 OFF On purchase of 7999*
GET ₹2000 OFF On purchase of 12999*
BLACKBERRYS
On Shopping of ₹7995* Get a Duffle Bag @ ₹99*
On Shopping of ₹22995* Get a Trolley @ ₹299*
Levi's
GET ₹1000 OFF On purchase of 6999*
GET ₹2000 OFF On purchase of 11999*
KILLER this is us
GET A BACK PACK ₹99 Shop for 5999*
GET ₹2000 OFF BUY 11999*
spykar
Shop for ₹11999* Get a Boom Box @ ₹299*
Shop for ₹6999* Get a Blue Tooth Speaker @ ₹99*
B MILL BEDSHEET BUY 2 ₹299*
లక్షల్లో డిజైన్లు.. వేలల్లో వెరైటీలు..
*CONDITIONS APPLY
• చీరలు • చుడీదార్స్ • గాగ్రాస్ • ఉమెన్స్ వేర్ • మెన్స్‌వేర్ • కిడ్స్ రెడీమేడ్స్ • ఫుట్ వేర్
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ



ఈనాడు



హైదరాబాద్ 4-10-2024 శుక్రవారం సిటీ సంపుటి 51. సంచిక 55

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 12+12+4 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

1,67,33,584

రాష్ట్రంలో మొత్తం గ్రామీణ ఓటర్ల సంఖ్య




- 2019తో పోలిస్తే 30.16 లక్షల మంది పెరుగుదల
- నల్గొండ జిల్లాలో అత్యధికం.. మేడ్చల్‌లో అత్యల్పం
- పురుషుల కంటే మహిళలే ఎక్కువ మంది
- గ్రామపంచాయతీల్లోని ఓటర్ల జాబితా విడుదల

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్యే ఎక్కువగా ఉంది. శాసనసభ ఓటర్ల జాబితా ఆధారంగా రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం ఆ జాబితాను పంచాయతీరాజ్ శాఖ ద్వారా తయారు చేయించి తాజాగా గురువారం విడుదల చేసింది. రాష్ట్రంలో మొత్తం 1,67,33,584 మంది గ్రామీణ ఓటర్లు ఉండగా... వారిలో 85,28,573 మంది మహిళలు, 82,04,518 మంది పురుషులు, 493 మంది ఇతరులు ఉన్నారు. మొత్తం 538 గ్రామీణ మండలాల్లో 12,867 గ్రామపంచాయతీలు, 1,13,722 వార్డులున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. అత్యధికంగా నల్గొండ జిల్లాలో 10,42,545 మంది ఓటర్లు ఉండగా.. అత్యల్పంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 64,397 మంది మాత్రమే గ్రామీణ ఓటర్లున్నారు. 2019 జనవరిలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రాష్ట్రంలో మొత్తం 1,37,17,469 మంది గ్రామీణ ఓటర్లు ఉండగా.. ఇప్పుడు వారి సంఖ్య మరో 30,16,115 పెరిగింది. గత ఎన్నికల్లో 12,751 గ్రామపంచాయతీలు ఉండగా.. ఇప్పుడు మరో 116 పెరిగాయి. వార్డుల సంఖ్య గత ఎన్నికల్లో 1,13,380 కాగా, ఇప్పుడు వాటికి మరో 342 కలిశాయి.

జిల్లాల వారీగా ఓటర్ల జాబితా 2లో


దుర్గమ్మకు రూ.2.50 కోట్ల వజ్రాభరణాలు



విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు భక్తులు గురువారం రూ.2.50 కోట్ల విలువైన వజ్రాభరణాలు సమర్పించారు. ముంబయికి చెందిన సౌరభ్ వజ్రాల కిరీటం, హైదరాబాద్ కొండాపూర్‌కు చెందిన సూర్యకుమారి నత్తు, బొట్టు, హైదరాబాద్ నివాసి సీఎం రాజేష్ వజ్రాలు పొదిగిన సూర్య, చంద్రులను బహూకరించారు. దాతలకుటుంబాలకు సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు.

– న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి





డిజిటల్ అరెస్టు పేరిట

రూ. 10.61 కోట్లు స్వాహా!

- బెదిరించి.. భయపెట్టి.. వృద్ధ దంపతులను దోచిన సైబర్ నేరగాళ్లు
- పోలీసుల వేషధారణలో వీడియోకాల్‌లోనే విచారణ
- బ్యాంకులో దాచుకున్న సొమ్మును లాగేసుకున్న ముఠా

ఈనాడు, హైదరాబాద్: వారు వృద్ధ దంపతులు.. సంతానం లేకపోవడంతో జీవితాంతం కూడబెట్టుకున్న సంపాదనను బ్యాంకులో దాచుకున్నారు. ఆ సొమ్ముపై కన్నేసిన సైబర్ నేరగాళ్లు వారిద్దరినీ వివిధ రకాలుగా భయపెట్టి.. 'డిజిటల్ అరెస్ట్' చేశామంటూ బెదిరించి ఏకంగా రూ. 10.61 కోట్లు దోచేశారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ)లో నమోదైన ఈ కేసు వివరాలిలా ఉన్నాయి.. హైదరాబాద్‌కు చెందిన బాధిత వృద్ధుడు (73) డీహైడ్రేషన్, గ్యాస్ట్రిక్ సమస్యలతోపాటు తీవ్రమైన మధుమేహంతో బాధపడుతూ గత జూన్‌లో ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకున్నారు. ప్రతిరోజూ ఇన్సులిన్ తీసుకోవాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో జులై 8న ఉదయం ఆయనకు ఎస్‌బీఐ అధికారులమంటూ గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌చేశాడు. 'వెస్ట్ ముంబయి బాంద్రాలో గత మే 9న మీ ఆధార్ కార్డును ఉపయోగించి వేరేవ్యక్తి బ్యాంకు ఖాతా తెరిచారు. ఖాతాలోనుంచి డబ్బును ఉపసంహరించేందుకు ప్రయత్నిస్తున్నారు' అని చెప్పాడు. ముంబయిలో తనకెలాంటి బ్యాంకు ఖాతా లేదని వృద్ధుడు స్పష్టంచేయడంతో ముంబయి పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచిస్తూ ఓ నంబరు ఇచ్చాడు. దీంతో వృద్ధుడు ఆ నంబరుకు ఫోన్‌చేశారు. ఓ ప్రముఖ బ్యాంకులో సురేశ్ అగర్వాల్ అనే నేరస్థుడు తెరిచిన ఖాతా ద్వారా మనీలాండరింగ్ జరిగిందని..

...మిగతా 2లో

వినూత్నంగా పాలిటెక్నిక్ సిలబస్

- ఇంజినీరింగ్ తరహాలో మేజర్, మైనర్ కోర్సుల విధానం
- మూడో సెమిస్టర్‌లో ఆంగ్లం, లైఫ్ స్కిల్స్ ల్యాబ్.. 4వ సెమిస్టర్‌లో ఎంప్లాయబిలిటీ స్కిల్స్ ల్యాబ్
- డిప్లొమా విద్యార్థులు సీ ప్రోగ్రామింగ్ నేర్చుకోవడం తప్పనిసరి
- ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే అమలు



ఈనాడు, హైదరాబాద్: పాలిటెక్నిక్ డిప్లొమా పాఠ్య విద్యా ప్రణాళికలో పలు మార్పులను రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. ప్రపంచవ్యాప్తంగా సాంకేతికంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా సిలబస్, పరీక్షల విధానం, విద్యా నాణ్యతలో సంస్కరణలు తీసుకొచ్చింది. ప్రస్తుత విద్యా సంవత్సరం(2024-25) నుంచే ఇవన్నీ అమల్లోకి రానున్నాయి. ఇంజినీరింగ్‌లో అమలవుతున్న మేజర్, మైనర్ డిగ్రీ విధానాన్ని కొత్తగా పాలిటెక్నిక్ డిప్లొమాలో అమలు చేయనున్నారు. ఆరు నెలల క్రితమే కమిటీలను నియమించిన రాష్ట్ర సాంకేతిక, శిక్షణ మండలి(ఎస్‌బీటెట్) అధికారులు ఇటీవల కొత్త సిలబస్‌ను ఖరారు చేశారు. నిబంధనల ప్రకారం ప్రతి మూడేళ్లకు ఒకసారి సిలబస్‌ను మార్పు చేయాల్సి ఉంది. చివరిసారిగా 2021-22లో మార్చారు. ఆ క్రమంలో మూడేళ్లు ముగిసినందున నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) నిబంధనల ప్రకారం 'ఫలిత ఆధారిత విద్య'ను పరిగణనలోకి తీసుకొని ఈసారి విద్యా ప్రణాళికలో మార్పులు చేశారు. అయితే, ఈసారి పలు వినూత్న సంస్కరణలు అమలుకు నిర్ణయించారు. దీన్ని సి-24 కరిక్యులమ్‌గా పిలుస్తారు. ఇది 2024-25, 2025-26, 2026-27 విద్యా సంవత్సరాల్లో డిప్లొమా మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందిన వారికి వర్తిస్తుంది.

ఇవీ కొన్ని ముఖ్యమైన మార్పులు..



- పరిశ్రమల్లో పెరుగుతున్న అవసరాలు, విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచాలన్న ఉద్దేశంతో ఇంజినీరింగ్ తరహాలో మేజర్, మైనర్ డిప్లొమా విధానాన్ని తెచ్చారు. అంటే మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ తదితర బ్రాంచీల విద్యార్థులు ఏఐ అండ్ ఎంఎల్/ డేటా సైన్స్/ సైబర్ సెక్యూరిటీ/ రోబోటిక్స్ లాంటి వాటిని చదవొచ్చు. అప్పుడు మేజర్ డిప్లొమాగా మెకానికల్, మైనర్‌గా ఏఐ అండ్ ఎంఎల్ అని పట్టా అందిస్తారు. దీంతో వారికి ఐటీ రంగంలో ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి.
- అన్ని బ్రాంచీల విద్యార్థులకు ఆరు నెలల పారిశ్రామిక శిక్షణ తప్పనిసరి. ఒక బ్యాచ్‌కు చెందిన విద్యార్థుల్లో ఐదో సెమిస్టర్‌లో సగం, ఆరో సెమిస్టర్‌లో సగం మంది ఈ శిక్షణకు వెళ్తారు.
- విద్యార్థులు 'స్వయం' లేదా ఎన్‌పీటీఈఎల్ నుంచి ఆన్‌లైన్‌లో గరిష్ఠంగా 15 క్రెడిట్లను సాధించవచ్చు. అంటే ఆన్‌లైన్‌లో చదువుకొని పొందిన క్రెడిట్లను పరిగణనలోకి తీసుకుంటారు. అవి మైనర్ డిప్లొమా తీసుకోవడానికి ఉపయోగపడతాయి.
- 2021-22 విద్యా సంవత్సరం నుంచి డిప్లొమాలో ఓపెన్ బుక్ విధానాన్ని ప్రారంభించారు. ఇప్పటివరకు మూడు సబ్జెక్టులను అమలు చేయగా ఈ సారి నాలుగో సబ్జెక్టుకు విస్తరించారు.
- సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రసాయనశాస్త్రం సబ్జెక్టులో పర్యావరణ సైన్స్‌ను ప్రవేశపెడుతున్నారు. తొలి సెమిస్టర్‌లో జనరల్ ఇంజినీరింగ్ కెమిస్ట్రీ, రెండో సెమిస్టర్‌లో అప్లైడ్ ఇంజినీరింగ్ కెమిస్ట్రీని చేర్చారు.
- ఆంగ్లంలో రాయడం, చదవడం, మాట్లాడటంలో నైపుణ్యం పెంచడం కోసం మూడో సెమిస్టర్‌లో కమ్యూనికేషన్ అండ్ లైఫ్ స్కిల్స్ ల్యాబ్‌ను ప్రవేశపెట్టారు. నాలుగో సెమిస్టర్‌లో ఎంప్లాయబిలిటీ స్కిల్స్ ల్యాబ్‌ను ప్రవేశపెట్టారు.
- పరీక్షల్లో ప్రతి యూనిట్ నుంచీ ప్రశ్నలు ఇస్తారు.
- మార్కెట్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని అన్ని బ్రాంచీల విద్యార్థులకు సీ ప్రోగ్రామింగ్ థియరీ, ల్యాబ్‌లను తప్పనిసరి చేశారు.
- సెమిస్టర్ చివరి పరీక్షలకు ఒక్కో సబ్జెక్టులో 40 మార్కులు మాత్రమే ఉంటాయి. మిగిలిన 60 మార్కుల్లో మిడ్ 1 పరీక్షలకు 20, మిడ్ 2 పరీక్షలకు 20, ఇంటర్నల్ పరీక్షలకు 20 మార్కులు ఇస్తారు. ఇంటర్నల్‌లో స్లిప్ టెస్ట్-1కు 5 మార్కులు, స్లిప్ టెస్ట్-2కు 5 మార్కులు, అసైన్‌మెంట్లకు-5, సెమినార్/పేపర్ ప్రెజెంటేషన్/ బృంద చర్చ/క్విజ్ లాంటి వాటికి మరో 5 మార్కులు కేటాయిస్తారు.



ప్రశాంతతను కోల్పోకండి

ఈ ప్రపంచంలో బాగా విజయవంతమైన వ్యాపారవేత్తల్లో ఉమ్మడిగా ఉండే ఒక గొప్ప లక్షణం ఏంటో తెలుసా..? కఠిన పరిస్థితుల్లోనూ ప్రశాంతతను కోల్పోకపోవడం. ప్రశాంతతను కోల్పోయినప్పుడు మనం తప్పు నిర్ణయం తీసుకునే ముప్పు పెరుగుతుంది. దానివల్ల పశ్చాత్తాప పడాల్సి వస్తుంది. ఎలాంటి పరిస్థితుల్లోనైనా ప్రశాంతగా ఆలోచించండి.

– శ్వేతా కుక్రేజా, పర్సనల్ బ్రాండ్ స్ట్రాటజిస్ట్

'పురపాలక కౌన్సిల్ సభ్యులకు పింఛన్ ఇవ్వాలి'

ఈనాడు, హైదరాబాద్: పురపాలక కౌన్సిల్ సభ్యులకు రూ. 10 వేల శాశ్వత పింఛన్ అందించాలని పురపాలక కౌన్సిల్ ఫోరం రాష్ట్ర ఛైర్మన్ రామునాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు గురువారం ఆయన వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, కౌన్సిళ్ల ప్రతినిధుల సమస్యల పరిష్కారానికి గత ప్రభుత్వం హామీ ఇచ్చినా అమలుచేయలేదని, కనీసం ఈ ప్రభుత్వమైనా అమలు చేసేలా చూడాలన్నారు.

ఆతిథ్య రంగంలో దేశంలోనే తొలి జీసీసీ

హైదరాబాద్‌లో ఏర్పాటుకు మారియట్ ఆసక్తి ◆ సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబుతో సంస్థ ప్రతినిధుల భేటీ



సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబును కలిసి తమ గ్రూప్ విస్తరణ ప్రణాళికలపై చర్చించిన మారియట్ ప్రతినిధులు

ఈనాడు, హైదరాబాద్: అమెరికా ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న మారియట్ హోటల్స్ హైదరాబాద్‌లో అత్యాధునిక టెక్నాలజీతో కూడిన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్(జీసీసీ) ఏర్పాటుకు ముందుకొచ్చింది. తొలిదశలో 300 మందికి ఉద్యోగావకాశాలు కల్పించనుంది. ఈమేరకు తమ గ్రూప్ విస్తరణ ప్రణాళికలపై సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో గురువారం సంస్థ ప్రతినిధులు చర్చించారు. జీసీసీ స్థాపనకు ఆసక్తిని ప్రకటించారు. అనంతరం వారితో కలిసి మంత్రి శ్రీధర్‌బాబు సచివాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... "ఆతిథ్య రంగంలో దేశంలోనే తొలి జీసీసీని మారియట్ గ్రూప్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తుండటం సంతోషదాయకం. ఇది 2025 మార్చిలోగా అందుబాటులోకి వస్తుంది. తెలంగాణలో 10 లక్షల మంది సాఫ్ట్‌వేర్ నిపుణులు ఉండగా... ఏటా లక్షన్నర మంది ఇంజనీరింగ్ విద్యార్థులు చదువులు ముగించుకుని బయటకు వస్తున్నారు. వీరిలో అత్యధికులకు జీసీసీలలో ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోనూ టెక్ యాక్సిలరేటరీ సెంటర్లను ఏర్పాటు చేయడానికి మారియట్ ఆసక్తిగా ఉంది. త్వరలో కార్యరూపం దాల్చనున్న 'ఏఐ సిటీ'తోపాటు రాష్ట్రంలోని వివిధ నగరాల్లోనూ తమ హోటళ్లను నిర్మిస్తామంది. ఇది రాష్ట్ర ఆర్థిక, సాంకేతికాభివృద్ధికి దోహదపడుతుంది" అని ఆశాభావం వ్యక్తంచేశారు.

గ్రీన్ ఫార్మాసిటీలో కాలుష్యం అనేదే ఉండదు...

"మేం ఏర్పాటు చేయనున్న గ్రీన్ ఫార్మాసిటీ పూర్తిగా పర్యావరణ హితంగా ఉంటుంది. అక్కడ జీరో పొల్యూషన్ పరిశ్రమలు ఉంటాయి. ఒకవేళ కొద్దిపాటి రసాయన వ్యర్థాలు వెలువడినా... ఆయా కంపెనీలే సొంత ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో శుద్ధి చేసుకుంటాయి. మరో పదిరోజుల్లో అక్కడికి ఎన్ని ఫార్మా కంపెనీలు వచ్చేది తెలుస్తుంది. ఫార్మాసిటీలో ఔషధ పరిశ్రమలతోపాటు విద్యా, గృహవసతి కల్పించే సంస్థలు, ఆతిథ్య, వినోద రంగాల సంస్థలన్నీ ఉంటాయి" అని మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, మారియట్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌తోపాటు సంస్థలోని వివిధ విభాగాల ప్రతినిధులు డ్రూ పింటో, నవీన్ మంగ, జాన్ టూమీ, గ్రెగ్ మార్టెల్, ఆశిష్ కేలే, అలెగ్జాండర్ ప్యాన్, మన్సూర్ బేగ్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గంటకు 25 కి.మీ. వేగంతో వెళ్లే వాహనాలను 16 ఏళ్లు దాటినవారు నడపొచ్చు

- మోటారు వాహనాల చట్టం సవరణలో కేంద్రం ప్రతిపాదన
- స్కూల్ బస్సులు నిబంధనలను ఉల్లంఘిస్తే 2 రెట్ల జరిమానా

ఈనాడు, దిల్లీ: విద్యుత్తు వాహనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో వాటిని నడిపేందుకు 16 ఏళ్లు దాటిన వారికి వెసులుబాటు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం మోటారు వాహనాల చట్టానికి సవరణలు ప్రతిపాదించింది. 1500 వాట్స్, లేదంటే కేంద్రం ప్రకటించే సామర్థ్యంతో గంటకు 25 కిలోమీటర్లకు మించని వేగంతో నడిచే వాటిని 16 ఏళ్ల పైబడినవారు బహిరంగ స్థలాల్లో నడపడానికి వీలు కల్పించాలని నిర్ణయించింది. ద్విచక్ర వాహనాలనూ వాణిజ్య అవసరాలకు ఉపయోగించుకోవడానికి వీలు కల్పించాలని ప్రతిపాదించింది. ర్యాపిడోలాంటి సంస్థలు అందించే ద్విచక్ర వాహన వాణిజ్య సేవలను కొన్ని రాష్ట్రాలు నియంత్రిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ సవరణ తీసుకొస్తోంది. ఉబర్, ఓలా తరహాలో వీటిని కాంట్రాక్టు క్యారేజీ వాహనాల కిందికి తీసుకురావాలని ప్రతిపాదించింది. మారిన కాలమాన పరిస్థితులకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం మోటారు వాహనాల చట్టానికి మొత్తం 67 సవరణలు ప్రతిపాదించింది. వాహన ప్రమాదాలకు సంబంధించిన క్లెయిమ్‌ల సెటిల్‌మెంట్‌కు మోటారు వాహనాల ట్రైబ్యునల్‌కు గరిష్ఠంగా 12 నెలల గడువు విధించింది. విద్యాసంస్థలు ఉపయోగించే బస్సులు నిబంధనలను ఉల్లంఘిస్తే రెండు రెట్ల జరిమానాను ప్రతిపాదించింది. తొలిసారి త్రిచక్ర వాహనం అంటే ఏంటో వివరణ ఇచ్చింది. వీటికి గరిష్ఠంగా 50 కిలోమీటర్ల వేగ పరిమితిని విధించింది. వచ్చే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును తీసుకురానుంది.

జిల్లాల వారీగా ఓటర్ల జాబితా

జిల్లా	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఆదిలాబాద్	2,16,293	2,25,487	15	4,41,795
భద్రాద్రి	3,042,64	3,19,660	23	6,23,947
హనుమకొండ	1,78,824	1,87,006	2	3,65,832
జగిత్యాల	2,83,010	3,10,522	8	5,93,540
జనగామ	2,03,097	2,06,696	4	4,09,797
జయశంకర్	1,42,217	1,48,432	14	2,90,663
గద్వాల	1,91,313	1,96,875	7	3,88,195
కామారెడ్డి	3,06,560	3,29,787	15	6,36,362
కరీంనగర్	2,57,333	2,69,894	10	5,27,237
ఖమ్మం	4,13,048	4,39,807	23	8,52,878
కుమురంభీం	1,74,297	1,74,057	16	3,48,370
మహబూబాబాద్	2,71,927	2,80,240	25	5,52,192
మహబూబ్‌నగర్	2,57,529	2,58,647	7	5,16,183
మంచిర్యాల	1,87,412	1,91,505	17	3,78,934
మెదక్	2,46,815	2,65,454	9	5,12,278
మేడ్చల్	32,402	31,992	3	64,397
ములుగు	1,15,501	1,22,332	25	2,37,858
నాగర్‌కర్నూల్	3,23,705	3,22,689	13	6,46,407
నల్గొండ	5,16,713	5,25,780	52	10,42,545
నారాయణపేట	1,98,199	2,05,547	2	4,03,748
నిర్మల్	2,09,994	2,30,641	16	4,40,651
నిజామాబాద్	3,87,017	4,43,548	15	8,30,580
పెద్దపల్లి	2,01,006	2,06,697	13	4,07,716
సిరిసిల్ల	1,67,686	1,78,553	20	3,46,259
రంగారెడ్డి	3,99,404	3,95,216	33	7,94,653
సంగారెడ్డి	4,15,201	4,19,113	46	8,34,360
సిద్దిపేట	3,02,321	3,12,043	7	6,14,371
సూర్యాపేట	3,35,542	3,47,320	20	6,82,882
వికారాబాద్	3,32,038	3,39,885	17	6,71,940
వనపర్తి	1,83,382	1,84,135	4	3,67,521
వరంగల్	1,91,235	1,97,808	9	3,89,052
యాదాద్రి	2,59,233	2,61,205	3	5,20,441
మొత్తం	82,04,518	85,28,573	493	1,67,33,584



కరీంనగర్ దిగువ మానేరు జలాశయంలో చేపలు విడుదల చేస్తున్న మేడిపల్లి సత్యం, పొన్నం ప్రభాకర్, మెట్టు సాయికుమార్, ప్రియాంక, పమేలా సత్పతి తదితరులు

చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు కార్యాచరణ

- మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని కులవృత్తుల వారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున శిక్షణ ఇప్పించి సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) ఏర్పాటుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణలోని 29 వేల చెరువుల్లో 80 కోట్ల చేప పిల్లలను పెంచే కార్యక్రమాన్ని కరీంనగర్‌లో గురువారం ఆయన రాష్ట్ర మత్స్య శాఖ ఛైర్మన్ మెట్టు సాయికుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఇందులో భాగంగా కరీంనగర్‌లోని దిగువ మానేరు జలాశయంలో చేప పిల్లలను విడుదల చేసి మాట్లాడారు. గతంలో చేప పిల్లలు సరఫరా చేసిన వారికి రూ. 40 వేల కోట్ల బిల్లులు చెల్లించకపోవడంతోనే ఈ సారి పంపిణీలో జాప్యం జరిగిందని, వాటిని పూర్తిగా చెల్లించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. ఈ నెల 7వ తేదీలోగా రాష్ట్రంలోని అన్ని చెరువుల్లో చేప పిల్లలను విడుదల చేస్తామని వివరించారు. మత్స్యశాఖ సహకార సంఘాల్లో అర్హులనే సంఘ సభ్యులుగా చేర్చుకోవాలని, వివాదాలకు అవకాశం ఇవ్వొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్య శాఖ డైరెక్టర్ ప్రియాంక అల, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కరీంనగర్ మేయర్ వై.సునీల్ రావు, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఛైర్మన్ పిట్టల రవీందర్, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తదితరులు పాల్గొన్నారు.

8న హాజరవ్వాలని అజారుద్దీన్‌కు ఈడీ నోటీసు

ఈనాడు, హైదరాబాద్: నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారన్న కేసులో భారత క్రికెట్ మాజీ కెప్టెన్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) మాజీ అధ్యక్షుడు మహ్మద్ అజారుద్దీన్‌ను ఈ నెల 8న విచారణకు హాజరు కావాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైదరాబాద్ కార్యాలయం నోటీసులు జారీ చేసింది. వాస్తవానికి గురువారమే హాజరుకావాలని గతంలోనే ఈడీ నోటీసులిచ్చింది. వ్యక్తిగత కారణాలతో తాను అందుబాటులో ఉండటంలేదని, వారం రోజుల గడువు కావాలని కోరుతూ ఆయన ఈడీకి గురువారం మెయిల్ ద్వారా లేఖ రాశారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ఈడీ వెంటనే మరో నోటీసు జారీ చేస్తూ.. . వచ్చే మంగళవారం(8న) రావాలంది. అజారుద్దీన్ హెచ్‌సీఏ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఉప్పల్‌లోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో రూ.20 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఏసీబీ 3 కేసులు నమోదు చేసింది. దర్యాప్తు చేసి, అభియోగపత్రాలను దాఖలు చేసింది. వీటి ఆధారంగా నిధుల మళ్లింపు వ్యవహారంపై ఈడీ మరోకేసు నమోదు చేసి, హెచ్‌సీఏ కార్యాలయంతోపాటు పలువురి ఇళ్లలో సోదాలు నిర్వహించింది.

'డిజిటల్ అరెస్ట్' పేరిట రూ.10.61 కోట్లు స్వాహా!

(మొదటి పేజీ తరువాయి)

ఆ ఖాతా తెరిచేందుకు మీ వ్యక్తిగత సమాచారం వినియోగించారని అవతలి వ్యక్తి చెప్పాడు. అంతేకాకుండా వాట్సప్‌లో ఈడీ, ఐటీ విభాగాల పేరిట లేఖలు పంపించాడు. 'మీ ఆస్తులకు మనీలాండరింగ్‌కు సంబంధం లేదని నిరూపించుకోవాలి. హిందూ వివాహచట్టం ప్రకారం మీ భార్య పేరిట ఉన్న ఆస్తులకూ నేరంతో సంబంధం లేదని తేల్చాలి. ఒకవేళ నేరంతో మీ డబ్బుకు సంబంధం లేదని మా దర్యాప్తులో తేలితే మూడే రోజుల్లో మీడబ్బు తిరిగి ఇచ్చేస్తాం' అని పేర్కొన్నాడు. అవసరమైతే కోర్టుకు హాజరవుతామని.. ఈ విషయాన్ని మరెవరితోనూ పంచుకోబోమని వృద్ధ దంపతుల నుంచి హామీ కూడా తీసుకున్నాడు. నిబంధనలను ఉల్లంఘిస్తే 3-7 ఏళ్ల శిక్ష తప్పదని భయపెట్టాడు. నవజోత్ సిమీ అనే మహిళా ఐపీఎస్ ఈ కేసును పర్యవేక్షిస్తున్నట్లు చెప్పాడు. అప్పటినుంచి సిమీ పేరుతో ఓ మహిళ ప్రతి రెండు గంటలకోసారి మాట్లాడుతూ వృద్ధ దంపతులను భయంలోకి నెట్టేసింది. కేసులో ఇరుక్కోవద్దంటే రవి అనే ఎస్సై చెప్పినట్లు నడుచుకోవాలని సూచించింది. ఇలా వీడియోకాల్స్ ద్వారా పోలీసుల వేషధారణలో అనేకమార్లు సైబర్ నేరగాళ్లు 'విచారణ' జరిపారు. దీంతో భయపడిన వృద్ధ దంపతులు గత జులై 8 నుంచి 26 వరకు 11 విడతలుగా తమ ఖాతాల్లోని మొత్తం రూ.10,61,50,000లను నేరగాళ్లు సూచించిన ఖాతాల్లోకి ఆన్‌లైన్‌లో బదిలీచేశారు. అనంతరం సైబర్ నేరగాళ్లు మాట్లాడటం మానేశారు. నేరంతో సంబంధం లేదని తేలితే మూడు రోజుల్లోనే డబ్బును తిరిగి ఖాతాలకు బదిలీ చేస్తామని చెప్పి రోజులు గడిచినా ఎలాంటి స్పందన లేకపోవడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు ఇటీవలే టీజీసీఎస్‌బీకి ఫిర్యాదు చేశారు.

మ్యూల్ ఖాతాలకు తరలింపు..

ఈ మేరకు సిమీ, రవిలతోపాటు ఇతరులపై కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు వృద్ధ దంపతుల సొమ్మును బదిలీచేసిన బ్యాంకు ఖాతాల వివరాలు సేకరించారు. అవి చాలామేర ఉత్తరాదికి చెందినవిగా గుర్తించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఝాన్సీ, గోరఖ్‌పుర్, వారణాసిలతోపాటు బెంగళూరు, హరియాణాలోని గురుగ్రామ్; బిహార్, మణిపుర్‌లలోని పలు ప్రాంతాలకు చెందిన ఖాతాలకు ఆ సొమ్ము చేరినట్లు గుర్తించారు. అవన్నీ మ్యూల్ ఖాతాలుగా (కొందరు కమీషన్‌కు ఆశపడి సైబర్ నేరగాళ్లకు అప్పగించిన బ్యాంకు ఖాతాలు) తేలడం గమనార్హం. తొలుత ఆ ఖాతాలకు బదిలీ చేసుకున్న నేరగాళ్లు వెంటనే పలు విడతలుగా ఇతర ఖాతాలకు బదిలీ చేసినట్లు గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉంది.

సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేయండి

- ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌లపై అసెంబ్లీ కార్యదర్శి అప్పీళ్లు
- నోటీసులు జారీ చేసిన హైకోర్టు
- 24కు విచారణ వాయిదా

ఈనాడు, హైదరాబాద్: భారాస నుంచి ఎన్నికై కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలపై దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌లను తక్షణం స్పీకర్ ముందుంచాలని, ఆపైన వాటికి నిర్ణయించిన షెడ్యూలును కోర్టుకు సమర్పించాలంటూ గత నెల 9న సింగిల్ జడ్జి తీర్పును సవాలు చేస్తూ అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు వేర్వేరుగా రెండు అప్పీళ్లు దాఖలు చేశారు. 'ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌లపై నిర్ణయం తీసుకోలేదంటూ స్పీకర్‌పై కొందరు తప్పుడు ఆరోపణలు చేశారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూలు ప్రకారం స్పీకర్ ఓ విధానం ప్రకారం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కానీ ఆ అవకాశం ఇవ్వకుండానే కోర్టుకు వచ్చి పిటిషన్ దాఖలు చేశారు. అనర్హత పిటిషన్‌లకు సంబంధించి మేము పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేశాం. మా వాదనలను పరిగణనలోకి తీసుకోకుండా సింగిల్ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు. కిహోటో హోలోహాన్ సుప్రీంకోర్టు, ఎర్రబెల్లి దయాకర్‌రావు కేసులో ఇదే హైకోర్టు ఇచ్చిన తీర్పుల ప్రకారం స్పీకర్‌కు కోర్టులు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వజాలవు. ఈ ఉత్తర్వుల అమలును నిలిపివేయకపోతే సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది' అని అప్పీళ్లలో పేర్కొన్నారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస రావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఈ అప్పీళ్లపై అత్యవసరంగా విచారణ చేపట్టి, అది పూర్తయ్యే వరకు సింగిల్ జడ్జి తీర్పు అమలును నిలిపివేయాలని కోరారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. అనర్హత పిటిషన్‌లపై విచారణ షెడ్యూలును నిర్ణయించడానికి ఫైళ్లను స్పీకర్ ముందుంచాలని అసెంబ్లీ కార్యదర్శికి సింగిల్ జడ్జి ఆదేశాలు జారీ చేశారని తెలిపింది. కేశం మెగాచంద్ర సింగ్ వర్సెస్ మణిపుర్ స్పీకర్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పరిగణనలోకి తీసుకుని సింగిల్ జడ్జి ఈ ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొంది. నిర్ణీత కాలవ్యవధిలో అనర్హత పిటిషన్‌లపై నిర్ణయం తీసుకోవాలంటూ స్పీకర్‌కు ఆదేశాలిచ్చే పరిధి ఈ కోర్టుకు ఉందా.. లేదా అన్న వివాదం తేలాల్సి ఉందని పేర్కొంది. వీటిపై ఈ నెల 24న తుది విచారణ చేపడతామని, ఈలోగా ఏవైనా చర్యలు తీసుకుంటే కోర్టును ఆశ్రయించవచ్చంది. ఈ కేసులో ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కె.పి.వివేకానంద, ఏ.మహేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావులకు నోటీసులు జారీ చేస్తూ విచారణను 24కు వాయిదా వేసింది.

ఎల్‌ఆర్‘ఎస్’ ఎప్పటికో?



● మొత్తం దరఖాస్తులు 25.67 లక్షలు.. ఆమోదించినవి 70 వేలలోపే!

● పలు జిల్లాల్లో వేగం పుంజుకోని ప్రక్రియ ● కలెక్టర్ల తీరుపై రెవెన్యూశాఖ మంత్రి సీరియస్

ఈనాడు, హైదరాబాద్: లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం(ఎల్‌ఆర్‌ఎస్) అమలు వేగం పుంజుకోవడం లేదు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకుని దరఖాస్తుల పరిశీలన చేపట్టాలని, వీలైనంత త్వరగా వాటికి ఆమోదం తెలిపి నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్న ప్రజలకు సాంత్వన కలిగించాలని కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటివరకు సీఎం ఒకసారి, రెవెన్యూశాఖ మంత్రి మూడుసార్లు సమీక్షలు నిర్వహించి.. ప్రక్రియలో వేగం పెంచేందుకు చర్యలు చేపట్టారు. వాస్తవానికి 2020 ఆగస్టు, సెప్టెంబరులలోనే దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం వివిధ కారణాలతో పథకం అమలు నిలిచిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఏడాది జనవరిలో ఎల్‌ఆర్‌ఎస్‌ను తిరిగి ప్రారంభించింది. రాష్ట్రంలో 2020 ఆగస్టు 31న జారీ చేసిన జీవో 131... 2023 జులై 31న జారీ చేసిన జీవో 135లలోని నిబంధనలే ఎల్‌ఆర్‌ఎస్‌కు వర్తిస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. 2020 ఆగస్టు 26కు ముందు రిజిస్టర్ చేసిన అనుమతి లేని, చట్టవిరుద్ధమైన లేఅవుట్లు, ప్లాట్లకు మాత్రమే పథకం వర్తిస్తుందని పేర్కొంది. జిల్లాలవారీగా కలెక్టర్లు దరఖాస్తులను పరిశీలించి.. అర్హులకు క్రమబద్ధీకరణ పూర్తి చేయాలని మార్గదర్శకాలు జారీ చేసింది.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల వివరాలిలా..

ప్రభుత్వానికి అందిన దరఖాస్తులు: 25.67 లక్షలు

ప్లాట్లకు సంబంధించినవి: 25.53 లక్షలు

లేఅవుట్ల దరఖాస్తులు: 0.13 లక్షలు

ఇప్పటివరకు పరిశీలించినవి: 4.50 లక్షలు

పరిశీలన అంతంతే!

రాష్ట్రంలో ఎల్‌ఆర్‌ఎస్ కింద సుమారు 25.67 లక్షల దరఖాస్తులు అందాయి. పురపాలక సంఘాల పరిధిలో 10.54 లక్షలు, గ్రామపంచాయతీల పరిధిలో 10.76 లక్షలు రాగా.. మిగిలినవి కార్పొరేషన్ల పరిధిలో వచ్చాయి. వాటి పరిశీలన, ఆమోదం, ఫీజు వసూలుకు వివిధ దశలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రభుత్వ భూములను రక్షిస్తూ.. అర్హత ఉన్న లేఅవుట్లను క్రమబద్ధీకరించే బాధ్యతలను కలెక్టర్లకు అప్పగించింది. పురపాలక, రెవెన్యూశాఖలే కాకుండా అవసరమైతే ఇతర శాఖలకు చెందిన సిబ్బందిని కూడా నియమించుకుని దరఖాస్తుల పరిశీలన వేగంగా పూర్తి చేయాలని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. దీంతో కొన్ని జిల్లాల్లో నీటిపారుదల శాఖ అధికారులను కూడా పరిశీలన బృందాల్లో నియమించారు. అనంతరం పరిశీలన ప్రక్రియను నాలుగు దశలుగా చేపట్టారు. అయితే, గత నెలాఖరు వరకు సుమారు 4.50 లక్షల దరఖాస్తుల పరిశీలన మాత్రమే పూర్తయినట్లు తెలిసింది. వాటిలో ఆమోదించినవి 70 వేలలోపే ఉన్నట్లు సమాచారం.

ఈ జిల్లాల్లో నెమ్మదిగా..

ములుగు, జగిత్యాల, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, రాజన్న సిరిసిల్ల, వనపర్తి తదితర జిల్లాలు దరఖాస్తుల పరిశీలన, ఆమోదంలో వెనుకబడి ఉన్నట్లు ప్రభుత్వం ఇటీవల గుర్తించింది. రెండు రోజుల క్రితం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పథకం అమలుకు నాలుగేళ్లుగా లక్షల మంది ఎదురుచూస్తుండగా క్షేత్రస్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న జిల్లాల్లోనూ ఎందుకు పరిశీలన పూర్తి చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. వర్షాలు కారణమంటూ కొందరు కలెక్టర్లు చెప్పేందుకు ప్రయత్నించగా మంత్రి అంగీకరించలేదు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు గోడపత్రికల ఆవిష్కరణ

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరుగా నమోదు చేయించుకునేందుకు వీలుగా ఎన్‌ఎస్‌యూఐ రూపొందించిన సమాచారానికి సంబంధించిన గోడపత్రికలను పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ గురువారం హైదర్‌గూడలోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆవిష్కరించారు. పట్టభద్రులు ఓటర్లుగా తమ పేరును నమోదు చేసుకునేందుకు https://graduatemlcelection2025.com వెబ్‌సైట్‌లో సందర్శించాలని సూచించారు. సందేహాలకు హెల్ప్‌లైన్ 7386549222 లో సంప్రదించాలన్నారు.

నేడు నిజామాబాద్ జిల్లాకు మహేశ్‌కుమార్‌గౌడ్

పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ శుక్రవారం నిజామాబాద్ జిల్లాకు వెళ్లనున్నారు. పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సొంత జిల్లాకు వెళ్లడం ఇదే మొదటి సారి. నిజామాబాద్ పట్టణంలో జిల్లా కాంగ్రెస్ ఏర్పాటు చేసే సభలో పాల్గొంటారు.

లాసెట్ చివరి విడత సీట్ల కేటాయింపు

ఈనాడు, హైదరాబాద్: లాసెట్ చివరి విడత కౌన్సెలింగ్ సీట్లను గురువారం అభ్యర్థులకు కేటాయించారు. కన్వీనర్ కోటా కింది చివరి విడతలో 3,158 సీట్లుండగా...2,991 మందికి సీట్లు దక్కాయని ప్రవేశాల కన్వీనర్ ఆచార్య పి.రమేష్‌బాబు తెలిపారు. తొలి విడతలో 5,363 మంది సీట్లు పొందగా. ..వారిలో 3,374 మంది ఆయా కళాశాలల్లో రిపోర్టు చేశారని పేర్కొన్నారు. తాజాగా సీట్లు పొందిన వారు ఈ నెల 7వ తేదీలోపు ట్యూషన్ ఫీజు చెల్లించి ఆయా కళాశాలల్లో ధ్రువపత్రాలతో రిపోర్టు చేయాలని సూచించారు.

ఆరు నుంచి ఇంటర్ కళాశాలలకు దసరా సెలవులు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని జూనియర్ కళాశాలలకు ఈ నెల 6 నుంచి 13వ తేదీ వరకు దసరా సెలవులు ఇస్తున్నట్లు ఇంటర్‌బోర్డు కార్యదర్శి శ్రీదేవసేన ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీన కళాశాలలు పునఃప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

2030 నాటికి 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తే లక్ష్యం

● జపాన్ పర్యటనలో ఉప ముఖ్యమంత్రి భట్టి

● రోహ్మ్, పానసోనిక్ కంపెనీల ప్రతినిధులతో భేటీ

● పెట్టుబడులకు ఆహ్వానం



ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు తమ ఉత్పత్తుల గురించి వివరిస్తున్న ‘రోహ్మ్’ ప్రతినిధులు

హైదరాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణలో 2030 నాటికి 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. జపాన్ పర్యటనలో ఉన్న ఆయన అధికారులతో కలిసి గురువారం క్యోటో నగరానికి సమీపంలోని ప్రముఖ సెమీకండక్టర్ల పరిశ్రమ రోహ్మ్‌ను సందర్శించి ఆ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు. తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో భిన్న రంగాల్లో సెమీకండక్టర్ల ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు కల్పిస్తున్న అవకాశాలను దృష్టిలో ఉంచుకొని విడిగా లేదా ఉమ్మడి భాగస్వామ్యంతో తెలంగాణలో సెమీ కండక్టర్ల పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు రావాలని భట్టి కోరారు. తెలంగాణ ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు కల్పిస్తున్న సౌకర్యాలు వ్యాపార అభివృద్ధికి అనుకూలంగా ఉన్నందున రాష్ట్రంలో పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు. అనంతరం భట్టి విక్రమార్క, అధికారులు పానసోనిక్ కంపెనీ కార్యాలయాన్ని సందర్శించారు. ఆ కంపెనీ ప్రెసిడెంట్ నబి నకానీషితో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల గురించి వారికి వివరించారు. తెలంగాణలో పానాసోనిక్ కంపెనీ ఎలక్ట్రిక్ వెహికిల్స్ (ఈవీ) ప్లాంట్ ఏర్పాటు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని వారికి భట్టి హామీ ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రి భట్టి వెంట రాష్ట్ర ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇంధన శాఖ కార్యదర్శి రొనాల్డ్‌రాస్, సింగరేణి సీఎండీ ఎన్.బలరాం ఉన్నారు.

ముగిసిన విదేశీ పర్యటన.. నేడు హైదరాబాద్‌కు భట్టి

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అమెరికా, జపాన్ దేశాల పర్యటన గురువారంతో ముగిసింది. ఆయన, అధికారుల బృందం తిరిగి శుక్రవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. ఈ పర్యటనలో ప్రధానంగా అత్యాధునిక గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి విధానాలు, బొగ్గు ఉత్పత్తిలో భద్రత, ఆధునిక సాంకేతికతలు, ఆధునిక మైనింగ్ విధానంతో అధికోత్పత్తి సాధించే భారీ యంత్రాలు, వర్చువల్ రియాలిటీతో రక్షణ చర్యలు వంటివాటిని స్వయంగా పరిశీలించారు. అమెరికా, జపాన్ దేశాల్లోని వివిధ కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. తెలంగాణలో పరిశ్రమలు ఏర్పాటుచేసే వారికి రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, మౌలిక వసతులు, సౌకర్యాలు తదితర విషయాలను వివరించారు. తెలంగాణలోని అనుకూల పరిస్థితులున్నాయని, ఇక్కడ పెట్టుబడులు పెట్టాలని వారిని ఆహ్వానించారు.

వాస్తవ నష్టమెంత?

● నిగ్గు తేల్చే పనిలో వాణిజ్యపన్నుల శాఖ

● 17 సంస్థల లావాదేవీల తనిఖీకి నిర్ణయం

● డేటా తారుమారుతో రూ.1,200 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు


ఈనాడు, హైదరాబాద్: వాణిజ్య పన్ను ఎగ్గొట్టేందుకు డేటాను తారుమారు చేయడం ద్వారా ప్రభుత్వానికి ఎంత నష్టం జరిగిందో తేల్చడం సమస్యగా మారినట్లు తెలుస్తోంది. సుమారు రూ.1,200 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసిన వాణిజ్య పన్నుల శాఖ.. ఇప్పుడు వాస్తవంగా జరిగిన నష్టం ఎంతో తేల్చే పనిలో నిమగ్నమైంది. ఇందుకోసం తాజాగా 17 సంస్థల వాణిజ్య పన్నుల చెల్లింపులకు సంబంధించిన లావాదేవీలను పరిశీలించాలని నిర్ణయించింది. ఇందులో కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్టీపీసీ) కూడా ఉంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

కొన్ని వ్యాపార సంస్థలు డేటాను తారుమారు చేయడం వల్ల ప్రభుత్వానికి భారీ నష్టం వాటిల్లినట్లు సి.డాక్ సంస్థ ఇచ్చిన ఫోరెన్సిక్ ఆడిట్ ద్వారా తేలిందని, మొత్తం 75 మంది వ్యాపారులు డేటాను తారుమారు చేసి ప్రభుత్వానికి పన్ను ఎగ్గొట్టారని, ఇందుకు వాణిజ్య పన్నుల శాఖలోని కొందరు అధికారులు సహకరించారంటూ జులై నెలాఖరులో సీసీఎస్ పోలీసులకు వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ ఫిర్యాదు చేశారు. తర్వాత ఈ కేసును సీఐడీకి బదిలీ చేశారు. అయితే ఇది జరిగిన కొద్ది రోజులకే పోలీసులకు ఫిర్యాదు చేసిన సమయంలో వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్‌గా ఉన్న శ్రీదేవిని ప్రభుత్వం బదిలీ చేసింది. అయితే కేసు పురోగతిలో భాగంగా ప్రభుత్వానికి ఎలా నష్టం జరిగిందో, ఏమేరకు జరిగిందో తేల్చడానికి శ్రీదేవి ఛైర్‌పర్సన్‌గా ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గత నెలలో ఆదేశాలు జారీ చేశారు. ఏయే సంస్థలు డేటాను తారుమారు చేశాయి, ఎంతమేరకు నష్టం వాటిల్లింది, ఎలా జరిగింది తదితర వివరాలతో నివేదిక తయారు చేసే పనిని ఈ కమిటీ చేపట్టింది. ఇందులో భాగంగా వాణిజ్య పన్నుల చెల్లింపుదారుల వివరాలను తనిఖీ చేయాలని నిర్ణయించింది. గత కమిషనర్ హయాంలోనే కొందరు పన్ను చెల్లింపుదారులకు సంబంధించిన లావాదేవీలను తనిఖీ చేసి వివరాలు తెలుసుకున్నామని, ఇంకా 17 సంస్థలవి తనిఖీ చేయాల్సి ఉందని, ప్రాధాన్యంగా గుర్తించి వీరి లావాదేవీలను తనిఖీ చేయాలంటూ హైలెవల్ కమిటీ ఛైర్‌పర్సన్ వాణిజ్య పన్నుల శాఖకు కొద్ది రోజుల క్రితం లేఖ రాశారు. తనిఖీ చేయాలని సూచించిన సంస్థల్లో ఎన్టీపీసీతోపాటు ఏడుకొండలు వడ్డెర లేబర్ కాంట్రాక్ట్ కో-ఆపరేటివ్ సొసైటీ, ఆటోమొబైల్స్, ఫార్మా, ప్యాకేజింగ్ ఇండస్ట్రీస్, మినరల్స్ తదితర రంగాలకు చెందినవి ఉన్నాయి. వాస్తవంగా ప్రభుత్వానికి ఎంత నష్టం వాటిల్లిందో నిగ్గు తేల్చడానికి నిర్ణీత వ్యవధిలోగా తనిఖీ పూర్తి చేయాలని కమిటీ కోరింది. మొత్తమ్మీద డేటా తారుమారు వల్ల ప్రభుత్వ ఖజానాకు ఎంత నష్టం వాటిల్లిందని తేల్చడం వాణిజ్యపన్నుల శాఖకు సవాలుగా మారింది.

ప్రభుత్వ కార్యాలయాల్లో బతుకమ్మ సంబరాలు నిర్వహించండి

● మహిళా ఉద్యోగులకు టీజీవో మహిళా అధ్యక్షురాలు దీపారెడ్డి పిలుపు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులు బతుకమ్మ సంబరాలను నిర్వహించాలని టీజీవో మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ జి.దీపారెడ్డి పిలుపునిచ్చారు. బతుకమ్మ వేడుకలను పురస్కరించుకొని టీజీవో కార్యాలయంలో గురువారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, జిల్లా మహిళా విభాగాల ప్రతినిధులతో కలిసి ఆమె బతుకమ్మ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు విధిగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొని సంస్కృతిని, సంప్రదాయాలను చాటాలని కోరారు. ఈ నెల 8న బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తామని.. ఆ రోజు పలువురు మహిళా మంత్రులు కూడా హాజరవుతారన్నారు.



కాస్త ఆగి.. ఆనందించండి!

చాలామంది తమ జీవితాన్ని
ట్రెడ్‌మిల్‌పై పరుగులా చూస్తున్నారు.
ఆగితే పడిపోతామన్న భయంతో
నిరంతరం పరిగెడుతూనే ఉన్నారు.
ఒక లక్ష్యాన్ని అందుకోగానే..
ఇంకో పెద్ద లక్ష్యం వైపు ఆరాటంతో
ముందుకు సాగుతున్నారు. కానీ
ఆ పరుగు ఏ దిశలో.. ఎక్కడిదాకా..
సాగుతుందన్నదే అసలైన ప్రశ్న!
నిరంతరం లక్ష్యాల వెంబడి
పరిగెడుతూ.. చిన్న చిన్న విజయాలకు ఆనందించడం మానేయకండి.

– సందీప్ మాల్, వెల్‌నెస్ కోచ్

పదోన్నతులు వెంటనే కల్పించాలి

విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి టీఎంఎస్‌టీఏ వినతి

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో మోడల్ పాఠశాలలు ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నా.. ఇప్పటివరకు పదోన్నతులు కల్పించలేదని, వెంటనే ఆ ప్రక్రియ మొదలుపెట్టాలని తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్(టీఎంఎస్‌టీఏ) విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని కోరింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూతం యాకమల్లు, ప్రధాన కార్యదర్శి కె.నగేశ్, సహాధ్యక్షులు రాజుకుమార్, రవీందర్‌గౌడ్, శ్రీనివాస్, కిరణ్‌కుమార్ తదితరులు గురువారం ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఖాళీలను భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని, 010 ద్వారా వేతనాలు చెల్లించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని వారు కోరారు.

డీఎస్సీ ధ్రువపత్రాల పరిశీలన 5 లోపు పూర్తి చేయండి

కలెక్టర్లకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనను ఈ నెల 5వ తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సచివాలయంలో గురువారం ఆయన కలెక్టర్లతో వీడియా కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ మొత్తం 11,062 మంది ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 9న ఎల్‌బీ స్టేడియంలో నియామక పత్రాలు అందించేందుకు వీలుగా జిల్లాల్లో వేగంగా ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే 9,090 మందికి సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిందని విద్యాశాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు ఈవీ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నేడు, రేపు ఓ మోస్తరు వర్షాలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో శుక్ర, శనివారాల్లో పలు జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ తెలిపింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జనగామ, సిద్దిపేట, యాదాద్రి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ జిల్లాల్లో ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయంది. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్టూర్‌లో 8.4 సెం.మీ. వర్షం కురిసింది.

చాగోస్ దీవులు మారిషస్‌కు అప్పగింత

లండన్: హిందూ మహా సముద్రంలోని చాగోస్ ద్వీప సముదాయంపై సార్వభౌమాధికారాన్ని మారిషస్‌కు బ్రిటన్ అప్పగించింది. ఆ సముదాయంలోని డిగో గార్సియా దీవిని మాత్రం వచ్చే 99 ఏళ్లపాటు బ్రిటన్, అమెరికాల అధీనంలోనే కొనసాగించనుంది. ఈ మేరకు చరిత్రాత్మక ఒప్పందం కుదిరినట్లు బ్రిటన్ గురువారం ప్రకటించింది. డిగో గార్సియా దీవిలో బ్రిటన్, అమెరికాల సైనిక స్థావరం ఉంది. ఈ ఒప్పందానికి భారత్, అమెరికాల పూర్తి మద్దతు ఉందని బ్రిటన్, మారిషస్ దేశాలు ప్రకటించాయి. మారిషస్‌కు ఈశాన్య దిక్కున 2,200 కిలోమీటర్ల దూరంలో, తిరువనంతపురానికి నైరుతి దిక్కున 1,700 కి.మీ. దూరంలో చాగోస్ ద్వీప సముదాయం ఉంది. వాటిలో 60 దీవులున్నాయి. మారిషస్ ఫ్రెంచి వలస రాజ్యంగా ఉన్నప్పుడు చాగోస్ దీవులపై మారిషస్‌కే అధికారం ఉండేది. చాగోస్ దీవులపై కుదిరిన ఒప్పందాన్ని భారత్ స్వాగతించింది.

బిచ్చగత్తె తలరాత మార్చిన బౌద్ధబిక్షువు

వైద్యురాలైన మురికివాడల యువతి



శిమ్లా: మురికివాడలో పుట్టి తల్లిదండ్రులతో కలిసి బాల్యం నుంచే బిచ్చమెత్తుకోవడం, చెత్త కుండీల్లో ఆహారం ఏరుకోడానికి అలవాటుపడిన పింకీ హర్యాణ్.. ఇపుడు ఎంబీబీఎస్ పట్టా అందుకొన్న వైద్యురాలు. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఈ యువతి విజయగాథ వెనుక ఉన్నది ఓ బౌద్ధబిక్షువు, ధర్మశాలకు చెందిన స్వచ్ఛంద సంస్థ. 2004లో మక్‌లోడ్ గంజ్ వీధుల్లో బిచ్చం కోసం తిరుగుతున్న నాలుగేళ్ల పింకీ టిబెటన్ శరణార్థ సన్యాసి లాబ్‌సంగ్ జామ్‌యాంగ్ కంట పడింది. ఆమె తల్లిదండ్రులను ఒప్పించి ఆ చిన్నారిని ధర్మశాలలోని దయానంద్ పబ్లిక్ స్కూలులో ఆయన చేర్పారు. వసతిగృహంలో ఉండి చదువుకొన్న పింకీ మొదటినుంచీ విద్యాభ్యాసంలో చాలా చురుగ్గా ఉండేదని ఉమంగ్ ఫౌండేషన్ (ఎన్జీవో) అధ్యక్షుడు అజయ్ శ్రీవాస్తవ తెలిపారు. సీనియర్ సెకండరీ పరీక్ష తర్వాత నీట్ (అండర్ గ్రాడ్యుయేట్)లోనూ ఆమె ఉత్తీర్ణురాలైనట్లు వెల్లడించారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా ప్రయివేటు వైద్య కళాశాలలో ప్రవేశం లభించని పింకీ.. బ్రిటన్‌కు చెందిన టాంగ్ - లెన్ ఛారిటబుల్ ట్రస్టు సాయంతో చైనాలోని ప్రతిష్ఠాత్మక మెడికల్ కాలేజీలో సీటు దక్కించుకొంది. ఎంబీబీఎస్ పట్టాతో ఇటీవలే ధర్మశాలకు తిరిగివచ్చిన ఆమె "బాల్యం నుంచీ పేదరికం నాకో సవాలుగా నిలిచింది. మురికివాడల నేపథ్యమే నాకు పెద్ద స్ఫూర్తి. వైద్యురాలిగా పేదలకు సేవ చేస్తా" అంటోంది. భారత్‌లో ప్రాక్టీసుకు అర్హత కోసం పింకీ ఇపుడు మరో పరీక్షకు రేయింబవళ్లు చదువుతోంది.

చికిత్స కోసం వెళ్లి..
డాక్టర్ హత్య
దిల్లీలోని నీమా ఆస్పత్రిలో దారుణం

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలోని ఓ ఆస్పత్రిలో దారుణం చోటుచేసుకుంది. చికిత్స కోసం వచ్చిన ఇద్దరు మైనర్లు ఏకంగా వైద్యుడినే కాల్చి చంపారు. కాళింది కుంజ్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని జైత్‌పుర్‌లో ఉన్న నీమా ఆస్పత్రిలో గురువారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. మృతుడిని యూనాని వైద్యుడు జావెద్ అక్తర్‌గా గుర్తించారు. పోలీసులు, ఆసుపత్రి సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ఇద్దరు గుర్తుతెలియని మైనర్‌లు గాయాలతో ఆసుపత్రికి వచ్చారు. చికిత్స పూర్తయిన తర్వాత అక్తర్‌ను కలవాలంటూ వైద్యుడి క్యాబిన్‌లోకి ప్రవేశించారు. అనంతరం ఆ డాక్టర్‌పై కాల్పులు జరిపారు. కాల్పుల్లో డాక్టర్ మృతి చెందారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సీసీటీవీలో రికార్డు అయ్యాయి. హత్యానంతరం ప్రధాన నిందితుడైన ఓ యువకుడు 'మొత్తానికి 2024లో హత్య చేశాను' అంటూ తన ఫొటోతో సహా సోషల్ మీడియాలో పోస్టు పెట్టాడు. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడి కోసం గాలిస్తున్నారు. అయితే ఈ హత్య వెనక ఉన్న కారణమేమిటో తెలియరాలేదు. ఈ ఘటనను పలు వైద్య సంఘాలు ఖండించాయి.



మీ పిల్లల్ని ఎలా పెంచుతారు?

పిల్లల పెంపకంలో ప్రధానంగా రెండు రకాల విధానాలు ఉంటాయి.
1. ఏం ఆలోచించాలో పిల్లలకు నేర్పడం. ఇలా చేస్తే వారు సగటు మనుషులుగా తయారవుతారు.
2. ఎలా ఆలోచించాలో నేర్పడం. ఈ విధానం వారిని శక్తిమంతులుగా తీర్చిదిద్దుతుంది.
మరి తల్లిదండ్రులుగా ఈ రెండు విధానాల్లో దేన్ని అనుసరిస్తారో మీ ఇష్టం!
– ఎ.వేలుమణి, వ్యాపారవేత్త

రైల్వే ఉద్యోగులకు 78 రోజుల బోనస్

- 11.72 లక్షల మందికి రూ.2,028 కోట్ల చెల్లింపు
- రూ.లక్ష కోట్లతో 2 వ్యవసాయ పథకాలు
- కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలు

దిల్లీ: రైల్వే ఉద్యోగులకు 78 రోజుల వేతనాన్ని 'ఉత్పాదకతతో ముడిపడిన బోనస్' (పీఎల్‌బీ) రూపంలో చెల్లించడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన గురువారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో దీంతో సహా పలు అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు. 11.72 లక్షల మంది రైల్వే ఉద్యోగులకు రూ.2,028.57 కోట్ల మొత్తం పీఎల్‌బీగా అందనుందని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకరులకు తెలిపారు. బోనస్‌పై పరిమితి వల్ల ఒక్కో ఉద్యోగికి గరిష్ఠంగా రూ.17,951 మాత్రమే లభించనుంది.



మంత్రివర్గ నిర్ణయాలను మీడియాకు వెల్లడిస్తున్న కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

వంటనూనెల దిగుబడికి ఊతం

దేశీయ ఉత్పత్తిని పెంపొందించి, స్వయం సమృద్ధి సాధించేలా వివిధ చర్యలు చేపట్టడానికి 'వంటనూనెలు, నూనె గింజల జాతీయ మిషన్'ను రూ.10,103 కోట్లతో ఏర్పాటు చేయడానికి కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 2024-25 నుంచి 2030-31 మధ్య ఏడేళ్లపాటు ఈ మిషన్ అమల్లో ఉంటుంది. 22-23లో 3.90 కోట్ల టన్నులుగా ఉన్న నూనెగింజల ఉత్పత్తిని 30-31 నాటికి 6.97 కోట్ల టన్నులకు పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఆహారభద్రత, వ్యవసాయాభివృద్ధి

సుస్థిర వ్యవసాయం, ఆహార భద్రత సాధించడానికి 'ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, కృషోన్నతి యోజన' పథకాల కింద రూ.లక్ష కోట్లు ఖర్చు చేయడానికి క్యాబినెట్ ఆమోదించింది.

మరాఠీ, బెంగాలీ, అస్సామీ భాషలకు గుర్తింపు

బెంగాలీ, మరాఠీ, అస్సామీ, పాలీ, ప్రాకృత్‌లను ప్రాచీన భాషలుగా గుర్తిస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది.

■ చెన్నై మెట్రో రైలు రెండో దశకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రూ.63,246 కోట్లతో 119 కి.మీ.ల మేర దీనిని చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు కింద మూడు కారిడార్లుగా మొత్తం 128 స్టేషన్లు నిర్మించనున్నారు.

పూర్తి వివరాలు www.eenadu.net లో..

భార్యతో బలవంతపు లైంగిక చర్యను
అత్యాచారమంటే ఇబ్బందులే

- సుప్రీంలో కేంద్రం వాదన

దిల్లీ: భార్యతో బలవంతంగా లైంగికచర్యలో పాల్గొనడాన్ని అత్యాచారంగా పరిగణించి శిక్షిస్తే అది దాంపత్య బంధాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని కేంద్రం పేర్కొంది. దీనివల్ల వివాహ వ్యవస్థలో చాలా అవాంతరాలు తలెత్తుతాయంది. వైవాహిక అత్యాచారాలను నేరంగా పరిగణించాలని కోరుతూ దాఖలైన పలు పిటిషన్లపై ఈ మేరకు సుప్రీంకోర్టులో ప్రాథమికంగా ప్రతి ప్రమాణపత్రాన్ని కేంద్రం దాఖలు చేసింది. మైనర్ కాని భార్యతో బలవంతపు శృంగారానికి భర్త ప్రయత్నించినప్పుడు ఆమె వ్యతిరేకిస్తే విచారణ నుంచి భర్తకు రక్షణ లభిస్తుందా అనే సంక్లిష్టమైన ప్రశ్నలు ఈ కేసు విచారణలో వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై కేంద్రం తన అభిప్రాయాన్ని తెలిపింది. వైవాహిక అత్యాచారం విషయంలో ఉన్న మినహాయింపులను కొట్టివేస్తే తీవ్రమైన పరిణామాలు తలెత్తుతాయంది. భార్య సమ్మతి ఉందో లేదో రుజువు చేయడం కష్టమని, ఈ సవరణలను దుర్వినియోగంచేసే అవకాశాన్ని కొట్టివేయలేమని పేర్కొంది.

సమగ్ర దృక్పథంతో నిర్ణయించాలి

"సమాజంపై నేరుగా ప్రభావం చూపే నిబంధనలకున్న రాజ్యాంగబద్ధతపై అన్ని రాష్ట్రాలను సంప్రదించి, సమగ్ర దృక్పథంతో నిర్ణయం తీసుకోవాలి. ఎందుకంటే ఇది న్యాయ అంశం కంటే సామాజికపరమైనది. మహిళా స్వేచ్ఛ, గౌరవం, హక్కుల్ని రక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. భార్య సమ్మతిని అతిక్రమించే ప్రాథమిక హక్కు భర్తకు లేకపోయినా.. వివాహ వ్యవస్థలో అత్యాచారాన్ని నేరంగా పరిగణించడం తీవ్రమైనది, తగనిది. అందువల్ల కేవలం చట్టం దృక్పథంతో కాకుండా సమగ్రంగా ఈ అంశాన్ని చూడాలి" అని కేంద్రం అభిప్రాయపడింది.

విద్వేషానికి చిరునామా భాజపా

- హరియాణాలో ఆ సర్కారును సాగనంపండి: రాహుల్
- ముగిసిన ప్రచార గడువు.. రేపే పోలింగ్



నూహ్, మహేంద్రగఢ్: భాజపా అంటే విద్వేషానికి చిరునామా అని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ మరోసారి ఆరోపించారు. అలాంటి పార్టీని హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో గద్దె దించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. కులం, మతం, భాష ఆధారంగా ద్వేషాన్ని విస్తరింపజేయాలన్న భాజపా ప్రయత్నాలను కాంగ్రెస్ సాగనివ్వదని స్పష్టంచేశారు. శనివారం ఎన్నికలు జరగనున్న హరియాణా శాసనసభ ఎన్నికల ప్రచారానికి గడువు గురువారం సాయంత్రంతో ముగిసింది. అన్ని పార్టీలూ ప్రచారసభలతో హోరెత్తించాయి. నూహ్, మహేంద్రగఢ్‌లలో బహిరంగ సభల్లో రాహుల్ ప్రసంగించారు. 'ఇది మొహబ్బత్ (ప్రేమ), నఫ్రత్ (ద్వేషం) మధ్య సాగుతున్న పోరు. ప్రేమను విస్తరించేది కాంగ్రెస్ పార్టీ అయితే ద్వేషాన్ని వ్యాపింపజేసేది భాజపా. ఆరెస్సెస్, భాజపాలు ఎక్కడికి వెళ్లినా ద్వేషాన్ని పెంచుతాయి. ఒకచోట భాష, మరోచోట మతం, ఇంకోచోట కులం గురించి అవి మాట్లాడతాయి. భారత్‌లో విద్వేషానికి తావులేదు. ఇక్కడ ఉండేది ప్రేమ మాత్రమే. ద్వేషానికి అడ్డుకట్టపడాలి. దేశంలో ప్రేమ, సోదరభావం, ఐక్యత గెలవాలి. ద్వేషభావం వల్ల దేశం బలహీనపడుతుంది. అది విషాదాన్ని, భయాన్ని వ్యాపింపజేస్తుంది. దానికి విరుగుడు ప్రేమే. దానిద్వారానే పురోగతి సాధ్యం' అని రాహుల్ చెప్పారు. రాజ్యాంగమే అందరి హక్కుల్ని కాపాడుతుందని, అదే లేకపోతే పేదల భూములు, డబ్బు, నీళ్లు వంటివన్నీ 20-25 మంది చేతుల్లోకి వెళ్లిపోతాయని చెప్పారు.

మన దేశం నుంచే తొలిసారి
కైలాస శిఖర దర్శనం
పాత లిపులేఖ్ పాస్ వద్ద యాత్రికులకు భాగ్యం

పిథోర్‌గఢ్: పరమ శివుడి నివాసంగా భక్తులు భావించే కైలాస శిఖరం తొలిసారిగా మన దేశ భూభాగం నుంచే గురువారం యాత్రికులకు దర్శనమిచ్చింది. ఉత్తరాఖండ్‌లోని పిథోర్‌గఢ్ జిల్లాలో వ్యాస లోయ వద్ద గల పాత లిపులేఖ్ పాస్ నుంచి ఈ పవిత్ర దర్శనం ఆవిష్కృతమైంది. గతంలో కైలాస శిఖరాన్ని సందర్శించేందుకు యాత్రికులు టిబెట్ భూభాగంలోకి వెళ్లాల్సి వచ్చేది. "అయిదుగురితో కూడిన యాత్రికుల మొదటి బృందం సభ్యులు పాత లిపులేఖ్ పాస్ నుంచి కైలాస శిఖరాన్ని దర్శించారు. ఈ అపురూప ఘట్టం యాత్రికులకు అలౌకికానందాన్ని అందించింది" అని పిథోర్‌గఢ్ జిల్లా పర్యాటక అధికారి కృతి చంద్ర ఆర్య పేర్కొన్నారు. వీరంతా బుధవారం గుంజి శిబిరానికి చేరుకుని అక్కడ నుంచి 2.5 కి.మీ. పాత లిపులేఖ్ పాస్‌కు పర్వతారోహణ చేసి కైలాస శిఖరాన్ని సందర్శించారు.

ఇరాన్‌పై పరిమితంగానే దాడి

- అణు స్థావరాల జోలికి వెళ్లొద్దు
- ఇజ్రాయెల్‌కు అమెరికా షరతు

టెల్ అవీవ్: ఇరాన్‌పై ఇజ్రాయెల్ పరిమిత స్థాయిలోనే దాడి చేయనుందా.? ఆ దేశంలోని అణుస్థావరాల జోలికిపోదా..? అంటే అవుననే సమాధానాలు వస్తున్నాయి. ఇరాన్ చేసిన బాలిస్టిక్ క్షిపణుల దాడులకు ఏ స్థాయిలో స్పందించాలన్న అంశంపై ప్రస్తుతం అమెరికా, ఇజ్రాయెల్ మధ్య తీవ్రంగా చర్చలు జరుగుతున్నాయి. అణు స్థావరాలపై దాడి చేస్తామంటూ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు చేసిన ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు బైడెన్ తిరస్కరించారు. అందుకు తమ మద్దతు ఉండదని ప్రకటించారు. పరిమిత స్థాయిలోనే దాడి చేయాలని ఆయన షరతు విధించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఇరాన్‌లోని చమురు క్షేత్రాలే లక్ష్యంగా దాడులు జరగొచ్చని తెలుస్తోంది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. రాజధాని బీరుట్‌పై ఐడీఎఫ్ చేసిన వైమానిక దాడిలో ఓ అపార్ట్‌మెంట్ ధ్వంసమైంది. 9 మంది ప్రాణాలు కోల్పోయారు. హెజ్‌బొల్లా మీడియా భవనంపైనా ఐడీఎఫ్ దాడి చేసింది. గడిచిన 24 గంటల్లో లెబనాన్‌లో 28 మంది వైద్య సిబ్బంది మరణించారని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. గాజాలో హమాస్ ప్రభుత్వ అధినేత రావీ ముష్తాహాను హతమార్చినట్లు ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్) ప్రకటించింది. ముష్తాహా.. యుద్ధానికి ముందు అప్రకటిత ప్రధానిగా గాజాలోని పరిపాలన బాధ్యతలను నిర్వహించారు. మరోవైపు- ఇరాన్ హిట్‌లిస్ట్ అంటూ కొన్ని పేర్లు వైరల్ అవుతున్నాయి. అందులో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పేరు ఉన్నట్లు తెలుస్తోంది.

■ గత వారం బీరుట్‌లో జరిగిన దాడుల్లో హెజ్‌బొల్లా అధిపతి హసన్ నస్రల్లాతో పాటు ఆయన కుమార్తె కూడా మృతి చెందినట్లు వార్తా కథనాలు వెలువడ్డాయి. నస్రల్లా అల్లుడు హసన్ జాఫర్ అల్- ఖాసిర్ సైతం మరణించినట్లు సిరియన్ మానవ హక్కుల అబ్జర్వేటరీ తెలిపింది.

పూర్తి వివరాలు www.eenadu.net లో..

వాతావరణ మార్పులతో గృహహింస

బ్రిటన్ పరిశోధకుల విశ్లేషణ

దిల్లీ: వాతావరణ మార్పులతో వరదలు, తుపానుల వంటి ప్రకృతి వైపరీత్యాలు పెరిగిపోతున్న సంగతి తెలిసిందే. ఈ విపరిణామాలు మహిళలపై దౌర్జన్యాలకు, గృహహింసకు దారితీస్తున్నాయని బ్రిటన్‌లోని 'యూనివర్సిటీ కాలేజ్ లండన్' పరిశోధకులు నిర్ధారించారు. 1993-2019 మధ్యకాలంలో 156 దేశాల్లో నమోదైన గృహ హింస ఘటనలను వారు విశ్లేషించారు. పితృస్వామిక సమాజం, పురుషాధిక్య భావజాలం ఉన్న దేశాల్లో గృహహింస మరీ ఎక్కువగా ఉంది. అధిక స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) కలిగిన దేశాల్లో వాతావరణ మార్పుల కారణంగా జరిగే గృహహింస చాలా తక్కువ. వాతావరణ మార్పుల వల్ల వేడి, తేమదనం పెరగడం హింసాత్మక వైఖరిని ప్రేరేపిస్తుందని గతంలో పలు అధ్యయనాలు సూచించాయి. వాతావరణ వైపరీత్యాలు మానసిక ఒత్తిడిని, ఆహార అభద్రతను తీవ్రం చేసి గృహ హింసకు దారితీస్తాయని తాజా అధ్యయనం తేల్చింది. వరదలు, ఆ తరవాత తుపానులు, మట్టిపెళ్లలు, కొండచరియలు విరిగిపడటం గృహహింసా ఘటనలను పెంచుతున్నాయి. ఈ సమస్యను ఎదుర్కోవడానికి ప్రభుత్వాలు ఎక్కువ నిధులు కేటాయించాలనీ, మహిళల సంరక్షణ చర్యలు తీసుకోవాలనీ పరిశోధకులు సూచించారు.



ధూమపానం విరమణతో ఆయుర్దాయంలో వృద్ధి

దిల్లీ: పొగతాగే వారి సంఖ్యను 2050కల్లా అయిదు శాతం మేర అదనంగా తగ్గించగలిగితే పురుషుల ఆయుష్షు ఒక ఏడాది మేర, మహిళల ఆయుష్షు 0.2 సంవత్సరం మేర పెరుగుతుందని అంతర్జాతీయ పరిశోధకుల అధ్యయనం తెలిపింది. 2050కల్లా పురుషుల్లో ధూమపానం 21 శాతం, మహిళల్లో 4 శాతం మేర తగ్గిపోతుందని అంచనా. దీనిని మరో 5శాతం వరకు తగ్గిస్తే జీవిత కాల వ్యవధి ఇంకా వృద్ధి చెందుతుందని లాన్సెట్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం అభిప్రాయపడింది. ధూమపాన సంబంధ మరణాలూ తగ్గుతాయి. సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల అమ్మకాలను నిషేధిస్తే 2095కల్లా 185 దేశాల్లో 12 లక్షల మందికి ఊపిరితిత్తుల క్యాన్సరు సోకకుండా నివారించవచ్చు. అల్పాదాయ, మధ్యాదాయ దేశాల్లో యువ జనాభా ఎక్కువ కాబట్టి ధూమపాన నిషేధం వల్ల అక్కడి వారికి అధిక ప్రయోజనం సమకూరుతుందని అధ్యయనం విశ్లేషించింది.

పోలీసుల నిర్బంధం నుంచి
సోనమ్ వాంగ్‌చుక్ విడుదల!

- దిల్లీ హైకోర్టుకు తెలిపిన సొలిసిటర్ జనరల్
- ఆ ప్రకటనతో విభేదించిన న్యాయవాది ప్రశాంత్ భూషణ్



దిల్లీ: పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్, అతని అనుచరులు పోలీసుల నిర్బంధం నుంచి విడుదలయ్యారని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా గురువారం దిల్లీ హైకోర్టుకు తెలిపారు. ప్రజలు గుమిగూడడం, ధర్నాలు చేయడాన్ని నిషేధిస్తూ దిల్లీలోని వివిధ ప్రాంతాల్లో విధించిన ఆంక్షలను కూడా ఎత్తివేసినట్లు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్, జస్టిస్ తుషార్ రావు ధర్మాసనం ముందు వెల్లడించారు. లద్దాఖ్‌ను రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో చేర్చాలన్న డిమాండ్‌తో పాదయాత్ర చేపట్టిన సోనమ్ వాంగ్‌చుక్, మరికొంత మందిని సోమవారం రాత్రి దిల్లీ పోలీసులు నిర్బంధంలోకి తీసుకున్నారు. దీనిని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై గురువారం విచారణ సందర్భంగా హైకోర్టుకు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సమాధానమిచ్చారు. సోనమ్ వాంగ్‌చుక్ తదితరులు బుధవారం రాజ్‌ఘాట్‌ను సందర్శించారని, హోం శాఖకు ఒక విజ్ఞాపన పత్రం కూడా అందజేశారని తెలిపారు. దీంతో సామాజిక కార్యకర్త ఆజాద్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ముగిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. అయితే, మరో పిటిషనర్ తరఫున హాజరైన న్యాయవాది ప్రశాంత్ భూషణ్...సొలిసిటర్ జనరల్ ప్రకటనతో విభేదించారు. తుషార్ మెహతా ప్రకటనలో అర్ధ సత్యం మాత్రమే ఉందన్నారు. వాంగ్‌చుక్ తదితరులను ఇంకా పూర్తిగా విడుదల చేయలేదని, వారిని న్యాయస్థానం ఎదుట హాజరుపరచాలని కోరారు. సొలిసిటర్ జనరల్ దీనికి తీవ్ర అభ్యంతరం తెలిపారు. ప్రశాంత్ భూషణ్ వ్యాఖ్యలను ఖండించారు. తుషార్‌మెహతా ప్రకటన వాస్తవం కాకపోతే చర్యలు తీసుకుంటామని ధర్మాసనం హెచ్చరించింది. సోనమ్ వాంగ్‌చుక్ విడుదలపై అఫిడవిట్ దాఖలు చేయాలని దిల్లీ పోలీసులను ఆదేశించింది.

ఆంక్షల ఉపసంహరణ
సుప్రీంకోర్టుకు దిల్లీ పోలీసుల వెల్లడి

ప్రజలు గుమిగూడడం, నిరసనలపై దిల్లీలో సెప్టెంబరు 30 నుంచి అక్టోబరు 5 వరకు అమలులో ఉండేలా విధించిన ఆంక్షలను బుధవారం అర్ధరాత్రి నుంచే ఉపసంహరించుకున్నట్లు దిల్లీ పోలీస్ కమిషనర్ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా గురువారం సుప్రీంకోర్టు ధర్మాసనానికి తెలిపారు. ఈ ధర్మాసనంలో సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్‌మిశ్ర సభ్యులుగా ఉన్నారు. దసరా ఉత్సవాలు ప్రారంభమవుతున్నందున ఆ ఆంక్షలను ఎత్తివేసేలా ఆదేశించాలని న్యాయవాది మేనకా గురుస్వామి... సీజేఐ ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. ఆంక్షల ఎత్తివేత విషయాన్ని పోలీసులు అంతకుముందు దిల్లీ హైకోర్టుకు కూడా తెలిపారు. ఆంక్షల ఎత్తివేతపై ఆమ్ ఆద్మీ పార్టీ హర్షం వ్యక్తం చేసింది.

బంగ్లా రాయబారుల ఉపసంహరణ

ఢాకా: భారతదేశంలోని బంగ్లా హైకమిషనర్ ముస్తఫిజుర్ రహమాన్‌తో పాటు అయిదుగురు రాయబారులను బంగ్లాదేశ్ స్వదేశానికి తిరిగి వచ్చేయాలని ఆదేశించింది. బెల్జియం, పోర్చుగల్, ఆస్ట్రేలియాలలోని రాయబారులనూ, ఐక్యరాజ్యసమితిలో బంగ్లా శాశ్వత ప్రతినిధిని కూడా తక్షణం వెనక్కు రావలసిందిగా ఆదేశించినట్లు గురువారం ఒక సీనియర్ అధికారి తెలిపారు. బ్రిటన్‌లోని తమ హైకమిషనర్‌ను స్వదేశానికి రావలసిందిగా నాలుగు రోజుల క్రితమే ఆదేశించామన్నారు. నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనస్ ప్రధాన సలహాదారుగా ఆగస్టు 8న తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అమెరికా, రష్యా, జర్మనీ, జపాన్, యూఏఈ, సౌదీ అరేబియాలోని రాయబారులనూ, మాల్దీవుల్లోని హైకమిషనర్‌ను వెనక్కు పిలిచారు. ఇంతవరకు ఈ దేశాల్లో కొత్త వారిని నియమించలేదు.

సింగపూర్ మంత్రికి ఏడాది జైలు

సింగపూర్: భారత సంతతికి చెందిన సింగపూర్ మాజీ రవాణా మంత్రి ఎస్. ఈశ్వరన్ (62)కు హైకోర్టు గురువారం 12 నెలల జైలు శిక్ష విధించింది. మంత్రిగా ఉన్న సమయంలో మిత్రులైన ఇద్దరు వ్యాపారుల నుంచి 3,13,200 అమెరికన్ డాలర్ల విలువైన బహుమతులను తీసుకున్నందుకు ఆయనకు ఈ శిక్ష పడింది. మాజీ మంత్రి ఈశ్వరన్ పదవీ దుర్వినియోగానికి పాల్పడ్డారని జడ్జి విన్సెంట్ హూంగ్ నిర్ధారించారు. ఈశ్వరన్ విమాన టికెట్లు, విదేశీ హోటళ్లలో బస వసతితోపాటు విస్కీ, వైన్ సీసాలు, క్రీడా పోటీలకు టికెట్ల వంటి చిన్న చిన్న కానుకలకు కూడా లోబడ్డారని తేలింది.

నేపాల్‌తో కలిసి పులుల అక్రమ రవాణాకు చెక్

దిల్లీ: పులుల అక్రమ రవాణాకు తోడు జంతువుల శరీర భాగాలను చైనాకు తరలించే అంతర్జాతీయ స్మగ్లర్ల ముఠాలను అడ్డుకునేందుకు భారత్, నేపాల్ కలిసి పని చేయనున్నట్లు అధికారులు గురువారం వెల్లడించారు. ఇరు దేశాలు ఇంటర్‌పోల్ వనరులను ఇందుకు ఉపయోగించుకుంటాయని వెల్లడించారు. సీబీఐ, ఇంటర్‌పోల్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా దిల్లీలో జరుగుతున్న ప్రాంతీయ ఆర్‌ఐసీఎం సమావేశంలో ఈ సమస్యపై అధికారులు చర్చలు జరిపారు. భారత్ నుంచి నేపాల్ మీదుగా పులులు, చిరుతపులులు, ఇతర జంతువులను చైనాకు అక్రమంగా తరలిస్తున్న అంశం ఆందోళనకరమని సీబీఐ అధికార ప్రతినిధి తెలిపారు.

భారత్‌లో అధ్వానంగా మతస్వేచ్ఛ

- యూఎస్‌సీఐఆర్ఎఫ్ నివేదిక

వాషింగ్టన్: భారత్‌లో మత స్వేచ్ఛ అధ్వానంగా మారిందని, దానిని 'ప్రత్యేక ఆందోళన కలిగిన దేశం'గా గుర్తించాలని యూఎస్ ఫెడరల్ ప్రభుత్వ కమిషన్ ధ్వజమెత్తింది. భారతదేశానికి సంబంధించిన ఒక విభాగం మతపరమైన మైనారిటీలు, వారి ప్రార్థనా స్థలాలపై హింసాత్మక దాడులను ప్రేరేపించడానికి ద్వేషపూరిత ప్రసంగాలతో సహా తప్పుడు సమాచారాన్ని ఉపయోగిస్తోందని యూఎస్ కమిషన్ ఫర్ ఇంటర్నేషనల్ రిలీజియస్ ఫ్రీడం(యూఎస్‌సీఐఆర్ఎఫ్) ఒక ప్రకటనలో ఆరోపించింది. యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ భారతదేశం మతపరమైన స్వేచ్ఛను ఉల్లంఘించినందుకు 'ప్రత్యేక ఆందోళన కలిగిన' దేశంగా గుర్తించాలని యూఎస్‌సీఐఆర్ఎఫ్ తన వార్షిక నివేదికలో సిఫార్సు చేసింది. అయితే ఇప్పటివరకు స్టేట్ డిపార్ట్‌మెంట్ ఆ సిఫార్సులను ఆమోదించలేదు. ఈ నివేదికలో 2024లో ఒక సమూహంచే వ్యక్తులు ఎలా హత్యలకు, దాడులకు గురయ్యారు? మత పెద్దలను ఏకపక్షంగా ఎలా అరెస్టు చేశారు? గృహాలు, ప్రార్థనా స్థలాలను ఎలా కూల్చివేశారు? అనేవి వివరించింది. మత స్వేచ్ఛను తీవ్రంగా ఉల్లంఘించారని పేర్కొంది. భారతదేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారన్న కారణంతో గత మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని ప్రభుత్వం నాటి నుంచి యూఎస్‌సీఐఆర్ఎఫ్ సభ్యులకు దేశాన్ని సందర్శించడానికి వీసాలు నిరాకరిస్తున్నారు. యూఎస్‌సీఐఆర్ఎఫ్ నివేదిక అంతా లోపభూయిష్టం, దురుద్దేశపూరితమని భారత విదేశీ వ్యవహారాల శాఖ తీవ్రంగా ఖండించింది.

అమేఠీలో కుటుంబం కాల్చివేత

అమేఠీ: ఉత్తర్ ప్రదేశ్‌లోని అమేఠీలో ఓ ప్రభుత్వ టీచరు కుటుంబాన్ని గుర్తు తెలియని దుండగులు గురువారం కాల్చి చంపారు. రాయ్‌బరేలీకి చెందిన సునీల్ (35), ఆయన భార్య పూనం (32), కుమార్తె దృష్టి (6)తోపాటు ఏడాది వయసున్న మరో కుమార్తె ఈ కాల్పుల్లో చనిపోయారు. వీరు ఉద్యోగరీత్యా పాన్‌హౌనాలో ఉంటున్నారు. ఇటీవల ఈవ్ టీజింగ్‌కు పాల్పడిన చందన్ వర్మ అనే వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద సునీల్ కేసు పెట్టారు. ఈ నేపథ్యంలో కాల్పులు జరగడంతో ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయం కోసం మాకింకా ఎదురుచూపులే..
ప్రజాకోర్టులో తేల్చుకుంటాం: ఉద్ధవ్‌ఠాక్రే

ముంబయి: శివసేన తిరుగుబాటు ఎమ్మెల్యేల అనర్హత కోరుతూ న్యాయస్థానాల్లో పిటిషన్లు వేసినా తమకింకా ఎదురుచూపులు తప్పడం లేదని, ఇక ప్రజాకోర్టులోనే తేల్చుకోవాలని నిర్ణయించినట్లు మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్‌ఠాక్రే తెలిపారు. త్వరలో జరగనున్న మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో.. నవరాత్రి వేడుకల ప్రారంభ సందర్భంగా గురువారం తమ పార్టీ ఇతివృత్త గీతం 'మశాల్ గీత్'ను ఆయన ఆవిష్కరించారు. రాక్షస సంహారానికి 'మశాల్' (కాగడా - ఉద్ధవ్‌ఠాక్రే శివసేన ఎన్నికల గుర్తు) ఇవ్వాలని జగదాంబ (దుర్గామాత)ను కోరుతున్నట్లుగా ఈ గీతం ఉంది.

శరద్ పవార్‌ను కలిసిన భాజపా సీనియర్ నేత

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ముందు భాజపాకు చెందిన సీనియర్ నేత, మాజీ మంత్రి హర్షవర్ధన్ పాటిల్ ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్‌తో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకొంది. గురువారం దక్షిణ ముంబయిలోని శరద్ పవార్ ఇంటికి వెళ్లిన పాటిల్ మీడియాతో మాట్లాడుతూ.. తమ పార్టీలో చేరి శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయాల్సిందిగా పవార్ తనను కోరినట్లు వెల్లడించారు.

నేపాల్, భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య
త్రైపాక్షిక విద్యుత్ వాణిజ్య ఒప్పందం

కాఠ్‌మాండూ: భారత్, నేపాల్, బంగ్లాదేశ్‌ల సరిహద్దు విద్యుత్తు వాణిజ్య ఒప్పందంపై సుదీర్ఘ కాలంగా నెలకొన్న ఎదురుచూపులకు తెరపడింది. మూడు పక్షాల నడుమ కుదిరిన త్రైపాక్షిక ఒప్పందంపై ఆయా దేశాల అధికారులు గురువారం సంతకాలు చేశారు. ఒప్పందం ప్రకారం.. నేపాల్ ఏటా జూన్ 15 నుంచి నవంబరు 15 వరకు (వర్షాకాలంలో) తన మిగులు విద్యుత్తును భారత ట్రాన్స్‌మిషన్ లైన్ల సాయంతో బంగ్లాదేశ్‌కు ఎగుమతి చేస్తుంది. మొదటిదశలో నేపాల్ 40 మెగావాట్ల జలవిద్యుత్తును బంగ్లాదేశ్‌కు అందించనుంది. దీంతో ఏడాదికి రూ.77.30 కోట్ల ఆదాయం తమకు సమకూరనున్నట్లు నేపాల్ విద్యుత్తు అధికారులు వెల్లడించారు. ఢల్కేబార్ (నేపాల్) - ముజఫర్‌పుర్ (భారత్) 400 కేవీ ట్రాన్స్‌మిషన్ లైను ద్వారా బంగ్లాదేశ్‌కు ఈ విద్యుత్తును సరఫరా చేయనున్నారు. వాస్తవానికి జులై నెలాఖరులోనే ఈ ఒప్పందంపై సంతకాలు చేయాల్సి ఉండగా, బంగ్లాదేశ్‌లో రాజకీయ సంక్షోభం కారణంగా వాయిదా పడింది.



యూపీలోని లఖీంపుర్ ఖేరీ ఘటన (2021) బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం అమృత్‌సర్‌లో రైలు పట్టాలపై 2 గంటల ఆందోళనలో పాల్గొన్న రైతులు

అలంకార రూపిణి.. దివ్యదర్శిని



బల్కంపేట ఎల్లమ్మ



సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి అమ్మవారు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారు మొదటిరోజు బాలాత్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాలను వివిధ రకాల పూలు, విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. నగరంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



పూలతో జూబ్లీహిల్స్ పెద్దమ్మ ఆలయం ముస్తాబు

సీవరేజీపై జలమండలి యుద్ధం

9లో

మూసీ మూసి

- పరీవాహకంలో అక్రమాల ప్రవాహం

ఈనాడు-సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి, నాగోలు, న్యూస్‌టుడే

మూసీ పరీవాహక ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు, క్రికెట్ గ్రౌండ్లు ఏర్పాటు చేస్తున్నా బల్దియా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. మంచిరేవుల నుంచి నాగోలు వరకు 55 కిలో మీటర్ల పొడవునా మూసీ నదిని సుందరీకరణ చేపట్టాలని సర్కార్ నిర్ణయించింది. ఇందుకు కొద్ది రోజులుగా అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేశారు. దాదాపు 15 వేల నిర్మాణాలుండగా.. దాదాపు 5 వేలకుపైగా ఎటువంటి అనుమతులు లేవని గుర్తించారు. కొందరు తప్పుడు అనుమతి పత్రాలు సృష్టించినట్లు తెలిసింది. మూసీ గర్భంలోనూ 1600లకుపైగా నిర్మాణాల్లోనూ ఎక్కువగా అద్దెలకు ఇచ్చినట్లు గుర్తించారు. వీరు తమకు రెండు పడక గదుల ఇళ్లను ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.



ఫణిగిరి కాలనీలో నదిని ఆనుకొని వ్యర్థాలతో పూడ్చివేత

రూ.లక్షల్లో వసూలు : అత్తాపూర్ నుంచి కిషన్‌బాగ్, చాదర్‌ఘాట్, శంకర్‌నగర్, చైతన్యపురి, నాగోలు వరకు మూసీలోనే 3వేలకు పైగా భారీ షెడ్లనున్నాయి. నెలకు రూ. లక్ష నుంచి రూ.2 లక్షలు వసూలు చేస్తున్నారు. అత్తాపూర్ నుంచి బాపూఘాట్ వెళ్లే దారిలో మూసీని పూడ్చి మెకానిక్ షెడ్లు నిర్మించారు.

క్రికెట్ గ్రౌండ్ల నిర్మాణంతో వ్యాపారం : చైతన్యపురి దగ్గర ఒక ప్రధాన పార్టీ అనుచరుడు మూసీ నదికి ఆనుకునే ఏకంగా రెండు క్రికెట్ గ్రౌండ్లను నిర్మించారు. ఇతనికి స్థానికంగా ఉన్న ఓ ప్రజాప్రతినిధి తోడ్పాటు ఇస్తున్నారని తెలిసింది. ఎలాంటి అనుమతుల్లేకుండా నడుస్తున్న సదరు క్రికెట్ గ్రౌండ్ నదీ గర్భంలో ఉందంటూ రెవెన్యూ అధికారులు ఎరుపురంగు మార్కు వేసి వెళ్లారు. ఆట స్థలాన్ని దాటిన తరువాత స్థలాన్ని చదును చేసేందుకు కొందరు మట్టికుప్పలు పోస్తున్నారు. ఇలా మూసీ పరివాహక ప్రాంతాల్లో అక్రమంగా వివిధ రూపాల్లో రూ.కోట్లలోనే వ్యాపారం జరుగుతోంది.

ప్రారంభోత్సవాల సందడి





సికింద్రాబాద్ హాకీ గ్రౌండ్స్‌లో 'ఫ్యామిలీ డిజిటల్ కార్డు' పైలెట్ ప్రాజెక్టును, ఎల్బీ స్టేడియంలో సీఎం కప్ పోటీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. 1. డిజిటల్ కార్డు దరఖాస్తు ఫారాన్ని సీఎం ఆవిష్కరించి అధికారిణి చేతికి అందించారు. 2. మరోవైపు ఎల్బీ స్టేడియంలో బాక్సర్ నిఖత్ జరీన్‌ను రాష్ట్ర ప్రభుత్వం డీఎస్పీగా నియమించింది.

కూకట్‌పల్లి

పార్ట్‌టైం పీహెచ్‌డీ ఇంటర్వ్యూలు ప్రారంభం

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: పార్ట్‌టైం పీహెచ్‌డీకి అర్హులైన అభ్యర్థులకు గురువారం జేఎన్‌టీయూహెచ్ ప్రవేశ విభాగంలో ఇంటర్వ్యూలు ప్రారంభమయ్యాయి. జులైలో ప్రవేశ పరీక్ష నిర్వహించగా ఆగస్టులో ధ్రువపత్రాల పరిశీలన జరిగింది. 310మంది పరీక్ష రాయగా.. ధ్రువపత్రాల తనిఖీ తర్వాత ఇంటర్వ్యూలకు 253మంది అర్హత సాధించారు. పరీక్ష నిర్వహణ, ధ్రువపత్రాల పరిశీలనలో కొంత ఒత్తిడి వచ్చినప్పటికీ.. వాటిని కాదని ఖచ్చితత్వానికి పెద్దపీట వేసి అర్హుల జాబితా సిద్ధం చేశారు. మొదటిరోజు 85మందిని ఇంటర్వ్యూలకు పిలవగా 83మంది హాజరయ్యారు. పీహెచ్‌డీ ప్రవేశాల బోర్డు ఛైర్మన్ డాక్టర్ కె.విజయకుమార్‌రెడ్డి నేతృత్వంలో రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ప్రవేశాల విభాగం డైరెక్టర్ డాక్టర్ జి.కృష్ణమోహన్‌రావు పర్యవేక్షించారు. ఇంటర్వ్యూలు శుక్ర, శని, సోమవారాల్లో కొనసాగుతాయని చెప్పారు.

పోలీసుల తీరుపై న్యాయవాదుల నిరసన



విధులు బహిష్కరించి కోర్టు గేటు వద్ద బైఠాయింపు

మూసాపేట: నాంపల్లి కోర్టులో ప్రాక్టీసు చేస్తున్న అబ్దుల్ కలీం అనే న్యాయవాదిపై మాదన్నపేట పోలీసులు దాడికి దిగారని ఆరోపిస్తూ కూకట్‌పల్లి కోర్టు న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించారు. కోర్టు గేటు వద్ద బైఠాయించిన న్యాయవాదులు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలిచ్చారు. జరిగిన ఘటనపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పి.నటరాజు, సంయుక్త కార్యదర్శి బి.యాదయ్య, మహిళా ప్రతినిధి ఎ.సదాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దేవీశరన్నవరాత్రి ఉత్సవం.. అమ్మవారి వైభవం

కూకట్‌పల్లి, మూసాపేట, న్యూస్‌టుడే: నియోజకవర్గం పరిధిలో గురువారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పలు ఆలయాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. సామూహిక కుంకుమార్చన, అభిషేకం, హోమం జరిపారు.



బాలాత్రిపురసుందరీదేవి అలంకరణలో కూకట్‌పల్లిలోని చిత్తారమ్మ తల్లి



ఫతేనగర్ జవహర్‌కాలనీలోని కనకదుర్గాదేవి



సాయినగర్‌లోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవాలయంలో..



ప్రశాంత్‌నగర్ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయంలో..



మూసాపేట జాతీయ రహదారిలో నల్లపోచమ్మదేవిగా..



వనబాల దేవిగా మూసాపేట రేణుకా ఎల్లమ్మదేవి

ప్రమాదకర విద్యుత్ స్తంభం తొలగింపు



బాలానగర్, న్యూస్‌టుడే: ఇటీవల వర్షాలకు ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ సమతానగర్ రోడ్డు నంబర్-1లో పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న సిమెంట్ విద్యుత్ స్తంభాన్ని గురువారం సిబ్బంది తొలగించారు. కింది భాగంలో పగిలిపోవడంతో ఒరిగి కేవలం తీగలపై వేలాడుతూ కనిపించడంతో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కార్పొరేటర్ నర్సింహయాదవ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన విద్యుత్ అధికారులతో పాత స్తంభాన్ని తీయించి కొత్తది పునరుద్ధరించారు.

మురుగు రహితం.. ఇంకుడుగుంతలు లక్ష్యం

జలమండలి 90రోజుల ప్రణాళిక

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: ప్రజలను మురుగు వేధిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో ఇళ్ల నుంచి బయటికి రాలేని దుస్థితి. ఫిర్యాదు చేసినప్పుడు తాత్కాలిక ఉపశమనం లభిస్తున్నప్పటికీ.. శాశ్వత పరిష్కారం దొరకడం లేదు. ఫలితంగా రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఒకవైపు మురుగు.. మరోవైపు వేసవిలో తాగునీటి ఇబ్బంది.. వెరసి అధికారులకు తలనొప్పిగా మారింది. ఈ రెండు సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా జలమండలి అడుగులు ప్రారంభించింది. కూకట్‌పల్లి జలమండలి డివిజన్ పరిధిలో మొదలైన కసరత్తు గురించి తెలుసుకుందాం..



బాలానగర్ సెక్షన్‌లో ఎయిర్‌టెక్ యంత్రాలు, సిబ్బంది, పనిముట్లతో సిద్ధం



ఓల్డ్‌బోయిన్‌పల్లి హరిజనబస్తీలో పూడిక తీస్తున్న సిబ్బంది

పూడిక తీస్తారు.. తీసింది తొలగిస్తారు

కూకట్‌పల్లి జలమండలి డివిజన్ పరిధిలో మొత్తం 12 సెక్షన్లు ఉన్నాయి. 576కిలోమీటర్ల మేర భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటై ఉంది. నిత్యం ఫిర్యాదులు(ఆన్‌లైన్/ఆఫ్‌లైన్) ఒక్కో సెక్షన్ పరిధిలో 5నుంచి 10వరకు వస్తుంటాయి. రెండు రోజులకోసారి పునరావృతమయ్యేవి కూడా సెక్షన్‌లో 5కు తక్కువ కాకుండా ఉంటున్నాయి. మొత్తంగా సమస్యాత్మకంగా మారిన ప్రాంతాలు 60కి పైగా ఉన్నాయి. మరమ్మతులు చేస్తున్నా ప్రయోజనం లేకపోతుండడం.. అధికారులు ప్రేక్షకపాత్రకు పరిమితం అవుతుండడంతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇటువంటి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి మరమ్మతులు చేయడమే కాకుండా.. పూర్తిస్థాయిలో పూడిక తీసేలా జలమండలి నిర్ణయం తీసుకుంది. 2వ తేదీ నుంచి ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని డిసెంబర్ 31వ తేదీ వరకు 90రోజుల పాటు నిర్వహించేలా షెడ్యూల్ సిద్ధం చేశారు. సమస్యాత్మక ప్రాంతాలకు ప్రాధాన్యమిస్తూ.. మిగతా అన్నిచోట్ల పైప్‌లైన్ మొత్తం పూడిక తీయనున్నట్లు జీఎం ప్రభాకర్‌రావు చెప్పారు. తీసిన పూడికను తరలించే ఏర్పాట్లు కూడా చేస్తున్నామన్నారు. ఏ రోజుకారోజు ఎక్కడ, ఎంతదూరం, పూడిక తీశారు..? కాలనీ పేరుతో సహా అన్ని వివరాలను యాప్‌లో సెక్షన్ల మేనేజర్లు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ధ్వంసమైన పైపుల మార్పుకు ప్రతిపాదనలు సిద్ధం చేయడం, మ్యాన్‌హోల్ మూతలు ఎప్పటికప్పుడు మార్చడం చేయనున్నారు.

ఇంకుడుగుంతలు తప్పనిసరి

300చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏ నిర్మాణమైనా ఇంకుడుగుంత ఉండాల్సిందే. దీన్ని తప్పనిసరి చేస్తూ సిబ్బంది అవగాహన కల్పిస్తారు. వచ్చే వేసవి నాటికి ఇంకుడుగుంత ఏర్పాటు చేసుకోని వారికి ట్యాంకర్ల బుకింగ్‌పై అదనంగా వసూలు చేయాలని నిర్ణయించారు. గతేడాది ట్యాంకర్లు అధికంగా బుకింగ్ అయిన ప్రాంతాలైన మోతీనగర్ గాయత్రీనగర్, కేపీహెచ్‌బీకాలనీ 1, 2, 3, 6వ ఫేజ్‌లతోపాటు గోపాల్‌నగర్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించనున్నారు. ఇప్పటికే నోటీసులు కూడా పంపిణీ చేస్తున్నట్లు జీఎం వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

వివరాలు తెలపాల్సింది.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకే

చెట్లకొమ్మల తరలింపు



బాలానగర్, న్యూస్‌టుడే: బాలానగర్ డివిజన్ పరిధిలోని ఫిరోజ్‌గూడలో ఇటీవల కరెంటు సిబ్బంది చెట్లకొమ్మలను కొట్టేసి రోడ్డుపై, ఇళ్ల ముందు గుట్టలుగా వదిలేశారు. స్థానికంగా అపరిశుభ్రత చోటుచేసుకొని ప్రజలు ఇబ్బంది పడుతూ వస్తున్నారు. ఈ విషయాన్ని కూకట్‌పల్లి సర్కిల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ డీఈ శ్రీనివాసరావు దృష్టికి 'ఈనాడు' తీసుకెళ్లగా ఆయన సత్వరమే స్పందించి సిబ్బందితో చెట్లకొమ్మలను తొలగింపజేసి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించి సమస్యను పరిష్కరించారు.

మురుగు కుప్పల తొలగింపు



కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీ పరిధి ధర్మారెడ్డికాలనీ ఫేజ్-1లో రహదారిలోని మురుగు కుప్పలను జలమండలి సిబ్బంది తొలగించారు. ఎల్‌ఐజీ నివాసాల సముదాయాల్లో మ్యాన్‌హోళ్లను శుభ్రం చేసి వ్యర్థాలను నడి రోడ్డుపై వదిలేశారు. నివాసితులకు దుర్వాసనతోపాటు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వీటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని 'ఈనాడు' జలమండలి మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో సిబ్బందిని పంపి కుప్పలను ఎత్తివేయించారు.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు



మూసాపేట, న్యూస్‌టుడే: అల్లాపూర్ పరిధి రామారావునగర్‌లో భూగర్భ మ్యాన్‌హోల్ వ్యవస్థ ధ్వంసమైంది. రోడ్డు మలుపులో ఈ సమస్య నెలకొనడంతో వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. వారం రోజులుగా కొనసాగుతున్న దీని గురించి 'ఈనాడు' జలమండలి ప్రాంతీయ మేనేజర్ విలియమ్స్ ప్రకాష్ దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన ఆయన గురువారం మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించారు.

విభాగిని పునరుద్ధరణ

స్పందనకు వందనం

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ రోడ్డులో ధ్వంసమైన విభాగినిని జీహెచ్‌ఎంసీ అధికారులు పునరుద్ధరించారు. రైతుబజార్‌కు ముందు ట్రాఫిక్ పోలీసులు కొత్త యూటర్న్ ఏర్పాటుచేశారు. ఇందుకు విభాగినిని తవ్వించారు. ఒకవైపు విభాగిని వ్యర్థాలు రహదారిపై పడి వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి. విభాగినిపై రెయిలింగ్ పట్టుకోల్పోయి ధ్వంసమయ్యేలా ఉంది. విభాగినిని సరిచేయాలని 'ఈనాడు'లో 'విభాగిని ధ్వంసం.. పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికన వార్త ప్రచురించింది. ఏఈ సాయిప్రసాద్ స్పందించి విభాగినిని పునరుద్ధరించారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా నిర్మించండి: ఎమ్మెల్యే



విజ్ఞాన్‌పురికాలనీలో అధికారులతో పర్యవేక్షిస్తున్న కృష్ణారావు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: ప్రజలకు ఇబ్బంది లేకుండా రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను ఆదేశించారు. గురువారం కూకట్‌పల్లి డివిజన్ విజ్ఞాన్‌పురికాలనీలో వివాదాస్పదమైన రోడ్డు నిర్మాణాన్ని ఆయన కాలనీవాసులు, అధికారులతో కలిసి పర్యవేక్షించారు. వరద కాలువలోకి నీరెళ్లే ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, కూకట్‌పల్లి సర్కిల్ ఈఈ గోవర్ధన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సహాయనిధి చెక్కుల పంపిణీ

కూకట్‌పల్లి శేషాద్రినగర్‌లో గురువారం నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన 39మందికి రూ.16,94,500 విలువైన సీఎం సహాయనిధి చెక్కులు ఎమ్మెల్యే కృష్ణారావు పంపిణీ చేశారు.

చెరువుల విస్తీర్ణం, ఆక్రమణల వివరాలివ్వండి

కూకట్‌పల్లి: నియోజకవర్గం పరిధిలోని 8చెరువుల విస్తీర్ణం, ఆక్రమణల వివరాలతో కూడిన సమాచారాన్ని ఇవ్వాలని ఎమ్మెల్యే కృష్ణారావు కలెక్టర్, తహసీల్దార్లు, నీటిపారుదల శాఖ అధికారులను కోరారు. గురువారం ఈ మేరకు ఆయా కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేశారు. చెరువుల విస్తీర్ణం, ఆక్రమణల విషయంలో ఒక్కో ప్రభుత్వ విభాగం ఒక్కోరకంగా చెబుతున్నారన్నారు. కొందరు రాజకీయ లబ్ధి కోసం ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

సీఎం అవగాహనతో మాట్లాడాలి

సీఎం రేవంత్‌రెడ్డి చెరువులపై పూర్తి అవగాహనతో మాట్లాడాలని ఎమ్మెల్యే ఒక ప్రకటనలో హితవు పలికారు. సున్నం, నల్లచెరువు విషయాలను ఆయన గురువారం ఓ సమావేశంలో ప్రస్తావిస్తూ కూకట్‌పల్లిలోని ఈ రెండింటిలో భారాస నాయకులు ఆక్రమించారనడాన్ని ఖండించారు. వాస్తవాలు తెలుసుకొని అవగాహనతో మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు.

ఇళ్లల్లోని మురుగును రోడ్ల మీదకు వదిలేస్తే చర్యలు

మూసాపేట, కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: ఇళ్లల్లోని మురుగును రోడ్ల మీదకు వదిలేస్తే యజమానులపై చర్యలు తీసుకుంటామని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి అన్నారు. జలమండలి చేపట్టిన 90 రోజుల ప్రత్యేక కార్యచరణలో భాగంగా బాలాజీనగర్ డివిజన్‌లోని 15వ ఫేజ్(వెంకటరమణ కాలనీ), కేపీహెచ్‌బీ డివిజన్‌లోని నాలుగో ఫేజ్‌లో ఆయన గురువారం పర్యటించారు. బాలాజీనగర్‌లో అనేక బహుళ అంతస్తుల నిర్మాణాలకు సంబంధించిన మురుగు వీధుల్లో ప్రవహిస్తుండటంపై యజమానులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఇళ్ల యజమానులకు తాఖీదులు జారీచేయాలని అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు సైతం చేయాలని సూచించారు. ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రెండు పడకల ఇళ్ల ప్రాజెక్టును సందర్శించి మురుగు కనెక్షన్‌ను అనుసంధానం చేయాలన్నారు. జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం గృహసముదాయాలను సందర్శించారు. నాలుగో ఫేజ్‌లో మ్యాన్‌హోళ్లను శుభ్రం చేసే పనులను పరిశీలించారు. కలుషిత జలాల సమస్యపై ఎల్‌ఐజీ బ్లాక్‌ల్లో ఆరా తీశారు. జీఎం ప్రభాకర్‌రావు, డీజీఎంలు శంషీర్, శిరీష, మేనేజర్లు శ్రీకాంత్‌రెడ్డి, సలోమి తదితరులున్నారు.



జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం గృహ సముదాయం వద్ద పర్యటిస్తున్న అశోక్‌రెడ్డి

అన్నదాన పథకానికి విరాళం

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన పి.వంశీధర్‌రెడ్డి రూ.లక్ష మొత్తాన్ని ఆలయ ఏఈవో రవీంద్రబాబుకు గురువారం అందించారు. దాత, కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలను అందించారు. సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు ఉన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు



ఫతేనగర్ గౌతంనగర్ వద్ద దాండియా ఆడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు



మూసాపేట పరిధి ప్రగతినగర్‌లోని శ్రీసాయి విద్యానికేతన్ హైస్కూల్‌లో..



కూకట్‌పల్లి పాపారాయుడునగర్ ఎస్‌ఎస్‌కే ఎక్సోటికా అపార్ట్‌మెంట్స్‌లో..



విద్యార్థినుల నృత్యాలు

కూకట్‌పల్లి, మూసాపేట, న్యూస్‌టుడే: నియోజకవర్గం పరిధిలో బతుకమ్మ సంబరాలు ఘనంగా కొనసాగుతున్నాయి. గురువారం నాలుగో రోజు కూకట్‌పల్లి గ్రామంలోని హనుమాన్ దేవాలయం మైదానంలో సంబరాల్లో మహిళలు పాల్గొని ఆడి.. పాడారు. అనంతరం ఊరేగింపుగా పీఎన్‌ఎం ఉన్నత పాఠశాలకు చేరుకొని అక్కడ కొద్దిసేపు ఆట, పాటలతో అలరించి రంగధాముని చెరువులో నిమజ్జనం చేశారు.

హత్యకు గురైన మహిళ ఆచూకీ లభ్యం

మూసాపేట: లోధా టవర్స్ సమీపంలోని ఉదాసీన్ మఠానికి చెందిన ప్రదేశంలో హత్యకు గురైన మహిళ ఆచూకీని కూకట్‌పల్లి పోలీసులు కనుగొన్నారు. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలానికి చెందిన ప్రియాంక(30)గా నిర్ధారించారు. రెండేళ్లుగా భర్తతో విడిపోయి సొంతూరులోనే ఉంటున్న ఆమెకు కుమార్తె సంతానంగా తెలుస్తోంది. ఉపాధి కోసం 2నెలల క్రితం నగరానికి వచ్చిన ఆమె కేపీహెచ్‌బీకాలనీ మెట్రో స్టేషన్ కింద ఉన్న పాదచారుల మార్గంపైనే నిద్రపోయేదని సమాచారం. గుర్తు తెలియని వ్యక్తి ఆమెను ఉదాసీన్ మఠం స్థలానికి తీసుకెళ్లి హత్య చేశాడు. నిందితుడి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. రెండు రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశాలున్నట్లు అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

అత్యాచార కేసు బాధితురాలిపై తప్పుడు ప్రచారం.. కేసు

ఈనాడు, హైదరాబాద్: తనపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ యూట్యూబర్ హర్షసాయిపై నమోదైన అత్యాచార కేసులో బాధితురాలు సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తప్పుడు ఆడియోకాల్ రికార్డింగ్స్, అవాస్తవ సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. తప్పుడు ప్రచారం చేస్తున్న విజ్ఞాన్, మహీధర్, శేఖర్‌బాషాపై చర్యలు తీసుకోవాలని కోరారు.

గంజాయి రవాణా.. ఇద్దరి అరెస్టు



బాలానగర్, న్యూస్‌టుడే: గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని బాలానగర్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ డి.వేణుకుమార్ కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం మంగెల గ్రామానికి చెందిన పి.వెంకటేశ్(24), ఎం.తరుణ్(24) బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం అందింది. ఎస్సై రఘు నేతృత్వంలోని బృందం ఇందిరాగాంధీపురం వద్ద వాహనాల తనిఖీల్లో వీరిని పట్టుకున్నారు. 4.962కిలోల గంజాయి, ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి గురువారం కోర్టులో హాజరుపరిచారు.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE MEDCHAL MALKAJGIRI DISTRICT: AT KUKATPALLY
O.S.No. 44 of 2024

Between:
Krishna Balakrishna Mody & others ...Plaintiff
AND
The Tahsildar Balanagar Mandal Medchal Malkajgiri District & another ...Defendants

To
All Concerned.

Please take Notice that the above named Plaintiffs has filed above O.S. for Declaration of Legal Heirs U/s.34 & 35 of the Specific Relief Act, 1963 in respect of the Plaint Schedule Property in O.S.No. 44 of 2024 on the file of Senior Civil Judge Medchal Malkajgiri District at Kukatpally and this Hon'ble Court was pleased to order substituted service of summons by way of paper publication. Therefore you are hereby directed to appear before the Senior Civil Judge Medchal Malkajgiri District at Kukatpally on **21-10-2024 at 10.30 Am** in person or through your counsel failing which the matter will be decided in your absence as per law.

(BY ORDER OF THE COURT)
S.R.SANJEEV KUMAR
SRINIVAS YADAV, K.PAVAN KUMAR, BADRA NANAVATH, Advocates
Off: Flat No.104, 1st Floor, BRUNDAVAN, Prashanth Nagar, Beside Bharath Petrol Pump Lane, Moosarambagh, Hyderabad - 500036., **Cell.No. 9848086188.**

అడ్డంకులు తొలగిస్తేనే సాఫీగా రాకపోకలు

పాదచారుల వంతెన వ్యర్థాలు తొలా పునరుద్ధరించని రహదారి

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ-హైటెక్ సిటీ రద్దీ మార్గంలో రాకపోకలకు నిత్యం ఒక అడ్డంకి ఉంటుంది. జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులకు ప్రణాళిక లేకపోవడమే ఇందుకు కారణం. జేఎన్‌టీయూ చౌరస్తా దాటితే నాలుగు, ఏడో ఫేజ్ మధ్య ఉన్న పైవంతెన వరకు ప్రధాన రహదారి, పైవంతెనలు అందుబాటులో ఉన్నా సరైన సర్వీస్ రహదారుల్లేక ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఇన్ని రోజులు రైతుబజారు దాటి నిరుపయోగంగా పాదచారుల వంతెన సామగ్రి ఉండటంతో రాకపోకలకు ఇబ్బంది కలిగిన సంగతి తెలిసిందే. అవి తొలగినా ప్లాట్‌ఫామ్‌ల మాదిరి అడ్డంకులు అలానే ఉండిపోయాయి.



రైతుబజారు దాటిన తర్వాత ధ్వంసమైన కాలిబాట

రైతుబజారు దాటాక..

రైతుబజారు దాటిన తర్వాత పైవంతెన, సర్వీస్ రహదారి మొదలవుతాయి. పూర్తిస్థాయి సర్వీస్ రోడ్డు అందుబాటులో లేక వంతెన ఎక్కాలన్నా, సర్వీస్ రహదారిలోకి వెళ్లాలన్నా అయోమయమే. మరోవైపు పాదచారుల వంతెన సామగ్రి తొలగించిన చోట భారీగా వరద నిలుస్తోంది. అధికారులకు ఫిర్యాదులు అందినా ఫలితం లేదు. అక్రమంగా వాహనాలు నిలుపుతున్నారు. కాలిబాటలు సైతం ధ్వంసమై వరద నిలుస్తోంది.

వంతెన దిగే చోట ఇరుకు

జేఎన్‌టీయూ చౌరస్తా వైపు వంతెన దిగే చోట ఇరుకుగానే ఉంటోంది. బాక్స్ డ్రెయిన్ పనులు సగంలోనే ఆగిపోయాయి. పాదచారుల వంతెన సామగ్రి తొలగినా బాక్స్‌డ్రెయిన్ అడ్డుగా ఉంది. సర్వీస్ రహదారి సరిగా లేకపోవడంతో వంతెన దిగే వాహనాలకు సర్వీస్ రోడ్డులో నుంచి వచ్చే వాహనాలతో విఘాతం కలుగుతోంది. అధికారులు కేవలం పాదచారుల వంతెన సామగ్రి తొలగించిన ప్రదేశాన్నే చదును చేస్తే సరిపోదు. పూర్తిస్థాయి సర్వీస్ రహదారిని తయారుచేస్తేనే వాహనదారుల ప్రయాణానికి సాఫీగా ఉంటుంది. నీరు నిలవకుండా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. అడ్డదిడ్డంగా ఉన్న కాలిబాటనూ సరిచేయాల్సి ఉంది.



రహదారి అభివృద్ధి చేయాల్సిన ప్రదేశం

జీహెచ్‌ఎంసీకి లేఖ రాశాం: వెంకట్, కేపీహెచ్‌బీ ట్రాఫిక్ సీఐ

రహదారులను అభివృద్ధి చేయాలని జీహెచ్‌ఎంసీకి లేఖ రాశాం. రహదారులు పూర్తయ్యాక చర్యలు చేపడతాం.

తొందర్లోనే పునరుద్ధరిస్తాం: సాయిప్రసాద్, ఏఈ

వంతెన సామగ్రి తరలించడంతో రహదారులను పునరుద్ధరిస్తాం. సర్వీస్‌రోడ్డుకు అనుసంధానం చేసి ప్రయాణం సాఫీగా ఉండేలా తీర్చుదిద్దుతాం. కాలిబాటలు సరిచేస్తాం.





బాలాత్రిపుర సుందరీదేవిగా..

శక్తి ఆరాధనకు ప్రాధాన్యతమిస్తూ జరుపుకొనే పండుగ దసరా. తొమ్మిది రోజులు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి కొలుస్తారు. తొలిరోజున అమ్మవారు పసుపు రంగు చీరలో బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అభయహస్త ముద్రతో ఉండే అమ్మవారి అనుగ్రహం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఎనిమిదేళ్లలోపు బాలికలకు అమ్మవారి స్వరూపంగా భావించి కుమారి పూజలు చేశారు.



భక్తుల పాలిట పెద్దమ్మ

జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి దేవాలయంలో గురువారం నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని పూలతో, విద్యుద్దీపకాంతులతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈ తొమ్మిది రోజుల్లో అమ్మవారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. – న్యూస్‌టుడే, జూబ్లీహిల్స్



నేడు గజలక్ష్మీదేవిగా..

పెద్దమ్మతల్లి శుక్రవారం అష్టలక్ష్మి రూపాల్లో ఒకటైన గజలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. కమలం మీద పద్మాసన భంగిమలో కూర్చొని ఉండే అమ్మవారికి నాలుగు చేతులు ఉంటాయి. ఓ చేతిలో కమలాలను పట్టుకోగా, అభయహస్తం, వరదముద్ర చేతులు ఉంటాయి. చుట్టూ ఉన్న ఏనుగులు తొండాలతో నీటిని అమ్మవారిపైకి చల్లుతుంటాయి. గులాబీ రంగు చీరలో అమ్మవారు దర్శనమివ్వనున్నారు. శుభాలను కలిగించేందుకు అమ్మవారికి గులాబీ రంగు చీరను అలంకరిస్తారు.

5న అన్నపూర్ణాదేవి..

సకల జీవరాశికి ఆహారం ప్రసాదించే దేవత అన్నపూర్ణాదేవి. ఈ నెల 5న శనివారం ఈ అలంకరణలో అమ్మవారు దర్శనమివ్వనున్నారు. వెన్న రంగు చీర అలంకరిస్తారు. ఈ తల్లిని ధ్యానిస్తే ధనధాన్యవృద్ధి, ఐశ్వర్య సిద్ధి కలుగుతాయని ప్రతీతి. చేతిలో వెండిగిన్నెతో పూల అలంకారంతో నిర్మలమైన, చల్లని మనసుకు ప్రతీకగా అమ్మవారు నిలుస్తుంది.






6న గాయత్రీదేవి..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెద్దమ్మతల్లి 6వ తేదీన గాయత్రీదేవి అలంకారంలో నారింజ(ఆరెంజ్) రంగు చీరతో భక్తులకు దర్శనమివ్వనున్నారు. పంచముఖాలతో దర్శనమిచ్చే గాయత్రీదేవి అన్ని మంత్రాలకు మూలశక్తిగా భావిస్తారు. ముక్త, విద్రుమ, హేమ, నీల, దవళ వర్ణాలు కలిగిన అయిదు ముఖాలతో శంకు, చక్రం, గద, అంకుశం ధరించి అమ్మవారు దర్శనమిస్తారు.










రమాదేవి పబ్లిక్ స్కూల్‌లో ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం



మాట్లాడుతున్న కర్నల్ ప్రసూన్‌నాథ్, పక్కన ప్రదర్శనలు, హాజరైన క్యాడెట్లు

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించుకుంటూ ఉన్నత లక్ష్యాలను సాధించాలనే ఆకాంక్షలతో ఎన్‌సీసీ క్యాడెట్లు ముందుకు సాగాలని 1 తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కర్నల్ ప్రసూన్‌నాథ్ పేర్కొన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీ సమీపంలోని రమాదేవి పబ్లిక్ స్కూల్‌లో 1 తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరంలో గురువారం క్యాడెట్లను ఉద్దేశించి కర్నల్ ప్రసూన్‌నాథ్ ప్రసంగించారు. తమ బెటాలియన్ పరిధిలోని విద్యా సంస్థల్లోనే అత్యుత్తమ సౌకర్యాలు, అనువైన పరిస్థితులతో పాటు సువిశాల క్రీడా ప్రాంగణంతో అన్ని విధాలా అనువుగా ఉన్న రమాదేవి పబ్లిక్ స్కూల్‌లో తొలిసారి వార్షిక శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. రమాదేవి పబ్లిక్ స్కూల్ యాజమాన్యం అందిస్తున్న తోడ్పాటుతో శిక్షణ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో రమాదేవి ట్రస్ట్ ట్రస్టీ డా.రావిచంద్రశేఖర్, ప్రిన్సిపల్ ఖమర్‌సుల్తానా, ఎన్‌సీసీ 1 టీ బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు. ఆర్మీ లాన్స్ నాయక్ రోహిత్, సిపాయి రోమిత్ బృందం మిక్స్ మార్షల్ ఆర్ట్స్‌ను ఎలా ఆత్మరక్షణకు వినియోగించుకోవచ్చో ప్రదర్శించారు.

ఉన్నత స్థానాలపై గురిపెట్టాలి.. ఎన్‌సీసీ క్యాడెట్లు అత్యుత్తమ ప్రతిభతో ఏ, బీ, సీ స్థాయి ఉత్తీర్ణులైతే ఉన్నత స్థానాలకు చేరేందుకు మార్గం ఉంటుందని రమాదేవి ట్రస్ట్ ట్రస్టీ డా.రావిచంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆర్మీలో అత్యున్నత స్థానాలకు చేరిన వారిలో అనేకమంది ఎన్‌సీసీ క్యాడెట్లున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు.



నగరంలో దసరా ఉత్సవాల సందడి మొదలైంది. చాదర్‌ఘాట్‌లోని విక్టరీ ప్లే గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన 65 అడుగుల దుర్గామాత విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

ఇల్లు అద్దెకిస్తున్నారా.. జరభద్రం!

ఈనాడు, హైదరాబాద్



● ఉద్యోగులమంటూ చేరి.. అసాంఘిక కార్యకలాపాలు

అద్దె ఎంతైనా పర్వాలేదు.. అడ్వాన్స్ ఎంతైనా ఇస్తాం.. మా సొంతిల్లులా భద్రంగా చూసుకుంటాం. కిరాయికి చేరే ముందు తీయటి మాటలు చెవికి తాకగానే చాలామంది ఇప్పుడే చేరిపోమంటూ బంపర్ ఆఫర్ ఇస్తారు. గేటుకు వేలాడే టులెట్ బోర్డును ఎప్పుడెప్పుడు తీసేయాలా! అనే తొందరలో.. వచ్చిన వారి గురించి పూర్తి వివరాలు తెలుసుకోకుండానే తాళాలు అప్పగిస్తున్నారు. అకస్మాత్తుగా పోలీసుల నుంచి ఫోన్ కాల్ వచ్చినప్పుడు తాము చేసిన పొరపాటు గుర్తిస్తున్నారు. ఠాణా చుట్టూ తిరగలేక తలపట్టుకుంటున్నారు. మరికొందరు ఒక అడుగు ముందుకేసి, యజమానులను బెదిరిస్తూ నెలల తరబడి సొమ్ములు చెల్లించకుండా తిరుగుతున్నారు.

రూటు మార్చిన కేటుగాళ్లు..

నగరంలో కొందరు యజమానులు జాగ్రత్తలు పాటిస్తే.. మరికొందరు వచ్చే కిరాయి సొమ్ములు లెక్కలేసుకుంటున్నారు. దీన్ని అవకాశం చేసుకున్న కేటుగాళ్లు.. దర్జాగా ఇళ్లలోకి చేరి చీకటి కార్యకలాపాలు సాగిస్తున్నట్టు పోలీసుల దాడుల్లో బయటపడుతున్నాయి. సికింద్రాబాద్‌లో విశ్రాంత ఉద్యోగి ఇంట్లోకి భార్యభర్తలమంటూ జంట అద్దెకు చేరారు. తామిద్దరం పోలీసు శాఖలో పనిచేస్తున్నట్టు నమ్మించారు. కొద్దిరోజుల తరువాత రాత్రివేళల్లో కొత్త వ్యక్తుల రాకపోకలు పెరగటంతో యజమాని నిలదీశాడు. పోలీసుల తనిఖీ సమయంలో అసలు విషయం బయటపడింది. వారి వద్ద స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లలో వేలాది మంది యువతుల ఫొటోలు బయటపడ్డాయి. గచ్చిబౌలిలోని ఖరీదైన అపార్ట్‌మెంట్‌కి ఐటీ ఉద్యోగినంటూ చేరాడు. ఉప్పల్‌లో సొంతిల్లున్నా.. కార్యాలయానికి దగ్గర అనే ఉద్దేశంతో ఫ్లాట్ తీసుకున్నట్టు నమ్మించాడు. వారాంతపు సమయంలో మిత్రులను రప్పించి డ్రగ్స్ తీసుకుంటూ రేవ్ పార్టీలు ఏర్పాటు చేస్తున్నట్టు గుర్తించి ఖాళీ చేయించినట్లు సమాచారం.

బాబోయ్ ఇప్పుడేం చేద్దాం.. ● దిల్లీ, పుణె పోలీసుల కన్నుగప్పిన కరడుగట్టిన ఉగ్రవాది రిజ్వాన్ సైదాబాద్‌లోని అపార్ట్‌మెంట్‌లో ఆరు నెలలు మకాం వేశాడు. ఫ్లాట్ అద్దెకిచ్చే సమయంలో నిర్వాహకులు అతడి నుంచి ఆధారాలు తీసుకోలేదు. కిరాయి కేవలం రూ.5 వేలే కదా అని ఒప్పంద పత్రం రాయించుకోలేదు. ● టోలిచౌకిలో ఒక ఇంట్లో అద్దెకు దిగిన ఇద్దరు మహిళలు.. రెండు నెలల కిరాయి అడ్వాన్స్ చెల్లించి ఏడాదిపాటు ఇంటి యజమానికి నరకం చూపారు. ఖాళీ చేయమంటే తమ పట్ల అసభ్యంగా ప్రవర్తించారంటూ పోలీసులకు ఫిర్యాదు చేస్తామంటూ బెదిరించారు. ● మాదాపూర్‌లో ఒక విశ్రాంత ఉద్యోగి తన ఫ్లాట్‌ను అద్దెకిచ్చారు. కుటుంబంతో ఉన్నట్టు చెబుతూనే అతడు ఆ ఇంటిని వ్యభిచార గృహంగా మార్చాడు. పోలీసుల తనిఖీల్లో బండారం బయటపడటంతో ఇంటి యజమానికి పోలీసులు నోటీసులు జారీ చేశారు.

'ధన్వంతరి బాధితులకు న్యాయం చేయాలి'

కాచిగూడ, న్యూస్‌టుడే: ధన్వతరి బాధితులను మోసగించాలని చేసే ప్రయత్నాలను ఇకనైనా మానుకోవాలని ధన్వంతరి ఫౌండేషన్ బాధితుల ఫోరం కన్వీనర్ గిరిప్రసాద్‌శర్మ హెచ్చరించారు. ఆకర్షణీయమైన పెట్టుబడుల పేరిట అమాయకులను రూ. 1500 కోట్లకు మోసగించిన నిందితులు కోర్టు బయట కేసును పరిష్కరించుకుందామంటూ బాధితుల సెల్‌ఫోన్లకు సంక్షిప్త సందేశాలు పంపుతున్నారని ఆరోపించారు. గురువారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో బాధితులతో కలిసి ఆయన మాట్లాడారు. ధన్వంతరి బాధితులు అంబర్‌పేటలోని ఫౌండేషన్ కార్యాలయానికి వెళ్లగా.. సీసీఎస్ పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారన్నారు. ఫౌండేషన్ ఆస్తులు విక్రయించి బాధితులకు న్యాయం చేయకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

కేటీఆర్ క్షమాపణ చెప్పాలి: కాంగ్రెస్

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: మంత్రి కొండా సురేఖపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి కేటీఆర్ తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం బషీర్‌బాగ్ బాబూ జగ్జీవన్‌రాం చౌరస్తాలో కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో మంత్రి సీతక్కపై నోరుపారేసుకున్న కేటీఆర్ తాజాగా మంత్రి కొండా సురేఖపై సామాజిక మాధ్యమాల్లో అనుచితంగా వ్యవహరించడం.. మహిళలపై ఆయన వైఖరి స్పష్టమవుతుందన్నారు. పార్టీ నేతలు షకీల్, రాహుల్‌సింగ్, షహీద్ ఖాన్, పింకీ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనలో చెకోలేకర్ శ్రీనివాస్, కాంగ్రెస్ నేతలు

ఉస్మానియాలో చిన్నారుల చర్మవ్యాధుల చికిత్స శిక్షణ కేంద్రం

ఉస్మానియా ఆసుపత్రి, సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రిలో చిన్నారుల చర్మవ్యాధుల చికిత్స శిక్షణ కేంద్రాన్ని ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.నరేంద్ర కుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రాకేశ్ సహాయ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలోనే తొలిసారిగా శిక్షణ కేంద్రాన్ని ఉస్మానియా ఆసుపత్రిలో ఏర్పాటు చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. కేంద్రం ఏర్పాటుకు కృషి చేసిన ఓఎంసీ డెర్మటాలజీ విభాగాధిపతి డా.భూపేష్ కుమార్‌ను అభినందించారు. శిక్షణ కేంద్రం ద్వారా చిన్నారుల్లో వచ్చే చర్మ వ్యాధులను సకాలంలో గుర్తించి.. చికిత్స అందించేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఉస్మానియా ఆర్‌ఎంఓలు డా.జయకృష్ణ, డా.రఫీ, డా.కవిత, డా.రాజీవ్‌సింగ్, డా.అరుణ, డా.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న డా.నరేంద్ర కుమార్, రాకేశ్ సహాయ్, డా.భూపేష్ కుమార్


సంపాదనలో కొంత సమాజానికి కేటాయించాలి



డా.జితేందర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తెలంగాణ అగర్వాల్ సమాజ్ ప్రతినిధులు

శంషాబాద్, న్యూస్‌టుడే: సంపన్న వర్గాలు తమ సంపాదనలో కొంత సమాజాభివృద్ధి కోసం కేటాయించాలని రాష్ట్ర డీజీపీ డా.జితేందర్ పేర్కొన్నారు. గురువారం రాత్రి శంషాబాద్‌లో తెలంగాణ అగర్వాల్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు మనీష్ అగర్వాల్ అధ్యక్షతన నిర్వహించిన అగ్రసేన్ మహారాజ్ 5148వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మనీష్ అగర్వాల్ మాట్లాడుతూ.. 1998 నుంచి లాభాపేక్ష లేకుండా సామాజిక సేవలను విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి రవిగుప్తా, ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా, మహిళాభద్రతా విభాగం డీజీపీ శిఖాగోయల్ తదితరులు పాల్గొన్నారు.

బజాజ్ ఎలక్ట్రానిక్స్‌లో కొనుగోలుపై భారీ నజరానా



ఆఫర్ల కార్డులను ప్రదర్శిస్తున్న మాళ్విక శర్మ, సీరత్ కపూర్

సోమాజిగూడ, న్యూస్‌టుడే: బజాజ్ ఎలక్ట్రానిక్స్ కొనుగోళ్లపై భారీ నజరానా ప్రకటించింది. దేశంలోనే అతిపెద్ద ఫెస్టివల్ ఆఫర్‌గా రూ.కోటి నగదు బహుమతులు, 30 ఆల్టో కే10 కార్లు ఇస్తున్నట్లు వెల్లడించింది. ఇందుకు సంబంధించిన కార్డులను గురువారం పంజాగుట్టలోని బజాజ్ షోరూమ్‌లో నటీమణులు మాళ్విక శర్మ, సీరత్‌కపూర్ ఆవిష్కరించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని బజాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూమ్‌లలో ఈనెల 3 నుంచి జనవరి 8వ తేదీ వరకు ఈ ఆఫర్ వర్తిస్తుందని తెలిపారు.

మెట్రోరైల్ నిర్వహణ భద్రతపై సెమినార్




కార్యక్రమంలో ఎల్‌అండ్‌టీ, ఎమ్ఆర్‌హెచ్ఎల్ సిబ్బంది

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: మెట్రోరైలు ప్రయాణికులు, సిబ్బంది భద్రతపై నిర్వహించిన తొలి సెమినార్ గురువారం విజయవంతంగా ముగిసిందని ఎల్‌అండ్‌టీ, ఎల్‌అండ్‌టీ ఎమ్ఆర్‌హెచ్ఎల్ తెలిపింది. 'కార్యక్రమంలో అవలంబించాల్సిన ఉత్తమ పద్ధతులు, రైల్వే పరిశ్రమలో క్లిష్టమైన సంఘటనలపై చర్చించుకున్నాం. హైదరాబాద్ మెట్రో వర్క్‌షాప్ సేఫ్టీ వాక్‌తో ప్రారంభమైంది. అంతర్గతంగా అభివృద్ధి చేసిన భద్రతా పరికరాలు ప్రదర్శించడంతో పాటు ఉద్యోగులకు భద్రతా విధానాలు అనుసరించడంపై మార్గనిర్దేశం చేసేందుకు హ్యాండ్ బుక్ రూపొందించాం. హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణ భద్రత ప్రాముఖ్యతను వివరించారు. సాధించిన అనేక భద్రత అవార్డుల గురించి ప్రస్తావించారు. నిరంతరం అభివృద్ధి చెందాల్సిన అవసరాన్ని నూతన లక్ష్యాలను' వివరించారని తెలిపింది. కార్యక్రమంలో ఎల్‌అండ్‌టీఎమ్‌హెచ్ఎల్ ఎండీ, సీఈవో కేవీబీ రెడ్డి, సీవోవో సుధీర్ చిప్లుంకర్ తదితరులు పాల్గొన్నట్లు పేర్కొంది.

ఉత్తరాల ప్రాముఖ్యంపై 'ఢై అఖర్' రైటింగ్ క్యాంపెయిన్

అబిడ్స్, న్యూస్‌టుడే: 'డిజిటల్ యుగంలో ఉత్తరాల ప్రాముఖ్యం' అంశంపై తపాలా శాఖ జాతీయ స్థాయిలో 'ఢై అఖర్ లెటర్ రైటింగ్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ సర్కిల్ సహాయ డైరెక్టర్ శరత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కల్గిన విద్యార్థులు తమ పేరు, పాఠశాల/కళాశాల, పుట్టిన తేదీ, అభ్యసిస్తున్న తరగతి, చిరునామా, చరవాణి నంబరు తదితర వివరాలతో పాటు పైన పేర్కొన్న అంశంపై తమ అభిప్రాయాలను లేఖ రూపంలో రాసి చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్, తెలంగాణ సర్కిల్, హైదరాబాద్-500001 పేరిట పోస్టు చేయాలని కోరారు. ఈ నెల 3 నుంచి 14 వరకు వచ్చిన లేఖలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఇతర వివరాలు ఇండియన్ పోస్ట్ వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చన్నారు.

ఏఐపీఎమ్ఏ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్‌గా అనిల్‌రెడ్డి



ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ఆల్ఇండియా ప్లాస్టిక్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఏఐపీఎమ్ఏ) ముంబయి సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్‌టీసీసీఐ) అధ్యక్షుడు అనిల్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు గురువారం ఏఐపీఎమ్ఏ తెలిపింది. ముంబయిలో జరిగిన మేనేజింగ్ కమిటీ సమావేశంలో ఈ విషయాన్ని సంస్థ వివరించింది. సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ పదవికి దక్షిణ భారతీయుడు ఎన్నిక కావడం ఇదే తొలిసారని పేర్కొన్నారు. ఏఐపీఎమ్ఏ అనేది లెజెండరీ ప్లాస్టిక్స్ అసోసియేషన్, ఎరువుల మంత్రిత్వశాఖ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పెట్రోకెమికల్స్, భారత ప్రభుత్వం, వివిధ యూనియన్‌లో ప్రాతినిధ్యం కలిగి ఉందన్నారు. అనిల్‌రెడ్డి ముంబయిలోని ఇండియన్ ప్లాస్టిక్ ఇన్‌స్టిట్యూట్ జాతీయ అధ్యక్షుడిగా కూడా పనిచేశారని ఏఐపీఎమ్ఏ తెలిపింది.

బోగస్ కంపెనీ.. నకిలీ పీఎఫ్ ఖాతా

ఈనాడు, హైదరాబాద్: ఐటీ ఉద్యోగి ఆధార్, పాన్ ఇతర వ్యక్తిగత డేటా సేకరించిన నేరగాళ్లు.. ఆమె బోగస్ సంస్థలో పనిచేస్తున్నట్లు పీఎఫ్ ఖాతా సృష్టించారు. ఒకే సమయంలో రెండు కంపెనీల్లో పనిచేస్తున్నట్లు రికార్డుల్లో ఉండడంతో సదరు యువతి ఉద్యోగం కోల్పోవాల్సి వచ్చింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువతి(26) నగరంలోని ప్రముఖ ఐటీ సంస్థలో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పనిచేస్తున్నారు. యువతిని ఇటీవల యాజమాన్యం ఉద్యోగం నుంచి తొలగించింది. దీనిపై హెచ్‌ఆర్ విభాగాన్ని సంప్రదించగా పీఎఫ్ ఓవర్‌ల్యాప్ కారణమని చెప్పారు. అంటే ఒకే సమయంలో రెండు సంస్థల్లో పనిచేస్తున్నట్లు. తాను అలా పనిచేయలేదని చెప్పగా ఈపీఎఫ్‌వో రికార్డుల్లో ఉందని చెప్పారు. దీనిపై యువతి కూకట్‌పల్లిలోని ఈపీఎఫ్‌వో ప్రాంతీయ కార్యాలయానికి వెళ్లి ఆరా తీయగా.. శేరిలింగంపల్లిలోని కొత్తగూడలో చిరునామాతో రిజిస్టరైన మారెళ్ల సాఫ్ట్‌ల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో 2020 ఏప్రిల్ 1 నుంచి 2022 ఆగస్టు 5 వరకు పని చేస్తున్నట్లు రికార్డులు చూపించారు. బాధితురాలు అక్కడకు వెళ్లగా కార్యాలయమే లేదు. బోగస్ అని తేలింది.

సెలవులో హెచ్ఎండీఏ కమిషనర్

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ సెలవులో వెళ్లారు. ఈనెల 15 తేదీ వరకు ఆయన విదేశీ పర్యటనలో ఉండనున్నారు. ఈ నేపథ్యంలో పట్టణ, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్ ఇన్‌ఛార్జి బాధ్యతలు తీసుకున్నారు. లేఅవుట్లు, నిర్మాణ అనుమతులకు సంబంధించి ఫైళ్ల కదలిక కొంతకాలంగా మందగమనంలో ఉంది. కమిషనర్ సెలవుతో మరింత జాప్యం కాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దసరాకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

మియాపూర్, న్యూస్‌టుడే: దసరా పండగ నేపథ్యంలో మియాపూర్ ఆర్టీసీ-2 డిపో నుంచి వివిధ దూరప్రాంతాలకు ప్రత్యేక బస్ సర్వీసులు నడుపుతున్నట్లు మేనేజర్ వెంకటేశం తెలిపారు. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే ఈ సర్వీసులు 12వ తేదీ వరకు నడుస్తాయని పేర్కొన్నారు. మియాపూర్ క్రాస్ రోడ్ నుంచి ఈ బస్సు సర్వీసులు బయల్దేరి నిజాంపేట చౌరస్తా, కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి, ఎస్సార్‌నగర్ అమీర్‌పేట, ఎంజీబీఎస్, జేబీఎస్ మీదుగా ఆయా ప్రాంతాలకు నడుస్తాయి. వివరాలకు 99592 26420.

కేఎల్ యూనివర్సిటీకి పురస్కారం



అవార్డు అందుకుంటున్న రామకృష్ణ

మొయినాబాద్, న్యూస్‌టుడే: నగర శివారు మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లోని కేఎల్ యూనివర్సిటీకి జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకు వరించింది. 'ఎడ్యుస్కిల్స్ వర్చువల్ ఇంటర్ షిప్ ర్యాంకింగ్స్-2024'లో కేఎల్ యూనివర్సిటీ అసాధారణమైన ప్రదర్శన చూపింది. అధునాతన ఇంటర్న్‌షిప్ పర్యావరణ వ్యవస్థను సృష్టించడం ద్వారా డిజిటల్ వర్క్ ఫోర్స్ ఆఫ్ టుమారో నిర్మించడంలో అందించిన తోడ్పాటుకు గాను జాతీయస్థాయిలో 7వ స్థానాన్ని దక్కించుకుంది. ప్రిన్సిపల్ డాక్టర్ రామకృష్ణ అవార్డును అందుకున్నారు.

నగరంలో ఈనాడు

● మాదాపూర్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఉదయం 10 గంటలకు డిజైన్ డెమోక్రసీ అండ్ మ్యూజియం ఆఫ్ తెలంగాణ కార్యక్రమం.

● తిలక్ రోడ్ తెలంగాణ సారస్వత పరిషత్‌లో సాయంత్రం 5.30 గంటలకు ధర్మనిధి సాహితీ పురస్కారాల ప్రదానోత్సవం.

మోత మోగుతోందిక్కడే

పారిశ్రామిక ప్రాంతం కంటే జూబ్లీహిల్స్‌లో అధిక శబ్దతీవ్రత నమోదు




జనవరి నుంచి ఆగస్టు వరకు నమోదైన సగటు శబ్ద తీవ్రత (డెసిబుల్లలో..)

ప్రాంతం	ఉదయం	రాత్రి
జేఎన్టీయూ	68	66
సనత్‌నగర్	63	61
జూబ్లీహిల్స్	72	74
జీడిమెట్ల	69	68
తార్నాక	61	57
జూపార్కు	55	54
అబిడ్స్	61	62
హెచ్‌సీయూ	62	61

ఈనాడు, హైదరాబాద్: జూబ్లీహిల్స్‌లో శబ్ద తీవ్రత శ్రుతి మించుతోంది. పీసీబీ నిర్దేశిత అవధికంటే ఎక్కువ డెసిబుల్లలో శబ్ద తీవ్రత రికార్డవుతోంది. పారిశ్రామిక ప్రాంతాలతో పోల్చితే జూబ్లీహిల్స్‌లోనే అధికంగా నమోదవ్వడం గమనార్హం. పీసీబీ జనవరి నుంచి ఆగస్టు వరకు నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. ఉదయం, రాత్రివేళల్లో ఒకే తరహాలో శబ్దకాలుష్యం నమోదవుతోందని పేర్కొంది. జూబ్లీహిల్స్, తార్నాక ప్రాంతాలు నివాస.. అబిడ్స్, కూకట్‌పల్లి ప్రాంతాలు వాణిజ్య.. సనత్‌నగర్, జీడిమెట్ల ప్రాంతాలు పారిశ్రామిక.. జూపార్కు, హెచ్‌సీయూ సున్నిత ప్రాంతాలుగా గుర్తించారు. నిర్మాణ రంగం, ట్రాఫిక్, రాత్రివేళ డీజే, వాహనాల హోరుతో ఈ ప్రాంతంలో అధిక శబ్ద తీవ్రత నమోదవుతోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

పీసీబీ నిర్దేశిత శబ్ద అవధులు.. (పగలు 6 నుంచి రాత్రి 9గం.లు), (రాత్రి 9గం.ల నుంచి ఉదయం 6గం.లు) (డెసిబుల్లలో)



దుష్ప్రభావాలివే..

- శబ్దం మితిమీరితే గుండె కొట్టుకునే వేగం, రక్త పీడనం పెరుగుతుంది.
- 65 డెసిబుళ్ల చప్పుడుతో గుండె జబ్బులు, చెవుడు కూడా రావొచ్చు.
- చప్పుడుతో పనిచేసే శక్తిని కోల్పోతారు. నిద్రలేమి, తలనొప్పి, అలసట వస్తుంది.
- మానసికంగా, శారీరకంగానూ కుంగదీస్తుంది.

సీవరేజీపై జలమండలి యుద్ధం!

- గ్రేటర్ వ్యాప్తంగా 90 రోజులపాటు ప్రత్యేక డ్రైవ్
- మురుగు సమస్యను 30 శాతం తగ్గించేందుకు ప్రణాళిక

ఈనాడు, హైదరాబాద్: గ్రేటర్ వ్యాప్తంగా సీవరేజి సమస్యపై జలమండలి యుద్ధం ప్రకటించింది. రాబోయే 90 రోజుల్లో మురుగు సమస్యలను 30 శాతానికి తగ్గించాలనేది కీలకాంశమని ఎండీ అశోక్‌రెడ్డి తెలిపారు. ప్రత్యేక కార్యాచరణను బాపూఘాట్‌లో బుధవారం కార్యక్రమాన్ని జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ప్రతి ఇంటి ప్రాంగణంలో ఇంకుడు గుంత ఉండేలా స్థానికులను చైతన్యం చేయనున్నారు. అందుకు స్వచ్ఛంద సంస్థల సభ్యులు ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించనున్నారు. చిన్న చినుకుకే రహదారులు, జనవాసాలు నిత్యం మురుగుతో దర్శనం ఇస్తున్నాయి. కోట్లు ఖర్చు చేసి నిర్మించిన రహదారులు దెబ్బతినగా మురుగుతో జనజీవం అస్తవ్యస్తమవుతోంది. జలమండలి పరిధిలో మురుగు సమస్యకు సంబంధించి నెలకు 30-40వేల ఫిర్యాదులు అందుతున్నాయి. మురుగు గొట్టాల క్లీనింగ్‌కు 225 ఎయిర్‌టెక్ యంత్రాలు పనిచేస్తున్నాయి. వాటికే ఏటా కోట్లలోనే అద్దెలు చెల్లిస్తున్నారు. అయినా పరిస్థితిలో మార్పు లేదు. అంతేకాక 300 చదరపు మీటర్ల ఇంటి విస్తీర్ణం దాటిన ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంత తప్పకుండా నిర్మించుకోవాలని నగర ప్రజలకు పిలుపునిచ్చారు. లేదంటే వచ్చే ఏడాది నుంచి రెండింతలు నీటి బిల్లులు చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు.



ప్రత్యేక డ్రైవ్‌లో చేసే పనులు ఇలా...

- నిత్యం మురుగు పొంగే మ్యాన్‌హోళ్ల గుర్తింపు
- భూగర్భ డ్రైనేజీ పైపులైన్ల స్థితి.. సామర్థ్యం పరిశీలన
- పైపులైన్ సామర్థ్యం పెంపునకు చర్యలు
- కాలం చెల్లిన పైపులైన్ల మార్పులకు ప్రణాళికలు
- ఇక రోజూ రంగంలో ఎయిర్‌టెక్ యంత్రాలు
- ఎయిర్‌టెక్ యంత్రాలను జీపీఎస్ ద్వారా పరిశీలన
- క్షేత్రస్థాయి పనులపై జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా పర్యవేక్షణ
- నిర్ణీత మొత్తం సీవరేజీతోపాటు అదనంగా మురుగు తొలగింపు

ఈనాడు, హైదరాబాద్: రాజధానిలో జీఐఎస్(జియోగ్రాఫిక్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్) సర్వే నత్తనడకన సాగుతోంది. ఆరు నెలల్లో పూర్తవుతుందని ఆగస్టు 8, 2024న విలేకరుల సమావేశంలో కమిషనర్ ఆమ్రపాలి ధీమా వ్యక్తం చేయగా.. 2 నెలల పురోగతి ఆ స్థాయిలో లేదు. సర్వే చేపట్టిన సంస్థ నిర్లక్ష్యమే అందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. అరకొర ఉద్యోగులతో సర్వే చేపడుతోంది. కొత్తగా విధుల్లో చేరుతోన్న కొందరు సర్వేయర్లు.. జీతాలు, ఇతరత్రా సమస్యలతో రోజుల వ్యవధిలోనే ఉద్యోగం వదిలేస్తున్నారు. దాంతో సర్వే నెమ్మదించింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆ సంస్థపై చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ స్పష్టం చేస్తోంది. నగరానికి 3డీ పటం తయారు చేయాలన్న లక్ష్యంతో చేపట్టిన ప్రతిష్ఠాత్మక జీఐఎస్ సర్వే ఆదిలోనే ప్రశ్నార్థకంగా మారింది.

కమిషనర్ హెచ్చరికను ఖాతరు చేయని ఏజెన్సీ

నత్తనడకన జీఐఎస్ సర్వే

పూర్తయితే బహుళ ప్రయోజనాలు.. జీఐఎస్ సర్వే రెండు దశల్లో జరగనుంది. మొదటిదశలో డ్రోన్లు నగరం మొత్తాన్ని 2డీ రూపంలో చిత్రీకరిస్తాయి. రెండో దశలో ఇంటింటి సర్వే, క్షేత్రస్థాయిలో మౌలిక సౌకర్యాల మ్యాపింగ్ ఉంటుంది. డిజిటల్ ఇంటి నంబర్లు, ప్రతి ఇల్లు, వీధి, పార్కులు, విద్యుత్తు స్తంభాలు, చెరువులు, ప్రభుత్వ భవనాలు, ఖాళీ స్థలాలు, క్రీడా మైదానాలు, ఇతరత్రా వసతుల స్పష్టమైన చిత్రాలతో నగరానికి విస్తృత స్థాయి 3డీ పటం రూపుదిద్దుకుంటుంది. స్విగ్గీ, జొమాటో, ఇతర ఈ-కామర్స్ సంస్థలు నగర పటాన్ని ఉపయోగించుకుంటాయని, జీఐఎస్ సర్వే పటాలు భవిష్యత్తు సమస్యలకు పరిష్కారం చూపుతాయి.



- ప్రాజెక్టు వ్యయం: రూ.22 కోట్లు
- నగరం మొత్తం విస్తీర్ణం..: 625 చ.కి.మీ
- డ్రోన్ సర్వే పూర్తయిన విస్తీర్ణం..: 600 చ.కి.మీ
- నగరంలోని మొత్తం ఇళ్లు..: 25 లక్షలు
- ఇంటింటి సర్వే పూర్తయిన ఇళ్లు..: 16 వేలు

సర్వేలో నమోదు చేసుకునే వివరాలు..

నిర్మాణానికి సంబంధించిన ఆస్తిపన్ను వివరాలతోపాటు దానిని వ్యాపారానికా, నివాసానికా అనే వివరాలను సర్వేలో జీహెచ్ఎంసీ సేకరిస్తోంది. నిర్మాణంలోని పచ్చదనం, విద్యుత్తు సదుపాయాలు, సౌర ఫలకలు, ఇంకుడు గుంత, లిఫ్టు, ఎదురుగా ఉన్న రోడ్డు వెడల్పు వంటి వివరాలను.. యజమానికి సమ్మతమైతేనే తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. అదనపు వివరాలను నగర భవిష్యత్తు ప్రణాళిక కోసం సేకరిస్తున్నామంటున్నారు. భవన నిర్మాణ అనుమతి, నీటి, విద్యుత్తు కనెక్షన్ల వివరాలు ఇవ్వడం తప్పనిసరి కాదంటున్నారు.

రహదారి.. ప్రమాదకారి



హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద పదుల సంఖ్యలో భారీ వాహనాలను రోడ్డు పక్కనే నిలుపుతున్నారు. రాత్రివేళ ఇతర వాహనాలు వాటిని ఢీకొని తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

పట్టుతప్పితే.. అంతే



రోడ్డు ప్రమాదాలపై అధికారులు ఎంతగా అవగాహన కల్పిస్తున్నా కొందరు వాహనదారులు, ప్రయాణికులు చెవికెక్కించుకోవడం లేదు. సచివాలయం రోడ్డులో ఓ ట్రాలీఆటోలో కూరగాయల మూటలపై కూర్చొని ప్రమాదకరంగా వెళ్తున్నారు.

పరిమితికి మించి.. ప్రాణాల మీదకు



ద్విచక్రవాహనాలపై పరిమితికి మించి లోడ్‌తో ప్రయాణిస్తూ కొందరు ప్రాణాలకు మీదకు తెచ్చుకుంటున్నారు. నాంపల్లి స్టేషన్ రోడ్డులో గురువారం ఓ బైక్‌పై యువకుడు భారీ మూటలతో ఇలా వెళ్తూ కనిపించాడు.

బాలుడిపై లైంగికదాడి.. యువకుడికి పదేళ్ల జైలు



నిందితుడు అబ్దుల్ మజీద్

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: ఉచిత వసతి గృహంలో ఉంటూ ఏడో తరగతి చదువుతున్న బాలుడిపై లైంగికదాడికి పాల్పడ్డ యువకుడికి న్యాయస్థానం పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.16,000 జరిమానా విధించింది. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునీల్ బర్ల కథనం ప్రకారం.. పశ్చిమబంగకు చెందిన మహ్మద్ అబ్దుల్ మజీద్(23) సరూర్‌నగర్ పరిధిలోని ఓ వసతిగృహంలో పనిచేసేవాడు. 2018 ఏప్రిల్ 22 రాత్రి వసతి గృహంలో నిద్రిస్తున్న బాలుడి(13)ని బలవంతంగా మరో గదిలోకి తీసుకెళ్లి భయభ్రాంతులకు గురిచేసి లైంగికదాడికి పాల్పడ్డాడు. సరూర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కేసు విచారించిన రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి గురువారం తుదితీర్పు వెల్లడించారు. బాధిత బాలుడికి రూ.5 లక్షల పరిహారం ప్రకటించారు. నిందితుడు చెల్లించే జరిమానాను బాలుడి వైద్య ఖర్చుల, పునరావాసానికి కేటాయించాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

మంత్రి కొండా సురేఖపై భారాస కార్పొరేటర్ల ఫిర్యాదు



ఏసీపీకి ఫిర్యాదు చేస్తున్న భారాస కార్పొరేటర్లు కవితారెడ్డి, పద్మావెంకటరెడ్డి, దేదీప్యరావు, సామల హేమ, సునీత

జూబ్లీహిల్స్: రాష్ట్ర మంత్రి కొండా సురేఖ చేసిన తప్పుడు, నిరాధార వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలంటూ పలువురు భారాస మహిళా కార్పొరేటర్లు గురువారం బంజారాహిల్స్ డివిజన్ ఏసీపీ వెంకటరెడ్డి, ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్రకు ఫిర్యాదు చేశారు. కార్పొరేటర్లు కవితారెడ్డి, పద్మావెంకటరెడ్డి, దేదీప్యరావు, సామల హేమ, ఆర్.సునీతలు ఫిర్యాదు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. మంత్రి చేసిన వ్యాఖ్యలు నిరాధారమైనవని, కేటీఆర్ ప్రతిష్ఠకు భంగం కలిగించే వ్యాఖ్యలని పేర్కొన్నారు. మూసీ సుందరీకరణ, ఇతర సమస్యలను పక్కదారి పట్టించడానికి ముఖ్యమంత్రితో కొండా సురేఖ కుమ్మక్కై ఈ ఆరోపణలు చేశారన్నారు. నాగచైతన్య-సమంత విడిపోవడానికి కేటీఆర్ కారణమంటూ వ్యాఖ్యానించడం ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నమన్నారు. మంత్రిపై కేసు నమోదు చేయాలని, లేదంటే చట్టపరంగా ముందుకెళ్తామని కార్పొరేటర్లు అన్నారు. పోలీసులు ఫిర్యాదు స్వీకరించారు. కోర్టు అనుమతితో కేసు నమోదు చేస్తామని తెలిపారు.

హైడ్రా బాధితులతో కలిసి దీక్ష చేస్తా: ఈటల



కాలనీవాసుల సమావేశంలో పాల్గొన్న ఎంపీ రాజేందర్

నేరేడ్‌మెట్, మౌలాలి, న్యూస్‌టుడే: పేదల బతుకుల్లో మట్టి కొడుతున్న దుర్మార్గపు ప్రభుత్వం రేవంత్‌రెడ్డిదని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. హైడ్రా బాధితులు అత్యధికంగా మల్కాజిగిరిలో ఉన్నారని అన్నారు. బండ చెరువు చుట్టూ 18 కాలనీల్లో 35 ఏళ్ల క్రితం పట్టా భూములు కొనుక్కొని ఇళ్లు కట్టుకున్నారన్నారు. కార్పొరేటర్లు రాజ్యలక్ష్మి, సునీతతో కలిసి ఎంపీ గురువారం బండ చెరువు పరిసర కాలనీలలో పర్యటించారు. కాలనీవాసులతో సమావేశమయ్యారు. కాలనీవాసులు తమ ఇళ్లు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్నాయని.. ఇప్పుడు హైడ్రా భయం గుప్పెట్లో కొట్టుమిట్టాడుతున్నామని ఆయనకు మొరపెట్టుకున్నారు. అనంతరం ఈటల మాట్లాడారు. హైడ్రా బాధితులందరితో కలిసి త్వరలో దీక్ష చేస్తానని, అందరూ నిశ్చింతగా ఉండాలని హామీ ఇచ్చారు. హైడ్రా చర్యలపై కోర్టు మొట్టికాయలు వేసినా ప్రభుత్వానికి జ్ఞానం రావడం లేదన్నారు. 'ఎవరు చెప్పినా వినసంటే సైకో అంటారంటూ ముఖ్యమంత్రిపై పరుష పదజాలం'తో ధ్వజమెత్తారు. సీఎంకు మంత్రులు వత్తాసు పలుకుతున్నారని ఆయన విమర్శించారు.

మూసీ లోపలున్న నిర్మాణాలనే కూల్చేస్తున్నారు



మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానించిన అంజన్‌కుమార్‌యాదవ్, ఫహీమ్ ఖురేషి, అనిల్‌కుమార్ యాదవ్

నారాయణగూడ: 'కాంగ్రెస్‌లో ప్రజాస్వామిక స్వేచ్ఛ ఎక్కువ. పలు సందర్భాలు పరస్పరం విమర్శలు గుప్పించుకున్నా.. సమయం వచ్చినప్పుడు అంతా ఒక్కటై పోరాడతాం' అని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. గురువారం న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో మహేష్‌కుమార్‌గౌడ్‌ను సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. పార్టీ అందరిది.. కష్టపడేవారికి కచ్చితంగా అవకాశాలు వస్తాయన్నారు. మూసీ కూల్చివేతల విషయంలో ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. కూల్చివేతలు మూసీ లోపలి నిర్మాణాలు మాత్రమేనని.. పరివాహక ప్రాంతంలో ఉన్నవి కాదన్నారు. వందల చెరువులు, కుంటలను భారాస నేతలు కబ్జా చేశారని ఆరోపించారు. గేటెడ్ కమ్యూనిటీలోకి వరద ఎందుకొస్తుందో ఆలోచన చేయాలన్నారు. ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు ఫహీమ్ ఖురేషి, కూన శ్రీశైలం గౌడ్, సీతారామరాజు, శ్రీనివాస్ గుప్తా ఉన్నారు.

మహిళా మంత్రులుంటే ఓర్వలేకపోతున్నారు



మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న మహిళా కాంగ్రెస్ నేతలు

అబిడ్స్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇద్దరు మహిళలు మంత్రులుగా ఉండటం చూసి ఓర్వలేకపోతున్నారని.. మాజీ మంత్రి కేటీఆర్ సామాజిక మాధ్యమాల వేదికగా ట్రోల్ చేయడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు తెలిపారు. మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో గాంధీభవన్ సమీపంలోని నాంపల్లి లత టాకీస్ చౌరస్తాలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. జుబ్దార్ కేటీఆర్ అంటూ నినాదాలు చేశారు. తొమ్మిదిన్నరేళ్ల అధికారంలో ఉన్న.. భారాస పార్టీ మహిళలకు ఏమాత్రం విలువ ఇవ్వలేదని, ప్రతిపక్షంలో ఉండి తాము సచివాలయానికి వెళ్తే అనుమతి నిరాకరించిన విషయం గుర్తు చేశారు. నోరు ఉందని ఇష్టారాజ్యంగా వాగితే సహించేది లేదని, ఇటీవలే మహిళా కమిషన్ సైతం మొట్టికాయలు వేసినా కేటీఆర్ మారడం లేదన్నారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల అధ్యక్షులు ఉషశ్రీ, రాధ, లక్ష్మీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శైలజ, జ్యోతిరెడ్డి, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంఆర్ నియంత్రణకు కార్యాచరణ

మంత్రి దామోదర రాజనర్సింహ



యాక్షన్ ప్లాన్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

మాదాపూర్, న్యూస్‌టుడే: యాంటీ బయోటిక్స్ విచ్చలవిడిగా వాడకంతో ప్రమాదకర స్థాయికి చేరుకున్న యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్) నియంత్రణ కోసం రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను తెలంగాణలో పక్కాగా అమలుచేస్తామని వైద్యారోగ్య శాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం సాయంత్రం మాదాపూర్‌లోని శిల్పాకళావేదికలో జీ-స్పార్క్ 2024 పేరిట "ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్, కంట్రోల్ అండ్ యాంటీమైక్రోబియల్ స్టీవార్డ్‌షిప్" అనే అంశంపై ఏర్పాటు చేసిన మూడు రోజుల అంతర్జాతీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఏఎంఆర్‌పై ప్రభుత్వ కార్యాచరణ ప్రణాళికను ఆయన ప్రకటించారు. దేశంలో ఆరు రాష్ట్రాలు ఏఎంఆర్ కార్యాచరణ ప్రణాళికను అమలుచేస్తున్నాయని, ఇందులో కేరళ ముందంజలో ఉందని చెప్పారు. జీ-స్పార్క్ సదస్సు ఛైర్ డా.రంగారెడ్డి మాట్లాడుతూ.. ఆధునిక వైద్యానికి ఏఎంఆర్ పెద్ద సవాల్‌గా మారుతుందని చెప్పారు.

మానవాళికి ప్రమాదకరం.. జీ-స్పార్క్ సదస్సు కోఛైర్, కాంటినెంటల్ ఆసుపత్రి సీఎండీ డా.గురు ఎన్ రెడ్డి మాట్లాడుతూ.. ఏఎంఆర్ కారణంగా మన దేశంలో ఏటా 3 లక్షల మంది మరణిస్తున్నారని తెలిపారు. కేరళ మాజీ మంత్రి శైలజా టీచర్ మాట్లాడుతూ.. ఏఎంఆర్ యాక్షన్ ప్లాన్‌ను అమలుచేయడంలో కేరళ మొదటి స్థానంలో ఉందన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇండియా ఆఫీస్ ప్రతినిధి డా.అనూజ్ శర్మ మాట్లాడుతూ.. 2030 నాటికి ఏఎంఆర్ మరణాలను 10 శాతం తగ్గించాలని ఇటీవల యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వ ఏఎంఆర్ యాక్షన్ ప్లాన్‌ను మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు.



మన్నించాలమ్మా.. నీళ్లు లేవమ్మా

రాష్ట్రం మొత్తం విస్తారంగా వర్షాలు కురిసి చెరువులు జలకళతో దర్శనమిస్తుంటే.. మంచాల మండలంలో వర్షాలు లేక చెరువులు వెలవెలబోతున్నాయి. జాపాల చెరువులో ఉన్న కొన్ని నీటిలో బతుకమ్మలు నిమజ్జనం చేశారు. రహదారిపై వెళ్లేవారు బతుకమ్మలకు ఎంత కష్టమొచ్చింది.. నీరులేక ఇలాంటి పరిస్థితి వచ్చిందంటూ వాపోతున్నారు. – న్యూస్‌టుడే, మంచాల

ప్రైవేటు ఉపాధ్యాయుడికి ఐదేళ్ల జైలు



వెంకటరమణ

గౌతంనగర్, న్యూస్‌టుడే: విద్యార్థినిపట్ల అసభ్యంగా ప్రవర్తించిన ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడికి గురువారం పోక్సో కోర్టు అయిదేళ్ల జైలు, రూ.5 వేల జరిమానా విధించి బాలికకు రూ.25 వేలు చెల్లించాల్సిందిగా తీర్పునిచ్చినట్లు మల్కాజిగిరి ఠాణా సీఐ సత్యనారాయణ తెలిపారు. విజయనగరం జిల్లా కొమరాడ మండలం రావికారవలస గ్రామానికి చెందిన వెంకటరమణ(40) మౌలాలి గౌతమ్ కాన్సెప్ట్ పాఠశాలలో 2016లో ఉపాధ్యాయుడిగా పనిచేసినప్పుడు పదోతరగతి విద్యార్థినిపట్ల అసభ్యంగా ప్రవర్తించాడు.

నృత్య దర్శకుడు జానీకి నాలుగు రోజుల మధ్యంతర బెయిలు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: అత్యాచారం, బెదిరింపులు, పోక్సో కేసులో విచారణ ఖైదీగా చంచల్‌గూడ జైలులో ఉన్న నృత్య దర్శకుడు జానీకి 4 రోజుల మధ్యంతర బెయిలు మంజూరైంది. ఉత్తమ నృత్య దర్శకుడిగా దిల్లీలో అవార్డు అందుకోవాల్సి ఉన్నందున రంగారెడ్డి జిల్లా ప్రధాన పోక్సో కోర్టులో బెయిలుకు దరఖాస్తు చేసుకోగా విచారణ జరిపిన న్యాయమూర్తి హరీశ.. ఈనెల 6 నుంచి 9 వరకు బెయిలు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. రూ.2 లక్షల వ్యక్తిగత బాండ్, అంతే మొత్తంతో ఇద్దరి పూచీకత్తు సమర్పించాలన్నారు. కుటుంబసభ్యులను, మీడియాను కలవకూడదు. ఈనెల 10న ఉదయం 10.30కు కోర్టులో హాజరుకావాలి.

పెద్దఅంబర్‌పేట ఛైర్‌పర్సన్‌గా జయశ్రీ



హయత్‌నగర్: పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్‌గా పండుగల జయశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఛైర్‌పర్సన్ చెవుల స్వప్నపై కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస పరీక్ష నెగ్గిన విషయం తెలిసిందే. గురువారం తట్టిఅన్నారం వార్డు కార్యాలయంలో చేవెళ్ల ఆర్డీవో (ప్రత్యేకాధికారి) పి.సాయిరాం, కమిషనర్ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిల్ ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. 21 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. సీపీఐకి చెందిన 12వ వార్డు కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్.. నూతన ఛైర్మన్‌గా 8వ వార్డు కౌన్సిలర్ జయశ్రీ పేరు ప్రతిపాదించగా, భారాసకు చెందిన 15వ వార్డు కౌన్సిలర్ అర్చన బలపరిచారు.

పక్కాగా.. కుటుంబ డిజిటల్ కార్డు ప్రాజెక్టు

జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ స్నేహ శబరీష్



మాట్లాడుతున్న బల్దియా అదనపు కమిషనర్ స్నేహ శబరీష్

ఈనాడు, హైదరాబాద్: కుటుంబ డిజిటల్ కార్డుల జారీ కోసం నగరంలో చేపట్టనున్న ప్రయోగాత్మక ప్రాజెక్టును విజయవంతం చేయాలని, వివరాల సేకరణ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ ఐటీ విభాగం అదనపు కమిషనర్ స్నేహశబరీష్ అధికారులకు స్పష్టం చేశారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతిలో ఆమె అధికారులకు దిశానిర్దేశం చేశారు. ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, ఎమ్మార్వోలు, ఏఎంసీలు, డీపీఓలు, సీఓలు, తదితరులకు వివరాల సేకరణపై అవగాహన కల్పించారు. "ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం నియోజకవర్గానికి ఓ కాలనీ ఎంపికైంది. ఆయా కాలనీల్లోని ప్రతి ఇంటికి వెళ్లండి. కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకుని సర్కారు ఇచ్చిన ఫారాల్లో నింపండి. ఒక్కో బృందం రోజుకు కనీసం 40 ఇళ్లను సర్వే చేయాలి. సర్వేను 8వ తేదీన ముగించి, వివరాలను 9న పరిశీలించి, 10వ తేదీన ప్రభుత్వానికి అందజేయాలి. ప్రాజెక్టులో.. కుటుంబాన్ని ఓ యూనిట్‌గా తీసుకుని, ఒక డిజిటల్ కార్డును అందజేయాల్సి ఉంటుంది' అన్నారు.

తెలంగాణ న్యాయవాదుల క్రికెట్ జట్టు ఎంపిక

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: ఈ నెల 6 నుంచి 12 వరకు ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించే 36వ అఖిల భారత న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంట్‌లో తెలంగాణ తరపున పాల్గొనే ఆటగాళ్ల (న్యాయవాదుల) జాబితాను తెలంగాణ అడ్వకేట్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రాజేందర్‌రెడ్డి గురువారం ప్రకటించారు. ఈ జట్టుకు రంగారెడ్డి జిల్లా కోర్టులకు చెందిన న్యాయవాది పి.రాఘవేందర్‌రెడ్డి కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. ఇతర సభ్యులు.. కె.శశిధర్, డి.సాయిప్రసాద్, షేర్ సింగ్, మహ్మద్ మెస్సం అబు, ఎ.అన్వేశ్‌రెడ్డి, సుభాశ్ రాథోడ్, రాహుల్, శ్రేయాస్ వల్లా, వంశీ శ్రీవాత్సవ్, గౌతం, చైతన్య మిత్ర, మహ్మద్ హుసామా, వంశీ కరుతురి, ఎ.అంజన్, జగదీశ్వర్‌రెడ్డి.

బీసీ ఉప ప్రణాళికను ప్రకటించాలి


గోల్నాక, న్యూస్‌టుడే: బీసీల సమగ్రాభివృద్ధికి రూ. 5 వేల కోట్లతో ఉప ప్రణాళిక ప్రకటించాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ కోరారు. తెలంగాణలోని 120 కులాలలో అధిక శాతం నేటికీ పేదరికంలో మగ్గుతూ అభ్యున్నతికి దూరంగా ఉన్నాయన్నారు. గురువారం నింబోలిఅడ్డాలో.. పులిజాల కృష్ణ, మెట్టు ముత్యాల్‌రావు, డా.ప్రశాంత్ నిమ్‌కర్, సీహెచ్ ప్రదీప్‌గౌడ్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీసీ కులాలవారీగా జనాభా లెక్కలు తీసి అభివృద్ధికి నిధుల కేటాయింపు, సంక్షేమ పథకాల అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు. అత్యంత వెనుకబడిన బీసీల అభ్యున్నతికి ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని ప్రకటించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.



దృష్టి పడొద్దని దిష్టి తీశారు!

మూసీ పరీవాహక ప్రాంతం చైతన్యపురి డివిజన్ న్యూమారుతీనగర్ నార్త్ కాలనీ, గణేశ్‌నగర్ కాలనీవాసులు బుధవారం రాత్రి తమ ఇళ్లకు కుంకుమ కలిపిన నీళ్లతో దిష్టి తీశారు. నది సుందరీకరణ పేరిట ఇళ్లు కూల్చాలనుకుంటున్న అధికారుల కళ్లు తమ ఇళ్లపై పడొద్దని కోరుకుంటూ నిర్వహించినట్లు తెలిపారు. – న్యూస్‌టుడే, నాగోలు

ఉపాధ్యాయులకు ఆంగ్లభాషపై పట్టుండాలి



మాట్లాడుతున్న రామేశ్వర్‌గౌడ్

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: పోటీ ప్రపంచం నేపథ్యంలో ఉపాధ్యాయులకు ఇంగ్లిష్‌లో తప్పనిసరిగా ప్రావీణ్యం ఉండాలని ఆంగ్ల భాష శిక్షకుడు రామేశ్వర్‌గౌడ్ అన్నారు. గురువారం సుందరయ్య కళానిలయంలో 'విల్ టూ కెన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్' సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఆన్‌లైన్‌లో ఆంగ్లంపై శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. 2002 అక్టోబరు నుంచి ఇప్పటివరకు మొత్తం 53 వేల మంది ఉపాధ్యాయులకు ఆంగ్లభాషలో ఉచితంగా శిక్షణనిచ్చినట్లు తెలిపారు. 40 రోజులపాటు ఆన్‌లైన్‌లో ఒకరోజు ప్రత్యక్ష తరగతులు కొనసాగాయన్నారు. సహచట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులందరికీ ఆంగ్లభాషపై పట్టు ఉండడం ముఖ్యమన్నారు. మాతృభాషపై పట్టు ఉంటే ఇంగ్లిష్‌ను సులువుగా నేర్చుకోవచ్చని చెప్పారు.



హాజరైన ఉపాధ్యాయులు

చికెన్ ధరలు		
ఫాంరేటు 112-00		డ్రెస్డ్ 194-00
రిటైల్ 134-00		స్కిన్‌లెస్ 221-00

మూడు టోల్‌ప్లాజాలు.. మూడు ఏజెన్సీలకు..

త్వరలో వసూళ్లకు నిర్ణయం!

చౌటుప్పల్ గ్రామీణం, న్యూస్‌టుడే: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజాల వద్ద టోల్ వసూళ్ల బాధ్యతను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) తాజాగా మూడు ఏజెన్సీలకు అప్పగించింది. ఈ జాతీయ రహదారిపై 2012 డిసెంబరు నుంచి టోల్ వసూళ్లను ప్రారంభించిన జీఎమ్మార్ గుత్తేదారు సంస్థ.. నిర్దేశిత గడువు(2025 జూన్)కు ఏడాది ముందే టోల్ వసూళ్ల బాధ్యతతో పాటు హైవే నిర్వహణ నుంచి తప్పుకొంది. దీంతో ఎన్‌హెచ్‌ఏఐ జులై నుంచి సెప్టెంబరు వరకు మూడు నెలల పాటు టోల్ వసూళ్ల నిర్వహణను తాత్కాలికంగా రెండు ఏజెన్సీలకు అప్పగించింది. పంతంగి, కొర్లపహాడ్ వద్ద స్కైలాబ్ ఇన్‌ఫ్రా, చిల్లకల్లు వద్ద కోరల్ ఇన్‌ఫ్రా సంస్థ టోల్ వసూళ్ల బాధ్యతను చూసుకుంది. వీటి గడువు ముగియడంతో తాజాగా మూడు నూతన ఏజెన్సీలకు ఏడాది పాటు ఆ బాధ్యతను అప్పగిస్తూ ఎన్‌హెచ్‌ఏఐ నిర్ణయం తీసుకుంది. పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఇండియా మార్ట్‌కు, కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద ఈగల్ ఇన్‌ఫ్రా సంస్థకు, చిల్లకల్లు వద్ద అప్మీ రోడ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించింది. ఈ ఏజెన్సీలు ఈ నెల 5 లేదా 10వ తేదీ నుంచి టోల్ వసూళ్లను చేపట్టనున్నట్లు సమాచారం. మరోవైపు యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం నుంచి ఏపీలోని నందిగామ వరకు ఆరు వరుసల జాతీయ రహదారిగా విస్తరణకు సంబంధించిన డీపీఆర్ ప్రస్తుతం బిడ్డింగ్ దశలో ఉందని, వచ్చే ఏడాదిలో పనులు ప్రారంభమయ్యే అవకాశముందని ఎన్‌హెచ్‌ఏఐకి చెందిన ఉన్నతాధికారి ఒకరు 'న్యూస్‌టుడే'తో తెలిపారు.

'మంత్రులతో ముఖాముఖి' రేపటికి వాయిదా

హైదరాబాద్, న్యూస్‌టుడే: గాంధీభవన్‌లో శుక్రవారం జరగాల్సిన 'మంత్రులతో ముఖాముఖి' కార్యక్రమం శనివారానికి వాయిదా పడింది. ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించడానికి ప్రతి బుధ, శుక్రవారాల్లో గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ప్రజలు, కార్యకర్తలు ఈ మార్పును గమనించి వినతుల సమర్పణకు శనివారం రావాలని గాంధీభవన్ ఒక ప్రకటనలో తెలిపింది.

మరో మూడు మార్కెట్ యార్డులకు పాలకవర్గాలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో మరో మూడు మార్కెట్ యార్డులకు పాలకవర్గాలను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. యాదాద్రి జిల్లా వలిగొండ, నల్గొండ జిల్లా హాలియా, మహబూబ్‌నగర్ జిల్లా బడేపల్లి మార్కెట్ యార్డులకు ఛైర్మన్, వైస్‌ఛైర్మన్, సభ్యులను నియమించినట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటివరకు 78 మార్కెట్ యార్డులకు పాలకవర్గాల నియామకం జరిగిందని, త్వరలో మిగిలినవాటికి పాలకవర్గాలను నియమిస్తామని మంత్రి చెప్పారు.

కులం ఆధారంగా పనుల కేటాయింపు వద్దు

- జైళ్లలో వివక్షపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం
- ఖైదీలకు గౌరవంగా జీవించే హక్కు ఉంటుందని స్పష్టీకరణ
- 10 రాష్ట్రాల కారాగార నిబంధనల కొట్టివేత
- వివక్ష చోటు చేసుకుంటే రాష్ట్రాలదే బాధ్యతని హెచ్చరిక



దిల్లీ: కులం ఆధారంగా జైళ్లలో ఖైదీలకు పనులు కేటాయించే కారాగార నిబంధనలను కొట్టివేస్తూ సర్వోన్నత న్యాయస్థానం గురువారం చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. కొన్ని రాష్ట్రాల జైళ్ల నిబంధనలు రాజ్యాంగంలోని అధికరణాలు 14, 15, 17, 21, 23కు విరుద్ధంగా ఉన్నాయని పేర్కొంది. పుట్టుకతోనే కొన్ని తెగలపై నేర ముద్ర వేయడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఖైదీలకు గౌరవంగా జీవించే హక్కు ఉంటుందని స్పష్టం చేసింది. బ్రిటిష్ వలస పాలన నాటి చట్టాలు ఇంకా కొనసాగడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. జైళ్లలోని ఖైదీల రిజిస్టర్లలో కులం వివరాలను నమోదు చేసే పట్టికను తీసివేయాలని ఆదేశించింది. మొత్తం 10 రాష్ట్రాల కారాగార నిబంధనలను భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రల ధర్మాసనం తప్పుబట్టింది. వెంటనే జైళ్ల నిబంధనలకు సంబంధిత రాష్ట్రాలు, కేంద్రం సవరణలు చేయాలని ఆదేశించింది. ఇందుకు ధర్మాసనం మూడు నెలల గడువిచ్చింది. జైళ్లలో కులం, లింగత్వం తదితర అంశాల ఆధారంగా ఎలాంటి వివక్ష చోటుచేసుకున్నా అలాంటి కేసులను తాము సుమోటోగా స్వీకరిస్తామని తెలిపింది. మూడు నెలల్లో నిబంధనల సవరణలకు సంబంధించి రాష్ట్రాలు ప్రమాణ పత్రాలు సమర్పించకపోతే చర్యలు ఉంటాయని హెచ్చరించింది. చాలా రాష్ట్రాల్లోని కారాగారాల్లో కులం ఆధారంగా పనుల కేటాయింపు జరుగుతోందని, అణగారిన వర్గాలకు అమానవీయ పనులు కేటాయిస్తున్నారంటూ పాత్రికేయురాలు సుకన్య శాంత వేసిన పిటిషన్‌పై సీజేఐ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరిపి 148 పేజీల తీర్పు వెలువరించింది. ఇందులో కొన్ని కీలక వ్యాఖ్యలు చేసింది. ఊడ్చడం, శుభ్రం చేయడం లాంటి పనులు అణగారిన కులాలకు, వంట చేయడం లాంటి పనులు అగ్ర వర్ణాలకు అప్పజెప్పడం రాజ్యాంగంలోని అధికరణం 15ను ఉల్లంఘించడమేనని తెలిపింది. ఇందుకు వీలు కల్పిస్తూ రూపొందించిన జైలు నిబంధనలకు సవరణలు చేయాలని ఆదేశించింది.

ఇంకా కుల జాడ్యం పోలేదు: సీజేఐ

స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా దేశాన్ని కుల జాడ్యం వీడకపోవడంపై సీజేఐ ఆవేదన వ్యక్తం చేశారు. 'ఏ కులం కూడా పాకీ పనులు చేయడానికి లేదా అల్పమైన పనులు చేయడానికి పుట్టలేదు. వంట చేసేవారు. . చేయని వారంటూ జైళ్ల నిబంధనల్లో పేర్కొనడం అంటరానితనానికి ఆనవాళ్లే. వాటిని అనుమతించకూడదు. కొన్ని తెగల్లో పుట్టిన వారిని నేరగాళ్లుగా చూడటం సరికాదు. ఇది బ్రిటిష్ పాలన నాటి అవశేషం. వివక్షను రూపుమాపేందుకే మనం రాజ్యాంగంలో అధికరణం 21ను ఇముడ్చుకున్నాం' అని పేర్కొన్నారు.

వివక్షను సహించం: ధర్మాసనం

కారాగారాల్లో కులం ఆధారిత వివక్షను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ధర్మాసనం స్పష్టం చేసింది. 'న్యాయం, సమానత్వం విషయంలో మనకొక జాతీయ దృక్పథం అవసరం. అది పౌరులందరినీ కలుపుకొనిపోయేలా ఉండాలి. వ్యవస్థాగత వివక్షను గుర్తించాలి. ఎందుకంటే కులం సరిహద్దులు ఉక్కుతో తయారు చేసినవి. అవి కొన్ని సార్లు బయటకు కనపడవు. కానీ అవి దాదాపుగా ఎప్పటికీ ఛేదించలేనివి' అని సీజేఐ పేర్కొన్నారు. అణగారిన వర్గాలపై హింస, వివక్ష, అణచివేత, ద్వేషం ధిక్కారం సాధారణమైపోయాయని తీర్పులో ధర్మాసనం ఆవేదన వ్యక్తం చేసింది. 'కుల వ్యవస్థ మన సమాజంలో సామాజిక అన్యాయాలు పాతుకుపోయేలా చేసింది. సహజ న్యాయ సూత్రాలను విస్మరించే వాతావరణాన్ని సృష్టించింది. అణగారిన కులాలెప్పుడూ అట్టడుగున ఉండేలా, వారు ప్రాథమిక హక్కులు, గౌరవం కోల్పోయేలా చేసింది' అని ధర్మాసనం అభిప్రాయపడింది.

ధాన్యం కొనుగోలుకు 7,139 కేంద్రాలు

- తొలుత నిజామాబాద్, నల్గొండ జిల్లాల్లో..
- పీఏసీఎస్, ఐకేపీ కేంద్రాల్లో కొనుగోళ్లు



ఈనాడు, హైదరాబాద్: వానాకాలం వరి పంట కొనుగోలుకు రాష్ట్రవ్యాప్తంగా 7,139 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. తొలుత నిజామాబాద్, నల్గొండ జిల్లాల్లోని కేంద్రాలకు ధాన్యం వస్తుందని పౌరసరఫరాల వర్గాలు చెబుతున్నాయి. మిగతా జిల్లాలతో పోలిస్తే ఈ జిల్లాల్లో ముందే వానాకాలం వరి సాగు కావడంతో కోతలు కూడా ముందే మొదలుకానున్నాయి. అందుకు అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లకు 4,496 పీఏసీఎస్ కేంద్రాలు, 2,102 ఐకేపీ సెంటర్లు, 541 ఇతర కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. అక్టోబరు 1 నుంచి కేంద్రాలను ఏర్పాటు చేయాలని ముందు అనుకున్నప్పటికీ రెండు వారాలుగా కురుస్తున్న వర్షాలతో వరి కోతలు ఆలస్యమయ్యాయి. ఈ నేపథ్యంలో ఒకట్రెండు రోజుల్లో కొన్ని కేంద్రాలను ప్రారంభించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

నిజామాబాద్, జగిత్యాలల్లో అత్యధికంగా..

జిల్లాలవారీగా చూస్తే నిజామాబాద్‌లో అత్యధికంగా 480, జగిత్యాలలో 421 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించారు. సిద్దిపేటలో 417, మెదక్‌లో 387, నల్గొండలో 375, కామారెడ్డిలో 351, కరీంనగర్‌లో 340, మంచిర్యాలలో 326, యాదాద్రి భువనగిరిలో 323, పెద్దపల్లిలో 311, రాజన్న సిరిసిల్లలో 258, నాగర్‌కర్నూల్, వనపర్తిలలో 244 చొప్పున, ఖమ్మంలో 236, మహబూబాబాద్‌లో 234, నిర్మల్‌లో 228, సూర్యాపేటలో 206, వరంగల్‌లో 203, మహబూబ్‌నగర్, జయశంకర్ భూపాలపల్లిల్లో 189 చొప్పున, సంగారెడ్డిలో 183, జనగామలో 180, ములుగులో 173, భద్రాద్రి కొత్తగూడెంలో 160, హనుమకొండలో 149, నారాయణపేటలో 95, వికారాబాద్‌లో 92, జోగులాంబ గద్వాలలో 55, రంగారెడ్డి జిల్లాలో 45, కుమురంభీం ఆసిఫాబాద్‌లో 30, మేడ్చల్ మల్కాజిగిరిలో 12, అత్యల్పంగా ఆదిలాబాద్ జిల్లాలో 3 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి.

తొలి పది రోజులు కీలకం

వరి కోతలు మొదలు కావడంతోనే రైస్‌మిల్లర్లు, ధాన్యం వ్యాపారులు నేరుగా రైతుల వద్దకు వెళ్తారు. కోసిన ధాన్యాన్ని కోసినట్లే కల్లాల నుంచే తీసుకెళ్తారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలంటే తేమ శాతం 17 శాతం దాటొద్దు. దీనికోసం కొన్ని రోజులపాటు ఆరబెట్టాల్సి ఉంటుంది. మిల్లర్లు, వ్యాపారులు 25 శాతం, ఆపై తేమ శాతం ఉన్నా కొంటారు. ఈ నేపథ్యంలో వరి కోతలు మొదలైన తొలి వారం, పది రోజులు కీలకమని పౌరసరఫరాల సంస్థ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. మరోవైపు, బాస్మతియేతర బియ్యం ఎగుమతులపై ఉన్న ఆంక్షల్ని కేంద్ర ప్రభుత్వం కొద్దిరోజుల క్రితం ఎత్తివేసిన నేపథ్యంలో రైతుల నుంచి సన్నాల కొనుగోళ్లకు మిల్లర్లు, వ్యాపారులు గతంలో కంటే ఎక్కువగా ముందుకొచ్చే అవకాశాలున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 88.09 లక్షల టన్నుల సన్నాల దిగుబడి వస్తుందన్న అంచనాలు ఉండగా.. రైతులు తమ సొంత అవసరాలకు దాచుకునే ధాన్యం, వ్యాపారులకు అమ్మేది పోను 48.91 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని భావిస్తున్నారు. అందుకు అనుగుణంగా జిల్లాలు, మండలాల వారీగా కేంద్రాల ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు.

42 లక్షల మందికీ రుణమాఫీ చేస్తాం!

20 లక్షల మందికి ఇంకా చేయాల్సి ఉంది

- సాయం అందిన రైతుల సంఖ్య 22.37 లక్షలు
- అన్నదాతలను గందరగోళపరుస్తున్న భాజపా
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో 22 లక్షల మందికి పైగా రైతులకు రుణమాఫీ చేశామని.. మరో 20 లక్షల మందికి ఆర్థిక వెసులుబాటు చూసుకుంటూ రుణమాఫీ చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రుణమాఫీపై తమ ప్రభుత్వం ఎప్పటికప్పుడు స్పష్టమైన వివరాలు చెబుతున్నప్పటికీ భాజపా పెద్దలు, రాష్ట్ర నాయకులు రైతులను గందరగోళపరచి రాజకీయ పబ్బం గడుపుకొంటున్నారని విమర్శించారు. ' 'రాష్ట్రంలో మొత్తం రైతుల సంఖ్య 65.56 లక్షలు. వీరిలో భూములు ఉండి, బ్యాంకుల ద్వారా పంటరుణాలు తీసుకున్నవారి సంఖ్య 42 లక్షలు. 2018 రుణమాఫీ పథకంలో గత ప్రభుత్వానికి అందిన ఖాతాలు 40 లక్షలు మాత్రమే. అప్పట్లో కనీసం 20 లక్షల మందికి సరిగా మాఫీ కాలేదు. మా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 42 లక్షల మంది రైతులకు.. రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయడానికి కావాల్సిన మొత్తం రూ.31 వేల కోట్లు. వీరిలో రూ.2 లక్షలలోపు రుణాలు తీసుకొని, కుటుంబ నిర్ధారణ అయిన ఖాతాల సంఖ్య 22,37,848. వీరికి రూ.17,933.19 కోట్లను మొదటి పంటకాలంలోనే మాఫీ చేశాం. మిగతా 20 లక్షల మందికీ రుణమాఫీ చేస్తాం. ఈ లెక్కల్లో భాజపా నేతలకు అనుమానాలుంటే బ్యాంకులవారీగా వివరాలు తీసుకోవచ్చు. ఇంత పారదర్శకంగా లెక్కలున్నప్పటికీ రుణమాఫీ 2024 పథకం పూర్తయిందని మేం ప్రకటించామంటూ భాజపా నేతలు అబద్ధాలు చెప్పి తమ స్థాయిని దిగజార్చుకుంటున్నారు. నాకు మంత్రి పదవి కొత్తకాదు.. దాని కోసమో, ఇతర పదవులకు ఆశపడో మాట్లాడే నైజం నాది కాదు. ఇప్పటికైనా భాజపా రాష్ట్ర నాయకులు నా గురించి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి.

రూ.400 కోట్లు విదిల్చారు

గత నెలలో కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు రూ.10 వేల కోట్ల సాయం అర్థిస్తే రూ.400 కోట్లు మాత్రమే కేంద్ర ప్రభుత్వం విదిల్చింది. కేంద్రం పీఎం కిసాన్ లబ్ధిదారుల సంఖ్య 37 లక్షల నుంచి 30 లక్షలకు తగ్గించి రైతులకు అన్యాయం చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ద్వారా సరఫరా అయ్యే దొడ్డురకం రేషన్ బియ్యం దుర్వినియోగమవుతోంది. దీన్ని అరికట్టడానికి, మా ప్రభుత్వం మీద రూ.2,000 కోట్ల అదనపు భారం పడినా వెనక్కి తగ్గకుండా సన్నబియ్యం సేకరించి రాష్ట్రంలోని అన్ని రేషన్ షాపుల ద్వారా తెల్ల రేషన్‌కార్డు దారులకు, అన్ని వసతిగృహాల విద్యార్థులకు సరఫరా చేయడానికి ప్రణాళిక రూపొందించాం. సన్నవడ్లకు క్వింటాలుకు ఈ సీజన్ నుంచి రూ.500 బోనస్ ఇస్తున్నాం. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై రాష్ట్ర భాజపా నేతలు ఎందుకు స్పందించడం లేదు? దిల్లీలోని పెద్దలను ఎందుకు ప్రశ్నించడం లేదు? మీరు తెలంగాణలో మీ పరపతిని పెంచుకోవాలనుకుంటే, రాష్ట్రానికి నిధుల కోసం, రైతుల ప్రయోజనాల కోసం కేంద్రంపై పోరాడాలి"అని సూచించారు.

చలానా తీయాల్సిందే.. దారం కట్టాల్సిందే!

- పదో తరగతి పరీక్షలంటే విద్యార్థులకు తిప్పలు
- ఫీజుల చెల్లింపునకు చలానాలు తీయాల్సిందే
- కాలానుగుణంగా మారని ఎస్‌ఎస్‌సీ బోర్డు

ఈనాడు, హైదరాబాద్: ఏ పరీక్షకైనా హాజరు కావాలంటే బ్యాంకుకు వెళ్లి చలానా తీయడాన్ని ఇప్పటి పరిస్థితుల్లో ఊహించగలరా? జవాబుపత్రంపై సమాధానాలు రాస్తూ సార్... ఇంకో జవాబుపత్రం కావాలని అడగడం విన్నారా? గతంలో ఇలాంటి విధానాలున్నా దాదాపు అన్ని విభాగాలు మారాయి. విద్యార్థుల సౌకర్యమే ప్రధానంగా తమను తాము మార్చుకున్నాయి. ఎస్ఎస్‌సీ బోర్డు మాత్రం పాత విధానాలనే కొనసాగిస్తూ విద్యార్థులను, ప్రధానోపాధ్యాయులను తిప్పలు పెడుతోంది.

ఇంకా ఎక్కడున్నారు... సర్?

- పదో తరగతి పరీక్ష ఫీజు కోసం బ్యాంకుల్లో చలానా తీయాలి. పిల్లలను ఇబ్బంది పెట్టలేక అందరి వద్దా వసూలు చేసి, ప్రధానోపాధ్యాయులే బ్యాంకులకు వెళ్లి చలానా తీస్తున్నారు.



- పరీక్షల్లో విద్యార్థులకు తొలుత నాలుగు పుటల జవాబు పత్రాల బుక్‌లెట్ ఇస్తున్నారు. అందులో మొదటి పేజీలో విద్యార్థుల వివరాలు నింపడానికి, ఇతర సూచనలు ముద్రించి ఉంటాయి. అంటే మూడు పేజీలు రాశాక అదనపు జవాబుపత్రాన్ని ఇన్విజిలేటర్లను అడిగి తీసుకోవాలి. అధిక శాతం మంది కనీసం నాలుగు పేజీలుండే రెండు, మూడింటిని తీసుకుంటారు. వాటిని ఎన్ని తీసుకున్నారో తొలుత ఇచ్చిన షీట్‌లో రాయాలి. పొరపాటున మూడుకు బదులు నాలుగని రాస్తే ఇన్విజిలేటర్ పరిశీలించకుండా పంపిస్తే మూల్యాంకనం సందర్భంగా పరేషాన్ తప్పదు. పైగా రాయడం పూర్తయ్యాక జవాబు పత్రాలన్నీ కలిపి దారంతో ముడేయాలి. అది సరిగా పడకుంటే విద్యార్థి భవిష్యత్తు తారుమారవుతుంది.
- పరీక్ష ఫలితాల తర్వాత పునఃలెక్కింపు, పునఃపరిశీలనకు దరఖాస్తు చేసుకోవాలంటే మళ్లీ చలానాలు తీయాల్సిందే. సంబంధిత దరఖాస్తును వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి లేదంటే డీఈఓ కార్యాలయాల నుంచి పొందాలి. సహజంగా అప్పుడు వేసవి సెలవులు ఉంటాయి. దాంతో విద్యార్థులకు సాయం చేయడానికి పాఠశాలలు ఉండవు.

ఇతర విభాగాలను చూసి నేర్చుకోరా?

- ఎక్కడో కాదు... మనరాష్ట్రంలోనే ఇంటర్ బోర్డు ఒక్కో విద్యార్థికి 24 పేజీల జవాబుపత్రాల బుక్‌లెట్‌ను ఇస్తుంది. పరీక్ష ఫీజుతోపాటు పునఃలెక్కింపు, పునఃమూల్యాంకనం రుసుములనూ వెబ్‌సైట్ ద్వారా రెండు నిమిషాల్లోనే చెల్లించొచ్చు.
- తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టాస్) సైతం పదో తరగతికి 20 పేజీలు, ఇంటర్‌కు 24 పేజీల జవాబు పత్రాల బుక్‌లెట్లను ఇస్తోంది.
- సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు ఎస్ఎస్‌సీ బోర్డు అధికారులు గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా విద్యాశాఖ, ఆర్థికశాఖలు అనుమతి ఇవ్వలేదని సమాచారం.

మాదిగలకు మాటిచ్చి మోసం చేశారు

- మందకృష్ణ మాదిగ

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ చేపట్టి అందుకు అనుకూలంగా ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి తర్వాత పట్టించుకోకుండా మాదిగలను మోసం చేశారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ విమర్శించారు. ఎస్సీ వర్గీకరణకు అనుగుణంగా విద్యా, ఉద్యోగాల భర్తీ ఉంటుందని ప్రకటించి అందుకు విరుద్ధంగా రాష్ట్రంలో 11 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టారని దుయ్యబట్టారు. గురువారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పంజాబ్, తమిళనాడు రాష్ట్రాల్లోని వర్గీకరణ విధానంపై అధ్యయనం చేసి తెలంగాణలోనూ అలాంటి నిర్ణయం తీసుకుంటామని చెప్పినా ఆ ప్రయత్నమూ జరగలేదన్నారు. కాంగ్రెస్ అధినాయకత్వంలోని కొందరి మాటలు విని సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు అన్యాయం చేస్తున్నారన్నారు. వైద్య సీట్ల భర్తీలోనూ మాదిగ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టి అందుకు అనుగుణంగా ఉద్యోగ నియామకాలు చేపట్టాలంటూ ఈ నెల 9న అన్ని జిల్లా కేంద్రాల్లో నల్లజెండాలతో నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం 15న అన్ని మాదిగ సంఘాలతో సదస్సు నిర్వహించి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్‌మాదిగ, ఎమ్మెస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్ మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్ మాదిగ, అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్, జాతీయ కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

న్యాయవాదులపై పోలీసు దాడులు ఆపాలి

- డీజీపీ కార్యాలయం వద్ద నిరసన



డీజీపీ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

నారాయణగూడ, న్యూస్‌టుడే: న్యాయవాదులను లక్ష్యంగా చేసుకొని జరుగుతున్న పోలీసు దాడులను ఆపాలంటూ గురువారం సాయంత్రం న్యాయవాదులు డీజీపీ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. రోడ్డుపై బైఠాయించగా పోలీసులు అడ్డుకున్నారు. న్యాయవాది కలీమ్‌పై దాడి చేసిన సైదాబాద్ ఎస్సై, కానిస్టేబుల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ ఆఫ్ ఆల్ బార్ అసోసియేషన్స్ అధ్యక్షుడు వై.కొండల్‌రెడ్డి మాట్లాడారు. "ఈ ఏడాది న్యాయవాదులపై ఆరు దాడులు జరిగాయి. చట్టాలు తెలిసీ పోలీసులు న్యాయవాదులపై దాడులు చేస్తున్నారు. మూసీ కూల్చివేతలపై న్యాయవాది కలీమ్ స్టే తీసుకొచ్చారు. ఒకరికి కేటాయించిన ఇళ్లను మరొకరికి కేటాయించడాన్ని అడ్డుకుంటున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో రాజకీయ నాయకుల ప్రోద్బలంతో సైదాబాద్ ఎస్సై ఇష్టారీతిన వ్యవహరించారు. కలీమ్‌ను ఇంటి నుంచి కొట్టుకుంటూ తీసుకెళ్లారు. మేము అపాయింట్‌మెంట్ తీసుకున్నప్పటికీ డీజీపీ బయటకు వెళ్లిపోవడం న్యాయవాదులను అవమానించడమే. న్యాయవాదులకే ఇలాంటి పరిస్థితి ఉంటే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటి? న్యాయవాదుల పరిరక్షణ చట్టం తీసుకురావాలి. పోలీసులు లేకుండా రాజకీయనాయకులు బయటకు వెళ్లలేని పరిస్థితి ఉంది. అందువల్లే పోలీసులపై చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం భయపడుతోంది'' అని ఆరోపించారు. అనంతరం వివిధ బార్ అసోసియేషన్ల ప్రతినిధి బృందం డీజీపీ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించింది. నిరసన తెలిపిన వారిలో వివిధ బార్ అసోసియేషన్ల ప్రతినిధులు బాల్‌రెడ్డి, యాదగిరి, కృష్ణ, శ్రీనాథ్, రాజవర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎస్సీల వాటా పక్కనపెట్టి డీఎస్సీ నియామకాలు చేపట్టాలి

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఎస్సీల వాటా 15 శాతం పక్కనపెట్టి డీఎస్సీ నియామకాలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డిని తెలంగాణ మాదిగ సంఘాల ఐక్య వేదిక కోరింది. ఈ మేరకు మాజీ మంత్రి డా.ఎ.చంద్రశేఖర్‌తో కలిసి ఐక్య వేదిక, కాంగ్రెస్ నాయకులు దేవని సతీష్‌మాదిగ తదితరులు గురువారం జూబ్లీహిల్స్‌లో ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు శుక్రవారం(4న) సీఎం ఇంటి ముందు, 5న సచివాలయం, 6న అసెంబ్లీ, 7న గాంధీభవన్, 8న అంబేడ్కర్ విగ్రహం ఎదుట 'సాష్టాంగ నమస్కారం' కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఐక్యవేదిక నేతలు ఒక ప్రకటనలో తెలిపారు.

EENADU Vol: 51, Iss: 55 | Printed and Published by D N Prasad on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt. Ltd. Printed at Ushodaya Publications, Eenadu Press, Plot No. A-1/1, Block No. 3, Industrial Development Area, Uppal, Hyderabad, Medchal District - 500 039, Telangana State. Published at Eenadu Corporate Office, Ramoji Film City, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy District - 501 512, Telangana State. Editor: D N Prasad. Phone: 040-22232223. RNI No. 27656/75. Regd. No. HSE/1009/2024-26, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు

హైదరాబాద్ 4-10-2024 శుక్రవారం సిటీ సంపుటి 51. సంచిక 55

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 12+12+4 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru




Mobiles & Accessories
iPhone 16
128GB
Built for Apple Intelligence
EXCHANGE BONUS UPTO ₹8,000*
CASH BACK UPTO ₹5,000*
EMI STARTS AT ₹3,329*
₹79,900
₹74,900*
SAMSUNG 5G
A 15
• 6 GB RAM
• 128 GB ROM
FREE! NECK BAND ₹1,999
EMI ₹1,549*
₹19,999
₹15,499*
vivo 5G
V40e
• 8GB RAM
• 128GB ROM
FREE! SMART WATCH ₹2,999
CASH BACK 10%*
EMI ₹2,416*
₹33,999
₹28,999*
realme 5G
13
• 8 GB RAM
• 256 GB ROM
CASH BACK ₹2,000*
EMI ₹2,111*
₹22,999
₹16,999*
ONEPLUS 5G
12 R
• 8GB RAM
• 256GB ROM
FREE! TWS EARBUDS ₹2,999
CASH BACK ₹3,000*
₹42,999
₹34,999*
pebble
Pebble Smart Watch
Prism Black
₹3,299
₹899*
boAt
TWS Airdopes 141 ANC
₹5,990
₹1,399*
Laptop's & Printer's
hp Gaming Laptop
16GB RAM 512GB SSD 15" FHD
4GB Graphics Card
Windows 11 Office
CASH BACK ₹3,000*
EMI ₹4,399*
₹86,050
₹62,999*
ASUS Notebook
8GB RAM 512GB SSD 15" FHD
EMI ₹2,582*
₹54,990
₹30,990*
DELL Notebook
16GB RAM 1TB SSD 14" FHD
CASH BACK ₹5,000*
EMI ₹4,466*
₹82,392
₹61,999*
Lenovo Gaming Laptop
16GB RAM 512GB SSD 15" FHD
6GB Graphics Card
CASH BACK ₹3,500*
EMI ₹4,166*
₹1,06,090
₹59,000*
Lenovo Notebook
16GB RAM 512GB SSD 15" FHD
CASH BACK ₹3,000*
EMI ₹4,041*
₹75,490
₹45,499*
SAMSUNG Tab
8GB RAM 128GB ROM 11" FHD
Galaxy Tab A9+
CASH BACK ₹7,000*
EMI ₹2,813*
₹32,999
₹15,499*
Canon Ink Tank Wirelss MFP G3730
•Print •Scan •Copy
EMI ₹2,166*
₹18,000
₹12,999*
SONY Playstation5 Digital Slim
EMI AVAILABLE
₹44,990
₹39,990*
BUY ANY MOBILE GET FREE GIFTS!
Finance Available
BAJAJ FINSERV
IDFC FIRST Bank
BUY ANY LAPTOP GET FREE ACCESSORIES
Farm Fresh
Onion Red Per Kg Offer Valid till 6th Oct ₹58
Carrot Per Kg Offer Valid till 6th Oct ₹59
Ridge Gourd [Sponge Gourd] Per Kg Offer Valid till 6th Oct ₹49
Musambi Per Kg Offer Valid till 6th Oct ₹65
Apple Kinnaur Per Kg Offer Valid till 6th Oct ₹199
Avocado Hass Per Kg Offer Valid till 6th Oct ₹339
Meat & Fish
Mutton Curry Cuts Per Kg ₹800 ₹749
Country Chicken Whole Per Kg ₹450 ₹379
Little Tuna Per Kg ₹350 ₹289
Indian Salmon Whole Per Kg ₹1000 ₹849
Chicken Lollipop Masala Per Kg ₹350 ₹319
Marinated Tilapia Fish Per Kg ₹250 ₹199
Nuts 'N' Spices
Almonds Californian 500g ₹499.50 ₹360
Pistachios Irani 500g ₹724.50 ₹549.50
Golden Raisins 500g ₹167.50 ₹115
White Urad Whole Per Kg BEST PRICE ₹130 ₹121
Peanut Plain (Brown) Per Kg BEST PRICE ₹155 ₹129
Sona Masoori Rice Per Kg BEST PRICE ₹56 ₹51
LuLu
Lulu Online India App
login to www.luluhypermarket.in
DOWNLOAD NOW LULU ONLINE INDIA APP
Google Play App Store
GET EVERYTHING HOME DELIVERED
Elevate your shopping experience
మన లులు ఆన్‌లైన్ అయ్యింది
www.luluhypermarket.in
ONLINE EXCLUSIVE Grocery • Fresh • Home Appliances • Home Hold • Home & Decor
FIRST PURCHASE OFFER ₹100 OFF* ON ORDERS ABOVE ₹999/-
USE CODE SAVE100
*T&C Apply
Offers valid from 4th Oct to 13th Oct 2024 or till stocks lasts. Images shown in the offer booklet is only indicative and actual products may vary. Prices are subject to change.
HDFC BANK
10% Instant Discount *
using HDFC Bank EasyEMI
10% instant discount upto Rs.2500/- on minimum spends of Rs.5000/- | Offer valid from 5th October to 5th November 2024
*T&C Apply



Home Utilities
Bergner Trimax Pressure Pan 3.5ltr 52% OFF ₹4,999 ₹2,599
Chefline Hot Server 2pc 2+3Ltr 59% OFF ₹2,895 ₹1,199
Fora kitchen SS Idly Pot-6 40% OFF ₹999 ₹599
Larah 14Cl Cup Set 6Pc Assorted 33% OFF ₹445 ₹299
Nolta Opal Dinner Set 5Pc 44% OFF ₹890 ₹499
Nolta Biriyani Pot Dum 10ltr 34% OFF ₹3,950 ₹2,599
Onix Biriyani Pot With Lid 12Ltr OBP12 54% OFF ₹3,890 ₹1,799
Pigeon SS Knife 3Pc Set 15506 60% OFF ₹495 ₹199
Premier Pressure Cooker SS Handi 3ltr 49% OFF ₹3,120 ₹1,599
Scotch brite Cotton Mop Handled 18% OFF ₹425 ₹349
Smart Klean Floor Squeegee + Broom+Brush 45% OFF ₹820 ₹449
Vinod Multi Kadai Steel 43% OFF ₹2,820 ₹1,599
Offers valid from 4th Oct to 13th Oct 2024 or till stocks last.
Glam & Glow
Nivea Shower Gel Active Clean/ Frangipani 500ml 50% OFF
Nivea Soft Moisturizing Cream 300ml/ Body Milk 600ml 50% OFF ₹549 ₹274
Meera Shampo Strong & Healthy/ Anti Dandruff/ HairFall Care 1ltr 50% OFF
Camay Soap Chic Black/ Classic/ Natural White 3 X125gm 50% OFF ₹237 ₹118
Engage Men Cologne Spray XX1/XX2/XX3 135ml 50% OFF ₹310 ₹155
Wow Endless Black Natural Kajal .35g 50% OFF ₹199 ₹99
Dove Body Wash Sensitive/ Almond/ Sheabuter 1Ltr 50% OFF ₹849 ₹424
Colgate Tooth Paste Total Advanced Health 300g ₹75 OFF ₹370 ₹295
Stationery & Toys
Gear Backpack FLAT 65% OFF
HMI Waterbottle FLAT 50% OFF (Selected Items)
HMI Lunch Bag FLAT 50% OFF (Selected Items)
Merry Art Set 42Pcs-M-42 ₹299 ₹249
Oxygen Bicycle (all sizes) FLAT 55% OFF
Skid Fushion Soft toys FLAT 50% OFF
Nivia Vinyl Dumbbell 5Kg VD-9955 ₹2,499 ₹1,699
Viva Skate Shoes VS 150 10-13 JR ₹5,500 ₹2,999
Footwear & Luggage
Aristocrat Hard Spinner CruiserII 3PC Set ₹22,000 ₹6,899
Kamiliant Hard Spinner Martial Gift Box ₹7,500 ₹1,799
Kamiliant Back Pack Valarie Assorted ₹2,198 ₹999
Cortigiani/ Debackers Footwear BUY 1 20% BUY 2 40%
Home Furnishing
Homewell Blanket Double/ Single Fantasy Print ₹999 ₹499 ₹1,399 ₹599
Homewell Comforter Double Checks 200TC ₹3,999 ₹1,599
Homewell Pillow 650GM 2Pc Set ₹1,399 ₹479
Homewell Carpet Shaggy Super Soft 4x6 FRD ₹7,999 ₹3,499
LuLu FASHION STORE MEN / WOMEN / KIDS
LuLu DUSSEHRA FESTIVE DEALS 4th Oct - 13th Oct, 2024
UNWRAP THE MAGIC OF FASHION SAVINGS! DRESS UP & WIN BIG
*T&C Apply
LuLu EYE XPRESS
This Navratri, See the Good through the Best
Let's focus on setting new standards and a new attitude. Celebrate this festive season with LuLu Eyexpress and get your favorite picks at affordable prices.
UP TO 50% OFF On Sunglasses
T&C Apply
LuLu FASHION STORE MEN / WOMEN / KIDS
BLSH
Your Dussehra beauty transformation Starts here!
UPTO 50% OFF ON COSMETICS & FRAGRANCES
SELECTED PRODUCTS ONLY
*T&C Apply
SCAN THIS QR TO VIEW EXCLUSIVE OFFERS
LuLu HYPERMARKET
LuLu FASHION STORE MEN / WOMEN / KIDS
LuLu CONNECT DIGITAL & ELECTRONICS MEGASTORE
Survey No. 1050, Lulu Mall, Balanagar Mandal, Rd Number 3, Kukatpally Housing Board Colony, Kukatpally, Hyderabad, Telangana 500072

డ్రగ్స్ సూత్రధారితో కాంగ్రెస్‌కు సంబంధం

● ఆరోపణలు గుప్పించిన భాజపా

దిల్లీ: దిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ.5,600 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్న కేసులో ప్రధాన సూత్రధారి తుషార్ గోయెల్.. దిల్లీ యూత్ కాంగ్రెస్ ఆర్‌టీఐ సెల్ ఛైర్మన్ అని భాజపా గురువారం ఆరోపించింది. దేశాన్ని నాశనం చేయడంలో ప్రమేయం ఉన్న మాదకద్రవ్యాల వ్యాపారులతో కాంగ్రెస్‌కు సంబంధాలున్నాయని భాజపా అధికార ప్రతినిధి, ఎంపీ సుధాంశు త్రివేది ఆరోపించారు. దీనిపై ఆ పార్టీ వివరణ ఇవ్వాలని కోరారు. 'డ్రగ్స్ సొమ్మును కాంగ్రెస్ తన ప్రచారంలో ఉపయోగిస్తోంది. తుషార్ గోయెల్‌తో పార్టీకి ఉన్న సంబంధం వ్యాపారానికి కూడా విస్తరించిందా? హరియాణాలో అధికారంలోకి వస్తే.. డ్రగ్స్ సరఫరాకు అనుమతి ఇస్తామని కాంగ్రెస్‌కు, మాదకద్రవ్యాల వ్యాపారులకు మధ్య ఏదైనా ఒప్పందం కుదిరిందా? గోయెల్‌కు సీనియర్ కాంగ్రెస్ నాయకులు కేసీ వేణుగోపాల్, దీపేందర్ సింగ్ హుడ్డాతో ఫొటోలున్నాయి. అంతేకాకుండా హుడ్డా ఫోన్ నంబరు కూడా అతడి వద్ద ఉంది. దీనిపై హుడ్డా కుటుంబం వివరణ ఇవ్వాలి' అని సుధాంశు డిమాండ్ చేశారు.

2022లోనే అతడిని బహిష్కరించాం

సుధాంశు ఆరోపణలపై ఇండియన్ యూత్ కాంగ్రెస్(ఐవైసీ) స్పందించింది. గోయెల్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడంతో అతడిని 2022 అక్టోబరు 17న బహిష్కరించినట్లు స్పష్టం చేసింది. హరియాణా ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రతిష్ఠను దిగజార్చేందుకు భాజపా ప్రయత్నిస్తోందని విమర్శించింది.

రాజకీయ సంబంధాలపై దర్యాప్తు

దిల్లీలో మాదక ద్రవ్యాల ముఠాకు చెందిన ఇతర సభ్యులను పట్టుకునేందుకు పోలీసులు పలు బృందాలను ఏర్పాటు చేశారు. ఓ జాతీయ పార్టీకి చెందిన నేతలతో తుషార్ గోయెల్‌కు సంబంధాలున్నట్లు గుర్తించినట్లు వారు గురువారం వెల్లడించారు. ఈ వ్యవహారానికి సంబంధించి జితేందర్ గిల్ అలియాస్ జస్సీ అనే మరో నిందితుడ్ని పోలీసులు గురువారం అమృత్‌సర్ విమానాశ్రయంలో అరెస్టు చేశారు.

అవినీతి, ఆశ్రిత పక్షపాతానికి కాంగ్రెస్ హామీ



దానికి ఆస్కారం ఇవ్వొద్దు ● హరియాణాలో మళ్లీ మాకే అధికారమివ్వండి: మోదీ

దిల్లీ: అవినీతి, కులతత్వం, మతతత్వం, ఆశ్రిత పక్షపాతాలకు హామీగా కాంగ్రెస్ నిలుస్తుందని, అలాంటి పార్టీకి బదులు భాజపాకే హరియాణాలో వరసగా మూడోసారి అధికారమివ్వాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. హరియాణాలో ఎన్నికల ప్రచారానికి గడువు గురువారం సాయంత్రం ముగిసిన నేపథ్యంలో ఈ మేరకు 'ఎక్స్'లో ఆయనొక సందేశం వెలువరించారు. "విభజనవాద, వ్యతిరేక రాజకీయాలకు మారుపేరుగా కాంగ్రెస్ నిలుస్తుంది. దేశభక్తి మెండుగా ఉన్న హరియాణా ప్రజలు ఆ పార్టీని ఆమోదించరు. కాంగ్రెస్ అంటే సిండికేట్లు, అల్లుళ్లకు చిరునామా. తండ్రి-తనయుల రాజకీయాలకు అది మారుపేరు. స్వీయ ప్రయోజనాలే వారికి ముఖ్యం. వర్గ రాజకీయాల్లో వారు తలమునకలై ఉంటారు. అలాంటి పార్టీ ఎన్నటికీ స్థిరమైన సర్కారును ఇవ్వజాలదని ప్రజలకు తెలుసు. కుటుంబాలు ఇస్తున్న ఆదేశాలతో రాష్ట్రాన్ని అవమానించడం హరియాణా ప్రజల మనోభావాలను గాయపరుస్తోంది. కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్ సర్కార్లు ఎలా విఫలమయ్యాయో ప్రజలు చూస్తున్నారు. ఆ పార్టీ విధానాలు ప్రజల్ని నాశనం చేస్తాయి. అందుకే హరియాణాలో హస్తం పార్టీని ప్రజలు కోరుకోవడం లేదు. కులపరమైన హింసను నివారించడంలో విఫలమైన కాంగ్రెస్‌పై దళితులు, వెనుకబడిన వర్గాల్లో ఆగ్రహం ఉంది. రిజర్వేషన్లను అంతం చేయడానికి అనుకూలంగా ఉన్నట్లు కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారు. అలాంటి పార్టీని మరోసారి శిక్షించేందుకు ప్రజలు మానసికంగా సిద్ధమయ్యారు" అని మోదీ చెప్పారు. రాష్ట్రంలో భాజపా అధికారంలో ఉన్న పదేళ్లలో అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. కుంభకోణాలు, అల్లర్ల నుంచి రాష్ట్రాన్ని బయటకు తీసుకువచ్చామని చెప్పారు. దేశాన్ని కాంగ్రెస్ ఎన్నడూ బలోపేతం చేయలేదన్నారు.

గాంధీజీ అహింసావాదం మానవాళికి గొప్ప బలం

● ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెరస్ వ్యాఖ్య



ఐరాస: మహాత్మా గాంధీ ఇచ్చిన అహింస, శాంతి, సమానత్వ సందేశాలు మానవాళికి గొప్ప బలమని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ పేర్కొన్నారు. సమానత్వం, గౌరవం, శాంతి, న్యాయాలకు గాంధీ తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా పాటించే గాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఐరాస కార్యాలయంలో 'గాంధీయన్ వాల్యూస్ అండ్ యూఎన్ చార్టర్' పేరుతో భారతీయ మిషన్ ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా గుటెరస్ గాంధీజీకి నివాళులర్పించారు. అనంతరం సందేశమిచ్చారు. ప్రస్తుతం ప్రపంచం హింసతో ఇబ్బందిపడుతోందని, ఉక్రెయిన్ నుంచి పశ్చిమాసియా దాకా ఘర్షణలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అహింస అనేది మానవాళికి గొప్ప బలమని గాంధీజీ నమ్మేవారని పేర్కొన్నారు. ఘర్షణలు, మానవతా సంక్షోభాలు తలెత్తిన ఈ సమయంలో గాంధీ ప్రవచించిన అహింస, చర్చల వంటి అంశాలు మనకు మార్గం చూపుతాయని ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ అభిప్రాయపడ్డారు. ఐరాస ఉత్తర భాగంలోని మైదానంలో గాంధీజీకి ఆయన నివాళులర్పించారు.

సియాటిల్‌లో విగ్రహావిష్కరణ

వాషింగ్టన్: గాంధీ జయంతి సందర్భంగా బుధవారం అమెరికాలోని ఐటీ నగరం సియాటిల్‌లో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ బ్రూస్ హారెల్, అమెరికా కాంగ్రెస్ సభ్యులు ఆడం స్మిత్, ప్రమీలా జయపాల్ తదితరులు పాల్గొన్నారు. గాంధీజీ అనుసరించిన అహింస, సత్యాగ్రహ, సర్వోదయ గురించి వక్తలు మాట్లాడారు.

దేశాభివృద్ధికి 'డిజిటల్' తరమే కీలకం

● రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



జైపుర్: భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారడంలో జెనరేషన్ 'జడ్' (డిజిటల్ యుగంలో పుట్టిన తరం) ఎంతో కీలకమని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. గురువారం రాజస్థాన్‌లోని ఉదయ్‌పుర్‌లో గల మోహన్‌లాల్ సుఖాడియా యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. స్వార్థం కంటే పరోపకార స్వభావం విద్యార్థుల ప్రతిభ వికసించేందుకు ఎక్కువ దోహదం చేస్తుందన్నారు. 'విద్యకంటే వ్యక్తిత్వం గొప్పదని అంబేడ్కర్ అనేవారు. గుణము, వినమ్రత లేని విద్య ప్రమాదకరమని ఆయన నమ్మకం. మన చదువు పేదలకు హాని చేస్తే ఆ వ్యక్తి సమాజానికి శాపంగా మారవచ్చు. శాస్త్ర సాంకేతిక రంగాలు వేగంగా మారిపోతున్న ఈ దశలో వ్యక్తిత్వాన్ని కాపాడుకోడానికి విధిగా కృషి చేయాలి. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలని మనం ప్రతినబూనాం. ఈ ప్రయాణంలో కీలకపాత్ర పోషించేది మీరే" అని విద్యార్థులనుద్దేశించి ముర్ము అన్నారు.

కోల్‌కతా ఆసుపత్రిలో హత్యాచార బాధితురాలికి మద్దతుగా విగ్రహం

● ఆమెను అవమానించడమే: నెటిజన్ల నిరసన

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ రాజధాని నగరమైన కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాలలో హత్యాచారానికి గురైన జూనియర్ వైద్యురాలికి నివాళిగా విగ్రహాన్ని ఏర్పాటుచేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ విగ్రహం బాధితురాలిని అవమానించేలా ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో పలువురు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. హత్యాచార సమయంలో ఆమె అనుభవించిన క్షోభను ప్రతిబింబించేలా 'క్రై ఆఫ్ ది అవర్' పేరుతో అసిత్ సైన్ అనే శిల్పి ఈ విగ్రహాన్ని రూపొందించారు. దీన్ని ఇటీవల ఆర్‌జీ కర్ వైద్య కళాశాల ప్రాంగణంలోని ప్రిన్సిపల్ కార్యాలయానికి సమీపంలో ప్రతిష్ఠించారు. ఈ చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. "అత్యాచార బాధితురాలిని ఆధారంగా చేసుకొని ఇలాంటి విగ్రహాలను ఎలా ఏర్పాటు చేస్తారు?" అంటూ పలువురు నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు.. ఆర్‌జీ కర్ ఆసుపత్రిలో బుధవారం రోగికి చికిత్స అందిస్తున్న డాక్టర్‌ను బెదిరించి, దుర్భాషలాడిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు.

✦ హత్యాచారానికి గురైన జూనియర్ వైద్యురాలి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని, పని ప్రదేశాల్లో వైద్యులకు భద్రత కల్పించాలని కోరుతూ జూడాలు చేస్తున్న మలిదశ ఆందోళనలు గురువారం మూడోరోజుకు చేరుకున్నాయి. ఆర్‌జీ కర్ ఆసుపత్రి ఘటన తర్వాత బెంగాల్ వైద్య కళాశాలల్లో బెదిరింపుల సంస్కృతి పెరిగిందని వైద్య విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు బెంగాల్ ఆరోగ్యశాఖకు పలు ఫిర్యాదులు కూడా వెళ్లాయి.

టైట్లర్ పాత్ర ఉంది

● 1984 సిక్కు అల్లర్ల కేసులో బాధితుడి భార్య వాంగ్మూలం

దిల్లీ: ఇందిరా గాంధీ హత్యానంతరం దిల్లీలో చెలరేగిన అల్లర్లలో కాంగ్రెస్ నేత జగదీశ్ టైట్లర్ పాల్గొన్నారని ఓ బాధితుడి భార్య కోర్టులో వాంగ్మూలమిచ్చారు. ఉత్తర దిల్లీలోని పుల్ బంగాశ్ గురుద్వారా వద్ద తన భర్తను అల్లరిమూక చంపేసిందని, ఆ సమయంలో టైట్లర్ వచ్చి మూకను ఉసిగొలిపారని పేర్కొన్నారు. ఈ మేరకు లఖ్వీందర్ కౌర్ అనే మహిళ వాంగ్మూలాన్ని ప్రత్యేక కోర్టు జడ్జి రాకేశ్ శ్యాల్ గురువారం రికార్డు చేశారు. ప్రత్యక్ష సాక్షి అయిన సురేందర్ సింగ్ ఈ విషయాన్ని తనతో చెప్పారని కౌర్ వివరించారు. అయితే ఎవరో తెలిపిన విషయాలను బాధితురాలి వాంగ్మూలంగా నమోదు చేయడం తగదని టైట్లర్ తరఫు న్యాయవాది పేర్కొనగా జడ్జి తోసిపుచ్చారు.

ఇరాన్, చైనా, ఉ.కొరియాల్లో గూఢచారులు కావలెను

● సంచలనం సృష్టిస్తున్న సీఐఏ ప్రకటన

వాషింగ్టన్: అమెరికా నిఘాసంస్థ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సీఐఏ) చైనా, ఉత్తర కొరియా, ఇరాన్‌లలో గూఢచారుల (ఇన్‌ఫార్మర్ల) నియామకానికి సామాజిక మాధ్యమాల్లో జారీ చేసిన ప్రకటన సంచలనంగా మారింది. ఔత్సాహికులు తమను ఎలా సంప్రదించాలో కూడా అందులో పేర్కొనడం విశేషం. ఈ మేరకు మాండరీన్ (చైనా), పార్సీ, కొరియా భాషల్లో ఎక్స్, ఫేస్‌బుక్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్, లింక్డిన్ అకౌంట్లలో సీఐఏ పోస్టులు పెట్టింది. చివరకు డార్క్‌వెబ్‌లోనూ ఇటువంటి ప్రకటన వెలువడటం గమనార్హం. వీపీఎన్, టోర్ నెట్‌వర్క్ ఆధారంగా తమ అధికారిక వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కోరింది. ఆయా దేశాలు కేంద్రంగా పనిచేసే వీపీఎన్‌లు మాత్రం వాడొద్దని హెచ్చరించింది. "ప్రపంచం నలుమూలల నుంచి ఎంతోమంది మమ్మల్ని సంప్రదించాలని ప్రయత్నిస్తున్నారు. ఆ పని సురక్షితంగా ఎలా చేయాలో మేము సూచనలు చేస్తున్నాం" అని సీఐఏ పేర్కొంది. రెండేళ్ల కిందట ఉక్రెయిన్‌పై రష్యా దాడి చేశాక.. రష్యా భాషలో ఇటువంటి సూచనలనే సీఐఏ జారీ చేసింది. చైనా, రష్యా, ఉత్తర కొరియా, ఇరాన్ దేశాలు అమెరికా వేదికగా ఉన్న ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలను ఇప్పటికే నిషేధించాయి.

నేడు ఫిరోజ్‌షా రోడ్డులోని ఇంటికి మారనున్న కేజ్రీవాల్



దిల్లీ: ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ శుక్రవారం లుటియన్స్‌లోని ఫిరోజ్‌షా రోడ్డులోని 5వ నంబరు భవనానికి మారనున్నారు. ఆప్ కార్యాలయానికి సమీపంలో ఉన్న ఈ భవనం పంజాబ్ ఆప్ ఎంపీ అశోక్ మిత్తల్‌కు కేటాయించగా.. ప్రస్తుతం అందులో కేజ్రీవాల్ కుటుంబంతో కలిసి ఉండనున్నట్లు ఆప్ నాయకుడు సౌరభ్ భరద్వాజ్ బుధవారం విలేకర్ల సమావేశంలో తెలిపారు. కాగా, దిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోదియా కూడా రాజేంద్రప్రసాద్ రోడ్డులోని నివాసానికి మారారు.

దేవీ నవరాత్రులు శుభాలను కలిగించాలి: మోదీ

దిల్లీ: శరన్నవరాత్రి ఉత్సవాల ఆరంభాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. "శక్తి ఆరాధనకు కేంద్రమైన ఈ పవిత్ర పండుగ అందరికీ శుభాలను కలిగించాలి" అంటూ 'ఎక్స్'లో పేర్కొన్నారు. గురువారం నుంచి మొదలైన దేవీ నవరాత్రుల్లో దేశవ్యాప్తంగా దుర్గాదేవిని వివిధ రూపాల్లో విశేషంగా ఆరాధిస్తారు. చివరి రోజును విజయ దశమిగా జరుపుకొంటారు.

అయోధ్య రామాలయ శిఖరనిర్మాణం ప్రారంభం

అయోధ్య: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రఖ్యాత అయోధ్య రామాలయ శిఖర నిర్మాణం గురువారం ప్రారంభమైంది. 161 అడుగుల ఎత్తున నిర్మించే దీని నిర్మాణం నాలుగు నెలల్లో పూర్తికావచ్చని నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్ర వెల్లడించారు. శిఖరంతో పాటు మందిర ఆవరణలో మరో ఏడు దేవాలయాల నిర్మాణం కూడా మొదలైందన్నారు.

సాయిబాబా విగ్రహాల తొలగింపు.. అదుపులో హిందూ సంస్థ అధిపతి

వారణాసి: స్థానిక దేవాలయాల్లో శిర్డీ సాయిబాబా విగ్రహాల తొలగింపు ఘటనకు సంబంధించి సనాతన రక్షక్ దళ అధిపతి అజయ్ శర్మను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించారంటూ బుధవారం రాత్రి ఆయన్ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయాన్ని ఆయన కుటుంబ సభ్యులకు తెలిపామన్నారు. వారణాసిలో మొత్తం 14 ఆలయాల నుంచి సాయిబాబా విగ్రహాలను మంగళవారం తొలగించారు.



జర్మనీలోని ఉల్మ్‌లో ఉన్న 'ఉల్మెర్ మున్‌స్టర్' కట్టడమిది. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన చర్చిగా ఇది పేరొందింది. 1890 మే 31 నాటికి నిర్మాణ పనులు పూర్తిచేసుకుంది. దీని ఎత్తు 530 అడుగులు. స్పెయిన్‌లో 'లా సగ్రాడా ఫామిలియా బసిలికా' నిర్మాణం పూర్తయితే ఆ కట్టడమే ప్రపంచంలో అత్యంత ఎత్తయిన చర్చిగా నిలవనుంది. బసిలికా చర్చిని 566 అడుగుల ఎత్తుతో నిర్మిస్తున్నారు. 2026 నాటికి నిర్మాణ పనులు పూర్తవుతాయని అంచనా. 1882లో లా సగ్రాడా ఫామిలియా బసిలికా నిర్మాణం మొదలైనా వివిధ రకాల అవాంతరాలు ఎదురయ్యాయి. దీంతో 142 సంవత్సరాలుగా ఈ కట్టడం పూర్తవలేదు.

బెంగాల్ గవర్నర్‌కు నల్లజెండాలతో విద్యార్థుల నిరసన

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్‌కు కోల్‌కతా విశ్వవిద్యాలయం (సీయూ)లో గురువారం జరిగిన ఓ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్ విద్యార్థి విభాగం నుంచి నల్లజెండాలతో నిరసన ఎదురైంది. గవర్నర్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ చర్యపై 'ప్రతి ఒక్కరికీ నిరసన తెలిపే హక్కు ఉంది' అని మీడియా అడిగిన ప్రశ్నకు గవర్నర్ బోస్ సమాధానమిచ్చారు.

పోలీసుల అదుపులో మాజీ ఎంపీ రూపా గంగూలీ

కోల్‌కతా: విధులకు ఆటంకం కలిగిస్తున్నారన్న కారణంతో భాజపాకు చెందిన మాజీ ఎంపీ రూపా గంగూలీని గురువారం కోల్‌కతా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం పేలోడర్ చక్రాల కిందపడి 9వ తరగతికి చెందిన విద్యార్థి మరణించడంతో స్థానికులు పోలీసులను ఘెరావ్ చేశారు. ఈ కార్యక్రమంలో తమపై దౌర్జన్యానికి దిగారన్న ఆరోపణలతో అయిదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారిని విడుదల చేయాలని కోరుతూ బాన్స్‌ద్రోణీ ఠాణా ఎదుట రూపా గంగూలీ ప్రదర్శనకు దిగగా.. కేసు నమోదుచేసి ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఐటీ స్థాయీ సంఘం నుంచి వైదొలగిన జయా బచ్చన్

దిల్లీ: భాజపా ఎంపీ నిశికాంత్ దూబె అధ్యక్షత వహిస్తున్న కమ్యూనికేషన్లు, ఐటీ పార్లమెంటరీ స్థాయీ సంఘం నుంచి సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ జయా బచ్చన్ వైదొలగారు. కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై అధ్యక్షత వహిస్తున్న కార్మిక, టెక్స్‌టైల్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ స్థాయీ సంఘంలో మాత్రం ఆమె కొనసాగనున్నారు. ఐటీ స్థాయీ సంఘంలో బచ్చన్ ఖాళీ చేసిన స్థానాన్ని తృణమూల్ నేత సాకేత్ గోఖలేతో భర్తీ చేస్తూ గురువారం రాజ్యసభ బులెటిన్ విడుదల చేసింది.

అటల్ సేతుపై మరో ఆత్మహత్య

● మూడురోజుల వ్యవధిలో రెండో ఘటన

ముంబయి: మహారాష్ట్రలోని అటల్ సేతు సముద్ర వంతెనపై మూడు రోజుల వ్యవధిలోనే రెండో ఆత్మహత్య ఘటన వెలుగు చూసింది. వంతెనపై నుంచి దూకి ఓ వ్యాపారవేత్త (52) ఆత్మహత్యకు పాల్పడినట్లు గురువారం అధికారులు వెల్లడించారు. సెంట్రల్ ముంబయిలోని మాతుంగ ప్రాంతానికి చెందిన ఫిలిప్ షా అనే వ్యాపారవేత్త బుధవారం ఉదయం అటల్ సేతుపై కారును ఆపి ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. వంతెనపై కారు ఆగి ఉండటాన్ని గుర్తించిన సీసీటీవీ సిబ్బంది విషయాన్ని సహాయక బృందానికి తెలిపారు. దీంతో అప్రమత్తమైన బృందం కారు నిలిపి ఉన్న ప్రాంతానికి చేరుకుని, ఫిలిప్ షా కోసం సముద్రంలో గాలింపు చర్యలు చేపట్టింది. కొద్దిసేపటి అనంతరం అతడిని గుర్తించి ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. అప్పటికే అతడు మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కారులో లభించిన ఆధార్ కార్డు ఆధారంగా మృతుడి వివరాలను తెలుసుకున్నట్లు పోలీసులు వివరించారు. ఆత్మహత్యకు కొన్ని రోజుల ముందు నుంచి ఫిలిప్ షా మానసిక ఒత్తిడికి లోనయ్యాడని పేర్కొన్నారు. కాగా అటల్ సేతుపై సోమవారం కూడా ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది.

పోలీసు స్టేషన్‌పై దాడి.. ఆయుధాల దోపిడీ

● మణిపుర్‌లో ఘటన

ఇంఫాల్: మణిపుర్‌లోని ఉఖ్రుల్ పట్టణంలో నాగా తెగకు చెందిన రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణల్లో ఒక గుంపు పోలీసు స్టేషన్‌పై దాడి చేసి ఆయుధాలను దోచుకున్నట్లు పోలీసులు గురువారం తెలిపారు. వీరిలో ఎక్కువమంది యువకులే ఉన్నట్లు పేర్కొన్నారు. 'స్వచ్ఛతా అభియాన్'లో భాగంగా ఓ వివాదాస్పద భూమిని శుభ్రం చేసే విషయంలో బుధవారం రెండు వర్గాల మధ్య కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా, మరో 20 మంది గాయపడ్డారు. ఈ క్రమంలోనే పోలీసు స్టేషన్‌పై దాడి జరిగింది. ఈ ఘటనలో దుండగులు ఎన్ని ఆయుధాలను దోచుకున్నారో నిర్ధారించలేదని, విచారణ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఉఖ్రుల్‌లో నిషేధాజ్ఞలు విధించామని, మొబైల్ సేవలపై ఆంక్షలు విధించామని వెల్లడించారు. ఏకే-47, ఐఎన్ఎస్ఏఎస్ రైఫిల్స్ మొదలైనవి దోచుకున్న ఆయుధాల్లో ఉన్నట్లు తెలుస్తోంది.

బందీలుగా ఉన్న ఇద్దరు యువకుల విడుదల

మణిపుర్‌లోని కాంగ్‌పోక్పీ జిల్లాలో సాయుధుల వద్ద బందీలుగా ఉన్న ఇద్దరు యువకులు వారంరోజుల తర్వాత విడుదలయ్యారు. గురువారం ఉదయం వీరిని పోలీసులకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. మణిపుర్ రాష్ట్ర పోలీసులు, అస్సాం రైఫిల్స్ అధ్వర్యంలో వీరిని సురక్షితంగా ఇంఫాల్‌కు తరలించినట్లు వెల్లడించారు. గత నెల 27న కీథేల్‌మానబీ ప్రాంతంలో ఎస్ఎస్‌సీ జీడీ పరీక్షకు హాజరయ్యేందుకు ముగ్గురు యువకులు వెళ్లారు. ఈ క్రమంలోనే వారు దారి తప్పడంతో సాయుధుల చేతికి చిక్కారు. వారిలో ఒకరిని సైనికులు రక్షించిన విషయం తెలిసిందే.

గ్వాటెమాల సరిహద్దులో మెక్సికో సైనికుల కాల్పులు

● ఆరుగురు వలసదారుల మృతి

మెక్సికో: గ్వాటెమాల సరిహద్దులో మెక్సికో సైనికులు జరిపిన కాల్పుల్లో ఆరుగురు వలసదారులు మృతి చెందారు. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకున్నట్లు మెక్సికో రక్షణ శాఖ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. "ఈజిప్ట్, నేపాల్, క్యూబా, భారత్, పాకిస్థాన్, ఇతర దేశాల నుంచి వలసదారులను ఎక్కించుకుని ట్రక్, మరో రెండు వాహనాలు చియాపాస్ రాష్ట్రంలోకి రాగానే వాహనంలో కాల్పులు శబ్దాలు వినిపించాయి. దాంతో ఆ వాహనాలపై ఇద్దరు సైనికులు కాల్పులు జరిపారు. దీంతో ఘటన స్థలంలో నలుగురు చనిపోయారు. మరో 12 మంది గాయపడ్డారు. వారిలో మరో ఇద్దరు కొద్దిసేపటికి మృతి చెందారు" అని పేర్కొంది.

కాంగో సరస్సులో పడవ మునక.. 78 మంది మృతి!

గోమ(కాంగో): తూర్పు కాంగోలో విషాదం చోటుచేసుకుంది. కివు సరస్సులో గురువారం పడవ మునగడంతో కనీసం 78 మంది మృతిచెందారు. ఈ ఘటనలో 78 మంది మృతదేహాలను బయటకు తీశారని, మరో 10 మందిని రక్షించి ఆస్పత్రికి తరలించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కిటుకు రేవుకు కొన్ని మీటర్ల దూరంలోనే ఈ పడవ మునిగిపోయిందని పేర్కొన్నారు.


మరో సైనికుడి అంత్యక్రియలు

గోపేశ్వర్: ఐఏఎఫ్ విమానం గల్లంతైన ఘటనలో 56 ఏళ్ల తర్వాత లభించిన జవాను నారాయణ్ సింగ్ బిష్త్ మృతదేహానికి గురువారం ఉత్తరాఖండ్‌లోని కోల్పురి గ్రామంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. అధికారులు, బంధు మిత్రుల మధ్య ఆయన మేనల్లుళ్లు సురేందర్ సింగ్, జైవీర్ సింగ్ కార్యక్రమాలను జరిపించారు. రోహతంగ్ ప్రాంతంలో 1968 ఫిబ్రవరి 7వ తేదీన వాయు సేనకు చెందిన ఏఎన్-12 విమానం గల్లంతైంది. అందులో ప్రయాణిస్తున్న పలువురు గల్లంతు కాగా ఇటీవల కొందరు సైనికుల మృతదేహాలు లభించాయి.

✦ 56 ఏళ్ల కిందట మరణించిన మరో సైనికుడు థామస్ చెరియన్ మృతదేహం గురువారం కేరళకు చేరుకుంది. పథనంతిట్టకు చెందిన చెరియన్ మృతదేహం ఇటీవల రోహతంగ్ ప్రాంతంలో లభ్యమైంది.

పదేళ్లలో 70% హింస తగ్గింది

● కశ్మీర్, నక్సల్ ప్రభావిత ప్రాంతాలపై అమిత్ షా వెల్లడి



అహ్మదాబాద్: గత పదేళ్లలో జమ్మూ కశ్మీర్, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలుసహా ఈశాన్యంలో 70% హింసాత్మక ఘటనలు తగ్గాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. ఈ ప్రాంతాల్లో హింస కారణంగా మరణాలు 72% తగ్గాయని పేర్కొన్నారు. గురువారం అహ్మదాబాద్‌లో నూతన పోలీస్ కమిషనర్ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. 'పదేళ్ల కిందట తరచూ ఎక్కడో ఓచోట బాంబు పేలుళ్లు చోటు చేసుకునేవి. ఈ పదేళ్లలో గణనీయ మార్పు వచ్చింది. ప్రధాని మోదీ నాయకత్వంలో హింసాత్మక చర్యలను అడ్డుకోవడానికి చేపట్టిన చర్యలు విజయవంతమయ్యాయి' అని అమిత్ షా పేర్కొన్నారు.

కుమార్తెను కిడ్నాప్ చేశారని ఫిర్యాదు

● విచారణలో బయటపడిన తండ్రి రాక్షసత్వం

ముంబయి: సెంట్రల్ ముంబయిలోని మహాలక్ష్మి ప్రాంతంలో నివాసముంటున్న ఓ వ్యక్తి (46) తన కుమార్తెను ఎవరో కిడ్నాప్ చేశారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు.. తండ్రే అసలు నేరస్థుడని తెలిసి విస్తుపోయారు. పదిహేడేళ్ల ఆ యువతిని గత అయిదేళ్లుగా తండ్రి లైంగికంగా వేధిస్తూ నరకం చూపించాడు. కన్నవాడి క్రూరత్వం ఇక భరించలేక బుధవారం ఆమె ఇల్లు వదిలి వెళ్లిపోయింది. కిడ్నాప్ కేసు విచారణలో భాగంగా గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు మహాలక్ష్మి రైల్వేస్టేషనులో బాధిత యువతిని గుర్తించి, క్రైం బ్రాంచి కార్యాలయానికి తీసుకువచ్చారు. తండ్రి తనపై చేసిన అఘాయిత్యాలు ఆమె నోట విని అవాక్కయ్యారు. యువతి ఫిర్యాదుతో గురువారం నిందితుడిని అరెస్టు చేసి, పోక్సో తదితర చట్టాల కింద కేసులను నమోదు చేశారు.

రూ.కోటికి టోకరా

● ఒకే కుటుంబానికి చెందిన 19 మందిపై కేసు

ఠాణే: క్రిప్టోకరెన్సీ పథకంలో పెట్టుబడులు పెడితే మంచి లాభాలు వస్తాయని నమ్మించి ఓ వ్యక్తి నుంచి రూ.1.17కోట్లను వసూలు చేసిన ఒకే కుటుంబానికి చెందిన 19 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మహారాష్ట్రలోని ఠాణేలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం క్రిప్టోకరెన్సీ పథకంలో పెట్టిన మొత్తానికి 12 రెట్ల రాబడిని పొందవచ్చు అని చెప్పి ఓ 42 ఏళ్ల వ్యక్తిని నిందితులు నమ్మించారు. దీంతో అతడు రూ.91.53 లక్షలు పెట్టగా.. అతడి సోదరుడు రూ.25.69 లక్షలు చెల్లించాడు. 2022 మార్చిలో ప్రారంభించిన ఈ పథకంలో తమ పెట్టుబడి డబ్బును తిరిగి ఇవ్వాలంటూ నిందితులను బాధితులు అడగ్గా పొంతనలేని సమాధానాలు చెప్పి దాటవేస్తూ వచ్చారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

తైవాన్‌ను అతలాకుతలం చేస్తున్న క్రథాన్


తైపీ: భీకర గాలులు, కుండపోత వర్షాలతో తైవాన్‌ను క్రథాన్ తుపాను వణికిస్తోంది. పెను గాలులకు దక్షిణ తైవాన్‌లో చెట్లు నెలకొరగ్గా.. రోడ్లన్నీ జలమయమయ్యాయి. వందల విమానాలు రద్దయ్యాయి. ఆర్థిక కార్యకలాపాలతోపాటు పాఠశాలలు, కళాశాలలను మూసివేశారు. ప్రధాన ఓడరేవు ప్రాంతమైన కౌసింగ్ నగరంలో గురువారం మధ్యాహ్నం 12.40 గంటల సమయంలో తుపాను తీరం దాటింది. దీంతో శుక్రవారానికి నెమ్మదిగా బలహీనపడుతూ ఉష్ణ మండల అల్పపీడనంగా మారుతుందని దేశ వాతావరణశాఖ ప్రకటించింది.

ఆసుపత్రిలో అగ్ని ప్రమాదం.. 9 మంది మృతి

తైవాన్‌లోని పింగ్‌టుంగ్ కౌంటీలో గురువారం తెల్లవారుజామున ఓ ఆసుపత్రిలో భారీ ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. ఈ దుర్ఘటనలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. మంటల ద్వారా ఎగసిపడిన పొగను పీల్చడంతో 9 మంది మృతి చెందినట్లు అధికారులు తెలిపారు.

ఆమె శరీరంపై హక్కు ఆమెకుగాక ఇంకెవరికి?


● అబార్షన్ హక్కును సమర్థించిన మెలానియా



వాషింగ్టన్: అగ్రరాజ్య అధ్యక్ష ఎన్నికలను ప్రభావితం చేసే కీలకాంశాల్లో అబార్షన్ హక్కు ఒకటి. అధ్యక్ష అభ్యర్థులు కమలా హారిస్, డొనాల్డ్ ట్రంప్ మధ్య గత నెల జరిగిన డిబేట్‌లో గర్భ విచ్ఛిత్తి అంశంపై ఇరువురు వాడీవేడిగా చర్చించారు. ఈ క్రమంలో ట్రంప్ సతీమణి మెలానియా నుంచి కీలక స్పందన వచ్చింది. అబార్షన్ హక్కులపై అధికారం రాష్ట్రాలకే ఉండాలని ట్రంప్ వాదిస్తుండగా.. మెలానియా మాత్రం అబార్షన్ హక్కును సమర్థించారు. 'మెలానియా' పేరుతో అక్టోబరు 8న విడుదల కానున్న పుస్తకంలో ఈ అంశం గురించి ఆమె తన అభిప్రాయాన్ని పొందుపరిచారని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. 'ఆమె శరీరం గురించి నిర్ణయాలు తీసుకునే హక్కు ఆమెకు గాకుండా ఇంకెవరికో ఎందుకు ఉండాలి.. అవాంఛిత గర్భానికి సంబంధించి ఒక మహిళ తీసుకునే నిర్ణయాన్ని పరిమితం చేయడం.. ఆమె సొంత శరీరంపై నియంత్రణను నిరాకరించడం కిందికే వస్తుంది' అని ఆమె రాసుకొచ్చారు. నవంబరు 5న ఎన్నికలు జరగనుండగా.. దానికి కొన్ని వారాల ముందు ఈ పుస్తకం విడుదల కానుంది.

ఈనాడు సినిమా

పండగ తర్వాత బరిలోకి


రవితేజ

రవితేజ కథానాయకుడిగా భాను భోగవరపు ఓ చిత్రం తెరకెక్కిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. శ్రీలీల కథానాయిక. ఆమధ్య ఈ చిత్ర యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరణ సమయంలో రవితేజ గాయపడటంతో షూటింగ్ తాత్కాలికంగా ఆగిన సంగతి తెలిసిందే. ఇప్పుడాయన తిరిగి కోలుకోవడంతో సినిమాని పునః ప్రారంభించేందుకు సిద్ధమైంది చిత్ర బృందం. దీనిలో భాగంగా ఈనెల 14 నుంచి ఈ చిత్ర కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించనున్నారని సమాచారం. సుదీర్ఘంగా సాగే ఈ షెడ్యూల్‌లో రవితేజతో పాటు ముఖ్య తారాగణంపై టాకీ పార్ట్ చిత్రీకరించనున్నట్లు తెలిసింది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబవుతోన్న ఈ సినిమాలో రవితేజ రైల్వే పోలీస్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) అధికారిగా కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఇది వేసవి సందర్భంగా ప్రేక్షకుల ముందుకొచ్చే అవకాశముంది.


ఈటీవీ విన్‌లో 'భలే ఉన్నాడే'


రాజ్‌తరుణ్, మనీషా

కథానాయకుడు రాజ్ తరుణ్, మనీషా కంద్కూర్ జంటగా నటించిన చిత్రం 'భలే ఉన్నాడే'. మారుతి సమర్పణలో జె.శివసాయి వర్ధన్ తెరకెక్కించారు. ఎన్వీ కిరణ్ నిర్మించారు. వినోదంతో కూడిన ఓ వినూత్నమైన ప్రేమ కథాంశంతో రూపొందిన ఈ సినిమా ఇటీవలే విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. ఇందులో అమ్మాయిలకు దూరంగా ఉండే వ్యక్తిగా రాధ అనే పాత్రలో రాజ్‌తరుణ్, కృష్ణగా మనీషా కనిపించి ప్రేక్షకులను అలరించారు. ఇప్పుడీ చిత్రం ప్రముఖ ఓటీటీ వేదిక ఈటీవీ విన్‌లో ప్రసారమవుతోంది. మరి ఈ రాధాకృష్ణల ప్రేమకథ సుఖాంతమైందా..? లేదా? అనేది తెలియాలంటే ఈటీవీ విన్‌లో మీరూ ఈ సినిమా చూసేయండి.

ETV WIN

నేరుగా ఓటీటీలో విడుదల?


కమల్‌హాసన్

'భారతీయుడు3' నేరుగా ఓటీటీలో విడుదల కానుందా? అవుననే అంటున్నాయి తమిళ సినీ పరిశ్రమ వర్గాలు. ఆ దిశగానే ప్రముఖ ఓటీటీ సంస్థతో చిత్రబృందం సంప్రదింపులు జరుపుతున్నట్టు సమాచారం. కమల్‌హాసన్ కథానాయకుడిగా, శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. విజయవంతమైన 'భారతీయుడు'కి కొనసాగింపుగా రెండు, మూడు భాగాల్ని తెరకెక్కించారు. ఈ ఏడాది జులైలో విడుదలైన 'భారతీయుడు 2' ప్రేక్షకాదరణ పొందలేదు. దాంతో మూడో భాగం సినిమా థియేట్రికల్ వ్యాపారానికి సమస్యలు ఎదురవుతున్నాయి. అది దృష్టిలో ఉంచుకునే చిత్రబృందం మూడో భాగాన్ని నేరుగా ఓటీటీలో విడుదల చేయడంపై దృష్టిపెట్టినట్టు సమాచారం. దీనిపై చిత్రబృందం నుంచి మాత్రం ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రంలో కమల్‌తోపాటు, సిద్ధార్థ్, కాజల్, రకుల్‌ప్రీత్ సింగ్, ప్రియా భవానీ శంకర్ తదితరులు నటించారు.

"ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని అందించే చిత్రం 'శ్వాగ్'. ప్రథమార్ధం వినోదం, సస్పెన్స్‌తో ఆసక్తి రేకెత్తించేలా ఉంటే.. ద్వితీయార్ధం మరో భిన్నమైన అనుభూతిని అందిస్తుంది'' అన్నారు నిర్మాత టీజీ విశ్వప్రసాద్. ఆయన నిర్మాణంలో శ్రీవిష్ణు హీరోగా హసిత్ గోలి తెరకెక్కించిన చిత్రమే 'శ్వాగ్'. ఇది ఈరోజు థియేటర్లలోకి వస్తోంది. ఈ నేపథ్యంలోనే గురువారం విశ్వప్రసాద్ హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

శ్వాగ్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నాం


టీజీ విశ్వప్రసాద్

"శ్రీవిష్ణు ఎక్కువగా వినోదాత్మక చిత్రాలతోనూ.. కథా బలమున్న సినిమాలతోనూ అలరిస్తూ వస్తున్నారు. 'శ్వాగ్' మాత్రం వినోదంతో నిండి ఉంటూనే బలమైన కథాంశమున్న చిత్రంగా ఉంటుంది. ఇది ఓ వంశ వృక్షంలోని కొన్ని తరాల కథ. ఆడ, మగ ఎవరు గొప్ప అనే అంశం చుట్టూ తిరుగుతుంది. ఇందులో విష్ణు నాలుగు విభిన్నమైన పాత్రల్లో కనిపిస్తారు. అలాగే దాదాపు తొమ్మిదికి పైగా గెటప్పులతో అలరిస్తారు''.

- "ఇక్కడి దాకా సాగిన మా సంస్థ ప్రయాణాన్ని చూసుకుంటే మేము ఇప్పటి వరకు మంచి కంటెంట్‌తో కూడిన కమర్షియల్ చిత్రాలు చాలానే ఇచ్చాం. అయితే 'ఈగల్', 'మిస్టర్ బచ్చన్' ఫలితాలు చూశాక 'శ్వాగ్' విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. కమల్‌హాసన్ 'ఇంద్రుడు చంద్రుడు', 'మైఖేల్ మదన కామరాజు'ల్లోని క్యారెక్టరైజేషన్స్ మొత్తాన్ని కలిపి ఈ సినిమాలోని పాత్రల్ని సిద్ధం చేసినట్లు ఉంటుంది''.
- "మేము ఒకేసారి ఎక్కువ సినిమాల్ని నిర్మించడం అది చిత్ర ఫలితాల్ని దెబ్బ తీస్తుందని నేనైతే అనుకోను. నేను మా సంస్థ నుంచి ఎక్కువ కంటెంట్ తీసుకు రావాలనుకుంటున్నా. టెక్నాలజీని వినియోగించి లార్జర్ దేన్ లైఫ్ సినిమాల్ని ఎలా తీసుకు రావాలన్న దానిపై దృష్టి పెట్టా. వీలైనంత వరకు పాన్ వరల్డ్ స్థాయి చిత్రాలతో రావాలనుకుంటున్నాం. ప్రస్తుతం మా సంస్థలో నిర్మితమవుతున్న 'రాజాసాబ్', 'మిరాయ్', 'జీ2' చిత్రాల్ని విదేశీ భాషల్లోనూ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. 'రాజాసాబ్'ను నవంబరు నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్నాం. ఈ నెల ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా కచ్చితంగా ఓ సర్‌ప్రైజ్ ఇవ్వనున్నాం. ఇక ఈ చిత్రం రెండు భాగాలుగా ఉంటుందా? లేదా? అన్నది దర్శకుడు మారుతి స్పష్టత ఇస్తారు''.
- "మేము ప్రస్తుతం కన్నడ చిత్ర పరిశ్రమలో డిస్ట్రిబ్యూషన్ చేస్తున్నాం. వచ్చే ఏడాది దాదాపు నాలుగు సినిమాలు ప్రారంభించాలని సన్నాహాలు చేస్తున్నాం. అక్కడ మా తొలి చిత్రాన్ని హీరో గణేష్‌తో చేయనున్నాం. అలాగే శివ రాజ్‌కుమార్‌తో మరో ప్రాజెక్ట్ చేయనున్నాం. త్వరలో మా సంస్థ నుంచి 'హరికథ', 'న్యూసెన్స్ 2' వెబ్‌సిరీస్‌లు రానున్నాయి''.

ఆద్యంతం నవ్వించే చిత్రమిది

ఈ దసరాకి 'జనక అయితే గనక'తో అలరించేందుకు సిద్ధమవుతున్నారు నటుడు సుహాస్. ఆయన.. సంకీర్తన జంటగా నటించిన ఈ చిత్రాన్ని దిల్‌రాజు ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించింది. సందీప్ బండ్ల దర్శకత్వం వహించారు. ఈ సినిమా ఈనెల 12న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ.. "మంచి సినిమా తీశాం. అందుకే ఇప్పటికే నాలుగు షోలు వేశాం. చూసిన వాళ్లందరి


సందీప్, దిల్‌రాజు, సుహాస్, సంకీర్తన

నుంచి మంచి స్పందన లభించింది. ఆద్యంతం వినోదాత్మకంగా సాగే చిత్రమిది. అందర్నీ అలరించేలా ఉంటుంది'' అన్నారు. "భార్యాభర్త, అమ్మ, అమ్మమ్మ.. ఇలా అందరి కోణంలో సాగే చిత్రమిది. తప్పకుండా అన్ని వయసుల ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది'' అన్నారు నిర్మాత హర్షిత్ రెడ్డి. నటుడు సుహాస్ మాట్లాడుతూ.. "ఈ చిత్రం యూఎస్‌లో 10న విడుదలవుతుంది. మన దగ్గర 12న వస్తుంది. దీన్ని తప్పకుండా థియేటర్స్‌లో చూడండి. ఇది కచ్చితంగా ఎవరినీ నిరుత్సాహపరచదు. ఇప్పటి వరకు సినిమా చూసిన దర్శకులంతా బాగుందని మెచ్చుకుంటున్నారు. నా గత చిత్రాలకంటే ఇంకా బాగా వచ్చిందని ప్రశంసిస్తున్నారు'' అన్నారు. ఈ కార్యక్రమంలో సందీప్ బండ్ల, సంకీర్తన, రాకేశ్ వర్రె తదితరులు పాల్గొన్నారు.

యావత్ దేశాన్ని కదిలించే చరిత్ర


వివేక్ అగ్నిహోత్రి

'ది తాష్కెంట్ ఫైల్స్', 'ది కశ్మీర్ ఫైల్స్' లాంటి భిన్నమైన కథలతో సంచలనం సృష్టించారు బాలీవుడ్ దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి. ఇప్పుడాయన మరో శక్తిమంతమైన కథతో 'ది దిల్లీ ఫైల్స్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు ఇటీవలే ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా దీన్ని రెండు భాగాలుగా రూపొందిస్తున్నట్లు తెలుపుతూ.. మొదటి భాగం విడుదల తేదీని సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకున్నారు దర్శకుడు. "ఎన్నో సంవత్సరాల పరిశోధన తర్వాత 'ది దిల్లీ ఫైల్స్' చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయాలని నిర్ణయించుకున్నాము. యావత్ దేశాన్ని కదిలించే చరిత్రతో ఈ ప్రయాణాన్ని ప్రారంభించాం. తొలి భాగాన్ని 'ది బెంగాల్ చాప్టర్' పేరుతో వచ్చే ఏడాది ఆగస్టు 15న మీ ముందుకు తీసుకురాబోతున్నాం" అని వ్యాఖ్యల్ని జోడించారు. అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో మిథున్ చక్రవర్తి కీలక పాత్రలో నటిస్తున్నారు.

రోటి కపడా.. 25న


సందీప్, సోనూ

హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా ప్రధాన పాత్రల్లో విక్రమ్ రెడ్డి తెరకెక్కించిన చిత్రం 'రోటి కపడా రొమాన్స్'. బెక్కెం వేణుగోపాల్, సృజన్ కుమార్ బొజ్జం సంయుక్తంగా నిర్మించారు. సోనూ ఠాకూర్, నువేక్ష, మేఘ లేఖ, ఖుష్బూ చౌదరి కథానాయికలు. ఈ సినిమా ఈనెల 25న థియేటర్లలోకి రానుంది. ఈ విషయాన్ని చిత్ర వర్గాలు గురువారం ప్రకటించాయి. ఈ సందర్భంగా దర్శకుడు విక్రమ్ మాట్లాడుతూ.. "ఇది ప్రేమ, భావోద్వేగాలతో నిండిన ప్రయాణంలా ఉంటుంది. హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం ఆకర్షణగా నిలుస్తుంది. తప్పకుండా హిట్ కొడతాం" అన్నారు. "యువతరంకు నచ్చే అంశాలతో పాటు కుటుంబ భావోద్వేగాల మేళవింపుతో ఈ సినిమా రూపొందింది. దీంట్లోని ప్రతి పాత్ర అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది" అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్, ఆర్.ఆర్.ధ్రువన్, జి.వసంత్, ఛాయాగ్రహణం: సంతోష్ రెడ్డి.


వరుణ్ తేజ్, ప్రియదర్శి, ప్రిన్స్, అల్లరి నరేశ్, ఆకాశ్ జగన్నాథ్

ఆత్మహత్యలు వద్దని చెప్పే మంచి కథతో..

"మంచి కథా బలమున్న చిత్రాల్ని తెలుగు ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారు. అలాంటి చక్కటి కథతోనే రూపొందిన 'కలి'ని కూడా విజయవంతం చేస్తారని ఆశిస్తున్నా" అన్నారు హీరో వరుణ్ తేజ్. ప్రిన్స్, నరేశ్ అగస్త్య ప్రధాన పాత్రల్లో శివ శేషు తెరకెక్కించిన చిత్రమే 'కలి'. లీలా గౌతమ్ వర్మ నిర్మాత. ఈ సినిమా ఈరోజు విడుదలవుతున్న సందర్భంగా హైదరాబాద్‌లో ఇటీవల ముందస్తు విడుదల వేడుక నిర్వహించారు. హీరోలు వరుణ్ తేజ్, అల్లరి నరేశ్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ.. "ఆత్మహత్యలు వద్దనే మంచి కథాంశంతో 'కలి' వస్తోంది. దీన్ని తప్పకుండా థియేటర్లలోనే చూడండి. ఇది పెద్ద విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నా" అన్నారు. "మనం బాధ పడితే ఆ బాధ మనకు మాత్రమే తెలుస్తుంది. అదే తిరిగి నిలబడి ఎదిగితే అది పది మందికి తెలుస్తుంది. ఇదే ఈ చిత్ర కాన్సెప్ట్. ఇందులో ప్రిన్స్, నరేశ్ నటన అందర్నీ అలరిస్తుంది. మా ప్రయత్నాన్ని ఆదరిస్తారని కోరుకుంటున్నా" అన్నారు దర్శకుడు శివ శేషు. హీరో ప్రిన్స్ మాట్లాడుతూ.. "హీరో ఉదయ్‌కిరణ్‌తో పాటు నా క్లోజ్ ఫ్రెండ్స్ ఆత్మహత్యలు నన్ను చాలా కాలం బాధించాయి. ఈ ఆత్మహత్యల్ని చూశాక వీటి నివారణకు నా వంతుగా ఏదోకటి చేయాలనిపించింది. అప్పుడే 'కలి' కథ నా దగ్గర కొచ్చింది. ఇదెక్కడా మిమ్మల్ని బాధపెట్టేలా ఉండదు. థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం అలరిస్తుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, సినీతారలు ప్రియదర్శి, ఆకాశ్ జగన్నాథ్, వేణు యెల్దండి, నేహా కృష్ణన్, లీలా గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ప్రేమికుడూ గుర్తుపెట్టుకునేలా..

అంజన్ రామచంద్ర, శ్రావణిరెడ్డి జంటగా తెరకెక్కిన చిత్రం 'లవ్ రెడ్డి'. స్మరణ్ రెడ్డి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సునంద.బి రెడ్డి, హేమలత రెడ్డి, రవీందర్.జి, మదన్ గోపాల్ రెడ్డి, నాగరాజ్ బీరప్ప, ప్రభంజన్ రెడ్డి, నవీన్ రెడ్డి నిర్మాతలు. ఈ నెల 18న ప్రేక్షకుల ముందుకొస్తోందీ చిత్రం. ఇటీవల హైదరాబాద్‌లో టీజర్ విడుదల కార్యక్రమం జరిగింది. 'ప్రపంచంలో ప్రతి ప్రేమికుడూ పది కాలాలపాటు గుర్తు పెట్టుకునే కథ. ..' అంటూ టీజర్‌తో సినిమా నేపథ్యాన్ని పరిచయం చేశారు. కథానాయకుడు మాట్లాడుతూ "ప్రేమకథల్లో కొత్త కోణాన్ని ఆవిష్కరించే చిత్రమిది. థియేటర్ నుంచి బయటికొచ్చాక ప్రేక్షకులు కొంతకాలంపాటు ఈ కథతో ప్రయాణం చేస్తారు. చివర్లో ఒక గొప్ప అనుభూతితో బయటికొస్తార"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "లఘు చిత్రం కోసం కలిశాం నేనూ, అంజన్ రామచంద్ర. ఆ ప్రయాణం మమ్మల్ని ఇక్కడి వరకూ తీసుకొచ్చింది. మైత్రీ సంస్థ ద్వారా ఈ సినిమా విడుదల అవుతుండడం ఆనందంగా ఉంది'' అన్నారు. ప్రతి ఒక్కరూ ఆస్వాదించేలా ఈ చిత్రం ఉంటుందన్నారు నిర్మాత మదన్. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.


అంజన్ రామచంద్ర, శ్రావణిరెడ్డి

శ్రీదేవిలా నటించడం అసాధ్యం!


రకుల్

శ్రీదేవి లాంటి గొప్ప లెజెండ్ పాత్రలో నటించడం తన కెరీర్‌లో మర్చిపోలేని విషయమని అంటోంది అందాల తార రకుల్ ప్రీత్ సింగ్. ఇటీవలే 'భారతీయుడు 2'తో తెరపై సందడి చేసిందీమె. ప్రస్తుతం అగ్రకథానాయకుడు అజయ్ దేవగణ్‌తో కలిసి 'దే దే ప్యార్ దే 2' చిత్రీకరణలో ఉన్న రకుల్.. 'ఎన్టీఆర్:కథానాయకుడు' చిత్రంలో శ్రీదేవి పాత్రలో కనిపించి ప్రేక్షకుల్ని మెప్పించిన సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. ఇందులో నటించడం గురించి తన అనుభవాలను పంచుకుంది. "నా కెరీర్‌లో మర్చిపోలేని అద్భుతమైన క్షణాలలో ఇదీ ఒకటి. ఇందులో నాదీ అతిథి పాత్ర. అలనాటి కథానాయిక శ్రీదేవిలాగా నటించడం నాకు చాలా గౌరవప్రదమైన విషయం. నాకు తెలిసి ఆమెలాంటి వారు ఎవరూ ఉండరు. తనలా నటించడం కూడా అసాధ్యమనేది నా అభిప్రాయం. శ్రీదేవి లాంటి లెజెండ్ పాత్రను పోషించడం గొప్ప అనుభవం" అని చెప్పుకొచ్చింది రకుల్.

అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో ధూమ్ 4


అయాన్ ముఖర్జీ

వేక్ అప్ సిద్, 'బ్రహ్మాస్త్ర' లాంటి విజయవంతమైన చిత్రాలతో ప్రేక్షకులను మెప్పించారు బాలీవుడ్ దర్శకుడు అయాన్ ముఖర్జీ. ప్రస్తుతం ఎన్టీఆర్, హృతిక్ రోషన్ నటిస్తున్న 'వార్ 2' సినిమాను తీర్చిదిద్దే పనిలో ఉన్నారు. ఇప్పుడాయన మరో భారీ ప్రాజెక్టును తన ఖాతాలో వేసుకున్నట్లు తెలుస్తోంది. విశేష ప్రేక్షకాదరణను సొంతం చేసుకున్న 'ధూమ్' ఫ్రాంఛైజీలో నాలుగో భాగం రాబోతున్న సంగతి తెలిసిందే. బాలీవుడ్ కథానాయకుడు రణ్‌బీర్ కపూర్ ఈ చిత్రంలో ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు దర్శకుడిగా అయాన్ ముఖర్జీని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ విషయమై ఆదిత్య చోప్రా ఆయనతో చర్చలు జరుపుతున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఇప్పటికే దీనికి సంబంధించిన స్క్రిప్ట్ పనులు పూర్తయినట్లు, త్వరలో అధికారికంగా ప్రకటించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

ప్రేయసిగా సోనమ్‌ను అంగీకరించని సల్మాన్

ఔను... నిజమే!

"ప్రేమ్ రతన్ ధన్ పాయో".. కుటుంబ కథా నేపథ్యంలో సూరజ్ బర్జాత్యా తెరకెక్కించిన సినిమా ఇది. బాలీవుడ్ అగ్రకథానాయకుడు సల్మాన్ ఖాన్, సోనమ్ కపూర్ జంటగా నటించిన ఈ సినిమా 2015లో విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. ఇందులో 'జతకడతావో.. మాటేస్తావో' అంటూ ప్రేమపాటలు పాడుతూ సినీప్రియుల్ని మురిపించిందీ జంట. కానీ.. ఈ చిత్రంలో తన ప్రేయసిగా నటించడానికి సోనమ్ కపూర్‌ను అంగీకరించలేదట సల్మాన్. ఔను నిజమే అంటున్నారు దర్శకుడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన.. సల్మాన్ ఈ సినిమాలో సోనమ్‌ను ప్రేయసిగా అంగీకరించడానికి ఐదునెలల సమయం పట్టిందంటూ కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. "నేను ఈ సినిమా స్క్రిప్ట్‌ను సిద్ధం చేసి సల్మాన్‌తో కథానాయికల గురించి చర్చిస్తున్నాను. అప్పటికే ఎంతో మంది అందాల తారలు చిత్రపరిశ్రమలో రాణిస్తున్నా కొత్త జంటను ప్రేక్షకులకు పరిచయం చేయాలని నిర్ణయించుకున్నాం. 'రాంఝనా' సినిమా చూసిన తర్వాత ఈ చిత్రంలోని యువరాణి పాత్రకు సోనమ్ అయితే సరిగ్గా సరిపోతుందని అనిపించి ఆమె ఫొటోలను సల్మాన్‌కు పంపించాను. వాటిని చూసి "ఆమె చాలా పొడవుగా ఉంది. దీంతో పాటు సోనమ్ నా కళ్లముందు పెరిగిన అమ్మాయి. నాకంటే చాలా చిన్నది. నేను ఆమెను ఎలా ప్రేయసిగా ఊహించుకోగలను" అని అన్నారు. ఇంతకు ముందు ఆమెతో నటించిన 'సావరియా' చిత్రాన్ని గుర్తుచేస్తూ.. సల్మాన్‌ను ఒప్పించాన"ని ఆనాటి సంగతులను గుర్తుచేసుకున్నారు దర్శకుడు.



ఈనాడు బిజినెస్

కియా నుంచి 2 కార్లు

- ఈవీ9 @ రూ.1.3 కోట్లు
- కార్నివాల్ లిమోసిన్ ధర రూ.63.9 లక్షలు



దిల్లీ: కియా ఇండియా రెండు కొత్త కార్లను దేశీయ విపణిలోకి ప్రవేశ పెట్టింది. ఇప్పటికే విద్యుత్ వాహనం ఈవీ6 (ప్రారంభ ధర రూ.60.96 లక్షలు) మోడల్‌ను విక్రయిస్తున్న ఈ కంపెనీ, గురువారం మరో విద్యుత్ మోడల్ ఈవీ9ను ఆవిష్కరించింది. దీని ధర రూ.1.3 కోట్లు. రూ.63.9 లక్షల ధరతో కార్నివాల్ లిమోసిన్‌ను సైతం కియా ఇండియా మార్కెట్‌కు పరిచయం చేసింది.

✦ అత్యధిక విక్రయాలకు అవకాశం ఉన్న విద్యుత్ వాహనాన్ని(ఈవీ) వచ్చే ఏడాది విడుదల చేసి, 2030కి 4 లక్షల వార్షిక విక్రయాలు లక్ష్యంగా పెట్టుకున్నటమని కియా ఇండియా ఎండీ గ్వాంగు లీ పేర్కొన్నారు.

రూ.49,999 నుంచి ఎస్1 స్కూటర్: ఓలా



దిల్లీ: విద్యుత్ స్కూటర్ల తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్, 'బాస్' (బిగ్గెస్ట్ ఓలా సీజన్ సేల్) పేరిట ప్రత్యేక విక్రయాలను గురువారం ప్రారంభించింది. ఎస్1 స్కూటర్‌లో ప్రారంభమోడల్ (ఎస్1ఎక్స్)ను రూ.49,999 నుంచి విక్రయిస్తామని కంపెనీ తెలిపింది. 2 కిలోవాట్ బ్యాటరీ ఉండే ఈ స్కూటర్‌ను ఒకసారి ఛార్జి చేస్తే 95 కిలోమీటర్ల వరకు ప్రయాణించొచ్చని, గరిష్ఠవేగం 85 కిలోమీటర్లని సంస్థ పేర్కొంది. నిల్వలున్నంత వరకే ఈ స్కూటర్‌ను తక్కువ ధరకు విక్రయిస్తామని వివరించింది. గతంలో ఈ స్కూటర్ ప్రారంభ ధర రూ.70,000గా ఉండేది.

బిగ్‌సి దసరా ధమాకా ఆఫర్లు

దసరా పండుగ సందర్భంగా ధమాకా ఆఫర్లు ఇస్తున్నట్లు బిగ్‌సి సీఎండీ ఎం.బాలు చౌదరి తెలిపారు. ప్రతి మొబైల్ కొనుగోలుపై రూ.10,000 వరకు ప్రొటెక్షన్ పథకం, రూ.10 వేల వరకు తక్షణ క్యాష్ బ్యాక్, రూ.5,999 వరకు విలువైన కచ్చిత బహుమతి ఇస్తామన్నారు. ఓపో మొబైల్ కొనుగోలుపై రూ.10 లక్షల వరకు, వివో - రియల్‌మీ-ఎంఐ మొబైల్స్ కొనుగోలుపై లక్కీడ్రా ద్వారా మొబైళ్లు, బైక్‌లు, కార్లు, మరెన్నో బహుమతులు గెలుపొందే అవకాశం ఉందన్నారు. డెబిట్ కార్డుపై ఎటువంటి డౌన్‌పేమెంట్ లేకుండా వడ్డీలేని సులభ వాయిదాల్లో ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఏసీలు, టీవీలు కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు.

ఒకసారి ఛార్జింగ్‌తో 160 కిలోమీటర్లు

మహీంద్రా జియో @ రూ.7.52 లక్షలు



దిల్లీ: మహీంద్రా అండ్ మహీంద్రా అనుబంధ సంస్థ మహీంద్రా లాస్ట్ మైల్ మొబిలిటీ లిమిటెడ్, విద్యుత్తుతో నడిచే చిన్నపాటి వాణిజ్య వాహన విభాగంలోకి అడుగుపెడుతున్నట్లు ప్రకటించింది. 2 టన్నుల కంటే తక్కువ విభాగంలో జియో విద్యుత్ వాహనాన్ని పరిచయం చేసింది. దీని ప్రారంభ ధర రూ.7.52 లక్షలు (ఎక్స్‌షోరూమ్). జియోకు సుమారు 12,000 ఆర్డర్లు లభించాయని, ఈ వాహనాన్ని ఒకసారి ఛార్జింగ్ చేస్తే 160 కిలోమీటర్లు ప్రయాణించొచ్చని మహీంద్రా లాస్ట్ మైల్ ఎండీ, సీఈఓ సుమన్ మిశ్రా తెలిపారు.

థార్ రాక్స్‌కు గంటలో 1.76 లక్షల బుకింగ్‌లు: మహీంద్రా ఎస్‌యూవీ మోడల్ 'థార్ రాక్స్'కు బుకింగ్ ప్రారంభమైన గంటలోనే 1.76 లక్షల ఆర్డర్లు వచ్చాయని కంపెనీ తెలిపింది. దసరా నుంచి (అక్టోబరు 12) ఈ వాహన డెలివరీలు ప్రారంభం అవుతాయి.

యుద్ధ బేర్ మోగింది



- పశ్చిమాసియా ఉద్రిక్తతలతో వెల్లువెత్తిన అమ్మకాలు
- మూడు వారాల కనిష్ఠానికి సెన్సెక్స్
- ఒక్కరోజులో రూ.9.78 లక్షల కోట్ల సంపద ఆవిరి

సెన్సెక్స్ భారీ నష్టాలు

1)	2024 జూన్ 4	4390 పాయింట్లు
2)	2020 మార్చి 23	3935 పాయింట్లు
3)	2020 మార్చి 12	2919 పాయింట్లు
4)	2020 మార్చి 16	2713 పాయింట్లు
5)	2022 ఫిబ్రవరి 24	2702 పాయింట్లు
6)	2024 ఆగస్టు 5	2223 పాయింట్లు
7)	2020 మే 4	2002 పాయింట్లు
8)	2020 మార్చి 9	1942 పాయింట్లు
9)	2020 ఫిబ్రవరి 26	1939 పాయింట్లు
10)	2024 అక్టోబరు 3	1769 పాయింట్లు

ఎఫ్ఐఐల అమ్మకాలు: రూ.15,243 కోట్లు
డీఐఐల కొనుగోళ్లు: రూ.12,913 కోట్లు

సెన్సెక్స్ ▼1769 82497 | నిఫ్టీ ▼547 25250

ఇరాన్- ఇజ్రాయెల్ యుద్ధ ప్రకంపనలతో, దేశీయ స్టాక్ సూచీలపై బేర్ పట్టుబిగించింది. వరుసగా నాలుగో రోజైన గురువారం సూచీలు భారీగా నష్టపోయాయి. ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ నష్టాల నుంచి చిన్న మదుపర్లను రక్షించే ఉద్దేశంతో సెబీ తీసుకొచ్చిన కొత్త నిబంధనలూ కలవరపెట్టాయి. ప్రధానంగా చమురు, బ్యాంకింగ్, వాహన షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తగా.. సెన్సెక్స్ దాదాపు మూడు వారాల కనిష్ఠానికి పడిపోయింది. సెప్టెంబరు 11 తర్వాత సెన్సెక్స్‌కు ఇదే అత్యల్ప ముగింపు. డాలర్‌తో పోలిస్తే రూపాయి 14 పైసలు తగ్గి 83.96 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 1.87% లాభంతో 74.91 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

✦ సూచీల నష్టాలతో మదుపర్ల సంపదగా పరిగణించే, బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ గురువారం రూ.9.78 లక్షల కోట్లు తగ్గి రూ.465.07 లక్షల కోట్ల (5.54 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

✦ సెన్సెక్స్ 1264 పాయింట్ల క్రితం ముగింపు 84,266.29) నష్టంతో 83,002.09 వద్ద ప్రారంభమైంది. ఆరంభంలో కోలుకునే ప్రయత్నం చేసిన సూచీ, 83,752.81 వద్ద గరిష్ఠాన్ని నమోదుచేసింది. కానీ అమ్మకాల ఉద్ధృతితో 82,434.02 పాయింట్లకు పడింది. చివరకు 1769.19 పాయింట్ల నష్టంతో 82,497.10 వద్ద ముగిసింది.

✦ బ్రోకరేజీ షేర్లు కుదేల్: ఎఫ్ అండ్ ఓ నిబంధనలను సెబీ కఠినతరం చేసిన నేపథ్యంలో బ్రోకరేజీ కంపెనీల షేర్లు నీరసపడ్డాయి. ఎస్ఎమ్‌సీ గ్లోబల్ 3.50%, 5పైసా క్యాపిటల్ 2.91%, ఏంజెల్ వన్ సెక్యూరిటీస్ 2.38%, ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్ 2.16% చొప్పున నష్టపోయాయి.

సెన్సెక్స్‌కు ఈ ఏడాదిలో ఇది మూడో అతిపెద్ద పతనం. నిఫ్టీ 546.80 పాయింట్లు కోల్పోయి 25,250.10 వద్ద స్థిరపడింది.

✦ రిలయన్స్ షేరు డీలా: అమ్మకాల ఒత్తిడితో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 3.91% తగ్గి రూ.2,815.25 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.77,606.98 కోట్లు కోల్పోయి రూ.19.04 లక్షల కోట్లకు పరిమితమైంది.

✦ 29 షేర్లకు నష్టాలు: సెన్సెక్స్ 30 షేర్లలో 29 కుప్పకూలాయి. ఎల్ అండ్ టీ 4.18%, యాక్సిస్ బ్యాంక్ 4.12%, టాటా మోటార్స్ 4.08%, మారుతీ 3.90%, ఏషియన్ పెయింట్స్ 3.88% చొప్పున క్షీణించాయి. జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ఒక్కటే 1.18% పెరిగింది. రంగాల వారీ సూచీల్లో స్థిరాస్తి 4.49%, యంత్ర పరికరాలు 3.18%, వాహన 2.94%, సేవలు 2.87%, పరిశ్రమలు 2.75%, చమురు-గ్యాస్ 2.52% డీలాపడ్డాయి.

5 ఏళ్లలో కోటి ఇంటర్న్‌షిప్‌లు

రూ.66,000 కోట్ల వార్షిక ఆర్థిక మద్దతు



దిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రయోగాత్మక పద్ధతిన ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌ను గురువారం ఆవిష్కరించింది. అయిదేళ్లలో కోటి మంది యువతకు ముఖ్యంగా 21-24 ఏళ్ల వారికి ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం మొత్తం రూ.66,000 కోట్ల వార్షిక ఆర్థిక మద్దతును ప్రకటించింది. ఇందులో భాగంగా రూ.800 కోట్ల వ్యయంతో ప్రయోగాత్మక ప్రాజెక్టు కింద డిసెంబరు 2 నుంచి ఇంటర్న్‌షిప్ మొదలవుతుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1.25 లక్షల మంది అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా: కేంద్ర బడ్జెట్ 2024లో ప్రకటించిన ప్రకారం.. 'పీఎమ్ ఇంటర్న్‌షిప్ స్కీమ్ ఇన్ టాప్ కంపెనీస్' కింద ఇంటర్న్‌లకు బీమా కవరేజీ కూడా వర్తిస్తుంది. ఈ పథకాన్ని ఆన్‌లైన్ పోర్టల్ 'www.pminternship.mca.gov.in' ద్వారా అమలు చేస్తారు. కార్పొరేట్ వ్యవహారాల శాఖ దీనిని అభివృద్ధి చేసింది.

నెలకు రూ.5,000: నెలవారీగా రూ.5,000 చొప్పున ఏడాది పాటు అభ్యర్థులకు ఆర్థిక సహాయం(స్టైపెండ్) అందిస్తారు. కంపెనీలో చేరే ముందు ఇచ్చే రూ.6,000 (వన్‌టైం గ్రాంట్) కూడా ఉంటుంది. అంటే మొత్తం మీద ఏడాదిలో రూ.66,000 పొందుతారు.

అర్హతలు ఏమంటే: ఆన్‌లైన్/దూరవిద్య ప్రోగ్రామ్‌లలో నమోదు చేసుకున్న వారు అర్హులు. ఉన్నత పాఠశాల విద్య పూర్తి చేసి, ఐటీఐ నుంచి సర్టిఫికెట్ ఉన్నవారు లేదా బీఏ, బీఎస్సీ, బీకామ్, బీసీఏ, బీబీఏ, బీఫార్మ్ గ్రాడ్యుయేట్లు కూడా ఇంటర్న్‌షిప్‌నకు అర్హులే.

దసరా నుంచి నమోదు: దసరా పండుగ అయిన ఈనెల 12 నుంచి 25వ తేదీ వరకు పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చు. అక్టోబరు 26న ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెల్లడిస్తారు. అక్టోబరు 27 నుంచి నవంబరు 7 మధ్య కంపెనీలు అభ్యర్థులను ఎంపిక చేసుకుంటాయి. నవంబరు 8-15 లోగా ఆఫర్లు అంగీకరించాలి. ఒక అభ్యర్థికి మూడు ఆఫర్ల వరకు రావొచ్చు.

కంపెనీల ఎంపిక ఇలా: గత మూడేళ్లలో కార్పొరేట్ సామాజిక బాధ్యత సగటు వ్యయాల ఆధారంగా అగ్రగామి 500 కంపెనీలను కేంద్రం ఎంపిక చేస్తుంది. వీటిల్లో అవకాశాలుంటాయి.

ఏహెచ్ఎల్ఎల్‌లో వాటా విక్రయించే యోచనలో అపోలో హాస్పిటల్స్?

ఈనాడు, హైదరాబాద్: మల్టీస్పెషాలిటీ క్లినిక్‌లు- డయాగ్నస్టిక్ సెంటర్ల నిర్వహణలో తమ అనుబంధ సంస్థ అపోలో హెల్త్ అండ్ లైఫ్‌స్టైల్ లిమిటెడ్ (ఏహెచ్ఎల్ఎల్) లో వాటా విక్రయించే సన్నాహాల్లో అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ ఉంది. ఇప్పటికే ఈ సంస్థలో ప్రధాన వాటాదారుగా (31%) ఉన్న ఐఎఫ్‌సీ (ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్) కూడా తన వాటా విక్రయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సంస్థలో ఎనిమిదేళ్ల క్రితం నుంచి ఐఎఫ్‌సీ రూ.500 కోట్లు పెట్టుబడి పెట్టింది.

2000 సంవత్సరం నుంచి కార్యకలాపాలు: ఏహెచ్ఎల్ఎల్‌ను అపోలో హాస్పిటల్స్ గ్రూపు 2000 సంవత్సరంలో ఏర్పాటు చేసింది. అపోలో డయాగ్నస్టిక్స్, అపోలో షుగర్, అపోలో క్లినిక్స్, అపోలో క్రాడిల్, అపోలో స్పెక్ట్రా అనే బ్రాండ్ల పేర్లతో సేవలు అందిస్తోంది.

నిధులు సమీకరిస్తూ: ఐఎఫ్‌సీ వాటా విక్రయించడానికి వీలు కల్పించడంతో పాటు, సంస్థ వృద్ధికి అవసరమైన నిధులు సమీకరించాలనే ఆలోచనలో అపోలో హాస్పిటల్స్ యాజమాన్యం ఉన్నట్లు తెలుస్తోంది. ముంబయి, హైదరాబాద్‌లలో కొత్తగా అపోలో క్రాడిల్ బ్రాండ్ క్లినిక్‌లు ఏర్పాటు చేయాలని, డయాగ్నస్టిక్స్ సేవలను విస్తరించాలనే ప్రణాళికలు ఏహెచ్ఎల్ఎల్‌కు ఉన్నాయి. దీని కోసం వచ్చే రెండేళ్ల పాటు ఏటా రూ.100 కోట్ల చొప్పున పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది.

రోబోటిక్ శస్త్రచికిత్సల కోసం ఇన్‌ట్యూటివ్‌తో కిమ్స్ హాస్పిటల్స్ ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: కిమ్స్ హాస్పిటల్స్ (కృష్ణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) తన ఆసుపత్రుల్లో రోబోటిక్ శస్త్రచికిత్సలు నిర్వహించడానికి ఇన్‌ట్యూటివ్ అనే అగ్రగామి సంస్థతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లోని కిమ్స్ హాస్పిటల్స్‌లో దావిన్సీ రోబోటిక్ అసిస్టెడ్ సర్జరీ ప్రోగ్రామ్‌లను అమలు చేస్తారు. ఇందుకోసం వైద్యులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు బెంగళూరులోని కిమ్స్- సెయింట్ జాన్స్ హాస్పిటల్‌లో 'రోబోటిక్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేస్తామని కిమ్స్ హాస్పిటల్స్ సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు తెలిపారు. రోబోటిక్ సర్జరీలను ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోని వారికీ దగ్గర చేయాలనే లక్ష్యం ఈ ఒప్పందం ద్వారా నెరవేరుతుందని ఇన్‌ట్యూటివ్ సీఈఓ గ్యారీ ఎస్.గుథార్ట్ వివరించారు.

సెన్సెక్స్ 50, బ్యాంకెక్స్‌పై వారం వారీ డెరివేటివ్స్ రద్దు!

దిల్లీ: మార్కెట్ నియంత్రణాధికార సంస్థ సెబీ తాజా ఆదేశాల నేపథ్యంలో బీఎస్ఈ కీలక నిర్ణయం తీసుకుంది. సెన్సెక్స్ 50, బ్యాంకెక్స్‌లపై ఉన్న వారం వారీ సూచీ డెరివేటివ్స్ కాంట్రాక్టులు నిలిపి వేస్తున్నట్లు ప్రకటించింది. నవంబరు 14 నుంచి అంటే ప్రస్తుత కాంట్రాక్టుల గడువు తీరే తేదీ నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుంది. ఇకపై వీటిల్లో వారం వారీ కాంట్రాక్టులు ఉండవు. బ్యాంకెక్స్‌పై వారం వారీ ఇండెక్స్ డెరివేటివ్స్‌ను నవంబరు 18 నుంచి రద్దు చేస్తారు. ప్రస్తుత కాంట్రాక్టుల గడువు తీరాక, కొత్త కాంట్రాక్టులు వెలువడవు. స్పెక్యులేటివ్ ట్రేడింగ్‌ను అరికట్టడం కోసం ఎక్స్ఛేంజీలు ఒక ప్రామాణిక సూచీపై మాత్రమే వీక్లీ డెరివేటివ్ ఇవ్వాల్సి ఉంటుందని సెబీ ఆదేశించిన సంగతి విదితమే.

కోడి గుడ్డు

4న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయల్లో)

హైదరాబాద్	510
వరంగల్	512
విజయవాడ	535
గోదావరి	535
విశాఖపట్నం	535
చిత్తూరు	523

14 నుంచి హ్యుందాయ్ రూ.25,000 కోట్ల ఐపీఓ!



దిల్లీ: దక్షిణ కొరియా వాహన దిగ్గజం హ్యుందాయ్‌కు చెందిన భారత విభాగం హ్యుందాయ్ మోటార్ ఇండియా రూ.25,000 కోట్ల భారీ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు రంగం సిద్ధమైంది. ఈ నెల 14న హ్యుందాయ్ ఐపీఓ ప్రారంభం కావొచ్చని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మన దేశంలో 2022లో వచ్చిన ఎల్ఐసీ రూ.21,000 కోట్ల ఐపీఓ కంటే కూడా, ఇదే అతిపెద్ద ఇష్యూ కానుంది. ముసాయిదా పత్రాల ప్రకారం.. హ్యుందాయ్ మోటార్ ఇండియా ఐపీఓ పూర్తి ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)గా రానుంది. ఇందులో ప్రమోటర్ హ్యుందాయ్ మోటార్ కంపెనీ 14,21,94,700 ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. ఓఎఫ్ఎస్‌గా రానుండటంతో ఐపీఓ ద్వారా వచ్చిన నిధులు హ్యుందాయ్ మోటార్ ఇండియాకు వెళ్లవు. 2003లో మారుతీ సుజుకీ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదయ్యాక, మార్కెట్‌లోకి వస్తున్న తొలి వాహన సంస్థ ఇదే.

✦ 8 నుంచి గరుడా కన్‌స్ట్రక్షన్ ఐపీఓ: నిర్మాణ రంగ సంస్థ గరుడా కన్‌స్ట్రక్షన్ అండ్ ఇంజినీరింగ్ ఐపీఓ ఈ నెల 8న ప్రారంభమై 10న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణిగా రూ.92- 95ను నిర్ణయించారు. గరిష్ఠ ధర వద్ద కంపెనీ రూ.264 కోట్లు సమీకరించనుంది. రిటైల్ మదుపర్లు కనీసం 157 షేర్లకు దరఖాస్తు చేసుకోవాలి.

✦ కేఆర్ఎన్ హీట్ అదుర్స్: కేఆర్ఎన్ హీట్ ఎక్స్ఛేంజర్ అండ్ రిఫ్రిజిరేషన్ షేర్ల నమోదు ఉత్సాహంగా సాగింది. ఇష్యూ ధర రూ.220తో పోలిస్తే షేరు బీఎస్ఈలో 113.63% లాభంతో రూ.470 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 133.36% దూసుకెళ్లి రూ.513.40 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 117.47% పెరిగి రూ.478.45 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.2,973.88 కోట్లుగా నమోదైంది.

జీపేలో పసిడి రుణాలు

తెలుగులో 'జెమినీ లైవ్' త్వరలోనే



దిల్లీ: అంతర్జాతీయ టెక్ దిగ్గజం గూగుల్ తన ఆర్థిక సేవల సంస్థ గూగుల్‌పే (జీపే) ద్వారా పసిడి తనఖా రుణాలు అందజేసేందుకు ముత్తూట్ ఫైనాన్స్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రపంచంలోని మొత్తం పసిడిలో 11% భారత్‌లోనే ఉందని గూగుల్ ఇండియా కంట్రీ ఎండీ రోమా దత్తా చోబే పేర్కొన్నారు. భారతీయులు అందుబాటు వడ్డీ రేట్లతో, పసిడి రుణాలను జీపే ద్వారా పొందొచ్చని.. 'గూగుల్ ఫర్ ఇండియా' 10వ ఎడిషన్ కార్యక్రమంలో తెలిపారు.

✦ గూగుల్ ఏఐ అసిస్టెంట్ జెమినీ లైవ్ సేవలు హిందీలోనూ ప్రారంభించారు. తెలుగు, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మలయాళం, మరాఠీ, తమిళం, ఉర్దూ భాషల్లో రాబోయే కొద్ది వారాల్లో ఈ సేవలు అందుబాటులోకి వస్తాయి.

✦ ఓపెన్ సోర్స్ జెమినీ ఏజెంట్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా బెక్న్ ఆధారిత ఓపెన్ నెట్‌వర్క్స్‌ను ఏకీకృతం చేసే ప్రణాళికలు ఉన్నాయి. ఈ ఫ్రేమ్‌వర్క్ అన్ని భారతీయ కంపెనీలకు, వినియోగదార్లకు అందుబాటులోకి వస్తుంది. ఎలక్ట్రానిక్ నుంచి వ్యవసాయం ఉత్పత్తుల వరకు అన్నిటినీ కొనొచ్చు.

✦ కొద్ది నెలల్లో జెమినీ ఫ్లాష్ 1.5ను గూగుల్ ఆవిష్కరించనుంది. అంతర్జాతీయంగా ఉన్న అతిపెద్ద క్లౌడ్ ప్లాట్‌ఫారాల్లో ఇది ఒకటి. దీని ద్వారా సంస్థలు తమ క్లౌడ్, ఏఐ సొల్యూషన్లను భద్రంగా అమలు చేయొచ్చు. డేటాను నిల్వ చేయడంతో పాటు మెషిన్ లెర్నింగ్ ప్రక్రియలను భారత్‌లోనే పూర్తిగా చేయొచ్చు.

✦ 2025లో గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను భారత్‌లో గూగుల్ ఏర్పాటుచేయనుంది.

✦ 2026 కల్లా 186 మెగావాట్ల కొత్త పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని అందజేసేందుకు రెండు దీర్ఘకాల ఒప్పందాలను కుదుర్చుకుంది.

✦ నందన్ నీలేకనికి చెందిన ఏక్‌స్టెప్ ఫౌండేషన్‌తో కలిసి 'డీపీఐ ఇన్ ఓ బాక్స్'ను గూగుల్ సృష్టించనుంది. డిజిటల్ మౌలిక వసతులను నిర్మించడానికి ఉపయోగపడే ఫ్లగ్ అండ్ ప్లే మోడల్ ఇది.

హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్‌లో సాంకేతిక లోపం

ఎన్ఎస్ఈ డెరివేటివ్స్ ఆర్డర్లు పెట్టడంలో ఇబ్బందులు

దిల్లీ: హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో గురువారం మదుపర్లు ఇబ్బంది పడ్డారు. ముఖ్యంగా ఎన్ఎస్ఈ డెరివేటివ్స్ విభాగంలో ఆర్డర్లు పెట్టడం, వాటిని మార్చడంలో ఇబ్బందులు ఎదురయ్యాయని వినియోగదారులు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టులు పెట్టారు. దీనిపై హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ వివరణ ఇస్తూ, ఇతర విభాగాలు బాగానే ఉన్నా, ఎన్ఎస్ఈ డెరివేటివ్స్ విభాగంలో ఇబ్బందులు తలెత్తాయని, వాటిని పరిష్కరించేందుకు సాంకేతిక భాగస్వామి టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)తో కలిసి పని చేస్తున్నామని పేర్కొంది.

✦ గూగుల్‌కు అదానీ విద్యుత్: భారత్‌లో గూగుల్ క్లౌడ్ సేవలు, కార్యకలాపాలకు శుద్ధ ఇంధనాన్ని సరఫరా చేసేందుకు అదానీ గ్రూప్ ప్రకటించింది. గుజరాత్‌లోని కవ్డా పునరుత్పాదక ఇంధన పార్క్‌లో 30 గిగావాట్ ప్రాజెక్ట్ నుంచి 61.4 మెగావాట్ విద్యుత్‌ను గూగుల్‌కు అదానీ గ్రూప్ ఇవ్వనుంది. 2025 మూడో త్రైమాసికంలో ఈ ప్లాంట్ వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభమవుతాయి.

✦ విద్యుత్ వాహనాల కోసం ఇ-డ్రైవ్ మోటార్స్ అభివృద్ధి చేసేందుకు జపాన్ సంస్థ నైడెక్‌తో అశోక్ లేలాండ్ భాగస్వామ్యం కుదుర్చుకుంది.

✦ ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్, ఇజ్రాయెల్ ఏరోస్పేస్ రక్షణ రంగ సంస్థ ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ సంయుక్తంగా 'బీఈఎల్ ఐఏఐ ఏరోస్పేస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్'ను ఏర్పాటు చేశాయి.

✦ తమ ఒమన్ కార్యకలాపాలను బ్యాంక్ ధోఫర్‌కు విక్రయించనున్నట్లు బ్యాంక్ ఆఫ్ బరోడా వెల్లడించింది.

ఎన్‌హెచ్ఏఐతో జాతీయ రహదారి కాంట్రాక్టు వివాదం పరిష్కారం: కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్

ఈనాడు, హైదరాబాద్: ఒక జాతీయ రహదారి కాంట్రాక్టు విషయంలో ఎన్‌హెచ్ఏఐ (జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ)తో తలెత్తిన వివాదాన్ని పరిష్కరించుకున్నట్లు కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ తెలిపింది. దీని అనుబంధ సంస్థ కేఎన్ఆర్ ముజఫర్‌పూర్ బరౌనీ టోల్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్ (కేఎంబీటీపీఎల్) కు ఎన్‌హెచ్ఏఐ నుంచి రహదారి నిర్మాణం, నిర్వహణ, టోల్ వసూలు కాంట్రాక్టు లభించింది. అనుకున్న రీతిలో ముందుకు సాగలేదు. ఈ వివాదాన్ని స్వతంత్ర నిపుణులతో ఏర్పాటైన కన్సిలియేషన్ కమిటీ (సీసీఐఈ) పరిశీలించి, కేఎంబీటీపీఎల్‌కు నష్టపరిహారం, దానిపై వడ్డీ కలిపి మొత్తం రూ.317.69 కోట్లు చెల్లించాలని ఎన్‌హెచ్ఏఐకు సూచించింది. ఈ మొత్తాన్ని తాజాగా ఎన్‌హెచ్ఏఐ, కేఎంబీటీపీఎల్‌కు చెల్లించింది. దీంతో కేఎన్ఆర్ ముజఫర్‌పూర్ బరౌనీ టోల్‌వేస్ ప్రాజెక్టును ఎన్‌హెచ్ఏఐకు అప్పగించినట్లు కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ వెల్లడించింది.

బెంగళూరులో పోలొమీ ఎస్టేట్స్ రూ.800 కోట్ల ప్రాజెక్టు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన స్థిరాస్తి సేవల సంస్థల్లో ఒకటైన పోలొమీ ఎస్టేట్స్, బెంగళూరులో రూ.800 కోట్ల విలువైన ప్రాజెక్టు చేపట్టనుందని సంస్థ డైరెక్టర్ ప్రణంరావు వివరించారు. ఉత్తర బెంగళూరు (యెలహంక సంద్ర) లోని మాన్యత ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ 'ఫేజ్-2'లో 9 ఎకరాల్లో హైరైజ్ నివాస సముదాయాన్ని దాదాపు 18 లక్షల చదరపు అడుగుల మేర నిర్మిస్తామన్నారు. 35 అంతస్తుల్లో మొత్తం 850 ఫ్లాట్లు నిర్మిస్తామన్నారు. హైదరాబాద్‌లో 15 లక్షల చదరపు అడుగుల నివాస ప్రాజెక్టు, 13 లక్షల చదరపు అడుగుల వాణిజ్య ప్రాజెక్టు నిర్మాణంలో ఉన్నట్లు వివరించారు.

స్వరాజ్ కొత్త కాంపాక్ట్ ట్రాక్టర్లు

దిల్లీ: మహీంద్రా గ్రూప్‌నకు చెందిన స్వరాజ్ ట్రాక్టర్స్, తన కొత్త టార్గెట్ 625 ట్రాక్టర్ మోడల్‌ను గురువారం ఆవిష్కరించింది. టూ-వీల్, ఫోర్-వీల్ డ్రైవ్ రకాల్లో ఇవి లభ్యమవుతాయి. కొత్త మోడల్ 83.1 ఎన్ఎం టార్క్, డీజిల్ ఇంజిన్‌తో పాటు అడ్జస్టబుల్ ట్రాక్ విడ్త్‌తో రూపొందింది. రైతులు అధునిక వ్యవసాయ పద్ధతులకు మారేందుకు చిన్నపాటి ట్రాక్టర్లలో ఈ ట్రాక్టర్లను తీసుకొచ్చినట్లు కంపెనీ తెలిపింది. 980 కిలోల పవర్ లిఫ్ట్ (పీటీఓ), 14.09 కిలోవాట్ అవుట్‌పుట్, కాన్‌స్టంట్ మెష్ ట్రాన్స్‌మిషన్, డీజిల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ వంటి ఫీచర్లతో ఈ మోడల్ తయారైంది. మ్యాక్స్ కూల్ రేడియేటర్ టెక్నాలజీ, ఎక్కువ కార్యకలాపాల వేళ అధిక వేడిని నిరోధించేలా డిజైన్, దేశీయ వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా టార్గెట్ 625 ట్రాక్టర్లను రూపొందించినట్లు తెలిపిన కంపెనీ, వీటి ధరలను వెల్లడించలేదు.

ఇన్‌సైడర్ ట్రేడింగ్ కేసు పరిష్కారం

దిల్లీ: బాలాజీ అమైన్స్ షేర్లలో ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న నవీన చంద్ర తమ్మినేట్ల, కాశీనాథ్ రేవప్ప ధోలే, సెబీతో ఆ కేసును పరిష్కరించుకున్నారు. ఇందుకోసం సెటిల్‌మెంట్ ఛార్జీల కింద ఇద్దరూ కలిసి రూ.27.95 లక్షలు చెల్లించారు. ఉల్లంఘనలను అంగీకరించడం లేదా తిరస్కరించడం లాంటి ప్రతిపాదనలు లేకుండా సెటిల్‌మెంట్ ఆర్డర్ ద్వారా ఈ కేసు పరిష్కమయ్యింది. 2024 ఫిబ్రవరి 21-22 తేదీల్లో వీరు దరఖాస్తు సమర్పించారు. బాలాజీ అమైన్స్‌లో నవీన చంద్ర, కాశీనాథ్ రేవప్ప స్వతంత్ర డైరెక్టర్లుగా బాధ్యతలు నిర్వహించారు.

మనాక్సియా కోటెడ్ మెటల్స్‌కు రూ.200 కోట్ల కాంట్రాక్టు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న మనాక్సియా కోటెడ్ మెటల్స్ అండ్ ఇండస్ట్రీస్ విదేశీ సంస్థ నుంచి రూ.200 కోట్ల విలువైన కాంట్రాక్టు లభించింది. ఈ కాంట్రాక్టు ప్రకారం 20,000 టన్నుల ప్రీ-పెయింటెడ్ స్టీల్ కాయిల్స్, అలు జింక్ కోటెడ్ స్టీల్ కాయిల్స్, గాల్వనైజ్డ్ స్టీల్ ఉత్పత్తులను వచ్చే ఏడాది వ్యవధిలో సరఫరా చేయాల్సి ఉంటుందని సంస్థ ఎండీ సునీల్‌కుమార్ అగర్వాల్ పేర్కొన్నారు.

వేతన పెంపు ప్రస్తుత త్రైమాసికంలో!

దిగ్గజ ఐటీ కంపెనీల యోచన



దిల్లీ: వేతన పెంపును ఆలస్యం చేసినా, ఉద్యోగుల రాజీనామా చేయడంలో భావనకు ఐటీ కంపెనీల వ్యాపారాని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆందుబాటులో ఆర్థిక సంవత్సరం అరంభంలో లేదంటే రెండో త్రైమాసికంలో చేపట్టాల్సిన వేతన పెంపును మూడో త్రైమాసికం (అక్టోబరు- డిసెంబరు), ఆ తరవాతకు వాయిదా వేస్తున్నాయని సమాచారం. అంతర్జాతీయ క్లయింట్లు, ఐటీ సేవల కోసం కేటాయించే మొత్తాలు తగ్గించుకున్న నేపథ్యంలో ప్రాజెక్టుల రాక ఆలస్యమైంది. దీంతో వ్యయాలు నియంత్రించి, లాభదాయకత నిలబెట్టుకునేందుకే వేతనాల పెంపును ఐటీ కంపెనీలు వాయిదా వేశాయని బ్రోకరేజీ సంస్థల నివేదికలు, విశ్లేషకుల అభిప్రాయాలను ఉటంకిస్తూ ఓ ఆంగ్ల వెబ్‌సైట్ పేర్కొంది. ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ, ఎల్అండ్‌టీ టెక్ సర్వీసెస్ లాంటి కంపెనీలు వేతన పెంపును ఆలస్యం చేసి.. ఇప్పుడు చేపడితే, 2024-25 రెండో అర్ధభాగంలో ఆ కంపెనీల మార్జిన్లపై ప్రభావం ఉంటుందని బ్రోకరేజీ సంస్థ మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ తెలిపింది.

హెచ్‌సీఎల్ టెక్ మార్జిన్లు గణనీయంగా పెరగొచ్చు

జులై- సెప్టెంబరులో ఐటీ కంపెనీల మార్జిన్లు త్రైమాసిక ప్రాతిపదికన సగటున 25 బేసిస్ పాయింట్ల మేర పెరగొచ్చని బ్రోకరేజీ అంచనా. 'ఇన్ఫోసిస్, విప్రో, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా మార్జిన్లు 20-110 బేసిస్ పాయింట్ల శ్రేణిలో పెరగొచ్చు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), కోఫోర్జ్ మార్జిన్లలో 30-110 బేసిస్ పాయింట్ల క్షీణత ఉండొచ్చు' అని తెలిపింది. ఇన్ఫోసిస్ మార్జిన్ 10 బేసిస్ పాయింట్లు పెరిగి 21.2 శాతానికి చేరే అవకాశం ఉందని నోమురా అంచనా వేస్తోంది. హెచ్‌సీఎల్ టెక్ మార్జిన్ 120 బేసిస్ పాయింట్లు పెరిగి 18.3 శాతానికి చేరొచ్చని పేర్కొంది. వేతనాల పెంపు ప్రభావంతో కోఫోర్జ్ మార్జిన్ 110 బేసిస్ పాయింట్లు మేర తగ్గే అవకాశం ఉంది. దీని ప్రకారం చూస్తే.. మధ్య స్థాయి ఐటీ కంపెనీల వేతన పెంపును వాయిదా వేసినప్పటికీ, ఉద్యోగుల లభ్యత ఇబ్బందికర పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. మరో మధ్య స్థాయి ఐటీ సంస్థ టాటా ఎలెక్సీ మార్జిన్ 140 బేసిస్ పాయింట్లు మేర తగ్గే అవకాశం ఉంది. ఉద్యోగుల వినియోగం, జూనియర్ ఉద్యోగులకు వేతనాల పెంపు ఇందుకు కారణమని కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ వెల్లడించింది. ఈ అంచనాలపై ఐటీ కంపెనీలు స్పందించలేదు.

నిపుణులను కోల్పోవాల్సి రావొచ్చు..

ఐటీ రంగానికి ప్రతికూలతలు తొలగిపోతున్నాయని అభిప్రాయం వ్యక్తం అవుతున్న నేపథ్యంలో, సమీప భవిష్యత్తులో వేతనాల పెంపుపై ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అక్టోబరు-డిసెంబరులో కూడా వేతనాల పెంపును ఐటీ కంపెనీలు వాయిదా వేస్తే, నిపుణులను కోల్పోవడం ప్రారంభం అవుతుందని, అందుకే ఆయా సంస్థలు కూడా ప్రణాళికలు మార్చుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. అధిక వేతనాల కోసం ఉద్యోగులు ఇతర సంస్థలకు వెళ్లే అవకాశం ఉందని చేసుకుంటున్నట్లు తెలుస్తుంది. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, విప్రో, టెక్ మహీంద్రా సహా పలు దిగ్గజ ఐటీ కంపెనీలు మొత్తంగా 81,000-88,000 మంది సిబ్బందిని నియమించుకున్నట్లు సమాచారం. ఈ ప్రభావం ప్రస్తుత ఉద్యోగులపై పడొచ్చని అంటున్నారు. ఇప్పటివరకు ఐటీ సిబ్బంది వలసల రేటు గణనీయంగా తగ్గిందని ఏఎన్ఆర్ ప్రధాన పరిశోధక విశ్లేషకుడు గౌరవ్ వాసు చెబుతున్నారు. అధిక వేతనాలు పొందుతున్న, అనుభవజ్ఞులైన సిబ్బందిని పక్కనబెట్టి, ఫ్రెషర్లను నియమించుకుంటున్నాయని కొన్ని కంపెనీలు ప్రయత్నిస్తున్నాయని సమాచారం. ఈ అంశంపై ఇంటర్నేషనల్ ఐటీ సంస్థలో కొత్త ఉద్యోగుల ఎంపిక చేసుకుంటున్నాయని ఈఐసీఈ ప్రిన్సిపల్ వ్యవస్థాపకుడు, సీఈఓ పరితే జైన్ తెలిపారు.

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దసరా పండగ. కొత్త పనులు ప్రారంభించేందుకు ఇంతకు మించిన సమయం ఉండదు అని అనుకుంటాం. ఆర్థిక స్వేచ్ఛను సాధించేందుకూ అడుగులు వేయాల్సిన తరుణమిదే. ఇందు కోసం పాటించాల్సిన ముఖ్యమైన సూత్రాలేమిటో చూద్దామా...



మన ప్రాధాన్యాలకు అనుగుణంగా జీవించాలంటే ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉండాలి. మీరు ఎంచుకున్న జీవన శైలిని కొనసాగించేందుకు, దీర్ఘకాలిక లక్ష్యాలను సాకారం చేసుకునేందుకూ ఆర్థిక స్వేచ్ఛ అవసరం. రాబోయే ఏడాది, అయిదేళ్లు, దశాబ్దం.. ఇలా జీవితంలో ఏ మైలురాళ్లను మీరు సాధించాలని అనుకున్నారో వాటిపై ఒక స్పష్టత ఉండాలి. అవన్నీ సాధించగలిగినవిగా, సమయానుకూలంగా మార్చుకునేవిగా ఉండాలి. ఇప్పటి వరకూ మీ ఆర్థిక ప్రణాళిక ఎలా ఉంది.. దాని ద్వారా మీరు సాధించిదేమిటి? అనే ప్రశ్ననూ వేసుకోవాలి.

ఆర్థిక విజయం సాధిద్దాం

క్రమశిక్షణతో లెక్కలు..

సంపాదన, ఖర్చు లెక్కలు వేసుకోవడం ఆర్థిక ప్రణాళికలో ఒక కీలకమైన అంశం. సంపాదించిన మొత్తానికి రూపాయి అధికంగా ఖర్చు చేసినా.. మీరు అప్పుల ఊబిలోకి వెళ్లినట్లే. భావోద్వేగాలకు లోనుకాకుండా స్థిరంగా ఉండాలి. మీ ఆర్థిక వ్యవహారాలను ఒక క్రమ పద్ధతిలో నిర్వహించాలి. బడ్జెట్‌ను రూపొందించుకోవడం, దానికి కట్టుబడి ఉండటం అవసరం. వెంటనే ఖర్చు చేయాలనే ధోరణి ఎప్పుడూ సరికాదు. మీ పొదుపు ఖాతాలో ఉన్న ప్రతిపైసా ఒక ప్రయోజనం కోసం మాత్రమే ఉపయోగపడేలా చూసుకోవాలి. అప్పుడే అనుకున్న లక్ష్యాల సాధనకు ఆ డబ్బు ఉపయోగపడుతుంది.

వైవిధ్యంగా ఉండాలి

ఒకటే ఆదాయ మార్గంతో దీర్ఘకాలంలో ఆర్థిక విజయం సాధించడం కష్టం. కాబట్టి, మీరు సంపాదించిన సంపాదనలో కొంత భాగం పెట్టుబడుల రూపంలోకి మళ్లించాలి. ఆ పెట్టుబడులు మీకోసం కష్టపడుతూ, లాభాలను ఆర్జించాలి. అప్పుడే భవిష్యత్తుకు ఒక భరోసా ఏర్పడుతుంది. అదే విధంగా పథకాల్లో మదుపు చేసేటప్పుడూ అవి వైవిధ్యంగా ఉండేలా చూసుకోవాలి. షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, బాండ్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బంగారం, స్థిరాస్తి ఇలా పలు రకాల పథకాల్లో పెట్టుబడులు ఉండాలి.

సంపదను సృష్టించేలా

ముందు పెట్టుబడి.. తర్వాతే ఖర్చు అనే సూత్రాన్ని పాటించినప్పుడే సంపదను సృష్టించగలం అని మర్చిపోవద్దు. వచ్చిన మొత్తంలో కొంత శాతాన్ని మదుపు చేయడం అలవాటు చేసుకోవాలి. పిల్లల చదువులు, పెళ్లి, పదవీ విరమణ ప్రణాళిక ఇలా ప్రతి లక్ష్యానికీ వేర్వేరు పథకాలను ఎంచుకొని, పెట్టుబడులు ప్రారంభించాలి. ఇలా దీర్ఘకాలంలో సంపదను పోగు చేసుకుంటే.. సులభంగా లక్ష్యాలను సాధించగలం.

దీర్ఘకాలమే రక్ష...

తాత్కాలిక లాభాలు మనసుకు ఆనందాన్ని ఇస్తాయి. కానీ, ఆర్థిక విజయాన్ని అందించవు. సంక్లిష్టమైన ఆర్థిక ప్రపంచంలో దీర్ఘకాలిక వ్యూహాలే మంచి ఫలితాలను ఇస్తాయని చరిత్ర చెబుతోంది. స్వల్ప కాలంలో మార్కెట్లో వచ్చే హెచ్చుతగ్గులు ట్రేడర్లకు మాత్రమే ఆందోళన కలిగిస్తాయి. మదుపరులకు ఇవి మంచి అవకాశాన్ని ఇస్తాయని గుర్తుంచుకోవాలి. పెట్టుబడులను కొనసాగిస్తూ ముందుకెళ్లినప్పుడే అవి మిమ్మల్ని ఆర్థికంగా అత్యున్నత స్థితికి తీసుకెళ్తాయి.

అన్ని వేళలా ధీమాగా

ఆర్థిక కష్టం ఎప్పుడూ రాకూడదు. అనుకోని విధంగా వచ్చినా ఆదుకునేందుకు తగిన పథకాలు అండగా ఉండేలా చూసుకోవాలి. ముఖ్యంగా సంపాదించే వ్యక్తి తన వార్షికాదాయానికి కనీసం 12-15 రెట్ల వరకూ జీవిత బీమా పాలసీని తీసుకోవడం మర్చిపోవద్దు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కుటుంబానికి అంతటికీ వర్తించేలా కనీసం రూ.5లక్షల ఆరోగ్య బీమా పాలసీ ఉండటం తప్పనిసరి. అప్పుడే ఆర్థికంగా కాస్త ధీమాగా ఉండగలం.

సలహాలు తీసుకోండి

ఆర్థిక రంగంలో నిరంతరం ఎన్నో మార్పులు వస్తుంటాయి. పథకాల విషయంలో కావచ్చు. పన్ను వ్యవహారాల్లో కావొచ్చు. మార్పులు సహజం. వీటన్నింటి గురించీ తెలుసుకోవడం అందరికీ సాధ్యం కాదు. కానీ, ఆర్థిక విషయాల్లో కనీస పరిజ్ఞానం సాధించడం తప్పనిసరి. మీరు పొదుపు, పెట్టుబడులు పెడుతున్న పథకాల గురించి పూర్తిగా తెలుసుకోవడం మంచిది. ఆ తర్వాతే పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవాలి. పెట్టుబడుల విషయంలో, ఆర్థిక ప్రణాళికల విషయంలో వాటికి సంబంధించిన విషయ అవగాహన ఉన్న నిపుణుల సలహా స్వీకరించడంలో తప్పు లేదు.

రుణాలు తగ్గించుకోవాలి

మీ ఖర్చులను తగ్గించుకునే ప్రయత్నం చేయండి. దీనివల్ల క్రెడిట్ కార్డులు, ఇప్పుడు కొనండి తర్వాత చెల్లించండి (బీఎన్‌పీఎల్)లాంటి వాటి జోలికి వెళ్లాల్సిన అవసరం ఉండదు. అప్పులు తాత్కాలిక సంతోషాన్ని ఇస్తాయి. కానీ, ఇవి ఆర్థిక ఆరోగ్యానికి ఏమాత్రం మంచివి కావు అని గుర్తుంచుకోండి. అదే సమయంలో ఇల్లు, ప్లాటు కొనుగోలు కోసం అప్పులు చేయడం మంచిదే. అదీ మీరు సులభంగా చెల్లించేందుకు వీలున్నంత వరకే తీసుకోవాలి. ముఖ్యంగా క్రెడిట్ కార్డు బిల్లులను ఎప్పుడూ మొత్తం ఒకేసారి తీర్చేయండి. కనీస బిల్లు చెల్లిస్తూ ఉంటే.. నెలకు రూ.750 నుంచి రూ.1,500 వరకూ రుసుముల రూపంలో సమర్పించుకోవాల్సిందే. ఇది మీకు ముమ్ముందు మరింత భారంగా మారుతుంది. ఇది క్రెడిట్ స్కోరునూ తగ్గిస్తుంది.

అత్యవసరంలో ఆందోళన లేకుండా

అత్యవసరం ఎప్పుడు వచ్చినా దానిని తట్టుకునేందుకు సిద్ధంగా ఉండాలి. ఇందుకోసం 6-12 నెలల ఖర్చులకు సరిపోయే అత్యవసర నిధిని ఎప్పుడూ దగ్గర పెట్టుకోవాలి. ఉద్యోగం కోల్పోవడం, అనారోగ్యం, ఇంటి, వాహన మరమ్మతులు, ప్రమాదాల్లాంటి అనుకోని ఖర్చులకు ఈ మొత్తాన్ని ఉపయోగించుకోవాలి. స్వల్పకాలిక అవసరాల కోసం ఈ మొత్తాన్ని వాడుకున్నప్పటికీ, వెంటనే దాన్ని భర్తీ చేయడం మర్చిపోవద్దు.

సమీక్ష తప్పనిసరి

ఒకసారి ప్రణాళిక వేసుకున్నాక దాన్ని ఆచరణలో పెట్టడం తప్పనిసరి. దీంతోపాటు ఏటా దీన్ని ఒకసారైనా సమీక్షించుకోవాలి. అక్టోబరు నాటికి ఆర్థిక సంవత్సరం మధ్యలో ఉంటాం. కాబట్టి, ఒకసారి ఈ ప్రణాళికలను సరిచూసుకునేందుకు ఇది సరైన సమయమే. పండగల వేళ గతేడాదికీ ఇప్పటికీ మన ఆర్థిక పరిస్థితిలో వృద్ధి కనిపిస్తే ఆనందంగానూ ఉంటుంది.

'వాల్యూ స్కోర్' ఆధారిత మదుపు

ఐసీఐసీఐ మ్యూచువల్ ఫండ్ కొత్తగా రెండు మ్యూచువల్ ఫండ్ పథకాలను ఆవిష్కరించింది. ఇందులో ఒకటి ఈటీఎఫ్ (ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్) పథకం కాగా, మరోటి ఇండెక్స్ పథకం. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ నిఫ్టీ 200 వాల్యూ 30 ఈటీఎఫ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ నిఫ్టీ 200 వాల్యూ 30 ఇండెక్స్ ఫండ్ అనే ఈ రెండు పథకాల ఎన్ఎఫ్ఓ ముగింపు తేదీ ఈ నెల 14. ఎన్ఎఫ్ఓలో కనీస పెట్టుబడి రూ.100. నిఫ్టీ 200 సూచీలో ఆకర్షణీయమైన విలువ కల షేర్లపై పెట్టుబడి పెట్టేందుకు ఈ పథకాలు అవకాశం కల్పిస్తాయి. ఈ పథకాల నిర్వహణ వ్యయాలూ తక్కువగా ఉండటం మరో ప్రత్యేకత. నిఫ్టీ 200 వాల్యూ 30 టీఆర్ఐ సూచీని ఈ పథకాలు కొలమానంగా తీసుకుంటాయి. ఈ సూచీ, నిఫ్టీ 200 టీఆర్ఐ సూచీతో పోలిస్తే అనేక సందర్భాల్లో ఆకర్షణీయమైన పనితీరును ప్రదర్శించిన విషయం గమనార్హం. నిఫ్టీ 200 వాల్యూ 30 టీఆర్ఐ సూచీలో నిఫ్టీ 200 నుంచి 'వాల్యూ స్కోర్' ఆధారంగా ఎంపిక చేసిన 30 షేర్లు ఉంటాయి. దీర్ఘకాలంలో మెరుగైన పనితీరు కనబరిచే అవకాశం ఈ షేర్లకు ఉంటుంది. నిఫ్టీ 200 వాల్యూ 30 టీఆర్ఐ సూచీలో ఆర్థిక సేవలు, ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్స్- మైనింగ్, నిర్మాణ సామగ్రి, రసాయనాలు, టెలీకమ్యూనికేషన్ల రంగాలకు చెందిన కంపెనీలు ఉన్నాయి. ఈ పథకాల్లో పెట్టుబడి పెట్టాలనుకున్న మదుపరులు దీర్ఘ కాలం పాటు తమ పెట్టుబడులను కొనసాగించేందుకు సిద్ధపడితే లాభాలు ఆర్జించేందుకు అవకాశం ఉంటుంది.

నష్టభయం పరిమితంగా

కొత్త పథకం

ఆదిత్య బిర్లా సన్ లైఫ్ మ్యూచువల్ ఫండ్ ఒక వినూత్నమైన పథకాన్ని తీసుకొచ్చింది. ఆదిత్య బిర్లా ఎస్ఎల్ క్రిసిల్-ఐబీఎక్స్ ఏఏఏ ఎన్‌బీఎఫ్‌సీ-హెచ్ఎఫ్‌సీ ఇండెక్స్-సెప్టెంబరు 26 ఫండ్ అనే ఈ పథకం ఎన్ఎఫ్ఓ ఈ నెల 7 వరకూ అందుబాటులో ఉంటుంది. ఎన్ఎఫ్ఓలో కనీస పెట్టుబడి రూ.1,000. ఇది ఇండెక్స్ తరగతికి చెందిన ఓపెన్ ఎండెడ్ పథకం. ఇందులో వడ్డీ రేటు రిస్కు, క్రెడిట్ రిస్కు కొంత తక్కువే. దీనికి హర్షిల్ సువర్ణకర్, విష్ణేశ్ గుప్తా ఫండ్ మేనేజర్లు. క్రిసిల్ ఐబీఎక్స్ ఏఏఏ ఎన్‌బీఎఫ్‌సీ-హెచ్ఎఫ్‌సీ ఇండెక్స్‌లో భాగంగా ఉన్న పత్రాలపై ఈ పథకం మదుపు చేస్తుంది. కొంత సొమ్మును రుణ పత్రాలు, మనీ మార్కెట్ పత్రాలకూ కేటాయిస్తారు.

వృద్ధి కనిపించే రంగాల్లో

బరోడా బీఎన్‌పీ పారిబస్ మ్యూచువల్ ఫండ్ నుంచి ఒక మొమెంటమ్ ఫండ్ అందుబాటులోకి వచ్చింది. బరోడా బీఎన్‌పీ పారిబస్ నిఫ్టీ 200 మొమెంటమ్ 30 ఇండెక్స్ ఫండ్ అనే ఈ పథకం ఎన్ఎఫ్ఓ ముగింపు తేదీ ఈ నెల 9. ఎన్ఎఫ్ఓలో కనీస పెట్టుబడి రూ.1,000. ఇటీవలి కాలంలో మొమెంటమ్ పథకాలు మదుపరులను ఆకర్షిస్తున్న విషయం విదితమే. ఎప్పటికప్పుడు అధిక పనితీరును కనబరిచే రంగాలకు చెందిన కంపెనీలను గుర్తించి పెట్టుబడి పెట్టటం, తద్వారా అధిక లాభాలు ఆర్జించటం మొమెంటమ్ పథకాల ప్రత్యేకత. ఈ తరగతికి చెందిన పథకాన్ని బరోడా బీఎన్‌పీ పారిబస్ మ్యూచువల్ ఫండ్ ఆవిష్కరించింది. దీనికి నీరజ్ సక్సేనా ఫండ్ మేనేజర్‌గా వ్యవహరిస్తారు. నిఫ్టీ 200 మొమెంటమ్ 30 టీఆర్ఐ సూచీని ఈ పథకం పనితీరుకు కొలమానంగా తీసుకుంటారు. ఈ సూచీలోని షేర్లతోనే ఈ పథకం పోర్ట్‌ఫోలియో నిర్మిస్తారు. దీర్ఘకాలిక మదుపరులకు ఇది అనువుగా ఉంటుంది.

వర్చువల్ కార్డును తీసుకున్నారా?

క్రెడిట్ కార్డును ఉపయోగించి ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయడం, బిల్లులు చెల్లించడం సర్వసాధారణం. ఇలాంటప్పుడు మన కార్డు వివరాలు ఇతరులకు తెలియకుండా ఉండాలంటే ఏం చేయాలి? క్రెడిట్ కార్డుకు అనుబంధంగా వర్చువల్ క్రెడిట్ కార్డు (వీసీసీ)ని తీసుకుంటే సరి.

ఇప్పటికే మీకున్న క్రెడిట్ కార్డుకు డిజిటల్ రూపమే వర్చువల్ క్రెడిట్ కార్డు. ఆన్‌లైన్ లావాదేవీల కోసం మాత్రమే దీన్ని వినియోగించుకునేందుకు వీలుంది. సాధారణ కార్డులాగానే దీనికీ నంబరు, సీవీవీ, గడువు తేదీలాంటివి ఉంటాయి. ఇవి తాత్కాలికంగా వాడుకునేందుకు, ఆన్‌లైన్ షాపింగ్‌కు మాత్రమే ఉపయోగపడతాయి. కార్డును వాడాలనుకున్న ప్రతిసారీ మీకు ఒక కోడ్ వస్తుంది. దీన్ని అప్పటికప్పుడే వినియోగించాలి. తర్వాత వాడుకునేందుకు కుదరదు.

ప్రస్తుతం చాలా బ్యాంకులు వర్చువల్ క్రెడిట్ కార్డును అందిస్తున్నాయి. మీ బ్యాంకు వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్‌లో దీని గురించి సమాచారం ఉంటుంది. కార్డు కోసం దరఖాస్తు చేయగానే ప్రత్యేక వర్చువల్ కార్డు నంబర్ వస్తుంది. ఇది సాధారణంగా 24 గంటల నుంచి



48 గంటలపాటు అందుబాటులో ఉంటుంది. ఈ లోపు రద్దు చేసుకునేందుకూ వీలుంటుంది. ఈ కార్డు వివరాలను ఆన్‌లైన్‌లో పంపించేందుకూ వీలుండదు. ఒకవేళ దీన్ని ఎవరైనా వాడుతున్నారని అనుమానం వస్తే వెంటనే యాప్‌లో బ్లాక్ చేసేందుకు వీలుంది. వీసీసీలో ఎంత మొత్తం ఉండాలన్నది కార్డుదారు ముందే నిర్ణయించుకోవచ్చు. దాన్ని వాడకపోతే వెంటనే ప్రాథమిక కార్డులోకి బదిలీ అయిపోతుంది. వీసీసీని వాడాలన్నా ఓటీపీ, పిన్ తప్పనిసరి. ఆన్‌లైన్ కొనుగోలు చేసేముందు ఈసారి వర్చువల్ క్రెడిట్ కార్డును ప్రయత్నించండి.



ఈ రోజుల్లో అప్పులు సులభంగా లభిస్తున్నాయి. గృహ, వాహన, వ్యక్తిగత రుణాలతోపాటు, క్రెడిట్ కార్డు బిల్లులూ ఇప్పుడు సర్వసాధారణం అయ్యాయి. వీటన్నింటినీ తిరిగి చెల్లించడం ఒక సవాలుగానే మారుతోంది. ఖర్చులు, తీసుకున్న రుణాలకు వాయిదాలు చెల్లించడం కోసం కొన్నిసార్లు కొత్త అప్పులు చేయాల్సిన పరిస్థితులూ రావచ్చు. ఇలాంటప్పుడు ఆర్థికంగా చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తుంది. దీనికి ప్రత్యామ్నాయంగా రుణాలన్నింటినీ కలిపి ఒకే రుణంగా మార్చే ప్రయత్నం చేయొచ్చు.

అప్పులన్నీ ఒకే రుణంగా

ఇప్పటికే ఉన్న అనేక రుణాలను చెల్లించేందుకు ఒకే అప్పును తీసుకోవడం రుణ ఏకీకరణగా చెప్పొచ్చు. తక్కువ వడ్డీ రేటు లేదా అధిక వ్యవధి ఉండేలా చూసుకొని, ఒక పెద్ద అప్పు చేయడం అన్నమాట. దీనివల్ల వడ్డీ భారాన్ని తగ్గించుకోవచ్చు. అదే సమయంలో రుణాల సంఖ్య తగ్గుతుంది. ఫలితంగా ఒకే వాయిదా చెల్లిస్తే సరిపోతుంది.

సలభంగా: వేర్వేరు గడువు తేదీలతో వాయిదాలు చెల్లించాల్సిన అవసరం ఉండదు. రుణ ఏకీకరణ వల్ల నెలలో ఒక్కసారి మాత్రమే ఒకే వాయిదాను చెల్లిస్తే సరిపోతుంది. దీనివల్ల ఆర్థిక ఒత్తిడి తగ్గుతుంది. వాయిదాను మర్చిపోకుండా చెల్లించేందుకు వీలుంటుంది. క్రెడిట్ స్కోరూ పెరుగుతుంది.

తక్కువ వడ్డీ రేటు: వ్యక్తిగత, క్రెడిట్ కార్డు రుణాలపై అధిక వడ్డీ ఉంటుంది. తక్కువ వడ్డీకి తీసుకున్న రుణంతో వీటిని తీర్చేయడం ద్వారా ఆర్థిక భారం తగ్గుతుంది.

పొదుపు: అధిక వడ్డీ రుణాలతో పోలిస్తే తక్కువ వడ్డీ రుణాలకు వాయిదా కాస్త తగ్గుతుంది. అప్పుడు ఆదాయంలో పొదుపు మొత్తం పెరుగుతుంది. దీన్ని సరిగ్గా మదుపు చేస్తే, రానున్న రోజుల్లో రుణాన్ని తీర్చేయడానికి లేదా ఇతర ఆర్థిక లక్ష్యాల సాధనకు వాడుకోవచ్చు.

క్రెడిట్ స్కోరు: అప్పుల సంఖ్య అధికంగా ఉంటే, క్రెడిట్ స్కోరుపై ప్రభావం పడుతుంది. ఒకే రుణం తీసుకోవడం వల్ల స్కోరు పెరుగుతుంది. వాయిదాలను సకాలంలో చెల్లించినప్పుడే స్కోరు పెరుగుతుందని మర్చిపోవద్దు.

ఇవన్నీ తెలుసుకున్నాకే..

కొత్త రుణం తీసుకున్నప్పుడు లేదా పాత రుణాన్ని బదిలీ చేసేటప్పుడు రుణదాతలు విధించే ప్రాసెసింగ్ ఫీజు, బదిలీ రుసుమును పరిశీలించాలి. మీ ప్రస్తుత రుణదాతకు ముందుగానే చెల్లిస్తే దానికీ రుసుములు తీసుకోవచ్చు. ఇవన్నీ చూసుకున్నాకే రుణ ఏకీకరణకు అడుగేయాలి.

❖ మీ క్రెడిట్ స్కోరు ఆధారంగా రుణ వడ్డీ రేటును నిర్ణయిస్తుంటాయి బ్యాంకులు. మీకు 750కి మించి స్కోరున్నప్పుడు వడ్డీ రేటు విషయంలో కాస్త బేరమాడండి.

❖ రుణ ఏకీకరణ తర్వాత మీ అప్పు మొత్తం ఒకే చోటకు వస్తుంది. అదే సయయంలో వివిధ కాల వ్యవధుల్లో తీరాల్సిన అప్పు వ్యవధీ పెరుగుతుంది. దీనివల్ల వాయిదా మొత్తం కాస్త తగ్గినా, అధిక వ్యవధి వల్ల దీర్ఘకాలంలో వడ్డీ భారమే అవుతుంది. కాబట్టి, వీలైనంత తొందరగా రుణాన్ని తీర్చేయడానికి ప్రయత్నించాలి.

❖ అధిక నెలవారీ వాయిదా ఉండకుండా చూసుకోవాలి. ఒక్క ఈఎంఐ చెల్లించకపోయినా క్రెడిట్ స్కోరు దెబ్బతినే అవకాశం ఉంది. అందువల్ల రుణ ఏకీకరణకు కొత్త రుణాన్ని తీసుకునే ముందు ఈఎంఐ మీకు అందుబాటులో ఉండేలా చూసుకోండి.

❖ తక్కువ మొత్తంలో రుణాలుండి, మరో ఏడాదిలో అవి తీరబోతున్నాయి అనుకున్నప్పుడు వాటిని ఏకీకరణ చేసే ప్రయత్నం చేయొద్దు. తక్కువ వడ్డీ రుణాలను ఒకే అప్పుగా మార్చడం వల్ల పెద్దగా ఫలితం ఉండదు.

ఎవరికి అనుకూలం..

ప్రస్తుతం అధిక వడ్డీ రేట్లతో అనేక హామీ లేని రుణాలు, క్రెడిట్ కార్డు రుణాలు ఉన్న వారికి రుణాల ఏకీకరణ పనికొస్తుంది. గతంతో పోలిస్తే మీ క్రెడిట్ స్కోరు మెరుగైనప్పుడూ వడ్డీ రేటు తగ్గుతుంది. ఇలాంటప్పుడూ పెద్ద రుణం కోసం ప్రయత్నించవచ్చు. అన్ని ఈఎంఐలనూ ఒకే చోటకు తీసుకొచ్చి, ఆర్థిక వ్యవహారాలను సరళీకృతం చేయాలనుకున్నప్పుడూ దీన్ని పరిశీలించవచ్చు.

ఎలాంటి రుణం..

గృహరుణంపై టాపప్ తీసుకోవడం ద్వారా చిన్న రుణాలను తీర్చేందుకు ప్రయత్నించవచ్చు. కొన్నిసార్లు ఇతర బ్యాంకుకు మారినప్పుడూ పెద్ద మొత్తంలో అప్పు దొరుకుతుంది. చిన్న రుణాలను తీర్చేయడానికి తక్కువ వడ్డీకి దొరికే వ్యక్తిగత రుణాన్ని తీసుకోవచ్చు. లేదా బంగారాన్ని తాకట్టు పెట్టి, రుణం తీసుకోవచ్చు. ఇప్పటికే ఉన్న కారు రుణంపైనా టాపప్ ఇచ్చే అవకాశాలుంటాయి. దీన్నీ పరిశీలించవచ్చు. ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే.. మీరు తీసుకుంటున్న కొత్త అప్పు ద్వారా ఇప్పటికే ఉన్న రుణాల సంఖ్య, వడ్డీ భారం తగ్గాలి. అంతేకానీ, ఇది మరో రుణంగా మిగిలిపోకూడదు.

నెలకు రూ.15వేలతో...

నా వయసు 39. ప్రస్తుతానికి ఈపీఎఫ్ తప్ప ఇతర పెట్టుబడి పథకాలేమీ లేవు. రూ.3 లక్షల ఆరోగ్య బీమాను మా సంస్థ అందిస్తోంది. నెలకు రూ.70వేల వరకూ వస్తున్నాయి. ఇందులో నుంచి రూ.15వేల వరకూ పెట్టుబడి పెట్టాలనేది ఆలోచన. నా ప్రణాళిక ఎలా ఉండాలి? - దీపక్

❑ ముందుగా మీరు రూ. కోటి వరకూ టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకోండి. ప్రత్యేకంగా మీ సొంత ఆరోగ్య బీమా పాలసీ ఉండాలి. వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీని కనీసం రూ.50లక్షలకు తీసుకోండి. అత్యవసర నిధినీ సిద్ధం చేసుకోండి. ఆ తర్వాత మీరు మదుపు చేయాలనుకుంటున్న రూ.15వేలను దీర్ఘకాలిక లక్ష్యంతో డైవర్సిఫైడ్ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో క్రమానుగత పెట్టుబడి విధానంలో మదుపు చేయండి. ఇలా 21 ఏళ్లపాటు క్రమం తప్పకుండా మదుపు చేస్తే.. 11 శాతం వార్షిక సగటు రాబడి అంచనాతో దాదాపు రూ.1.48 కోట్ల వరకూ అయ్యే అవకాశం ఉంది.

గృహరుణం తీరేందుకు ఇంకా రెండేళ్ల సమయం ఉంది. ఇప్పుడు టాపప్ లోన్‌గా రూ.10 లక్షల వరకూ ఇస్తామని బ్యాంకు చెబుతోంది. దీన్ని తీసుకోవచ్చా? - కృష్ణమోహన్

మార్గదర్శి


❑ అప్పు లేకుండా ఉండటం ఎప్పుడూ మంచిది. రెండేళ్లలో రుణం తీరుతుంది కాబట్టి, ఇప్పుడు టాపప్ లోన్ తీసుకొని, కొత్తగా అప్పు చేయడం మంచిది కాదనే చెప్పాలి. ఆ డబ్బుతో మీరు ఏం చేస్తారు అనే స్పష్టతా ఉండాలి. మదుపు చేయాలని అనుకుంటే.. అప్పు చేసి పెట్టుబడులు పెట్టడం ఎప్పుడూ సరికాదు. టాపప్ రుణానికి చెల్లించే ఈఎంఐని మ్యూచువల్ ఫండ్లలో సిప్ చేసేందుకు ప్రయత్నించండి.

మా బాబు వయసు 16. తన పేరు మీద నెలకు రూ.50వేల వరకూ పెట్టుబడి పెట్టాలని అనుకుంటున్నాం. 5 ఏళ్ల తర్వాత విదేశాలకు వెళ్లేందుకు ఈ మొత్తం ఉపయోగిస్తాం. ఏం చేస్తే మంచి లాభాలు వస్తాయి? షేర్లలో పెట్టుబడి పెట్టొచ్చా? - వినోద్

❑ అయిదేళ్ల వ్యవధి ఉంది కాబట్టి, స్టాక్ మార్కెట్లో నేరుగా మదుపు చేసే బదులు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లను ఎంచుకోవడం మేలు. దీనివల్ల మీకు నష్టభయం పరిమితంగా ఉంటుంది. మీకు డబ్బు అవసరమైన రెండేళ్ల ముందు నుంచి మీ పెట్టుబడిని క్రమానుగత బదిలీ విధానంలో మంచి క్రెడిట్ క్వాలిటీ ఉన్న డెట్ మ్యూచువల్ ఫండ్లలోకి మళ్లించండి.

- తుమ్మ బాల్‌రాజ్

నష్టం రావద్దు లాభం వదులుకోవద్దు



'స్టాక్ మార్కెట్‌లో ఎప్పుడూ లాభాలే వస్తాయని చాలామంది అనుకుంటారు. మార్కెట్ ఎప్పటికీ ఆగదని భావిస్తుంటారు. అందుకే, ఈక్విటీల్లో పెట్టుబడులను పెంచుకుంటూ వెళ్తారు. డబ్బుకు సంబంధించినంత వరకూ ఇది పెద్ద అపోహ' అని అంటున్నారు ఐఐటీ మద్రాస్ ఆచార్యుడు ఎం.పట్టాభిరామన్. ఈ మాటల్లో వాస్తవం మనకు ఎప్పుడూ కనిపిస్తూనే ఉంటుంది. స్టాక్ మార్కెట్ సూచీలు పెరుగుతూ వస్తుంటాయి. ఒక్కసారిగా వేల పాయింట్లు పడిపోతూ ఉంటాయి. ఇలాంటప్పుడు మదుపరులు జాగ్రత్తగా ఉండటం ఒక్కటే సరిపోదు. నష్టాలు రాకుండా చూసుకోవడంతోపాటు, వచ్చిన లాభాలనూ కాపాడుకునేందుకు ఏం చేయాలన్నదీ తెలుసుకోవాలి.

పెట్టిన పెట్టుబడికి రాబడినిచ్చే పథకాలు సహజంగానే అధిక రాబడిని అందించవు. ఉదాహరణకు బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ప్రస్తుతం 7.5శాతం వరకూ వడ్డీ లభిస్తోంది. దీనికి కచ్చితమైన హామీ ఉంటుంది. కానీ, స్టాక్ మార్కెట్లో మదుపు చేసినప్పుడు ఇంతకు మించి లాభాలు వచ్చేందుకు ఆస్కారం ఉంది. కానీ, పెట్టిన పెట్టుబడికి ఎంతోకొంత నష్టభయం లేకపోలేదు. మార్కెట్, కంపెనీ స్థితిగతులను బట్టి, వచ్చే లాభాలు ఆధారపడి ఉంటాయి. అదే సమయంలో నష్టాలు కనిపించినా తట్టుకునే శక్తి ఉండాలి.

అన్నీ పెరగవు..

షేర్లలో పెట్టుబడులపై వచ్చే లాభాలు మార్కెట్ గమనాన్ని బట్టి ఆధారపడి ఉంటాయి. మార్కెట్ పెరుగుతున్నప్పుడు అన్ని షేర్ల ధరలూ పెరగవు. కానీ, మార్కెట్ పడిపోతున్నప్పుడు మాత్రం ఆ ప్రభావం అన్ని షేర్లపైనా ఉంటుంది. కొన్ని షేర్ల ధరలు వేగంగా పతనం అవ్వడమూ చూస్తుంటాం. షేర్లలో మదుపు చేసేటప్పుడు ఆ షేరు ధర ఎంత ఆకర్షణీయంగా ఉందన్న విషయాన్ని చూడాలి. అంతేకానీ, మార్కెట్ సూచీలు ఎలా ఉన్నాయన్నది కాదు. చాలా మంది మార్కెట్ పెరుగుతున్నప్పుడే మదుపు చేసేందుకు ముందుకు వస్తుంటారు. మార్కెట్ ర్యాలీ కొనసాగుతున్నప్పుడు ఆ షేరు ధర పెరుగుతోందని సంతోషంగా ఉంటారు. కానీ, మార్కెట్ పతనం అయితే, ఆ షేరు ధరలో ఎంత వేగంగా దిద్దుబాటు వస్తుందన్న విషయాన్ని పట్టించుకోరు. ఇక్కడే నష్టపోయే ప్రమాదం ఉంది. ఒక షేరు తక్కువ ధరకు కొనాలి.. అధిక ధర ఉన్నప్పుడు అమ్మాలి.. భవిష్యత్ అవకాశాలను పరిశీలించాకే తగిన నిర్ణయం తీసుకోవాలి.

హెచ్చుతగ్గులు పట్టించుకోవద్దు..

ఏ ఇతర పెట్టుబడి సాధనాలతో పోల్చి చూసినా.. దీర్ఘకాలంలో స్టాక్ మార్కెట్ అధిక రాబడినిచ్చింది. మార్కెట్లో స్వల్పకాలిక హెచ్చుతగ్గులను చూసి భయపడి ఎంతోమంది షేర్లను నష్టాలకు అమ్ముకొంటున్నారు. గత కొంతకాలంగా మార్కెట్ ఎలాంటి హెచ్చుతగ్గులకు లోనయ్యిందో చూస్తూనే ఉన్నాం. అక్టోబరు 3న మదుపరుల సంపద ఏకంగా రూ.11 లక్షల కోట్ల మేరకు నష్టపోయింది. మార్కెట్ విలువ పెరిగినప్పుడు మళ్లీ ఈ సంపద సృష్టి జరుగుతుంది. కాబట్టి, స్వల్ప, మధ్య కాలాల్లో వచ్చే హెచ్చుతగ్గులు దీర్ఘకాలిక మదుపరులకు మంచి అవకాశాన్ని ఇస్తున్నట్లు లెక్క. మంచి షేరు ఆకర్షణీయంగా అనిపించినప్పుడు వదులుకోవద్దు. మార్కెట్ సూచీల గమనాలను ఇలాంటప్పుడు పరిగణనలోకి తీసుకోవద్దు. ఏ పరిస్థితుల్లోనైనా స్థిరంగా కదలాడుతూ ఉండే షేర్లు కొన్ని ఉంటాయి. వాటిని ఎంపిక చేసుకోవడం మంచిది.

అన్ని దశల్లోనూ..

ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో సంఘటనలు జరుగుతుంటాయి. అవన్నీ స్టాక్ మార్కెట్లపై ప్రభావాన్ని చూపిస్తాయి. దేశాల మధ్య ఉద్రిక్తతలు, అమెరికాలో ఎన్నికలు, దేశంలోనూ ద్రవ్యోల్బణ పరిస్థితులు.. అధిక వడ్డీ రేట్లు ఇలా ఎన్నో పరిణామాలు స్టాక్ మార్కెట్‌ను ప్రభావితం చేస్తుంటాయి. వీటిని గమనిస్తూ ముందుకెళ్లాలి. మార్కెట్ అన్ని దశల్లోనూ మన పెట్టుబడులు కొనసాగాలి. అప్పుడే భవిష్యత్తులో లాభాల సంపాదనకు అవకాశాలు పెరుగుతాయి. మార్కెట్లో ఒక కంపెనీ షేరును ఎంపిక చేసుకునేటప్పుడు దాని వాస్తవిక విలువ, ఎంత తక్కువకు దొరుకుతోంది, దానికున్న వృద్ధి అవకాశాలేమిటిలాంటి అంశాలను పరిశీలించాలి. తక్కువ ధరకు దొరుకుతున్నాయని అని, ప్రతి షేరునూ కొంటే నష్టాలు పెరుగుతాయి. మీ పెట్టుబడుల జాబితాలో 12 షేర్లకు మించి ఉండకుండా చూసుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. 'మొత్తం పెట్టుబడిలో 50-60 శాతం వరకూ ఈక్విటీలకు కేటాయిస్తే సరిపోతుంది. దీంతోపాటు స్థిరాదాయం ఇచ్చే పథకాలనూ పరిశీలించాలి' అని పట్టాభిరామన్ సూచించారు.

ఈనాడు ప్రతిభ
హైదరాబాద్, శుక్రవారం, అక్టోబరు 4, 2024
5
pratibha.eenadu.net/eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

ప్రాక్టీస్ బిట్స్

ఇండియన్ పాలిటీ

1. భారత రాజ్యాంగ నిర్మాతలు భారత దేశాన్ని లౌకిక రాజ్యంగా ఉంచడానికి కారణాన్ని గుర్తించండి.
   1) ఒకేమతంలోని కొంతమందిపై మరి కొంతమంది ఆధిపత్యం చెలాయించకూడదు.
   2) ప్రభుత్వం ఏ ఒక్క మతాన్ని వ్యక్తులపై రుద్దకూడదు. వ్యక్తుల మతస్వేచ్ఛను హరించకూడదు.
   3) ఒక మతవర్గం మరొక మతవర్గంపై ఆధిపత్యం చెలాయించకూడదు.
   4) పైవన్నీ
2. భారతదేశంలో ఆచరణలో లౌకిక వాదానికి సంబంధించి సరికాని దాన్ని గుర్తించండి.
   1) భారతదేశాన్ని ఏ ఒక్క మత బృందం పరిపాలించలేదు.
   2) భారత రాజ్యాంగం మతపరమైన విద్యాసంస్థల ఏర్పాటును నిషేధించింది.
   3) భారత్‌లోని న్యాయస్థానాలు, పోలీసు స్టేషన్లు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో మతచిహ్నాలు ప్రదర్శించకూడదు.
   4) మహిళలకు వారసత్వంలో సమాన ఆస్తిహక్కును కల్పించడానికి ప్రజల మతఆధారిత పౌరచట్టాల్లో రాజ్యం జోక్యం చేసుకునే వీలుంది.
3. కిందివాటిలో ఒకప్పటి ఫ్రాన్స్ వలస దేశాల జాబితాలో లేనిదాన్ని గుర్తించండి.
   1) ట్యునీషియా 2) జింబాబ్వే
   3) అల్జీరియా 4) మొరాకో

సమాధానాలు: 1-4, 2-2, 3-2.

ప్రిపరేషన్ టెక్నిక్

చదివేటప్పుడు సందేహాలు వస్తే నోట్ చేసుకోవాలి. మరోసారి పాఠ్య పుస్తకాన్ని పరిశీలించి అర్థం చేసుకోవాలి. ఆన్‌లైన్‌లోనూ ప్రయత్నించవచ్చు. అప్పటికీ తెలియకపోతే ఉపాధ్యాయులను, స్నేహితులను అడిగి వెంటనే నివృత్తి చేసుకోవాలి. వదిలేయడం, వాయిదా వేయడం మంచి పద్ధతి కాదు.




పదోతరగతి
భౌతిక రసాయన శాస్త్రం

స్ట్రాన్షియం భారం తెలుసా!

2 మార్కుల ప్రశ్నలు — **మూలకాల వర్గీకరణ - ఆవర్తన పట్టిక**

ప్రశ్నలు జవాబులు

1) Ca, Sr, Ba లు డాబరీనర్ త్రికాలయితే; Ca, Ba ల భారాలు వరుసగా 40.0, 137.0 అయితే స్ట్రాన్షియం భారాన్ని కనుక్కోండి.

జ: స్ట్రాన్షియం భారం $= \frac{40.0+137.0}{2} = \frac{177}{2} = 88.5$

2) ఎకా–బోరాన్, ఎకా–అల్యూమినియం, ఎకా–సిలికాన్ స్థానాల్లో కనుక్కున్న మూలకాలు ఏవి?

జ: ఎకా-బోరాన్, ఎకా-అల్యూమినియం, ఎకా-సిలికాన్ స్థానాల్లో వరుసగా స్కాండియం, గాలియం, జెర్మేనియం మూలకాలను కనుక్కున్నారు.

3) క్షార మృత్తిక లోహాలు ఏ గ్రూపునకు చెందినవి?

జ: 2(IIA)

4) ఆవర్తన పట్టికలో ఏ గ్రూపు మూలకాలు అత్యధిక రుణ విద్యుదాత్మకతను కలిగి ఉంటాయి?

జ: హాలోజన్‌లు (VIIA గ్రూప్)

5) కార్బన్ కుటుంబం సంయోజకత ఎంత?

జ: 4

6) విస్తృత ఆవర్తన పట్టికలో 6వ పీరియడ్‌లో ఉన్న మూలకాల సంఖ్య ఎంత?

జ: 32

7) ఆవర్తన పట్టికలోని ఏ బ్లాక్‌లో లోహాలు, అర్ధ లోహాలు, అలోహాలుంటాయి?

జ: P - బ్లాక్

8) లాంథనైడ్‌లు, ఆక్టినైడ్‌లు ఆవర్తన పట్టికలో ఏ గ్రూపునకు చెందినవి?

జ: 3 (IIIB)

ముఖ్యమైనవి మరికొన్ని..

జవాబుల కోసం

1) Na^{+}, Mg^{2+}, Al^{3+} లలో అయానిక వ్యాసార్ధాలు పెరిగే క్రమాన్ని రాయండి. (2మా.)
2) ఆధునిక ఆవర్తన పట్టికలోని మొదటి పది మూలకాల్లో ఉన్న లోహాలు ఏవి? (2 మా.)
3) పరమాణు సంఖ్య 12గా ఉన్న మూలకం కింది లక్షణాలను రాయండి. (4 మా.)
   a) పీరియడ్ సంఖ్య b) గ్రూపు సంఖ్య
   c) సంయోజకత d) మూలక కుటుంబం

– కంచర్ల గగన్ కుమార్

నిరంతర విద్యుత్తు ఉత్పత్తి సాధనాలు!

జనరల్ స్టడీస్ — పర్యావరణ అంశాలు



శిలాజ ఇంధనాల వినియోగంతో తలెత్తే పర్యావరణ అనర్థాలను గుర్తించిన ప్రపంచం ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వైపు వేగంగా దృష్టి సారిస్తోంది. ఈ క్రమంలోనే విద్యుత్తు వాహనాల వాడకం పెరుగుతోంది. ఈవీలు నడిచేందుకు ప్రధానంగా కావాల్సినవి బ్యాటరీలు. నిల్వ ఉన్న ఇంధనం అయిపోగానే ఈ బ్యాటరీలు మార్చాలి లేదా రీఛార్జ్ చేయాలి. ఈ ఇబ్బందిని అధిగమించేందుకు రూపొందించినవే ఫ్యూయల్ సెల్స్. అవి హైడ్రోజన్ వాయువును విద్యుత్తు, రసాయనిక ప్రక్రియలకు గురిచేస్తూ నిరంతరాయంగా విద్యుత్తును ఉత్పత్తి చేస్తాయి. ఈవీ రంగంలో భవిష్యత్తు ఇంధన వనరుగా భావిస్తున్న ఈ సాంకేతికత గురించి పరీక్షార్థులు తెలుసుకోవాలి. హైడ్రోజన్ ఆధారిత ఫ్యూయల్ సెల్స్ పనిచేసే విధానం, వాటి అనుకూలతలు, ప్రయోజనాలు, ప్రస్తుతం ఉన్న సవాళ్లతోపాటు సూక్ష్మజీవుల ఆక్సీకరణ ద్వారా విద్యుత్తును ఉత్పత్తి చేసే మైక్రో ఫ్యూయల్ సెల్స్ గురించీ తగిన అవగాహనతో ఉండాలి.

విద్యుత్తు వాహనాలు బ్యాటరీలు, ఫ్యూయల్ సెల్‌లు

బ్యాటరీ అనేది శక్తి నిల్వ పరికరం. అది తన ఇంధనాన్ని అంతర్గతంగా నిల్వ చేస్తుంది. ఫ్యూయల్ సెల్ అనేది శక్తి మార్పిడి పరికరం. అందుబాటులో ఉన్న ఇంధనాన్ని మార్చడం ద్వారా శక్తిని ఉత్పత్తి చేస్తుంది. ఇందులో ఇంధనం బాహ్యంగా సరఫరా అవుతుంది. ఎలక్ట్రోడ్‌లు కరిగిపోగానే బ్యాటరీ డౌన్ అవుతుంది. అయితే ఫ్యూయల్‌సెల్ మాత్రం ఆక్సిజన్, హైడ్రోజన్ అందించినంత కాలం పనిచేస్తుంది. అందుకే మన్నిక పరంగా బ్యాటరీ కంటే ఫ్యూయల్ సెల్ ప్రయోజనకరంగా ఉంటుంది. ఇవి రెండూ ఏకముఖ విద్యుత్తును ఉత్పత్తి చేస్తాయి.

ఫ్యూయల్ సెల్ పనితీరు, సాంకేతికత: ఫ్యూయల్ సెల్ అనేది ఎలక్ట్రో కెమికల్ పరికరం. దీనిలో హైడ్రోజన్ ఇంధనం ఆక్సిజన్‌తో కలసి విద్యుత్తు, వేడి, నీటిని ఉత్పత్తి చేస్తుంది. ఫ్యూయల్ సెల్ బ్యాటరీని పోలి ఉంటుంది. ఇంధనం అందుబాటులో ఉన్నంత వరకు ఎలక్ట్రో కెమికల్ చర్య జరుగుతుంది. హైడ్రోజన్‌ను ఒత్తిడితో కూడిన కంటెయినర్ నిల్వ నుంచి, ఆక్సిజన్‌ను గాలి నుంచి తీసుకుంటుంది. ఇందులో దహనం లేకపోవడంతో హానికర ఉద్గారాలు ఉండవు. ఉప ఉత్పత్తిగా స్వచ్ఛమైన నీరు వెలువడుతుంది.



గమనిక: దీన్ని చిన్న నుంచి పెద్ద వరకు అన్నిస్థాయుల ఎలక్ట్రిక్ ఉపకరణాల్లో ఉపయోగించవచ్చు.

ఫ్యూయల్ సెల్ అనువర్తనాలు: 1) అన్నిరకాల వాతావరణ పరిస్థితులకు అనుకూలం. 2) రిమోట్ మానిటరింగ్ సిస్టమ్ ఉపయోగించి ఫ్యూయల్ సెల్స్ డేటాను కమ్యూనికేట్ చేస్తాయి. 3) తాత్కాలిక భవనాలకు విద్యుత్తు అందించవచ్చు. 4) రవాణా (రైలు, రోడ్డు, వాయు) 5) మెటీరియల్స్ హ్యాండ్లింగ్ 6) బ్లూ లైట్, డిఫెన్స్ అప్లికేషన్లు 7) సెల్యులార్ బేస్ స్టేషన్లు 8) విద్యుత్తు ఉత్పత్తి.

ఫ్యూయల్ సెల్ పనిచేసే విధానం: * ఒక ఇంధన ఘటం సంప్రదాయ ఘటాల మాదిరిగానే ఎలక్ట్రోలైట్ చుట్టూ శాండ్‌విచ్ చేసిన ఆనోడ్, క్యాథోడ్‌ను కలిగి ఉంటుంది. ఆనోడ్‌కు హైడ్రోజన్‌ను, క్యాథోడ్‌కు ఆక్సిజన్‌ను అందించాల్సి ఉంటుంది. * ఎలక్ట్రాన్లు బాహ్య సర్క్యూట్ ద్వారా వెళ్లి, విద్యుత్తు ప్రవాహాన్ని సృష్టిస్తాయి. * ప్రోటాన్‌లు ఎలక్ట్రోలైట్ ద్వారా క్యాథోడ్‌కి వెళుతున్నప్పుడు అవి ఆక్సిజన్, ఎలక్ట్రాన్లతో కలసి ఉపఉత్పన్నాలను ఉత్పత్తి చేస్తాయి. * మిథనాల్, ఇథనాల్, సహజవాయువుపై పనిచేసే ఫ్యూయల్ సెల్ కూడా అందుబాటులో ఉన్నప్పటికీ హైడ్రోజన్.. ఫాస్ఫారిక్ యాసిడ్ ఇంధన కణాల్లో అత్యంత సాధారణ రకం.

ఫ్యూయల్ సెల్ భవిష్యత్తు: 1) ఆటోమేటిక్ ఇంజిన్లు, పవర్‌స్టేషన్లు, పోర్టబుల్ ఎలక్ట్రానిక్స్ కోసం, పవర్ ప్యాక్‌ల కోసం భవిష్యత్తులో ఫ్యూయల్ సెల్స్ ఉత్తమ సాంకేతికతగా మారే అవకాశం ఉంది. 2) ఫ్యూయల్ సెల్స్ వివిధ శక్తి పరివర్తన పరికరాలతో పోటీపడతాయి. 3) గ్యాసోలిన్, టర్బైన్ ఇంజిన్‌లు పని చేయడానికి వాయువుల ద్వారా సృష్టించిన ఒత్తిడిని ఉపయోగించి ఇంధనాలను దహనం చేస్తాయి.

* అవసరమైనప్పుడు బ్యాటరీలు రసాయన శక్తిని తిరిగి విద్యుత్తు శక్తిగా మారుస్తాయి.

ఈ విధంగా టర్బైన్, గ్యాసోలిన్ ఇంజిన్ నిర్వహించే పని, బ్యాటరీలు చేసే పనులను ఫ్యూయల్ సెల్స్ ద్వారా మరింత సమర్థంగా నిర్వహించవచ్చు. అత్యంత ఆశాజనక సాంకేతికతల్లో ఇదొకటి.

* ప్రోటాన్ ఎక్స్ఛేంజ్ మెమ్‌బ్రేన్ ఫ్యూయల్ సెల్. ఈ రకమైన ఫ్యూయల్ సెల్ బస్సులు, గృహాలకు కూడా శక్తినిస్తుంది.

* కొన్నిరకాల ఆల్గే, బ్యాక్టీరియా కొన్ని పరిస్థితుల్లో సూర్యరశ్మిని శక్తివనరుగా ఉపయోగించుకుని హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేస్తాయని కనుక్కున్నారు.

డీఎస్సీ/టెట్ - 2024 బయాలజీ కంటెంట్

సూక్ష్మజీవుల ఇంధన కణాలు (మైక్రోబియల్ ఫ్యూయల్ సెల్స్- ఎంఎఫ్‌సీ)

* ఎంఎఫ్‌సీ, హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్స్‌తో సమానంగా ఉంటుంది. కానీ హైడ్రోజన్ ఇంధన స్థానంలో సేంద్రియ వ్యర్థాలు ఉపయోగిస్తారు.

* హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్స్‌లో ఎలక్ట్రోలైట్/ఉత్ప్రేరకంగా ప్లాటినంను ఉపయోగిస్తారు. అయితే సూక్ష్మజీవుల ఇంధన కణాల్లో, సేంద్రియ వ్యర్థాల సమక్షంలో బ్యాక్టీరియా ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది. ఇది H^{+}/ప్రోటాన్‌ను ఉత్పత్తి చేస్తుంది.

* బ్యాక్టీరియాకు వివిధ రకాల సేంద్రియ సమ్మేళనాలను కార్బన్ డయాక్సైడ్, నీరు, శక్తిగా మార్చగలిగిన సామర్థ్యం ఉంటుంది.

* సూక్ష్మజీవులు ఉత్పత్తి చేసే శక్తి వాటి జీవక్రియను వృద్ధి చేయడానికి, నిర్వహించడానికి ఉపయోగమవుతుంది. ఎంఎఫ్‌సీని వాడుకోవడం ద్వారా ఈ శక్తిని విద్యుత్తు రూపంలోకి మార్చవచ్చు.

ఎంఎఫ్‌సీ భాగాలు: ఎంఎఫ్‌సీ ఒక ఆనోడ్, క్యాథోడ్, ప్రోటాన్ ఎక్స్ఛేంజ్ మెమ్‌బ్రేన్, ఎలక్ట్రికల్ సర్క్యూట్‌ను కలిగి ఉంటుంది.

సూక్ష్మజీవుల ఇంధన కణం ఫంక్షనల్ యాక్టివిటీ: బ్యాక్టీరియాలను ఆనోడ్ ఛాంబర్‌లో ఉంచుతారు. అక్కడ అవి కర్బన సమ్మేళనాలు/సబ్‌స్ట్రేట్‌లను కార్బన్ డయాక్సైడ్, ప్రోటాన్, ఎలక్ట్రాన్ మొదలైన వాటిగా మారుస్తాయి. ప్రోటాన్ ఎక్స్ఛేంజ్ మెమ్‌బ్రేన్ సహాయం ద్వారా ప్రోటాన్‌లు బదిలీ అవుతాయి. వాయురహిత గది నుంచి ఏరోబిక్ ఛాంబర్ వరకు, ఏరోబిక్ ఛాంబర్‌లో ప్రోటాన్‌లు ఆక్సిజన్‌ను బంధిస్తాయి, నీటిని ఉపఉత్పత్తిగా ఏర్పరుస్తాయి. ఈ ప్రక్రియలో వాయురహిత గదిలో మిగిలి ఉన్న అదనపు ఎలక్ట్రాన్లు ఎలక్ట్రిక్ సర్క్యూట్ ద్వారా ఆనోడ్ నుంచి క్యాథోడ్‌కు వెళ్లడం ప్రారంభిస్తాయి. సంభావ్య వ్యత్యాసం కారణంగా ఈ ఎలక్ట్రాన్ల కదలిక విద్యుత్తు శక్తి ఉత్పత్తికి దోహదపడుతుంది.

* సేంద్రియ పదార్థాల ఉనికి కారణంగా ఎంఎఫ్‌సీలను వ్యర్థజలాల శుద్ధిలో కూడా అన్వయించవచ్చు.

నోట్: ఈ సెల్‌లో ఉత్ప్రేరకంగా ప్లాటినం, పెలాడియం, బంగారం లాంటి విలువైన లోహాలను ఉపయోగిస్తారు. అందువల్ల ఇది ఖర్చుతో కూడుకున్న ప్రక్రియ.

ప్రయోజనాలు: * ఫ్యూయల్ సెల్ ఇంధన సరఫరాను పొందుతున్నంత కాలం ఓల్టేజ్‌ను ఉత్పత్తి చేస్తుంది. * రీఛార్జ్ చేయాల్సిన పనిలేదు. * ఫ్యూయల్ సెల్‌కు అందించే ఆక్సిజన్, హైడ్రోజన్ మొత్తం మీద ఆధారపడి శక్తి ఉత్పత్తి ఉంటుంది. అంతేకాని ఫ్యూయల్ సెల్ పరిమాణం మీద కాదు.



రచయిత: ఈదుబిల్లి వేణుగోపాల్

చెన్నైలో రోడ్డుకు బాలు పేరు!

కరెంట్ అఫైర్స్



దిల్లీలో జరిగిన 3వ వరల్డ్ ఫుడ్ ఇండియా సమావేశం

ఎప్పుడో ఎనిమిది దశాబ్దాల క్రితం చేసుకున్న సింధు నదీజలాల ఒప్పందాన్ని ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా మార్చుకుందామంటూ పాకిస్థాన్‌కు భారత్ ప్రతిపాదించింది. న్యూజిలాండ్ శాస్త్రవేత్తలు ఇటీవల సముద్రగర్భంలో పొట్టి ముక్కు, నల్ల కళ్లతో ఉన్న సరికొత్త సొర చేపను గుర్తించారు. తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం పేరు పెట్టాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించగా, చెన్నైలో ఒక రోడ్డుకు దివంగత ప్రసిద్ధ గాయకుడు బాలసుబ్రహ్మణ్యం పేరు పెట్టి గౌరవించారు. నటుడు చిరంజీవి తాను వేల సంఖ్యలో చేసిన డ్యాన్స్ స్టెప్పులతో గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కారు. ఇలాంటి ఆసక్తికర, వార్తల్లో నిలిచిన వర్తమానాంశాలు, వాటి పూర్వాపరాలను పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. రక్షణ రంగంలో ఇటీవల చేరిన అధునాతన పరికరాలు, జాతీయ స్థాయిలో జరిగిన నియామకాలు, క్రీడాంశాలు, విజేతలు, కేంద్ర, రాష్ట్రాలు ప్రారంభించే యాప్‌లు, ప్రవేశపెట్టిన పథకాలు, పొరుగు దేశం శ్రీలంక ఎన్నికల ఫలితాలు, ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం తాజా పరిణామాలు, పర్యవసానాలపై అవగాహనతో ఉండాలి.

మాదిరిప్రశ్నలు

1. కిందివాటిలో 45వ చెస్ ఒలింపియాడ్‌కు సంబంధించి సరైన వాటిని గుర్తించండి.
   ఎ) 45వ చెస్ ఒలింపియాడ్ హంగేరీలోని బుడాపెస్ట్‌లో జరిగింది.
   బి) పెంటేల హరికృష్ణ, డి.గుకేష్, అర్జున్ ఇరిగేసి, ప్రజ్ఞానంద, విదిత్ గుజరాతీతో కూడిన భారత పురుషుల జట్టు స్వర్ణం సాధించింది.
   సి) ద్రోణవల్లి హారిక, వైశాలి రమేష్‌బాబు, దివ్య దేశ్‌ముఖ్, వంతికా అగర్వాల్, తానియా సచ్‌దేవ్‌లతో కూడిన భారత మహిళల జట్టు స్వర్ణం సాధించింది.
   డి) డి.గుకేష్, అర్జున్ ఇరిగేసి, దివ్య దేశ్‌ముఖ్, వంతికా అగర్వాల్ వ్యక్తిగత విభాగాల్లో స్వర్ణాలు గెలిచారు.
   1) ఎ, బి 2) ఎ, బి, సి
   3) బి, సి, డి 4) ఎ, బి, సి, డి
2. కిందివాటిలో సరైంది?
   ఎ) శ్రీలంక నూతన అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే.
   బి) శ్రీలంక నూతన ప్రధాని హరిణి అమర సూర్య.
   సి) శ్రీలంక 2వ మహిళా ప్రధాని హరిణి అమర సూర్య
   డి) శ్రీలంక మొదటి మహిళా ప్రధాని సిరిమావో బండారు నాయకే
   1) ఎ, బి, సి, డి 2) ఎ, బి
   3) ఎ, బి, డి 4) ఎ, సి

   నోట్: ప్రపంచంలోనే మొదటి మహిళా ప్రధాని సిరిమావో బండారు నాయకే (1960, జులై 21)
3. పరిశ్రమల నుంచి వచ్చే కార్బన్ వాయువులు వాతావరణంలోకి విడుదలకాక ముందే ఒడిసిపట్టి దాన్ని మిథనాల్‌గా మార్చే తొలి ప్లాంట్‌ను ఎక్కడ ఏర్పాటు చేయనున్నారు?
   1) పనాజి 2) ముంబయి
   3) పుణె 4) అహ్మదాబాద్

   నోట్: ఐఐటీ దిల్లీ, థర్మాక్స్ లిమిటెడ్ ఏర్పాటు చేస్తున్నాయి.
4. కిందివాటిలో సరైంది?
   ఎ) ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ కొత్త చీఫ్‌గా ఎయిర్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ నియమితులయ్యారు.
   బి) జాతీయ రైఫిల్ సంఘం నూతన అధ్యక్షుడిగా కాళికేశ్ నారాయణ్ సింగ్ దేవ్ నియమితులయ్యారు.
   సి) ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్ ఛైర్మన్‌గా మలయాళ మనోరమకు చెందిన రియాద్ మాథ్యూ ఎన్నికయ్యారు.
   డి) హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీ డైరెక్టర్‌గా అమిత్ గార్గ్ నియమితులయ్యారు.
   1) ఎ, బి, సి, డి 2) ఎ, సి, డి
   3) బి, సి, డి 4) ఎ, బి, సి
5. ఇటీవల ఏ నగరంలోని నుంగం బాక్కంలోని కాందార్‌నగర్ రోడ్డుకు 'ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం రోడ్డు'గా పేరుపెట్టారు?
   1) చెన్నై 2) మదురై 3) తిరుపతి 4) హైదరాబాద్
6. ఇటీవల పదేళ్లు పూర్తి చేసుకున్న 'మేకిన్ ఇండియా పథకం'ను మోదీ ఎప్పుడు ప్రారంభించారు?
   1) 2014, సెప్టెంబరు 25 2) 2014, సెప్టెంబరు 10
   3) 2014, సెప్టెంబరు 29 4) 2014, సెప్టెంబరు 8
7. భారత ఏవియేషన్ చరిత్రలో తేజస్ తొలి మహిళా ఫైటర్ పైలట్‌గా ఎవరు నియమితులయ్యారు?
   1) మేఘన అరోరా 2) శివంగి సింగ్
   3) రష్మీ శర్మ 4) మోహనా సింగ్
8. ఇటీవల వార్తల్లో వచ్చిన 'అభేద్' అనేది?
   1) యుద్ధ విమానం 2) యుద్ధ ట్యాంకు
   3) బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ 4) సూపర్ కంప్యూటర్


   నోట్: ABHED - అడ్వాన్స్‌డ్ బాలిస్టిక్స్ ఫర్ హైఎనర్జీ డిఫీట్. దీన్ని ఐఐటీ- దిల్లీ, డీఆర్‌డీఓ అభివృద్ధి చేశాయి.
9. ఏ దేశాల్లో ఒకేసారి పేజర్లు, వాకీటాకీలు ఇటీవల పేలి చాలామంది తీవ్రంగా గాయపడ్డారు?
   1) ఇజ్రాయెల్, పాలస్తీనా 2) లెబనాన్, సిరియా
   3) తుర్కియే, ఇజ్రాయెల్
   4) తుర్కియే, సౌదీ అరేబియా
10. రైతులకు చేపల సంరక్షణ, పెంపకం, నిర్వహణ పద్ధతులపై సమగ్ర వివరాలను ఎనిమిది భారతీయ భాషల్లో అందించే ఏ మొబైల్ యాప్‌ను కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ఇటీవల భువనేశ్వర్‌లో ప్రారంభించారు?
    1) రంగీన్ మఛిలీ 2) ఈల్ మఛిలీ
    3) టునా మఛిలీ 4) బైట్ మఛిలీ
11. ఇటీవల వార్తల్లో వచ్చిన '2024 పీటీ 5' అనేది?
    1) సబ్ మెరైన్ 2) గ్రహశకలం
    3) కొత్త 6జీ ఫోన్ 4) కొత్త గ్రహం
12. కిందివాటిలో సరైంది?
    ఎ) మిస్ యూనివర్స్ ఇండియా 2024 రియా సింఘా
    బి) మిస్ ఇండియా వరల్డ్ వైడ్ 2024 ధ్రువీ పటేల్
    సి) అక్కినేని నాగేశ్వరరావు (ఏఎన్ఆర్) జాతీయ అవార్డును ఇటీవల చిరంజీవికి ప్రకటించారు.
    డి) 24,000 డ్యాన్స్ స్టెప్పులతో చిరంజీవి గిన్నిస్ రికార్డు సృష్టించారు.
    1) ఎ, బి, డి 2) ఎ, బి, సి, డి
    3) ఎ, బి 4) ఎ, సి, డి
13. 'ప్రధానమంత్రి మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్ అండ్ అపెరల్ (పీఎం ఎంఐటీఆర్ఏ)' పథకం కింద ఇటీవల అపెరల్ పార్కును మోదీ ఎక్కడ శంకుస్థాపన చేశారు?
    1) అమరావతి (మహారాష్ట్ర)
    2) లఖ్‌నవూ (ఉత్తర్‌ప్రదేశ్)
    3) విరుద్‌నగర్ (తమిళనాడు)
    4) ధార్ (మధ్యప్రదేశ్)
14. ప్రపంచ అల్జీమర్స్ దినోత్సవం ఎప్పుడు జరుపుతారు?
    1) సెప్టెంబరు 21 2) సెప్టెంబరు 22
    3) సెప్టెంబరు 23 4) సెప్టెంబరు 25

    నోట్: 2024 థీమ్: టైమ్ టు యాక్ట్ ఆన్ డిమెన్షియా, టైమ్ టు యాక్ట్ ఆన్ అల్జీమర్స్
15. కిందివాటిలో సరైంది?
    ఎ) నాసా 2024, అక్టోబరులో యురోపా క్లిప్పర్ మిషన్ అనే స్పేస్ క్రాఫ్ట్‌ను అంతరిక్షంలోకి పంపనుంది.
    బి) యురోపా ఉపగ్రహం గురించి అధ్యయనం చేయడానికి ఈ మిషన్ చేపట్టారు.
    సి) యురోపా గురుడు ఉపగ్రహం (చందమామ).
    డి) ఆరేళ్ల పాటు ఈ మిషన్ జరుగుతుంది.
    1) ఎ, బి 2) బి, సి
    3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి
16. 'హ్రియోట్టా అవియా' అనేది?
    1) కొత్తగా గుర్తించిన వైరస్.
    2) కొత్తగా గుర్తించిన షార్క్ జాతి చేప.
    3) కొత్తగా గుర్తించిన శిలీంధ్రం.
    4) కొత్తగా గుర్తించిన ఒక వ్యాధి పేరు.

    నోట్: న్యూజిలాండ్ శాస్త్రవేత్తలు ఇటీవల సముద్రగర్భంలో ఉండే ఈ జీవిని గుర్తించారు. పొట్టి ముక్కుతో ఉండే దీన్ని 'స్పూక్ ఫిష్', నల్లటి కళ్లు ఉండటంతో 'ఘోస్ట్ ఫిష్' అంటున్నారు.
17. 3వ వరల్డ్ ఫుడ్ ఇండియా సమావేశం 2024 ఎక్కడ జరిగింది?
    1) ముంబయి 2) హైదరాబాద్
    3) న్యూదిల్లీ 4) చెన్నై
18. ఐసీసీ అంపైర్‌గా పాకిస్థాన్ నుంచి నామినేట్ అయిన తొలి మహిళ?
    1) సాదియా ఇక్బాల్ 2) బిస్మాహ్ మరూఫ్
    3) ఫాతిమా సనా 4) సలీమా ఇంతియాజ్
19. ఇటీవల ఉత్తమ పర్యాటక గ్రామంగా ఎంపికైన 'దేవ్‌మాలీ' భారతదేశంలో ఏ రాష్ట్రంలో ఉంది?
    1) గుజరాత్ 2) రాజస్థాన్
    3) మహారాష్ట్ర 4) మధ్యప్రదేశ్
20. 'అర్కా, అరుణిక' అనేవి?
    1) నూతన వరి వంగడాలు.
    2) వాతావరణ మార్పులను కచ్చితంగా చెప్పే సూపర్ కంప్యూటర్లు.
    3) భారత్ అభివృద్ధి చేసిన అధునాతన యుద్ధ విమానాలు.
    4) భారత్ అభివృద్ధి చేసిన అధునాతన జలాంతర్గాములు.
21. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 'ఎన్‌పీఎస్ వాత్సల్య' పథకాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
    1) 2024, సెప్టెంబరు 20
    2) 2024, సెప్టెంబరు 4
    3) 2024, సెప్టెంబరు 18
    4) 2024, అక్టోబరు 20
22. చైనాలోని షాంఘై కేంద్రంగా పనిచేసే బ్రిక్స్ బ్యాంకులో ఇటీవల చేరిన దేశం?
    1) కెనడా 2) జింబాబ్వే
    3) అల్జీరియా 4) జాంబియా

    నోట్: బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా కలసి బ్రిక్స్ బ్యాంకును ఏర్పాటు చేశాయి. తర్వాత బంగ్లాదేశ్, ఈజిప్ట్, యూఏఈ, ఉరుగ్వే చేరాయి.
23. భారత్ – పాకిస్థాన్ మధ్య ఏ సంవత్సరంలో కుదిరిన సింధు నదీజలాల ఒప్పందంలో నేటి పరిస్థితులకు తగినట్లు మార్పులు జరగాలని ఇటీవల భారత్ కోరింది?
    1) 1970 2) 1968 3) 1960 4) 1972
24. చంద్రుడిపైకి భారతీయ వ్యోమగాములను పంపేందుకు అవసరమైన సాంకేతికత అభివృద్ధి ప్రదర్శన కోసం చేపట్టనున్న 'చంద్రయాన్–4' మిషన్‌కు కేంద్ర మంత్రివర్గం ఇటీవల ఆమోదం తెలిపింది. చంద్రయాన్–4 కోసం ఎన్ని రూ.కోట్లు కేటాయించారు?
    1) రూ. 1,236 కోట్లు 2) రూ. 8,240 కోట్లు
    3) రూ. 2,104 కోట్లు 4) రూ. 3,428 కోట్లు
25. తెలుగు విశ్వవిద్యాలయానికి ఎవరు పేరు పెట్టాలని తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం ఇటీవల నిర్ణయించింది.
    1) కాళోజీ 2) సురవరం ప్రతాపరెడ్డి
    3) సి.నారాయణ రెడ్డి 4) జయశంకర్
26. అర్బన్ ప్రైమరీ పీహెచ్‌సీలో ఆయుష్ సౌకర్యాలను అందించిన మొదటి రాష్ట్రం?
    1) రాజస్థాన్ 2) మహారాష్ట్ర
    3) కేరళ 4) మధ్యప్రదేశ్
27. కిందివాటిలో సరైంది?
    ఎ) 2022కు దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం మిథున్ చక్రవర్తికి వచ్చింది.
    బి) ఈ పురస్కారాన్ని 1969 నుంచి ఇస్తున్నారు.
    సి) ఈ పురస్కారానికి నగదు రూ. 15 లక్షలు ఇస్తారు.
    డి) 2021కు ఈ అవార్డు వహీదా రెహమాన్‌కు వచ్చింది.
    ఇ) ఇప్పటి వరకు దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం 54 మందికి వచ్చింది.
    1) ఎ, బి, సి, డి, ఇ 2) బి, సి, డి
    3) ఎ, బి, సి, డి 4) ఎ, బి, డి, ఇ

    నోట్: 1) దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారానికి నగదు రూ. 10 లక్షల నుంచి రూ. 15 లక్షలకు నీర్జా శేఖర్ కమిటీ సిఫార్సు మేరకు పెంచారు.
    2) 2024 కు మిథున్ చక్రవర్తికి పద్మభూషణ్ అవార్డు వచ్చింది.
28. కిందివాటిలో ఐఐఎఫ్ఏ (ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ అవార్డ్స్) – 2024 అవార్డులకు సంబంధించి సరైంది?
    ఎ) అబుదాబి వేదికగా ఐఐఎఫ్ఏ - 2024 అవార్డుల ప్రదానోత్సవం జరిగింది.
    బి) మెగాస్టార్ చిరంజీవికి ఔట్ స్టాండింగ్ అచీవ్‌మెంట్ ఇన్ ఇండియన్ సినిమా అవార్డు లభించింది.
    సి) 'ఉమెన్ ఆఫ్ ది ఇయర్' అవార్డు సమంతకు వచ్చింది.
    డి) గోల్డెన్ లెగసీ అవార్డు బాలకృష్ణకు వచ్చింది.
    1) ఎ, బి, సి, డి 2) బి, సి, డి
    3) ఎ, బి, సి 4) బి, సి




రచయిత: బి.ధన్‌మోహన్ రెడ్డి

సమాధానాలు

1-4, 2-1; 3-3; 4-1; 5-1; 6-1; 7-4; 8-3; 9-2; 10-1; 11-2; 12-2; 13-1; 14-1; 15-4; 16-2; 17-3; 18-4; 19-2; 20-2; 21-3; 22-3; 23-3; 24-3; 25-2; 26-4; 27-1; 28-1.

ప్రపంచవ్యాప్తంగా శక్తి (ఎనర్జీ) రంగానికి డిమాండ్ పెరుగుతోంది. దీనికి అనుగుణంగా చేపడుతున్న పర్యావరణహిత కార్యక్రమాలు, తద్వారా సృష్టించాల్సిన శుద్ధ శక్తి వనరులు అంతర్జాతీయంగా పునరుత్పాదక శక్తి వనరుల ఆవశ్యకతను పెంచుతున్నాయి. భారతదేశం క్లీన్ ఎనర్జీ ట్రాన్స్‌ఫార్మేషన్‌లో భాగంగా రెన్యువబుల్ ఎనర్జీ లక్ష్యాలను నిర్దేశించింది. ఇటీవల కాలంలో భారత్ చేపడుతున్న కార్యక్రమాలు, ఇతర అంశాలపై పోటీపరీక్షార్థులు అవగాహన కలిగి ఉండాలి.



టీజీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
సైన్స్ అండ్ టెక్నాలజీ

హరిత హైడ్రోజన్ శుద్ధమైంది.. పర్యావరణహితం



రచయిత
రేమల్లి సౌజన్య
విషయ నిపుణులు

శక్తి రంగం - తాజా అంశాలు

భారత పునరుత్పాదక శక్తి వనరుల లక్ష్యాలు

ఇంటెండెడ్ నేషనల్ డిటర్మైండ్ కంట్రిబ్యూషన్స్ (ఐఎన్‌డీసీ) ప్రకారం పునరుత్పాదక శక్తి వనరుల నుంచి 2030 నాటికి 50 శాతం కుములేటివ్ ఎలక్ట్రిసిటీని ఉత్పత్తి చేయాలి.

- పంచామృత లక్ష్యాల్లో నిర్దేశించినట్లు 2030 నాటికి శిలాజేతర శక్తి వనరుల నుంచి 500 గిగావాట్ల శక్తిని ఉత్పత్తి చేయాలి. అంతేకాకుండా 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక శక్తి కెపాసిటీని స్థాపించాలి.
- శక్తి మంత్రిత్వ శాఖ ఇటీవల (జూన్ 2024 నాటికి) విడుదల చేసిన గణాంకాల ప్రకారం, పునరుత్పాదక శక్తి వనరుల నుంచి స్థాపిత సామర్థ్యం: 195 GW (మొత్తం సామర్థ్యంలో 43.7%)

మొత్తం స్థాపిత సామర్థ్యం విడివిడిగా:

సౌరశక్తి: 19.2% (85 గిగావాట్లు)
పవనశక్తి: 10.5% (46 గిగావాట్లు)
బయోమాస్: 2.3% (10 గిగావాట్లు)
వేస్ట్ టు ఎనర్జీ: 0.1% (0.5 గిగావాట్లు)

మొత్తం స్థాపిత సామర్థ్యంలో శిలాజేతర ఇంధనాల నుంచి స్థాపితమైన సామర్థ్యం: 23 గిగావాట్లు (మొత్తం స్థాపిత సామర్థ్యంలో 45.5%)

- భారతదేశం గ్లోబల్ ర్యాంకింగ్‌లో పునరుత్పాదక శక్తి స్థాపిత సామర్థ్యం దృష్ట్యా నాలుగో స్థానంలో, పవన శక్తి స్థాపిత సామర్థ్యంలో నాలుగో స్థానంలో, సోలార్ పవర్ కెపాసిటీలో అయిదో స్థానంలో ఉంది.

భారతదేశంలో సౌరశక్తి

శక్తి మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం, జూన్ 2024 నాటికి స్థాపిత సౌరశక్తి సామర్థ్యం: 85 GW

- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోలార్ ఎనర్జీ గణాంకాల ప్రకారం సంభావ్య సౌరశక్తి సామర్థ్యం (సోలార్ ఎనర్జీ పొటెన్షియల్): 748 Giga watt peak
- భారతదేశం సౌర శక్తి సామర్థ్యంలో అయిదో ర్యాంకులో ఉంది.
- సౌరశక్తి ఉత్పత్తి సామర్థ్యంలో భారత్ మూడో అతి పెద్ద దేశంగా ఉంది.
- Ember 2024 వాతావరణ నివేదిక ప్రకారం, 2023లో సౌరశక్తిని అత్యధికంగా ఉత్పత్తి చేసే దేశాల్లో భారత్ నాలుగో స్థానంలో ఉంది.

బయోమాస్, ఇథనాల్

భారతదేశంలో బయోమాస్ సంభావ్య శక్తి - 28 గిగావాట్లుగా ఉంది.

- పంట వ్యర్థాలు, వ్యవసాయ ఉత్పత్తుల నుంచి వచ్చిన చక్కెరలను కిణ్వన ప్రక్రియకు గురిచేసి ఇథనాల్ హైడ్రేషన్ ద్వారా ఇథైల్ ఆల్కహాల్ లేదా ఇథనాల్‌ను తయారు చేస్తారు.
- ఈ విధంగా ఉత్పత్తి అయిన ఇథనాల్‌ను బ్లెండింగ్ ప్రక్రియ ద్వారా వివిధ శిలాజ ఇంధనాల్లో కలిపి దేశవ్యాప్తంగా ఉద్గార స్థాయులను తగ్గించి, నెట్ జీరో లక్ష్యాలకు అనుగుణంగా చేపట్టాల్సిన కార్యాచరణలను రూపొందిస్తున్నారు.

లక్ష్యాలు: 20% ఇథనాల్ బ్లెండింగ్ ప్రక్రియను 2025 నాటికి పూర్తిచేయాలని సమీక్షించిన లక్ష్యాల్లో పేర్కొన్నారు.

- 2018లో రూపొందించిన జాతీయ బయో ఫ్యూయల్స్ పాలసీ ప్రకారం, 2030 నాటికి 5% బయోడీజిల్‌ను డీజిల్‌లో బ్లెండ్ చేయాలని లక్ష్యంగా పేర్కొన్నారు.
- 2022 నాటికి భారత్ 10% ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమాన్ని పూర్తి చేసింది.

ముఖ్యమైనవి...

- E 20 బ్లెండింగ్ ప్రక్రియ ద్వారా కార్బన్ మోనాక్సైడ్ ఉద్గారాలను ద్విచక్ర వాహనాల నుంచి 50 శాతం తగ్గించాలని, ఫోర్‌వీలర్స్ నుంచి 30% తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికి అనుగుణంగా దేశంలో కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించడానికి కావాల్సిన కార్యాచరణను రూపొందించారు.
- E 20 బ్లెండింగ్ ప్రక్రియ ద్వారా భారతదేశం ఇంధన దిగుమతుల నుంచి విముక్తి పొంది, ఇంధన రంగంలో స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేస్తోందని ఈ రంగ విశ్లేషకుల అంచనా.
- బయోమాస్ నుంచి ఈ రకమైన ఇంధనాల ఉత్పత్తి అనేది గ్రామీణ ప్రాంతంలోని రైతుల ఆదాయాన్ని పెంచడమే కాకుండా అంతర్జాతీయ పర్యావరణ లక్ష్యాలకు అనుగుణంగా ఉంటుంది.
- 2018లో రూపొందించిన బయో ఫ్యూయల్ పాలసీ ఇథనాల్ బ్లెండింగ్ ప్రక్రియకు కావాల్సిన మార్గదర్శకాలను అందిస్తే, భారత ప్రభుత్వం జీఎస్టీని 18% నుంచి 5% తగ్గించి కావాల్సిన ప్రోత్సాహకాలను అందిస్తోంది.
- PM JI-VAN కార్యక్రమం ద్వారా రెండో తరం జీవ ఇంధన ప్రాజెక్టులను వేగవంతం చేస్తున్నారు.
- పీఎల్ఐ స్కీముల ద్వారా ఫ్లెక్సీ ఫ్యూయల్ ఇంజిన్ల ఉత్పత్తిని కూడా ప్రోత్సహిస్తున్నారు.
- 1951లో రూపొందించిన ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్, రెగ్యులేషన్స్ చట్ట సవరణల ద్వారా దేశమంతటా ఇథనాల్ రవాణాను సులభతరం చేశారు.

భారతదేశంలో హైడ్రోజన్ ఎనర్జీ

హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్‌లో రసాయన శక్తిని విద్యుత్ శక్తిగా మారుస్తారు. దీన్ని అత్యంత శుద్ధమైన విద్యుత్ శక్తిగా భావిస్తారు.

- హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్‌లో రసాయన చర్య జరిగినప్పుడు విద్యుత్ శక్తి ఉత్పత్తి అవుతుంది. దీనితోపాటు ఉష్ణం, నీరు సహఉత్పత్తులుగా లేదా బైప్రొడక్ట్స్‌గా విడుదలవుతాయి.
- గ్రీన్ హైడ్రోజన్ లేదా హరిత హైడ్రోజన్‌ను అత్యంత శుద్ధ శక్తి వనరుగా భావిస్తున్నారు.
- గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి కూడా పునరుత్పాదక శక్తి వనరు అయిన సౌర లేదా పవనశక్తిని వినియోగించి, నీటిని ఫోటోక్యాటలైసిస్ లేదా ఎలక్ట్రోక్యాటలైసిస్ ప్రక్రియతో విచ్ఛిన్నం చేసి హైడ్రోజన్, ఆక్సిజన్‌గా వేరుచేస్తారు. ఈ హైడ్రోజన్ అత్యంత సమర్థవంతమైందిగా, కాలుష్యరహితంగా ఉంటుంది.
- గ్రీన్ హైడ్రోజన్‌ను మరింత సమర్థవంతంగా వినియోగించడానికి కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. వాటిలో ముఖ్యమైనవి...

1. నీటిని వేరుపరిచి హరిత హైడ్రోజన్‌ను తయారు చేయడానికి సహజ వనరులను వినియోగించడం వల్ల దీన్ని శుద్ధమైన శక్తి వనరుగా పరిగణిస్తారు.
2. ఈ హరిత హైడ్రోజన్‌ను వినియోగించి రవాణా రంగం, షిప్పింగ్, స్టీల్ పరిశ్రమలను కార్బన్ రహిత రంగాలుగా మార్చి 2070 నాటికి సున్నా ఉద్గారాల స్థాయికి చేరవచ్చు.
3. గ్యాసోలిన్ కంటే హరిత హైడ్రోజన్‌ను మూడు రెట్లు శక్తిమంతమైందిగా, సమర్థవంతమైందిగా భావిస్తారు.
4. హరిత హైడ్రోజన్‌ను శుద్ధ శక్తి వనరుగానే కాకుండా అత్యంత పర్యావరణహితమైందిగా భావిస్తున్నారు.

దీని లక్ష్యాలు: ఏడాదికి 5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్‌ను నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ ద్వారా ఉత్పత్తి చేయాలని నిర్దేశించారు.

- భారతదేశం ప్రస్తుతం 6.5 మిలియన్ మెట్రిక్ టన్నుల హైడ్రోజన్‌ను ఏటా ఉత్పత్తి చేస్తుంది. ఈ ఉత్పత్తి అయిన హైడ్రోజన్‌ను క్రూడ్‌ఆయిల్ రిఫైనరీలో, ఎరువుల ఉత్పత్తిలో వాడుతున్నారు.

భారతదేశంలో గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌కు అనుసంధానంగా...

- దేశంలోనే మొట్టమొదటి గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్‌ను స్టెయిన్‌లెస్ స్టీల్ రంగంలో స్టీల్ మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టింది.
- ఇండోర్ ప్రాంతంలో ఉన్న GAIL హైడ్రోజన్ బ్లెండింగ్‌ను Compressed Natural Gas and Piped Natural Gas ప్రాజెక్టుల్లో వినియోగించనుంది.
- లద్దాఖ్ ప్రాంతంలో ఎన్టీపీసీ హైడ్రోజన్ ఆధారిత ఫ్యూయల్ సెల్ ఎలక్ట్రిక్ వెహికల్ బస్సులను ప్రారంభించింది.
- ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కూడా గ్రీన్ హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ బస్సును ప్రారంభించింది.
- ఇటీవల సైన్స్ అండ్ ఇంజినీరింగ్ రిసెర్చ్ బోర్డ్ (SERB) పరిశోధనల్లో భారత శాస్త్రవేత్తలు మిథనాల్ నుంచి హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేసే పరిశోధనలను విజయవంతంగా పూర్తి చేశారు.

SATAT - సస్టెయినబుల్ ఆల్టర్నేటివ్ టువర్డ్స్ అఫోర్డబుల్ ట్రాన్స్‌పోర్టేషన్

ఈ కార్యక్రమాన్ని 2018లో ప్రారంభించారు.

- ఆటోమోటివ్ ఇంధనాలకు కావాల్సిన కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్రొడక్షన్‌ను వేగవంతం చేయడానికి కావాల్సిన కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లను ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేయనున్నారు.
- దీనికి నోడల్ ఏజెన్సీగా పెట్రోలియం, సహజవాయు మంత్రిత్వ శాఖ పనిచేస్తుంది.
- కంప్రెస్డ్ బయోగ్యాస్‌లో అత్యధికంగా 90 శాతానికి మించి మీథేన్ ఉండటంతో దీని కెలోరిఫిక్ విలువ 47 నుంచి 52 MJ/kgగా ఉంటుంది.
- CBGలో మీథేన్‌తో పాటు కార్బన్ డైఆక్సైడ్, హైడ్రోజన్ సల్ఫైడ్, నైట్రోజన్, ఆక్సిజన్, తేమ ఉంటాయి.

SATAT కార్యక్రమ లక్ష్యాలు: 2023 నాటికి 5000 CBG ప్లాంట్ల ఏర్పాటు

- 15 మిలియన్ మెట్రిక్ టన్నుల CBG ఉత్పత్తి
- 50 మిలియన్ మెట్రిక్ టన్నుల జీవ ఎరువుల ఉత్పత్తి.
- భారత్ భవిష్య శక్తి రంగ లక్ష్యాలైన ఎనర్జీ సామర్థ్యాన్ని, ఎనర్జీ సుస్థిరత, భద్రతను కాపాడటంలో కంప్రెస్డ్ బయోగ్యాస్ కీలకపాత్ర పోషిస్తుంది.

టైడల్ ఎనర్జీ లేదా తరంగ శక్తి

భారతదేశంలో అతి పెద్దదైన తీరరేఖను అత్యంత సమర్థవంతంగా వినియోగించడంలో తరంగ శక్తి కీలక పాత్ర పోషిస్తుంది.

- ఇది అత్యంత శుద్ధ శక్తి వనరుగా పనిచేస్తూ కార్బన్ ఫుట్ ప్రింట్‌ను తగ్గిస్తుంది
- భారత్ COP 26 పంచామృత్ ప్రతిజ్ఞకు అనుసంధానంగా పర్యావరణహిత శక్తివనరుగా తరంగ శక్తి పనిచేస్తుంది.
- నీటి సాంద్రత ఎక్కువగా కలిగి ఉండటంతో పవన శక్తి కంటే తరంగ శక్తి అత్యంత సమర్థవంతమైంది.
- భారతదేశంలో తరంగ శక్తి, సంభావ్య సామర్థ్యం (టైడల్, వేవ్ ఎనర్జీలు) వరుసగా - 12455 మెగావాట్లు, 41300 మెగావాట్లు.
- భారతదేశంలో గల్ఫ్ ఆఫ్ కంబట్, గల్ఫ్ ఆఫ్ కచ్, పాక్ బే, హుగ్లీ నదీ ప్రాంతం, దక్షిణ హల్దియా, సుందర్‌బన్ ప్రాంతాలు తరంగ శక్తి ఉత్పత్తికి అనుకూలమైనవిగా గుర్తింపు పొందాయి.
- సాంకేతిక, నావిగేషన్, ఆవరణ వ్యవస్థలోని సమస్యలు మొదలైనవి అలల శక్తిని ఉత్పత్తి చేసే క్రమంలో అవాంతరాలను సృష్టిస్తున్నాయి.
- ప్రపంచంలోనే అత్యధిక టైడల్ పవర్‌ను ఫ్రాన్స్, దక్షిణ కొరియాలు ఉత్పత్తి చేస్తున్నాయి. భారత ప్రభుత్వం టైడల్ ఎనర్జీ సంభావ్యతను గుర్తించటానికి, ఉత్పత్తి చేయటానికి కావాల్సిన కార్యాచరణను వేగవంతం చేయటానికి ఇటీవల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీని నియమించింది.

430 Word of the Day

Debilitate

Telugu meaning: బలహీనపరచు, నిర్వీర్యంచేయు

English meaning: The word debilitate is a verb that describes weakening or reducing the strength of someone or something.

Synonyms: Drain, Exhaust

Antonyms: Strengthen, Fortify

Usage: 1. The long illness debilitated her, leaving her too weak to perform daily tasks.
2. Continuous economic challenges have debilitated the company's ability to grow.

నోటిఫికేషన్స్

లేటరల్ ఎంట్రీ ప్రవేశాలు

దేశవ్యాప్తంగా 653 జవహర్ నవోదయ విద్యాలయాల్లో (జేఎన్‌వీ) తొమ్మిదో, పదకొండో తరగతుల్లో లేటరల్ ఎంట్రీకి సంబంధించి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ జేఎన్‌వీ ఎంపిక పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో 15, తెలంగాణలో 9 జేఎన్‌వీలు ఉన్నాయి. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 30 అక్టోబరు 2024.

అప్రెంటిస్ పోస్టులు

కోల్‌కతాలోని నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (ఎన్ఐసీఎల్) అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 16. ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 15 అక్టోబరు 2024.

దరఖాస్తు చేశారా..?

ఈ ఉద్యోగాలు, ప్రవేశాలకు నేడే (అక్టోబరు 4) ఆఖరు తేదీ

- ఎస్‌బీఐలో 1,511 స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్టులు. బీఈ, బీటెక్, ఎంసీఏ, ఎంటెక్, ఎంఎస్సీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం కలిగి ఉన్నవారు అర్హులు.
- బామర్ లారీ లిమిటెడ్‌లో 18 మేనేజీరియల్ ఉద్యోగాలు. పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, సీఏ/ఐసీడబ్ల్యూఏ, డిగ్రీ, ఎంఎస్సీ, ఎంబీఏ/ పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.
- కేవీ రంగారెడ్డి లా కాలేజీలో టీచింగ్ పోస్టులు. ఎల్ఎల్ఎం, పీజీ/ పీహెచ్‌డీ/ సెట్/ స్లెట్ ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.



జనరల్ స్టడీస్ విభాగంలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అంశానికి చాలా ప్రాధాన్యం ఉంటుంది. పర్యావరణం, సమాజం, ప్రజలకు ఆర్థికంగా అధిక నష్టం కలిగించి, సాధారణ కార్యకలాపాలు కూడా అడ్డుకునే తీవ్ర పరిస్థితిని విపత్తు అంటారు. దీన్ని ఎదుర్కొనే సామర్థ్యం ఎక్కువగా ఉండి, తక్షణ రక్షణ చర్యలు తీసుకున్నప్పుడు దీన్ని ప్రభావాన్ని తగ్గించవచ్చు.

- ఈ వీడియోలో విపత్తు నిర్వహణకు సంబంధించిన విషయాలను ఎలా చదవాలి? ఏ విధంగా గుర్తుంచుకోవాలి? ఏయే అంశాలపై అవగాహన పెంచుకోవాలి? ఇందులో ఉండే సిలబస్ ఏమిటి? మొదలైన వాటిని విశ్లేషణాత్మకంగా వివరించారు.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. వీడియో పాఠం చూడండి.. మరిన్ని వీడియోల కోసం ఈప్రతిభ యూట్యూబ్ ఛానల్ సబ్‌స్క్రైబ్ చేయండి!

Banni festival is celebrated in which state?

Current Affairs

1. Which of the following persons is appointed as the new Director General of the Aeronautical Development Agency (ADA)?
A) Laxman Singh B) Jitendra J Jadhav
C) Surya Prakash D) Ramesh Nayak

2. What is the full form of IBSF?
A) International Billiards and Snooker Federation
B) International Ball and Snooker Foundation
C) International Billiards and Snooker Founder
D) International Billiards and Snooker Finance

3. Which of the following persons officially launched the CM-SATH scheme to boost the educational prospects of the state's brightest student?
A) Sri Krishna B) Mahesh Yadav
C) Harsha Roy D) Manik Saha

4. Which of the following persons inaugurated Invest India's new office in Singapore?
A) Piyush Goyal B) Mahendar Sai
C) Jitendar Khanna D) Laxman Singh

5. On September 26, 2024, Prime Minister Narendra Modi launched .... PARAM Rudra supercomputers.
A) Three B) Two
C) One D) Five

6. The International Day for Universal Access to Information (IDUAI) is an annual observance on which of the following days?
A) Sep 15 B) Sep 21 C) Sep 29 D) Sep 28

7. Which of the following persons was Honored with ICC Lifetime Achievement Award for 2023?
A) Manohar Lal B) Srihari Iyer
C) Raja Chandar D) Deepak Mehta

8. Book titled, 'From Oil to Lithium: Navigating the Future of Energy' is authored by which of the following persons?
A) Manideep Singh B) Kuldeep Gupta
C) Sai Kiran D) Srinivasan

General Knowledge

9. Which of the following is expressed by the bodily movements where the body becomes the sole medium of expression?
A) Aharya Abhinaya
B) Vachika Abhinaya
C) Angika Abhinaya
D) Saatwika Abhinayam

10. The 'Karma' tribal dance form is associated with which state?

SSC Exams Special

General Awareness

A) Jharkhand B) Chhattisgarh
C) Maharashtra D) Madhya Pradesh

11. Banni festival is celebrated in which state?
A) Kerala B) Andhra Pradesh
C) Tamilnadu D) Maharashtra

12. Who was the author of the famous book "The peasantry of Bengal"?
A) Motilal Nehru B) BR Ambedkar
C) RG Bhandarkar D) RC Dutt

Geography

13. Which country is the largest producer of groundnuts in the world?
A) Russia B) China
C) India D) USA

14. Which of the following states in India had the lowest sex ratio according to the 2011 census?



A) Haryana B) Goa
C) Arunachal Pradesh D) Bihar

15. What is the highest peak of Tamil Nadu and a part of Nilgiri Mountain Range?
A) Sandakphu B) Anamudi
C) Doddabetta D) Guru shikhar

16. Indian Railways is the .... national railway network in the world.
A) Fifth-largest B) Fourth-largest
C) Third-largest D) Second-largest

General Science

17. The velocity of sound in air is ....
A) 313 m/sec B) 320 m/sec
C) 343 m/sec D) 360 m/sec

18. Which of the following is an organic chemist who demonstrated the existence of macromolecules, which he characterized as polymers?
A) Hermann Staudinger B) Harold Urey
C) Edward Davies Hughes
D) Sergei Winogradsky

19. Which of the following is the process of converting fats and oils into soap?
A) Emulsification B) Saponification
C) Vulcanisation D) Carbonation

20. .... is a disease that causes loss of skin color in patches.
A) Vitiligo B) Gonorrhea
C) Psoriasis D) Siderosis

Scan the QR code for Key

*These model questions were prepared by subject experts of **QnA Academy,** Hyderabad*

వైజాగ్ స్టీల్ అమ్మేస్తున్నామనడం సత్యదూరం

కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి




ఈనాడు, దిల్లీ: ఎన్డీయే ప్రభుత్వం వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను అమ్మేస్తోందన్న ఆరోపణలు నిరాధారం, సత్యదూరమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి గురువారం ఎక్స్‌లో పేర్కొన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణలో భాగంగానే కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించారని ఆరోపిస్తూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఎక్స్‌లో చేసిన ఆరోపణలకు ఆయన బదులిచ్చారు. ‘ ‘స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించారన్న విషయం నా దృష్టికి వచ్చిన 48 గంటల్లోనే వారిని తిరిగి నియమించాం. సెప్టెంబరు 27న తొలగించిన 4,200 మంది కాంట్రాక్ట్ కార్మికులను 29న మళ్లీ విధుల్లోకి తీసుకున్నాం. స్వప్రయోజనాలు, ఓటుబ్యాంకు రాజకీయాల కోసం ఈ అంశాన్ని వాడుకోవడం మానండి. ఇప్పటివరకు రద్దుచేసిన 3,700 మంది కాంట్రాక్ట్ లేబర్ పాసులను ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారా త్వరలో పునరుద్ధరిస్తామని ఆర్ఐఎన్ఎల్ యాజమాన్యం ఇప్పటికే స్పష్టంగా చెప్పింది. కార్మికుల బయోమెట్రిక్ డేటాను త్వరలో పునరుద్ధరిస్తాం. ప్రస్తుతం ఉన్న గేట్‌పాస్ వ్యవస్థతో పాటు అవసరమైన సౌకర్యాలను కొనసాగించడానికి అన్ని పక్షాలూ చర్చల సమయంలో అంగీకరించాయి. ఎన్డీయే ప్రభుత్వం వైజాగ్ స్టీల్‌ను అమ్మేస్తోందని మీరు చేసిన నిరాధార ఆరోపణలు పూర్తిగా సత్యదూరం. ప్రస్తుతం ప్రభుత్వరంగ సంస్థలను సరిగా నిర్వహించడంతో గత మూడేళ్లలో వాటి షేర్ విలువ అద్భుతంగా పెరిగింది'' అని కుమారస్వామి పేర్కొన్నారు.

విశాఖలో పర్యాటక అక్రమాలపై విచారణ

ఈనాడు, విశాఖపట్నం: విశాఖ జిల్లాలో ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ ఇచ్చిన లీజులు, వివిధ ప్రాజెక్టుల నిర్వహణలో లోపాలపై విచారణకు ప్రభుత్వం నియమించిన కమిటీ గురువారం ఇక్కడ పర్యటించింది. ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ మొదట ఎర్రమట్టి దిబ్బల వద్ద ఉన్న కంటైనర్ రెస్టారెంట్‌ను తనిఖీ చేసింది. రుషికొండలోని బ్లూఫ్లాగ్ బీచ్‌ను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేసింది. విశాఖ-భీమిలి రోడ్డులోని తొట్లకొండ వద్ద ఉన్న బేవాచ్ రిసార్ట్సులో అనధికార నిర్మాణాలు, లీజు ఒప్పందాలను తనిఖీ చేసినట్లు సమాచారం.

వైకాపా విధ్వంసకర నిర్ణయాలతో.. ఆర్థిక వ్యవస్థ కుదేలు



- శాఖల వారీ విజన్ రూపొందించుకుని.. నిర్దిష్ట లక్ష్యంతో పనిచేయాలి
- జనవరి నుంచి ఆచరణలోకి పీ4 విధానం
- ప్రాథమిక, పారిశ్రామిక, సేవా రంగాలపై సమీక్షలో సీఎం చంద్రబాబు

ఈనాడు - అమరావతి

గత ప్రభుత్వ విధ్వంసకర విధానాలతో అన్ని రంగాలూ తిరోగమనంలోకి వెళ్లాయని.. ఆర్థిక వ్యవస్థ కుదేలైందని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. ప్రస్తుతం ప్రతి శాఖలో కొత్త విధానాలు తెస్తున్నామని, వాటి సమర్థ అమలుతో ఆర్థికపురోగతి సాధించాలని ఆదేశించారు. 15% వృద్ధిరేటు సాధించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేయాలని సూచించారు. ప్రాథమిక, పారిశ్రామిక, సేవల రంగాల్లో వృద్ధిపై గురువారం ఆయన సచివాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా హాజరైన వివిధ శాఖల అధికారులు.. పదేళ్లలో రంగాలవారీ పరిస్థితుల్ని వివరించారు. ప్రభుత్వం అంటే సంక్షేమ పథకాలు ఇవ్వడమే కాదని.. ఆయా రంగాలను బలోపేతం చేసి ప్రజల ఆదాయాలను పెంచడమే ముఖ్యమని చంద్రబాబు వారికి స్పష్టం చేశారు. కొన్ని శాఖలు బాగా వెనకబడి ఉన్నాయని.. మరింత చురుగ్గా పనిచేయాలని చెప్పారు.

యాంత్రీకరణతో సాగు ఖర్చులు ఆదా

ప్రజల జీవన ప్రమాణాలు పెంచడంతో పాటు.. వారిపై అదనపు భారం వేయకుండా ప్రభుత్వ ఆదాయం పెంచే విధానాలను అమలుచేయాలని సీఎం సూచించారు. వ్యవసాయంలో సమగ్ర యాంత్రీకరణ ద్వారా రైతుల సాగు ఖర్చులు తగ్గించొచ్చని వివరించారు. ‘వచ్చే ఏడాది జనవరిలో పీ4 విధానాన్ని ఆచరణలోకి తెస్తున్నాం. సమాజంలో ఆర్థికంగా ఉన్నతస్థానంలో ఉన్నవారు.. అట్టడుగున ఉన్న 10% మందిని పైకి తెచ్చేందుకు సహాయం చేయాలి. ప్రభుత్వం ఇచ్చే పథకాలతో పాటు సంపన్నులు, సంస్థలు సీఎస్ఆర్ ద్వారా పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు దోహదపడాలి' అని సూచించారు.

వైకాపా రివర్స్ పాలనతో తిరోగమనం

‘2014 తర్వాత విభజన కష్టాలున్నా అప్పుడు తీసుకున్న నిర్ణయాలతో రాష్ట్రం 13.7% వృద్ధిరేటు సాధించింది. వైకాపా ప్రభుత్వ రివర్స్ నిర్ణయాలతో అది 10.59%కు తగ్గింది' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ‘2019లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య జీఎస్‌డీపీ వ్యత్యాసం 0.20% ఉండేది. 2024 నాటికి అది 1.5% అయ్యింది. 2014-15 మధ్య ఏపీలో ప్రజల తలసరి ఆదాయం రూ.93,903 ఉండగా.. తెదేపా ప్రభుత్వ నిర్ణయాలతో 2019 నాటికి రూ.1,54,031కి పెరిగింది. తలసరి ఆదాయంలో వృద్ధి తెదేపా హయాంలో 13.21% ఉంటే.. గత ప్రభుత్వ హయాంలో 9.06% మాత్రమే నమోదైంది' అని వివరించారు. ‘తలసరి ఆదాయంలో వ్యత్యాసం తెదేపా ప్రభుత్వ హయాంలో 0.16% ఉండగా.. గత ప్రభుత్వంలో 1.84%కు పెరిగింది. దక్షిణాది రాష్ట్రాల్లో తలసరి ఆదాయంలో ఏపీ ఐదోస్థానంలో ఉంది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని శాఖల వారీ విజన్ రూపొందించాలి. నిర్దిష్ట లక్ష్యాలతో పనిచేయాలి' అని ఆదేశించారు.

గంజాయి, డ్రగ్స్ కట్టడికి ఏపీలో టాస్క్‌ఫోర్స్

- జిల్లాకొకటి చొప్పున 26 నార్కొటిక్స్ కంట్రోల్ సెల్స్
- ఏపీ మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో కీలక నిర్ణయాలు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో గంజాయి, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపేందుకు వీలుగా రాష్ట్రస్థాయిలో యాంటీ నార్కొటిక్ టాస్క్‌ఫోర్స్ (ఏఎన్‌టీఎఫ్), జిల్లాకొకటి చొప్పున మొత్తం 26 నార్కొటిక్స్ కంట్రోల్ సెల్స్ ఏర్పాటుకు మంత్రివర్గం ఉపసంఘం ఆమోదం తెలిపింది. డీజీపీ పర్యవేక్షణలో ఐజీ స్థాయి అధికారి అధిపతిగా ఏఎన్‌టీఎఫ్ ఏర్పాటు చేయాలని తీర్మానించింది. ఏఎన్‌టీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోలీసుస్టేషన్, నాలుగు బృందాలతో కూడిన స్టేట్ టాస్క్‌ఫోర్స్ వింగ్ నెలకొల్పాలని అనుకుంది. వీటిలో ఒక బృందాన్ని పాడేరులో, మరో బృందాన్ని విశాఖపట్నంలో ఏర్పాటుచేయాలని ప్రతిపాదించింది. సచివాలయంలో హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రులు నారా లోకేశ్, కొల్లు రవీంద్ర, గుమ్మిడి సంధ్యారాణి, సత్యకుమార్ యాదవ్‌లతో కూడిన మంత్రివర్గ ఉపసంఘం గురువారం సమావేశమైంది. రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాల సమస్యపై చర్చించింది. వైకాపా హయాంలో గంజాయి, డ్రగ్స్ తీవ్రత ఎంత పెరిగింది, ఏఎన్‌టీఎఫ్ స్వరూపం ఎలా ఉండాలనేదానిపై డీజీపీ ద్వారకా తిరుమల రావు, ఐజీ రవికృష్ణ ప్రజంటేషన్ రూపంలో ఉపసంఘానికి వివరించారు. వాటి స్మగ్లింగ్, అక్రమ రవాణా, సరఫరా, సాగు, వినియోగం, కింగ్‌పిన్‌లను పట్టుకునేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. 459 పోస్టులతో ఏఎన్‌టీఎఫ్ ఏర్పాటు ప్రతిపాదనల్ని ఈ నెల 10న జరగబోయే మంత్రివర్గ సమావేశంలో పెట్టాలని తీర్మానించింది.

గంజాయి, డ్రగ్స్‌పై ఫిర్యాదుల స్వీకరణకు టోల్‌ఫ్రీ నంబర్ 1908

మాదకద్రవ్యాలు, గంజాయిపై సమాచారం, ఫిర్యాదుల స్వీకరణ కోసం 1908 టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటుచేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. దీంతోపాటు ఒక ఫోన్‌నంబర్, మెయిల్ ఐడీ, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, థ్రెడ్స్ ఐడీలు కూడా సిద్ధం చేసి వాటిని విస్తృతంగా ప్రజల్లో ప్రచారం చేయాలని తీర్మానించారు.

డేటా విశ్లేషణ, సైబర్ నిఘాతో డ్రగ్స్ ఆటకట్టు

■ సామాజిక మాధ్యమాల పర్యవేక్షణ, అనుమానాస్పద లావాదేవీల గుర్తింపు, ఆన్‌లైన్‌లో జరిగే మాదకద్రవ్యాల విక్రయాలను గుర్తించి అడ్డుకోవటం, డార్క్‌వెబ్‌పై నిఘా వంటివాటితో మాదకద్రవ్యాలు, గంజాయిని నిర్మూలించాలని ఉపసంఘం తీర్మానించింది.

■ స్మగ్లర్లు, కొరియర్ల నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, ఇతర పరికరాలను డిజిటల్ ఫోరెన్సిక్ ద్వారా విశ్లేషించి కింగ్‌పిన్‌లను పట్టుకోవాలని సూచించింది. మారుమూల ప్రాంతాల్లో సాగయ్యే గంజాయిని డ్రోన్లు, శాటిలైట్ చిత్రాల ద్వారా గుర్తించి ధ్వంసం చేయాలి.

దుష్పరిణామాలపై ప్రచారం చేయాలి - మంత్రి లోకేశ్

‘డ్రగ్స్, గంజాయి దుష్పరిణామాలపై ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలి. రాష్ట్రంలో గంజాయి సాగును అరికట్టడంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి ఏపీకి రాకుండా ఆయా ప్రభుత్వాలతో సమన్వయం చేసుకోవాలి. విజిబుల్ పోలీసింగ్‌తో పాటు ఇన్‌విజిబుల్ పోలీసింగ్‌పైనా దృష్టిసారించాలి. గంజాయి, డ్రగ్స్‌పై పోరాటంలో సెలబ్రిటీలను భాగస్వాములను చేస్తాం' అని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

■ ‘వైకాపా ప్రభుత్వ హయాంలో గంజాయి, మాదకద్రవ్యాలు, మద్యానికి బానిసలై ఆత్మహత్యలకు పాల్పడ్డవారి సంఖ్య విపరీతంగా పెరిగింది. సైబర్‌నిఘా ద్వారా మాదకద్రవ్యాల ముఠాల మూలాల్ని పెకలిస్తాం. గంజాయి స్మగ్లింగ్, రవాణా సమాచారం చెప్పినవారికి రివార్డులు అందజేస్తాం' అని హోంమంత్రి అనిత తెలిపారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

- రోజూ 24,000 ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీ చేస్తాం
- తితిదే ఈవో జె.శ్యామలరావు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాలను గతంకన్నా మిన్నగా.. వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తితిదే ఈవో జె.శ్యామలరావు తెలిపారు. స్థానిక అన్నమయ్య భవనంలో అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. శుక్రవారం నుంచి ఈనెల 12 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని తెలిపారు. శుక్రవారం(4వ తేదీన) ఏపీ సీఎం చంద్రబాబు పట్టువస్త్రాలు సమర్పిస్తారని, అనంతరం తితిదే 2025 క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరిస్తారని చెప్పారు. ఈ నెల 5వ తేదీ నుంచి తిరుపతి, తిరుమలలోని తితిదే విక్రయ కేంద్రాల్లో వాటిని అందుబాటులో ఉంచనున్నట్లు వెల్లడించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా 1.32 లక్షల మందికి రూ.300 దర్శన టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచామని, రోజూ ఎస్ఎస్‌డీ టోకెన్లు 24,000 కేటాయించనున్నట్లు ఆయన వివరించారు. శ్రీవాణి దర్శన టికెట్ల కరెంట్ బుకింగ్ ఈనెల 4, 8వ తేదీన రద్దు చేశామని, మిగిలిన రోజుల్లో అందుబాటులో ఉంటాయన్నారు. తిరుమలలో 40 వేల మంది భక్తులు బసచేసే అవకాశం ఉందని, యాత్రికుల సౌకర్యాల సముదాయ(పీఏసీ)లు 1, 2, 3, 4తో కలిపి 28 హాళ్లు, 670 వరకు లాకర్లు ఉన్నాయని మరో 20 వేల మంది భక్తులు వీటిలో బస చేయవచ్చన్నారు. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో ఉదయం 8 నుంచి రాత్రి ఒంటిగంట వరకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు పంపిణీ చేస్తామని, రోజూ లక్ష మందికి పాలు అందిస్తామన్నారు.

బతుకమ్మ నిర్వహణకు హైకోర్టు అనుమతి

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ పాతబస్తీలోని భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద 100 మంది మహిళలతో బతుకమ్మ వేడుకలు నిర్వహించుకోవడానికి అనుమతి మంజూరు చేయాలంటూ ఏసీపీకి గురువారం హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. భాగ్యలక్ష్మి ఆలయం వద్ద శుక్రవారం బతుకమ్మ వేడుక నిర్వహణకు అనుమతి నిరాకరించడాన్ని సవాలు చేస్తూ భాజపా రాష్ట్ర మహిళా మోర్చ అధ్యక్షురాలు వి.శిల్పారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి 100 మంది మహిళలతో బతుకమ్మ వేడుక నిర్వహించుకోవడానికి అనుమతించాలని పోలీసులను ఆదేశించారు. ఇందులో డీజే, సౌండ్ సిస్టంలు వినియోగించరాదన్నారు. ఇందులో పాల్గొనేవారు ఎలాంటి రాజకీయ ప్రసంగాలు చేయరాదని షరతు విధించారు.

వివరాల్లేని నోటీసులు చెల్లవు

హస్మత్‌పేట కూలీల పిటిషన్లపై హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాలానగర్ మండలం హస్మత్‌పేట దళితబస్తీ వాసులకు తహసీల్దార్ జారీ చేసిన నోటీసులను హైకోర్టు కొట్టివేసింది. ఎలాంటి వివరాలు లేకుండా, బస్తీవాసుల వాదన వినకుండా జారీ చేసిన నోటీసులు చెల్లవన్నారు. పూర్తి వివరాలతో, బస్తీవాసుల వాదన విని చట్ట ప్రకారం ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టాలని తహసీల్దార్‌ను ఆదేశించింది. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలున్నాయని, వాటిని తొలగించాలంటూ ఆగస్టు 21న తహసీల్దార్ జారీ చేసిన నోటీసులను రద్దు చేయాలని, కూల్చివేతలు చేపట్టకుండా హైడ్రాకు ఆదేశాలు జారీ చేయాలంటూ హస్మత్‌పేట దళిత బస్తీకి చెందిన ఎస్.మల్లయ్య, మరో 9 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. తహసీల్దార్ జారీ చేసిన నోటీసుల్లో సర్వే నంబరు, ఆక్రమణల విస్తీర్ణాలను పేర్కొనలేదని, వివరాల్లేకుండా ఇచ్చిన లోపభూయిష్టమైన నోటీసులు చెల్లవని పేర్కొన్నారు. చట్ట నిబంధనల ప్రకారం పిటిషనర్ల వాదన విని తాజాగా చర్యలు చేపట్టవచ్చంటూ తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు.

జూనియర్ లెక్చరర్ల నియామకాలెప్పుడు?

గన్‌ఫౌండ్రీ, న్యూస్‌టుడే: డీఎస్సీ మాదిరిగా జూనియర్ లెక్చరర్లకు కూడా దసరా లోపు నియామకపత్రాలు అందించాలని అభ్యర్థులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం నాంపల్లిలోని టీజీపీఎస్సీ కార్యాలయం వద్ద వారు ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. మూడు నెలల కిందటే జీఆర్ఎల్ పూర్తి చేశారని వారు తెలిపారు. అనేక నెలలుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా, నియామకాలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.



మాజీ గవర్నర్ కిరణ్‌బేడీ నుంచి పురస్కారం అందుకుంటున్న గల్లా రామచంద్రనాయుడు

గల్లా రామచంద్రనాయుడికి జీవన సాఫల్య పురస్కారం

రేణిగుంట, న్యూస్‌టుడే: అమరరాజ సంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ గల్లా రామచంద్ర నాయుడు ప్రతిష్ఠాత్మక మహాత్మా జీవన సాఫల్య పురస్కారాన్ని అందుకున్నారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా దిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద పుదుచ్చేరి మాజీ గవర్నర్ డాక్టర్ కిరణ్‌బేడీ చేతుల మీదుగా ఈ అవార్డును స్వీకరించారు. నాలుగు దశాబ్దాలుగా వ్యాపార రంగంలో పోటీతత్వాన్ని ముందుచూపుతో గ్రహించి, యువతకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ అభివృద్ధికి కృషి చేస్తున్న ఆయన సేవలకు గుర్తుగా ఈ అవార్డు దక్కిందని అమరరాజ పీఆర్వో బాబ్జి రాళ్లపల్లి గురువారం తెలిపారు.

ఈశా ఫౌండేషన్‌పై దర్యాప్తు ఆపండి

- తమిళనాడు పోలీసులకు సుప్రీంకోర్టు ఆదేశం
- మద్రాస్ హైకోర్టు ఉత్తర్వుపై స్టే విధింపు
- కేసు విచారణ తన వద్దకు బదిలీ
- ఇద్దరు మహిళలను వర్చువల్‌గా ప్రశ్నించిన సీజేఐ ధర్మాసనం



దిల్లీ: ఇద్దరు యువతులను అక్రమంగా నిర్బంధించారని, సన్యాసం తీసుకునేలా వారిని ఒప్పించారనే ఆరోపణలకు సంబంధించిన కేసులో కోయంబత్తూర్‌లోని ఈశా ఫౌండేషన్‌పై తమిళనాడు పోలీసుల దర్యాప్తును సుప్రీంకోర్టు నిలిపివేసింది. ఇప్పటి వరకు నిర్వహించిన దర్యాప్తుపై స్థాయీ నివేదికను తమకు సమర్పించాలని ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం ఆదేశించింది. ఆధ్యాత్మికవేత్త జగ్గీ వాసుదేవ్ నిర్వహణలోని ఫౌండేషన్‌పై నమోదైన క్రిమినల్ కేసులు, దర్యాప్తు వివరాలను సమర్పించాలంటూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల అమలుపై స్టే విధించింది. హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ ఈశా ఫౌండేషన్ దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం విచారణ జరిగింది. ఇద్దరు యువతుల తండ్రి దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను హైకోర్టు నుంచి తన వద్దకు బదిలీ చేసుకుంది. సుప్రీంకోర్టు ధర్మాసనంలో జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్ర సభ్యులుగా ఉన్నారు.

ఈశా ఫౌండేషన్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు.

సుమారు 150 మంది పోలీసులు ఆశ్రమంలోకి ప్రవేశించి, ప్రతి మూలా శోధించారని తెలిపారు.

హైకోర్టు ఆదేశాలపై స్టే విధించి పోలీసు చర్యలను ఆపాలని కోరారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఆ ఇద్దరు మహిళలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంభాషించింది. యువతుల తండ్రి కూడా విచారణకు వర్చువల్‌గా లేదా వ్యక్తిగతంగా హాజరుకావచ్చని ధర్మాసనం తెలిపింది. ఈ కేసులో పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ నెల 18కు వాయిదా వేసింది.

నిర్బంధంలేదు... స్వేచ్ఛగా ఉన్నాం: మహిళలు

తామిద్దరం ఆశ్రమంలో స్వచ్ఛందంగానే ఉంటున్నామని, ఎలాంటి ఒత్తిడీ తమపై లేదని ప్రత్యేక ఛాంబర్‌లో జరిగిన విచారణలో ఆ మహిళలు ధర్మాసనానికి తెలిపారు. హైకోర్టు ఆదేశాలతో ఆశ్రమానికి వచ్చిన పోలీసులు బుధవారం రాత్రి వెళ్లిపోయారని వెల్లడించారు.

ఆ మహిళలు తెలిపిన వివరాలను అనుసరించి వారిద్దరూ 27, 24 ఏళ్ల వయసులో ఆశ్రమానికి వచ్చారని, ప్రస్తుతం వారి వయసు 42, 39 ఏళ్లుగా తెలుస్తోందని ధర్మాసనం నోట్ చేసుకుంది. దేశంలోని ఇతర ప్రాంతాలకు ప్రయాణించే స్వేచ్ఛ తమకు ఉంటుందని, హైదరాబాద్‌లో జరిగిన మారథాన్‌లోనూ పాల్గొన్నామని ఆ మహిళలు వెల్లడించారు. తమ తండ్రి హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలుసుననీ పేర్కొన్నారు. ఎనిమిదేళ్ల క్రితం కూడా ఆ మహిళల తల్లి ఇటువంటి పిటిషనే సుప్రీంకోర్టులో దాఖలు చేసిందనే విషయం ధర్మాసనం దృష్టికి వచ్చింది. ఈశా యోగా కేంద్రంలో ఉంటున్న తన ఇద్దరు కుమార్తెలను అప్పగించాలని కోరుతూ వ్యవసాయ యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ కామరాజ్ మద్రాసు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయడంతో ఈ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది.



సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసిన రెడ్డి ఐకాస నేతలు రాంరెడ్డి, హరినాథ్‌రెడ్డి, మాధవరెడ్డి తదితరులు. చిత్రంలో పట్నం మహేందర్‌రెడ్డి

రెడ్డి కార్పొరేషన్ పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలి

సీఎంకు రెడ్డి ఐకాస ప్రతినిధుల వినతి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో రెడ్డి కార్పొరేషన్‌కు వెంటనే పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర రెడ్డి ఐకాస ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరింది. కార్పొరేషన్‌కు బడ్జెట్ కేటాయించాలని, విధివిధానాలను నిర్దేశించాలని అభ్యర్థించింది. తెలంగాణ రెడ్డి ఐకాస అధ్యక్షుడు ఎ.రాంరెడ్డి, కోఛైర్మన్ పైల హరినాథ్‌రెడ్డి, మాధవరెడ్డి, హరివర్ధన్‌రెడ్డి, ఇతర నేతలు సీఎంను గురువారం ఆయన నివాసంలో కలిసి సత్కరించారు. ఈ నెల 6న హైదరాబాద్ శిల్పాకళా వేదికలో జరిగే రెడ్డి ప్రజాప్రతినిధుల సన్మానోత్సవానికి రావాలని సీఎంను ఆహ్వానించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. రెడ్డి కార్పొరేషన్‌ను బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనమండలిలో చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏఆర్ డెయిరీ ఏ నిబంధనలు ఉల్లంఘించింది?

మదురై ధర్మాసనం

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: ఏఆర్ డెయిరీ ఫుడ్స్ ఏ నిబంధనలను ఉల్లంఘించిందని కేంద్ర ప్రభుత్వాన్ని మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం ప్రశ్నించింది. తిరుమల తిరుపతి దేవస్థానానికి నెయ్యి పంపిణీ చేసిన ఏఆర్ డెయిరీ లైసెన్సు ఎందుకు రద్దు చేయకూడదంటూ కేంద్రం తమకు పంపిన నోటీసును రద్దు చేయాలని కోరుతూ మదురై ధర్మాసనంలో ఏఆర్ డెయిరీ పిటిషన్ వేసింది. ఇది గురువారం విచారణకు వచ్చింది. కేంద్ర ఆహార భద్రతాశాఖ జారీ చేసిన నోటీసుల్లో ఏ నిబంధనలు ఉల్లంఘించిందనే వివరాలు లేవని మదురై ధర్మాసనం పేర్కొంది. నెయ్యి నాణ్యత పరిశోధనలో గుజరాత్ ల్యాబ్ ఇచ్చిన నివేదికకు, చెన్నై కింగ్స్ ల్యాబ్ నివేదికకు మధ్య వ్యత్యాసం ఉందన్నారు. చెన్నై ల్యాబ్ కల్తీ లేదని తెలిపిందని, అది కూడా ప్రభుత్వ సంస్థే అని పేర్కొంది. కేంద్ర క్వాలిటీ కంట్రోల్ ఏజెన్సీ పరిశోధన ఫలితాలను ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించింది. కేంద్ర ప్రభుత్వం ఏఆర్ డెయిరీకి కొత్తగా నోటీసులు ఇచ్చి, వివరణకు 14 రోజుల సమయం ఇవ్వాలని ఉత్తర్వులు ఇచ్చింది.

ఏఆర్ డెయిరీ ఎండీ బెయిలు పిటిషన్‌పై విచారణ నేటికి వాయిదా

ఈనాడు, అమరావతి: శ్రీవారి లడ్డూ తయారీకి కల్తీ నెయ్యిని సరఫరా చేశామనే ఆరోపణలతో తనపై నమోదైన కేసులో ముందస్తు బెయిలు మంజూరు చేయాలని తమిళనాడులోని దిండిగల్‌కు చెందిన ఏఆర్ డెయిరీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎండీ ఆర్.రాజశేఖరన్ హైకోర్టులో దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ శుక్రవారానికి వాయిదా పడింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ గురువారం ఉత్తర్వులిచ్చారు. అంతకు ముందు జరిగిన విచారణలో పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. అరెస్టు విషయంలో తొందరపాటు చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వుల కోసం అనుబంధ పిటిషన్ వేశామన్నారు. దానిపై అత్యవసరంగా విచారణ జరపాలని కోరారు. ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ.. లడ్డూ విషయమై గురువారం సుప్రీంకోర్టు విచారణ జరపనుందని, ముందస్తు బెయిలు పిటిషన్‌ను శుక్రవారానికి వాయిదా వేయాలని కోరారు. ఆ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

వివేకా హత్య కేసులో నిందితుడు... సునీల్‌యాదవ్‌కు షరతులతో బెయిలు

- తీర్పు వెలువరించిన తెలంగాణ హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: ఏపీ మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో రెండో నిందితుడైన యాదాటి సునీల్‌యాదవ్‌కు తెలంగాణ హైకోర్టు గురువారం షరతులతో బెయిలు మంజూరుచేసింది. రూ.25వేల వ్యక్తిగత బాండ్‌తో పాటు అంతే మొత్తానికి మరో ఇద్దరి పూచీకత్తులను సీబీఐ కోర్టుకు సమర్పించాలని సునీల్‌యాదవ్‌ను ఆదేశించింది. ప్రతి శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5లోగా పులివెందుల పోలీసుస్టేషన్‌లో హాజరుకావాలని ఆదేశించింది. సాక్షులను ప్రభావితం చేయడానికి ప్రయత్నించరాదని, విచారణ ప్రక్రియలో జోక్యం చేసుకోరాదని పేర్కొంది. పాస్‌పోర్టును స్వాధీనం చేయాలని, కోర్టు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లరాదని తెలిపింది. సాక్షులను ప్రభావితం చేయడానికి ప్రయత్నించినా, విచారణ ప్రక్రియలో జోక్యం చేసుకున్నా బెయిలు రద్దు పిటిషన్ దాఖలుకు సీబీఐకి అనుమతించింది. వివేకా హత్యకేసులో రెండో నిందితుడైన యాదాటి సునీల్‌యాదవ్ దాఖలు చేసిన బెయిలు పిటిషన్‌పై సుదీర్ఘ వాదనలను విన్న జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం తీర్పు వెలువరించారు. విచారణ ప్రక్రియను సునీల్‌యాదవ్ జాప్యం చేస్తున్నారని సీబీఐ, సునీతారెడ్డి ప్రధాన ఆరోపణ అని పేర్కొన్నారు. అయితే దీనికి విరుద్ధంగా పత్రాలు కావాలని గానీ, మరే ఇతర కారణంతో ఎలాంటి పిటిషన్‌ను కిందికోర్టులో దాఖలు చేయలేదని, సీబీఐ 2021లో నోటీసు ఇవ్వగానే హాజరయ్యానని, అరెస్టు చేశాక 10 రోజులు కస్టడీలో విచారణ జరిపారని సునీల్‌యాదవ్ పేర్కొన్నారని, దీన్నిబట్టి చూస్తే విచారణ జాప్యానికి కారణం సునీల్‌యాదవ్ అంటూ సీబీఐ నెపం వేస్తోందన్నారు. ఈ కేసులో మొత్తం 300 మంది సాక్షులుండగా సీబీఐ పేర్కొన్న ఐదుగురు సాక్షుల్లో 218 సాక్షి వాంగ్మూలం నమోదు చేయడానికి చాలా సమయం పడుతుందన్నారు. సాక్షులను బెదిరిస్తారన్నది సీబీఐ ప్రధాన ఆరోపణ అని, అలా జరిగితే బెయిలు రద్దు కోరవచ్చని, అంతేగానీ నిర్బంధంలో ఉంచడం సరికాదన్నారు. జలాలుద్దీన్‌ఖాన్ వర్సెస్ కేంద్రం, కేంద్రం వర్సెస్ కె.ఎ.నజీబ్, కల్యాణ్ చంద్రశేఖర్ వర్సెస్ రాజేశ్ రంజన్, మనీశ్ సిసోదియా వర్సెస్ ఈడీ, కల్వకుంట్ల కవిత వర్సెస్ ఈడీ కేసుల్లో విచారణ ప్రక్రియ కొనసాగకుండా సుదీర్ఘకాలం నిర్బంధంలో ఉంచడం సరికాదంటూ సుప్రీంకోర్టు ప్రస్తావించిందన్నారు. విచారణ ప్రక్రియ ఇంకా పత్రాల అందజేత దశలోనే ఉన్నందున ఇప్పట్లో పూర్తయ్యే అవకాశం లేనందున షరతులతో బెయిలు మంజూరు చేస్తున్నామన్నారు.



బతుకమ్మ వేడుకలకు హాజరైన శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి. చిత్రంలో నరసింహాచార్యులు, ఆది శ్రీనివాస్, రామచంద్రు నాయక్, అరెకపూడి గాంధీ, బండా ప్రకాశ్ తదితరులు

శాసనసభ ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలు

ఈనాడు, హైదరాబాద్: శాసనసభ ప్రాంగణంలో మహిళా ఉద్యోగులు గురువారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాలకు శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండగను మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాశ్, పీఏసీ ఛైర్మన్ అరెకపూడి గాంధీ, ప్రభుత్వ విప్‌లు రామచంద్రు నాయక్, ఆది శ్రీనివాస్, శాసనసభ కార్యదర్శి డా.నరసింహాచార్యులు, సీఎల్పీ కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పసుపు బోర్డు వెంటనే ప్రారంభించాలి: రైతు ఐక్యవేదిక

ఈనాడు, హైదరాబాద్: శాసనసభ ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ పసుపు బోర్డును వెంటనే రాష్ట్రంలో ప్రారంభించాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక డిమాండ్ చేసింది. వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి గురువారం హైదరాబాద్‌లో మాట్లాడుతూ.. గతేడాది సెప్టెంబరులో నిజామాబాద్ సభలో పసుపు బోర్డును ఏర్పాటు చేస్తామని మోదీ ప్రకటించారని తెలిపారు. ఆ తర్వాత కేంద్ర మంత్రిమండలి దీనిపై నిర్ణయం తీసుకొని.. గెజిట్ జారీ చేసినప్పటికీ పసుపు బోర్డును ఎక్కడ ఏర్పాటు చేస్తారో స్పష్టత ఇవ్వలేదని పేర్కొన్నారు. పసుపు బోర్డు ఏర్పాటుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.